ఈనాడు

విజయవాడ 19-2-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 190

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

AU SMALL FINANCE BANK

AU తో ఇంకా బ్యాంకింగ్ చేయడం లేదా ?

వడ్డీ

6.50%*

వరకు సంవత్సరానికి మరియు

నెలవారీ వడ్డీ చెల్లింపు

AU సేవింగ్స్ అకౌంట్

AU కరెంట్ అకౌంట్

వ్యాపార రుణాలు,
ట్రేడ్ & ఫారెక్స్ సర్వీసెస్,
మర్చంట్ సొల్యూషన్స్,
డిజిటల్ బ్యాంకింగ్ సర్వీసులు

ఆలోచన మార్చండి
ఇంకా బ్యాంక్ ని కూడా



స్కాన్ చేయండి

అకౌంట్ ని ఓపెన్ చేయండి

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి

యూనివర్సల్ బ్యాంకుగా ఆర్‌బిఐ నుండి సూత్రప్రాయంగా ఆమోదం పొందిన భారతదేశపు మొట్టమొదటి స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.

2,726 టచ్‌పాయింట్లు | 21 రాష్ట్రాలు మరియు 4 యుటిలు | 1.25 కోట్లు + కస్టమర్లు | 59,800+ ఎంప్లాయీస్

1800 1200 1200 | www.au.bank.in

ఈనాడు

విజయవాడ 19-2-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 190
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




ఉగాదికి మరో డీఎస్సీ

3,600 పోస్టుల వరకు భర్తీ చేసే అవకాశం

గతేడాది నిలబెన్, నిబంధనలే ఈసారీ అమలు

పాఠశాల విద్యాశాఖ కసరత్తు పూర్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మరో డీఎస్సీ ప్రకటించేందుకు సిద్ధమైంది. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని ఇటీవల విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు నోటిఫికేషన్‌కు ప్రణాళిక సిద్ధం చేసింది. ఉగాది పండగ సందర్భంగా ఉపాధ్యాయ నియామకాలకు ప్రకటన విడుదల చేయాలని భావిస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి ఖాళీల వివరాలను పాఠశాల విద్యాశాఖ సేకరించింది. అన్ని రకాల పోస్టులూ కలిపి 3,600 వరకు ఉండొచ్చు. ఆదర్శ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్లు, సంక్షేమ శాఖలకు చెందిన పాఠశాలల నుంచి ప్రాథమికంగా వివరాలు తీసుకున్నారు. (మిగతా 2లో)



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు గౌరవ వందనం సమర్పిస్తున్న యుద్ధ నౌకలు



ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ యుద్ధ నౌకల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి, సీఎం చంద్రబాబు

నౌకాదళం.. మన బలం

71 యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరణ

దేశ రక్షణలో నేవీది కీలకపాత్ర

సమైక్యతా స్ఫూర్తికి నిదర్శనం ఐఎఫ్ఆర్

విశాఖలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఈనాడు - విశాఖపట్నం

దేశ సాగర జలాల భద్రతలోనే కాకుండా విస్తృతమైన సముద్ర రవాణా వ్యవస్థను సురక్షితంగా ఉంచడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. విశాఖ తీరంలో ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఐఎన్ఎస్-సుమేధ నౌకపై ప్రయాణించిన 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి తదితరులు ఉన్నారు. అనంతరం వివిధ దేశాల నేవీ అధికారులు, అతిథులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. "దేశాల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడంలో, ఇతర దేశాల నౌకాదళాలతో భాగస్వామ్యాలు నెలకొల్పడంలో భారత నేవీ కీలక పాత్ర పోషిస్తోంది. భారత్, మిత్ర దేశాల మధ్య ఉన్న ఐకమత్యం, నమ్మకం, పరస్పర గౌరవానికి ఐఎఫ్ఆర్ ఓ నిదర్శనం. తీరం వెంబడి వివిధ దేశాల జెండాలు, నౌకాదళ సిబ్బందితో ఉన్న ఈ యుద్ధ నౌకలను చూస్తుంటే సంతోషంగా ఉంది. ఈ వాతావరణం ఉమ్మడి ఏకాత్మ భావనను ప్రతిబింబిస్తోంది. ఫ్లీట్ రివ్యూలో పాల్గొనడం ద్వారా మన సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. సముద్రాల ద్వారా అందరం కలసికట్టుగా ఉన్నామని ఈ కార్యక్రమం నిరూపించింది. భారత ప్రభుత్వ విధానమైన 'మహాసాగర్' స్ఫూర్తిని ఐఎఫ్ఆర్ మరింత ముందుకు తీసుకెళుతుందని ఆశిస్తున్నా' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

సముద్రాలతో భారత్‌ది సుదీర్ఘ బంధం

సముద్రాలతో భారత్‌ది సుదీర్ఘమైన లోతైన, శతాబ్దాల నాటి బంధమని రాష్ట్రపతి గుర్తుచేశారు. వ్యాపారంతో, దేశాల మధ్య బంధానికి సముద్ర జలాలు మార్గాలని పేర్కొన్నారు. 'కళింగ రాజుల పాలనలో ఒడిశా నుంచి నావికులు దక్షిణాసియా దేశాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారు. వారి రాకపోకలను అప్పటి ప్రజలు పండగలా జరుపుకొనేవారు. ఆనాటి సంప్రదాయానికి గుర్తుగా ఏటా కార్తీక పౌర్ణమి నుంచి వారం పాటు ఒడిశాలోని కటక్ ప్రాంత ప్రజలు బాలి జాతర అనే పండగను జరుపుకొంటున్నారు. ప్రస్తుతం ఫ్లీట్ రివ్యూ జరుగుతున్న విశాఖపట్నం.. భారత తూర్పు నౌకా దళ (ఈఎన్‌సీ) కేంద్రం. ఈ నగరానికి సముద్ర వర్తక చరిత్రలో కీలక స్థానం ఉంది. ఇక్కడ ఐఎఫ్ఆర్ నిర్వహించడం.. ఈ నగరానికి నేవీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతోంద'ని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ పురోగతి, శ్రేయస్సుకు మార్గాలుగా ఉన్న మహాసముద్రాలు అభివృద్ధి చెందడానికి అయా దేశాల నౌకాదళాలు సమిష్టిగా సహకరించాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న విదేశీ నౌకాదళాల అధికారులు, సిబ్బందికి దేశ ప్రజల తరఫున ప్రశంసించారు.

సంద్రంలో యుద్ధ నౌకల గర్జన

నౌకాదళాల శక్తి చాటేలా ఐఎఫ్ఆర్

పాల్గొన్న 66 భారత, 19 విదేశీ యుద్ధ నౌకలు 13లో

భారత్-అమెరికా మధ్య

సబ్‌సీ కేబుల్



విశాఖ గూగుల్ డేటా సెంటర్‌తో అనుసంధానం

30 మిలియన్ డాలర్ల ఏఐ సైన్స్ ఇంపాక్ట్ ఛాలెంజ్

2 కోట్ల మంది ప్రభుత్వోద్యోగులు.. కోటిమంది విద్యార్థులకు ఏఐలో నైపుణ్య శిక్షణ

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

ఈనాడు, అమరావతి: భారత్-అమెరికా మధ్య ఏఐ కనెక్టివిటీని పెంచేందుకు కొత్త సబ్‌సీ కేబుల్ రూట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌కు వచ్చిన ఆయన.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల ఏఐ హబ్ ఏర్పాటు.. అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గురించి ప్రస్తావించారు. ఇది అందుబాటులోకి వస్తే ఉద్యోగాలు, ఏఐ కటింగ్ ఎడ్జ్ ప్రయోజనాలు భారత్‌లోని ప్రజలు, వ్యాపారులకు అందుతాయని తెలిపారు. దీనివల్ల వచ్చే అవకాశాలను ప్రజలు, విద్యార్థులు వినియోగించుకునేందుకు నైపుణ్య శిక్షణలోనూ పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. సమిట్‌లో భాగంగా నిర్వహించిన మీడియా ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'భారతదేశం ఏఐతో అసాధారణంగా అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం నాకు ఉంది. మేం అందులో భాగస్వాములం కావాలనుకుంటున్నాం. ఏఐ అనేది మన జీవితకాలంలో వచ్చిన అతిపెద్ద మార్పు. భారత్ లాంటి దేశాలకు కొత్త అవకాశాలను సృష్టించే అవకాశం దీనివల్ల ఏర్పడుతుంది. ఆరోగ్యం, విద్య, వాతావరణ రంగాల్లో వచ్చే మార్పుల గురించి తెలుసుకోవడం ఏఐతో సాధ్యం. భారతదేశంలో ఏఐ ఎనేబుల్డ్ వాయిస్, విజువల్ సెర్చ్‌ను ఎక్కువగా వినియోగించడం నేను గుర్తించా. అమెరికా-భారత్ మధ్య ఏఐ కనెక్టివిటీ కొత్త సబ్‌సీ కేబుల్ ఏర్పాటుతో మెరుగవుతుంది' అని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ: భారతదేశంలోని విద్యార్థులు, ఉద్యోగులకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ అందించడంపై (మిగతా 2లో)

రూ.29,018 కోట్ల పెట్టుబడులు.. 22,407 మందికి ఉపాధి

- 27 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆమోదం
- సీఎం అధ్యక్షతన 15వ ఎస్ఐపీబీ సమావేశం 3లో

భారత్, ఈయూ ఎఫ్‌టీఏతో

స్వర్ణ యుగానికి నాంది

రక్షణ, టెక్నాలజీ రంగాల్లో స్పెయిన్‌తో బంధం మరింత బలోపేతం

రెట్టింపు వాణిజ్యానికి భారత్, ఫిన్లాండ్ అంగీకారం

7 దేశాల అధినేతలు, ఇద్దరు సీఈవోలతో మోదీ సమావేశం

ప్రపంచ దేశాల నేతలకు విందు ఇచ్చిన ప్రధాని



దిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన స్పెయిన్ ప్రభుత్వాధినేత పెడ్రో శాంచెజ్

దిల్లీ: భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో (ఎఫ్‌టీఏ) స్వర్ణ యుగానికి నాంది పలికామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్‌తోపాటు ఈయూలోని దేశాలకు ఇది ఎంతో మేలు చేయనుందని వెల్లడించారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన దేశాధినేతల్లో ఏడుగురితో బుధవారం దిల్లీలో ఆయన సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై వారితో చర్చించారు. ఇద్దరు సీఈవోలతోనూ మోదీ భేటీ అయ్యారు.

■ 'స్పెయిన్ ప్రభుత్వాధినేత పెడ్రో శాంచెజ్‌తో ఫలవంతమైన చర్చలు జరిగాయి. భారత్, స్పెయిన్ స్నేహానికి మరింత ఊతమిచ్చేలా ఈ చర్చలు సాగాయి. రక్షణ, భద్రత, టెక్నాలజీ రంగాల్లో సహకారంపై చర్చించాం. 2026ను భారత్-స్పెయిన్ సాంస్కృతిక, పర్యాటక, ఏఐ సంవత్సరంగా గుర్తిస్తున్నాం. ఎఫ్‌టీఏవల్ల స్పెయిన్‌తో ఆర్థిక బంధం మరింత బలపడనుంది. రెండు దేశాల ప్రజలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

■ 'ఏఐ సమిట్‌ను ఏర్పాటు చేసిన ప్రధాని మోదీకి శుభాకాంక్షలు' అని శాంచెజ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

■ భారత్, స్పెయిన్ సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, మౌలిక వసతులు, వాతావరణం, పునరుత్పాదక ఇంధన వనరులు, రక్షణ, భద్రత, అంతరిక్షం, సంస్కృతి, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలపై (మిగతా 2లో)

భారత్ అజేయం

టీ20 ప్రపంచకప్ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఘనవిజయం



శివమ్ దూబె

టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్‌కు ఎదురు లేదు. హ్యాట్రిక్ విజయాలతో ఇప్పటికే సూపర్-8 బెర్తును సొంతం చేసుకున్న టీమ్‌ఇండియా.. బుధవారం చివరి లీగ్ మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. మొదట శివమ్ దూబె (66; 31 బంతుల్లో 4×4, 6×6) చెలరేగడంతో భారత్ 6 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఛేదనలో నెదర్లాండ్స్ 7 వికెట్లకు 176 పరుగులే చేయగలిగింది. వరుణ్ చక్రవర్తి (3/14), శివమ్ దూబె (2/35), జస్‌ప్రీత్ బుమ్రా (1/17) ప్రత్యర్థిని కట్టడి చేశారు. భారత్ ఆదివారం తన తొలి సూపర్-8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది.

వివరాలు ఛాంపియన్ లో..

శవమై తేలిన మృగాడు

చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన 'హత్యా'చార నిందితుడు కులవర్ధన్

మృతదేహాన్ని తీసుకోని బంధువులు

మదనపల్లెలో స్థానికుల సంబరాలు



ఈనాడు- అన్నమయ్య, న్యూస్‌టుడే, మదనపల్లె (నేరవార్తలు, పట్టణం, గ్రామీణ): 'అవును చిన్నారిపై అత్యాచారం చేసి.. ఆపై హత్య చేసింది నేనే.. అయితే ఏంటి? మూడు నెలల్లో మళ్లీ బయటకు వస్తా. మీ అంతు చూస్తా' అంటూ బాలిక తల్లిదండ్రులపై మంగళవారం ఉదయం బెదిరింపులకు దిగిన నిందితుడు కులవర్ధన్ (30) బుధవారం ఉదయం చెరువులో శవమై కనిపించాడు. మంగళవారమే పోలీసుల కళ్లు గప్పి పారిపోయిన కులవర్ధన్.. జనం ఆగ్రహావేశాలను చూసి, వారికి దొరికితే చంపేస్తారేమో అనే భయమో, లేక చట్టపరంగా కఠిన శిక్ష ఖాయమనే అనుమానమో తెలియదు కానీ బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. చిన్నారిని చిదిమేసిన క్రూరమృగంలాంటి నిందితుడు మరణించాడన్న వార్త తెలుసుకుని స్థానికులు బుధవారం బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలోనూ అతడు గంజాయి మత్తులోనే కనిపించాడని స్థానికులు తెలిపారు.

అదుపులోంచి పారిపోయాడు: ఎస్పీ

ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. "మంగళవారం ఉదయం 7 గంటలకు కులవర్ధన్ ఇంట్లోని డ్రమ్ములో బాలిక విగతజీవిగా కనిపించగా వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. బయటకు తీసుకువచ్చి వాహనం ఎక్కిస్తున్న సమయంలో అతడు చేసిన ఘాతుకాన్ని తెలుసుకుని సుమారు 50 మంది స్థానికులు దాడి చేశారు. నిందితుడిని చంపేస్తారని భావించి రక్షక్ వాహనంలో ఎక్కించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళితే అక్కడకూ జనం వచ్చి ఆందోళన చేసే అవకాశం ఉందనే ఉద్దేశంతో వేరే ఠాణాకు తరలించాలని అనుకున్నాం. ముంబయి- చెన్నై జాతీయ రహదారినీ ప్రజలు దిగ్బంధం చేయడంతో కులవర్ధన్‌ను బయటకు తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఈ క్రమంలో రక్షక్ వాహనంలోని సిబ్బంది ప్రజలను అదుపు చేయడానికి బయటకు దిగారు. డ్రైవర్ మాత్రమే ఉండటాన్ని అదునుగా చూసుకుని కులవర్ధన్ పారిపోయాడు.'

మున్సిపల్ సిబ్బందితో అంత్యక్రియలు?

నిందితుడి ఆచూకీ కోసం రాత్రి వరకూ వెతికినా దొరకలేదు. బుధవారం ఉదయం కనసానివారిపల్లె చెరువులో (మిగతా 2లో)

ఏ2గా కులవర్ధన్ తల్లి అంజనమ్మ

బాలికపై 'హత్యా'చారం ఘటనలో పోక్సో, హత్య తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో ఏ1గా కులవర్ధన్, ఏ-2గా అతని తల్లి అంజనమ్మను పేర్కొన్నారు. ఆమెపై కూడా అనుమానం ఉందని చిన్నారి తండ్రి ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి 7 గంటల వరకు అంజనమ్మ ఇంట్లోనే ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆమెకు ఈ వ్యవహారం తెలుసా.. లేదా? అనే అంశాలపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు మరికొందరికీ ఇందులో ప్రమేయం ఉందని బాధితురాలి తండ్రి ఆరోపిస్తున్నారు.

ఇదీ సంగతి!



ఇంకా పరిశీలనలోనే ఉంది. అమల్లోకి వచ్చేలోగా టీనేజ్ దాటిపోతాంలే.. టెన్షన్ పడకు!

నిర్మాణ సమయంలో

వీఎల్‌టీ 50%కి తగ్గింపు



నిర్మాణ సమయంలో వీఎల్‌టీ 50శాతానికి తగ్గింపు నిర్ణయంతో ప్రజలు, బిల్డర్లకు ఏటా రూ.30 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. పుర, నగర పాలక సంస్థలు, నగర పంచాయతీలకు నష్టమైనా ప్రజలకు భారం కాకూడదన్న ఉద్దేశంతో, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీఎల్‌టీ తగ్గించాం.

\- మంత్రి నారాయణ

మున్సిపల్ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

ఈనాడు, అమరావతి: భవన నిర్మాణ సమయంలో వసూలు చేస్తున్న ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ)ను 50 శాతానికి ప్రభుత్వం తగ్గించనుంది. అనుమతులు తీసుకున్న తేదీ నుంచి తగ్గింపు వర్తిస్తుంది. వీఎల్‌టీని సగానికి తగ్గిస్తూ శాసనసభలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం ప్రవేశ పెట్టిన మున్సిపల్ సవరణ బిల్లును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నిర్మాణ సమయంలోనూ వీఎల్‌టీ వసూలు చేయడం ఆర్థికంగా భారమవుతోందన్న ప్రజల, స్థిరాస్తి వ్యాపార సంఘాల విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలించి 50 శాతానికి తగ్గించాలన్న నిర్ణయం తీసుకుంది.

2019 ఫిబ్రవరిలో జీవో...ఇప్పుడు చట్ట సవరణ

నిర్మాణ సమయంలో వీఎల్‌టీని 50 శాతానికి తగ్గించాలన్న ప్రతిపాదన 2014-19 మధ్య (మిగతా 2లో)



ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ట్యూటర్

ప్రయోగాత్మకంగా అమలు

ఐఐటీ మద్రాస్‌తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం 20న

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేధ(ఏఐ) ట్యూటర్ విధానాన్ని తీసుకొస్తోంది. ఐఐటీ మద్రాస్ రూపొందించిన డిజిటల్ లెర్నింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నారు. (మిగతా 2లో)

దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యలో

వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య పాత్ర



అనంతబాబు సుబ్రహ్మణ్యం

- భర్తతో పాటు ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారు.. హత్యకు ప్రేరేపించారు
- సీసీటీవీ ఫుటేజీల విశ్లేషణలో నిగ్గు తేలిన నిజం
- అభియోగపత్రంలో పేర్కొన్న సిట్
- కోర్టుకు సమర్పించిన అనుబంధ ఛార్జిషీట్‌లో పేర్కొన్న పోలీసులు

ఈనాడు, అమరావతి, కాకినాడ: దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్యలో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుతో పాటు ఆయన భార్య అనంత లక్ష్మీ దుర్గ అలియాస్ రోజా కూడా పాల్గొన్నారని సిట్ తేల్చింది. ఈ హత్యకు ప్రేరేపించటమే కాకుండా ఈ నేరంలో అనంతబాబుకు అన్నివిధాలా ఆమె సహకరించారని నిర్ధారించింది. హత్య తర్వాత ఆధారాల ధ్వంసం, మాయంలోనూ (మిగతా 2లో)

ఉగాదికి మరో డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

వీటన్నింటిలో కలిపి 1,200 వరకు ఖాళీలు రానున్నాయి. ఇవికాకుండా పంచాయతీరాజ్, పురపాలక, ప్రభుత్వ పాఠశాలల్లో 1,700 పోస్టులు ఉండనున్నాయి. ప్రత్యేక విద్య పోస్టులు 700 వరకు భర్తీ చేసే అవకాశం ఉంది. గతేడాది ఏప్రిల్‌లో 16,347 పోస్టులకు ప్రకటన ఇవ్వగా.. అందులో 15,941 భర్తీ అయ్యాయి. కొన్ని పోస్టులకు రిజర్వేషన్ల అభ్యర్థులు లేనందున మిగిలిపోయాయి.

సిలబస్‌లో మార్పు లేదు

ఉగాదికి ఇచ్చే డీఎస్సీ సిలబస్‌లో మార్పులేవీ చేయడం లేదు. గతేడాది డీఎస్సీకి ఇచ్చిన సిలబస్, మార్గదర్శకాలనే ఈసారీ అమలు చేయనున్నారు. ప్రత్యేక డీఎస్సీ సిలబస్‌ను ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అన్ని పోస్టులకూ ఆంగ్ల భాష ప్రావీణ్యం పరీక్ష, కంప్యూటర్ ప్రావీణ్యం పరీక్ష నిర్వహించాలని మొదట భావించినా, సమయం లేనందున ఈ ఆలోచనను వాయిదా వేశారు.

ప్రత్యేక ఒప్పంద టీచర్లకు వెయిటేజీ?

ప్రత్యేక అవసరాలున్న పిల్లలు చదువుతున్న పాఠశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు రాష్ట్రంలో 2,600 మంది వరకు ఉండగా.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారిలో అన్ని అర్హతలూ ఉన్న సుమారు 800 మందికి మినిమం టైం స్కేల్ అమలు చేయనున్నారు. పదేళ్ల సర్వీసు, టెట్‌లాంటి అర్హతలు నిర్ణయించారు. ఈ అర్హతలు సాధించిన వారికి మినిమం టైం స్కేల్ అమలు చేస్తారు. పర్మినెంట్ ఉద్యోగం కోసం వీరూ డీఎస్సీ రాయాల్సి ఉంటుంది. ప్రత్యేక డీఎస్సీలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న టీచర్లకు వెయిటేజీ ఇవ్వడంపై అధికారులు ఆలోచన చేస్తున్నారు.

శవమై తేలిన మృగాడు

(మొదటి పేజీ తరువాయి)

ఓ మృతదేహం కనిపించిందని స్థానికులు సమాచారం అందించారు. వెలికితీసి పరిశీలించగా కులవర్ధన్‌దిగా తేలింది. నిందితుడి తల్లి అంజనమ్మ పరారీలో ఉండటంతో.. పెద్దమ్మ, పెదనాన్నను పిలిపించాం. వారు మరణించింది కులవర్ధనేనని నిర్ధారించారు. ప్రాథమిక సమాచారం మేరకు ఆతడే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు' అని ఎస్పీ ధీరజ్ వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో మార్చురీలో ఉంచారు. శవాన్ని ఎవరూ తీసుకెళ్లకుంటే మున్సిపాలిటీకి అప్పగించి అంత్యక్రియలు పూర్తి చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

వైకాపా నేతల ఆందోళనలతో ఉద్రిక్తత.. కేసుల నమోదుకు పోలీసుల నిర్ణయం

మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు మదనపల్లె పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హోంమంత్రి అనిత బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చిన్నారి మృతదేహాన్ని శవపరీక్షకు పంపిస్తే మృతికి కారణాలు తెలుస్తాయన్నారు. దాంతో వారు కొంత శాంతించారు. అంతలో వైకాపా నాయకులు ఆందోళనకు దిగి.. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. సున్నితమైన అంశాన్ని రాజకీయం చేశారు. ఇది మరింత పెరిగి వివాదం స్థాయికి చేరి, ప్రజా సంఘాలు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనల్లో పాల్గొన్నారు. రాజకీయ లబ్ధి కోసం యత్నించిన వ్యక్తులపైనా పోలీసులు కేసు నమోదు చేయాలని భావిస్తున్నారు. బాధ్యులపై చర్యలు తప్పవని ఎస్పీ ధీరజ్ స్పష్టం చేశారు. ఆందోళనలకు సంబంధించి సీసీ ఫుటేజీ ఆధారంగా నేతలు ఇద్దరిని విచారిస్తున్నారు.

నిర్మాణ సమయంలో వీఎల్‌టీ 50 శాతానికి తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

తెదేపా ప్రభుత్వ హయాంలో తెరపైకి వచ్చింది. దీనిపై ప్రభుత్వం అన్ని కోణాల్లో పరిశీలించిన తరవాత పన్ను సగానికి తగ్గించి 2019 ఫిబ్రవరి 24న జీవో విడుదల చేసింది. అప్పట్లోనూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా నారాయణ ఉన్నారు. జీవో అమలుకు సాంకేతిక అంశాలు అవరోధం కావడంతో ఆ తరవాత ఏర్పడిన వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మున్సిపల్ చట్ట సవరణ చేశారు. ఇందుకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలు త్వరలోనే వెలువడనున్నాయి.

ప్రజలు, వ్యాపారులకు ఏటా రూ.30 కోట్ల లబ్ధి

నిర్మాణ సమయంలో వీఎల్‌టీ 50శాతానికి తగ్గింపు నిర్ణయంతో ప్రజలు, బిల్డర్లకు ఏటా రూ.30 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. ఈ పద్దు కింద పురపాలకశాఖకు ఏటా రూ.60 కోట్ల మేర ఆదాయం వస్తోంది. అనుమతులు తీసుకున్ననాటి నుంచి నిర్మాణం పూర్తి చేసేలోపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విలువ ఆధారంగా స్థలం విలువపై నగరపాలక సంస్థల్లో 0.5శాతం, పురపాలక సంఘాల్లో 0.2శాతం చొప్పున వీఎల్‌టీ విధించి వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని 50 శాతానికి తగ్గింపు ద్వారా పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు నష్టమైనా ప్రజలకు భారం కాకూడదన్న ఉద్దేశంతో, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీఎల్‌టీ తగ్గించామని మంత్రి నారాయణ తెలిపారు. అనుమతులు తీసుకున్నాక ఐదు అంతస్తుల్లోపు భవన నిర్మాణాలు మూడేళ్లలో, ఐదు కంటే మించిన అంతస్తుల భవనాలు ఆరేళ్లలోపు పూర్తి చేయాలి. అలాంటి వాటికే వీఎల్‌టీ తగ్గింపు వర్తించనుందని అధికారులు వెల్లడించారు.

అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం: ఎమ్మెల్యేలు

'నిర్మాణ సమయంలో వీఎల్‌టీ 50శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అందరికీ ఆమోదయోగ్యం. ప్రజలు, వ్యాపారులకు లబ్ధి చేకూరనుంది. నిర్మాణాలకు అనుమతులిచ్చే సమయంలోనే వీఎల్‌టీ తగ్గింపు వర్తించేలా సాఫ్ట్‌వేర్‌లోనూ సవరణలు చేయాలి' అని వీఎల్‌టీ తగ్గింపుపై శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ఎ.రాధాకృష్ణ, సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ అన్నారు.

స్వర్ణ యుగానికి నాంది

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు నేతలూ చర్చలు జరిపారు. రూపాంతరీకరణ శక్తిగా ఏఐ ఎదుగుతోందని వారు అభిప్రాయపడ్డారు.

■ ఎఫ్‌టీఏకు మద్దతుగా నిలిచినందుకు ఫిన్లాండ్ ప్రధాని పెటెరి ఆర్పోకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని భేటీ సందర్భంగా ఇద్దరు నేతలు నిర్ణయించారు. ఇంకా 6జీ, ఆవిష్కరణలు, శుద్ధ ఇంధనం, బయో ఇంధనాలు, సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థలపై వారి మధ్య చర్చలు జరిగాయి.

■ రక్షణ, తయారీ, ఎరువులు, మౌలిక వసతుల రంగాల్లో మరింతగా సహకరించుకోవాలని ప్రధాని మోదీ, సెర్బియా అధ్యక్షుడు ఉసిక్ నిర్ణయించారు. రెండు దేశాల స్నేహంపట్ల గర్విస్తున్నానని ఉసిక్ తెలిపారు. భారత్ తమకు విశ్వసనీయ భాగస్వామి అని వెల్లడించారు.

■ క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. టెక్నాలజీ, ఆవిష్కరణలు, నౌకా నిర్మాణం, బ్లూ ఎకానమీ వంటి రంగాల్లో పరస్పర సహకారంపై వారు చర్చించుకున్నారు. 2025 తొలి 11 నెలల్లో రెండు దేశాల మధ్య వాణిజ్యం 10శాతం పెరిగిందని ప్లెంకోవిక్ తెలిపారు. లాజిస్టిక్స్, జల రవాణా, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, రక్షణ వంటి రంగాల్లో సహకారానికి ఎదురు చూస్తున్నామని వెల్లడించారు.

■ ఎస్టోనియా అధ్యక్షుడు అలార్ కరిస్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. భవిష్యత్తు టెక్నాలజీలు, ఇంధన నిర్వహణ, నైపుణ్య రంగాల్లో కలిసి పని చేయాలని ఇద్దరు నేతలూ నిర్ణయించారు.

■ కజకిస్థాన్‌తో వాణిజ్యం, ఇంధనం, కీలక ఖనిజాలు, రక్షణ రంగాల్లో సహకారానికి మరిన్ని అవకాశాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆ దేశ ప్రధాని ఓల్జాస్ బెక్తెనోవ్‌తో ఆయన సమావేశమయ్యారు.

■ పరస్పర విశ్వాసం, గుడ్‌విల్‌ల ఆధారంగా భారత్, భూటాన్ బంధం కొనసాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భూటాన్ ప్రధాని షెరింగ్ తాబ్గేతో ఆయన భేటీ అయ్యారు.

■ గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, సన్ మైక్రో సిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లాలతోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

నేడు ఏఐ సమిట్‌కు శ్రీకారం

ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను గురువారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. భారత్ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత సీఈవోలతో చర్చల్లో భాగస్వాములవుతారు. ప్రారంభ కార్యక్రమంలో మోదీతోపాటు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రసంగిస్తారు. ఈ సమిట్‌లో ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల అధిపతులూ పాల్గొంటున్నారు.



దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్

ప్రపంచ నేతలకు స్వాగతం

ఏఐ ఇంపాక్ట్ సమిట్ జరిగే భారత మండపంవద్ద ప్రపంచ దేశాల నేతలకు ప్రధాని మోదీ బుధవారం సాయంత్రం ఘనంగా స్వాగతం పలికారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలీనా జార్జీవా, మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రాంగులాం, క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లై, ఎస్టోనియా అధ్యక్షుడు అలార్ కరిస్, ఫిన్లాండ్ ప్రధాని పెటెరి ఆర్పో, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిసోటాకిస్, గయానా ఉపాధ్యక్షుడు భరత్ జగ్దేవ్, భూటాన్ ప్రధాని షెరింగ్ తాబ్గేలను ఆయన స్వాగతించారు. డ్రమ్స్, నాదస్వరం, తంబూరాల వంటి సంప్రదాయ సంగీత ధ్వనుల మధ్య వారికి ఘనంగా స్వాగతం లభించింది. ప్రతి ఒక్కరితో ఆయన కరచాలనం చేశారు.

■ దేశాధినేతలకు, అంతర్జాతీయ ప్రముఖులకు ప్రధాని మోదీ విందు ఇచ్చారు. విందుకు సంబంధించిన చిత్రాలను ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యలో
వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఆమె కీలకంగా వ్యవహరించారని గుర్తించింది. సీసీ కెమెరాల్లోని దృశ్యాలను విశ్లేషించి హత్య సమయంలో ఘటనా స్థలంలోనూ, ఆ తర్వాత కూడా మృతదేహాన్ని తీసుకెళ్లిన వాహనంలో ప్రధాన నిందితుడైన అనంతబాబుతో కలిసి ప్రయాణించినట్లు నిగ్గు తేల్చింది. ఈ కేసులో ఆమెను రెండో నిందితురాలిగా (ఏ-2) చేర్చింది. హత్య, హత్యకు ప్రేరేపించటం, ఆధారాలు ధ్వంసం చేశారంటూ ఆమెపై అభియోగాలు మోపింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపిన సిట్ అధికారులు ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో బుధవారం అభియోగ పత్రం దాఖలు చేశారు. వైకాపా హయాంలో పోలీసులు ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయకుండా, కీలకమైన సాంకేతిక ఆధారాలు సేకరించకుండా వదిలేయటమే కాకుండా ప్రధాన నిందితుడు అనంతబాబుకు కొమ్ముకాసేలా వ్యవహరించిన నేపథ్యంలో.. కూటమి ప్రభుత్వం గతేడాది జులైలో తదుపరి దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసింది. ప్రాసిక్యూషన్‌కు సహకారం అందించేందుకు సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావును నియమించింది. సిట్ దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ రికార్డులు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు చేయించింది. అందులో అనేక కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయి. వాటన్నింటినీ అభియోగపత్రంలో పొందుపరిచింది. ప్రధానాంశాలివి..

అనంతబాబు జన్మదినం రోజే..

అనంతబాబు, అతని భార్య లక్ష్మీదుర్గ వద్ద సుబ్రహ్మణ్యం ఆరేళ్ల పాటు కారు డ్రైవర్‌గా పనిచేశారు. ఆ సమయంలో తన పెళ్లి ఖర్చుల కోసం అనంతబాబు నుంచి రూ.50 వేలు అప్పు తీసుకున్నారు. అందులో రూ.30 వేలు తిరిగి చెల్లించేశారు. హత్యకు గురికావటానికి మూడు నెలల ముందు సుబ్రహ్మణ్యం.. అనంతబాబు దంపతుల దగ్గర ఉద్యోగం మానేశారు. దీంతో కక్ష పెంచుకున్న అనంతబాబు తనకు చెల్లించాల్సిన రూ.20 వేలు ఇవ్వాల్సిందేనంటూ సుబ్రమణ్యాన్ని, అతని కుటుంబ సభ్యుల్ని పదేపదే బెదిరించేవారు.

◆ 2022 మే 19న రాత్రి 7.30 గంటల సమయంలో సుబ్రహ్మణ్యం, అతని స్నేహితుడు కలిసి వారు నివసించే రాంబగీచా అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వెళ్లారు. అదేరోజు రాత్రి 8.09 గంటల సమయంలో అనంతబాబు సుబ్రహ్మణ్యం తండ్రికి ఫోన్ చేసి అతని గురించి ఆరా తీశారు. తనకు చెల్లించాల్సిన రూ.20 వేలు ఇవ్వకపోతే కాళ్లు చేతులు, నరికేస్తానని బెదిరించారు.

◆ 2022 మే 19న అనంతబాబు జన్మదినం కావటంతో అతను నివాసమైన శ్రీరామ్‌నగర్‌లోని శంకర్ టవర్ అపార్ట్‌మెంట్‌లో తన భార్య లక్ష్మీదుర్గతో కలిసి ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఆ రోజు రాత్రి 10.15 నుంచి 10.30 గంటల సమయంలో శంకర్ టవర్స్ పక్కనే ఉన్న నవభారత్ పబ్లిక్ స్కూల్ వద్ద సుబ్రహ్మణ్యం స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండటంతో.. అనంతబాబు అక్కడికి వెళ్లి అతన్ని తన ఏపీ39 బీ0456 నంబరు ఐ20 వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. తర్వాత కొన్ని గంటల్లోనే అతని మృతదేహాన్ని డోర్ డెలివరీ చేశారు.

వాచ్‌మన్ కుమార్తెను కర్ర అడిగారు..

◆ అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గ కాకినాడలోని శంకర్ టవర్ అపార్ట్‌మెంట్‌లోని 401 నంబరు ఫ్లాట్‌లో నివసించేవారు. సుబ్రహ్మణ్యం హత్య జరిగిన రోజు (2022 మే 19వ తేదీ) రాత్రి ఆమె అదే అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో ఉన్నారు. సుబ్రహ్మణ్యం హత్యకు ముందు రాత్రి 10.20 నుంచి 10.22 గంటల మధ్య సెల్లార్‌లోని వాచ్‌మన్ గదిలోకి వెళ్లిన లక్ష్మీదుర్గ.. వాచ్‌మన్ కుమార్తెను పెద్ద కర్ర కావాలని అడిగారు. తన దగ్గర లేదని ఆమె సమాధానమివ్వగా.. ఏదో ఒక కర్ర తీసుకురావాలని తీవ్ర ఒత్తిడి చేశారు.

◆ హత్య గురించి తనకు తెలియదని, ఆ సమయంలో తాను అక్కడలేనని ఆసుపత్రిలో బంధువులను పరామర్శించటానికి వెళ్లానని అనంతబాబు భార్య గతంలో పోలీసులకు వాంగ్మూలమిచ్చారు. అయితే ఆమె చెప్పిన ఆసుపత్రిలో ఆ సమయంలో ఆమె లేరని సీసీ కెమెరా ఫుటేజీల విశ్లేషణలో తేల్చిన సిట్ అధికారులు.. అదే సమయంలో హత్య జరిగిన ఘటనా స్థలంలో ఆమె ఉన్నట్లు కూడా సీసీ ఫుటేజీల్లోనే గుర్తించారు. దీంతో అప్పట్లో ఆమె చెప్పిన వాంగ్మూలమంతా పచ్చి అబద్ధమని, హత్యలో ఆమెది క్రియాశీలక పాత్ర అని నిగ్గు తేలింది.

నాగమల్లితోట దగ్గర ప్రమాదమని కాల్..

19వ తేదీ అర్ధరాత్రి 12.53 గంటల సమయంలో అనంతబాబు.. సుబ్రహ్మణ్యం తండ్రికి ఫోన్ చేసి నాగమల్లితోట కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం గాయాలపాలయ్యాడని ఆసుపత్రికి తీసుకెళ్తున్నానని చెప్పారు. అయితే ఆ సమయంలో అనంతబాబు సెల్‌టవర్ లొకేషన్ నాగమల్లితోట దగ్గర కాకుండా ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డు ఏరియాలో, బృందావన్ కాలనీలో ఉంది.

◆ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు నాగమల్లితోట కూడలి వద్దకు వెళ్లి చూడగా అసలు అక్కడ రోడ్డు ప్రమాదం జరిగిన ఆనవాళ్లే కనిపించలేదు.

◆ అదేరోజు అర్ధరాత్రి తర్వాత సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని అనంతబాబు తన వాహనంలో తీసుకొచ్చి.. సుబ్రహ్మణ్యం కుటుంబ నివసించే అపార్ట్‌మెంట్ వద్ద పడేశారు. రూ.2 లక్షలు ఇస్తానని ఎవరికీ తెలియకుండా అంత్యక్రియలు చేయించాలని బెదిరించారు. బాధిత కుటుంబ సభ్యులు ఎదురుతిరగటంతో వెనక్కి వెళ్లిపోయారు. వెళ్తూవెళ్తూ తన కారు డిక్కీలో ఏమైనా ఉన్నాయా? అని చూశారు.

గెస్ట్ హౌస్ సమీపంలో చీకటి ప్రదేశంలో

◆ అనంతబాబుకు చెందిన ఏపీ39బీ0456 నంబరు ఐ20 కారు 2022 మే 19వ తేదీ రాత్రి 10.37 గంటల సమయంలో కాకినాడ వీవీ కుమార్ గెస్ట్‌హౌస్ వద్ద నున్న చీకటి ప్రదేశం వైపు వెళ్లింది. అక్కడే చాలాసేపు ఆగింది. రాత్రి 11.55 గంటలకు తిరిగి వెనక్కి వచ్చింది. 12.05 గంటలకు అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీన్ని బట్టి అక్కడే హత్య చేశారని స్పష్టమవుతోంది.

హత్య ముందు, తర్వాత దుస్తులు మార్చుకుని..

◆ సుబ్రహ్మణ్యం హత్యకు ముందు, ఆ తర్వాత కూడా అనంతబాబు, ఆయన భార్య లక్ష్మీదుర్గలు వారు నివసించే శంకర్ టవర్స్ అపార్ట్‌మెంట్, ఎదురుగా ఉండే ఈశ్వర ధరణి అపార్ట్‌మెంట్స్‌లో పలుమార్లు హడావుడిగా తిరుగుతూ కనిపించారు. హత్యకు ముందు, తర్వాత నాలుగైదుసార్లు దుస్తులు మార్చుకుని కనిపించారు. ఇవన్నీ సీసీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి.

◆ కాకినాడలోని అమృత ఆసుపత్రి, ఆంజనేయస్వామి గుడి, భానుగుడి సెంటర్, బ్లూరే ఆసుపత్రి, బగీచా అపార్ట్‌మెంట్, ఈశ్వర ధరణి అపార్ట్‌మెంట్ ఇలా 14 చోట్ల నుంచి సీసీ కెమెరాల దృశ్యాల్ని సిట్ అధికారులు సేకరించారు. ఏపీ39బీ0456 నంబరు కలిగిన ఐ20 వాహనం (అనంతబాబుది) హత్య జరిగిన రోజు రాత్రంతా పలు చోట్లకు తిరుగుతూనే కనిపించింది. మృతదేహంతో పాటు అనంతబాబు, అతని భార్య కూడా ఉన్నారు.

పరారీలో లక్ష్మీదుర్గ..: ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఎమ్మెల్సీ అనంతబాబు ఇప్పటికే జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకొచ్చి తిరుగుతున్నారు. ఆయన భార్య, రెండో నిందితురాలైన లక్ష్మీదుర్గను విచారణకు రావాలని పోలీసులు ఇదివరకే నోటీసులు జారీ చేయగా.. ఆమె హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకుని పరారైపోయారు.

వైకాపా హయాంలో మొక్కుబడి విచారణ

2022 మేలో జరిగిన ఈ కేసును వైకాపా పెద్దల ఒత్తిళ్లతో మొక్కుబడిగా విచారణ చేసి నిందితుల్ని కాపాడే ప్రయత్నం చేశారు. అనంతబాబు చెప్పినట్లే కేసు దర్యాప్తు సాగించారు. ఈ హత్యలో అతనికి సహకరించింది ఎవరో తేల్చకుండానే విచారణ పూర్తిచేశారు. సాంకేతిక ఆధారాలేవీ సేకరించలేదు. పోలీసుల దర్యాప్తు తీరుపై వైకాపా హయాంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు సీఎం, డీజీపీ వద్దకు వచ్చి తమ కుమారుడి కేసును పునర్విచారణ చేయాలని మొరపెట్టుకోవడంతో ప్రభుత్వం సిట్ వేసి దర్యాప్తు చేపట్టింది. ఈ విచారణను అడ్డుకోవాలని చూసినా కోర్టు అనుమతించడంతో తదుపరి విచారణ జరిపి కీలక సాక్ష్యాలను సేకరించారు. అదనపు ఛార్జ్‌షీట్ వేసి కోర్టులో ట్రయల్స్ మొదలయ్యేలా చూస్తున్నారు. ఈ కేసు విచారణ నిమిత్తం లక్ష్మీదుర్గ కుల ధ్రువీకరణ కోసం అడ్డతీగల తహసీల్దారుకు పంపిన లేఖను అనంతబాబుకు లీకు చేసిన రెవెన్యూ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్‌కు సిట్ అధికారులు సూచించారు. గతంలో నిందితునికి అనుకూలంగా విచారణ చేపట్టిన పోలీసులపైనా చర్యలు తీసుకునే అవకాశాలను పరిశీలిస్తున్నారు. 'గత ప్రభుత్వ హయాంలో సక్రమంగా విచారణ జరగలేదు. తాజాగా సిట్ జరిపిన విచారణలో సేకరించిన ఆధారాలతో ఈ కేసు నిరూపణ అవ్వడానికి ఎక్కువ అవకాశాలున్నాయి' అని బాధితుల తరఫున వాదిస్తున్న ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ట్యూటర్

(మొదటి పేజీ తరువాయి)

దీనికి సంబంధించి దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో 20న (శుక్రవారం) ఐఐటీ మద్రాస్‌తో పాఠశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకోనుంది. ప్రభుత్వ పాఠశాలలకు ఐఐటీ మద్రాస్ ఈ సాంకేతిక సహాయాన్ని ఉచితంగా అందించనుంది. పాఠశాల విద్యాశాఖ వద్ద ఉన్న కంటెంట్‌ను ఐఐటీ మద్రాస్‌కు అందిస్తుంది. దీన్ని విద్యార్థుల డివైజెస్‌కు అక్కడి నుంచి పంపిస్తారు. తెలుగు, ఆంగ్లం హిందీ భాషల్లో కంటెంట్ ఉంటుంది. మొబైల్ యాప్, వెబ్, వాట్సప్ ఇంటర్‌ఫేస్‌లలో పని చేస్తుంది. విద్యార్థులు నచ్చిన పాఠాన్ని నేర్చుకోవచ్చు. విద్యార్థి ఎంతవరకు నేర్చుకున్నారనేదాన్ని అక్కడే ప్రశ్నలు ఇస్తారు. వాటికి రాసిన సమాధానాల ఆధారంగా విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను అంచనా వేస్తుంది.

ఏం చేస్తుంది..

- ◆ పాఠశాలల్లో స్వీయ లెర్నింగ్ సంస్కృతిని నిర్మిస్తుంది
- ◆ పాఠ్యాంశాలకు అనుగుణంగా సంభాషణాత్మక బోధన
- ◆ వాయిస్, టెక్స్ట్ ఆధారిత ఇంటరాక్షన్
- ◆ విద్యార్థి గత సమాచారం ఆధారంగా సందర్భానుసారంగా సమాధానాలు
- ◆ తాత్కాలిక పునశ్చరణ (రెమిడియల్) కోచింగ్‌పై ఆధారపడడాన్ని తగ్గించడం
- ◆ వినియోగం, అభ్యాస ధోరణులపై డ్యాష్ బోర్డులు
- ◆ తరగతి అభ్యసనను పటిష్ఠం చేస్తుంది
- ◆ పాఠ్యపుస్తకాలు, దీక్ష, ఎస్‌సీఈఆర్టీ, ఎన్‌సీఈఆర్టీ మెటీరియల్ వినియోగం
- ◆ తప్పుదోవ పట్టించే సమాధానాలు లేకుండా నియంత్రణ

అమలు నమూనా..: విద్యార్థులు వాళ్ల ఇంటి వద్ద ఉండే సెల్‌ఫోన్లు, పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌ల ద్వారా ఏఐ ట్యూటర్‌ను వినియోగించవచ్చు. కొన్ని పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్యాబ్‌ల ద్వారా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు.

ఇల్లే నందనవనం



కాకినాడ గ్రామీణ మండలం రమణయ్యపేటలోని దుర్గా విద్యుత్‌నగర్‌కు వెళ్తే అక్కడో ఇల్లు మీ చూపు తిప్పుకోనివ్వదు. రంగురంగుల పూలు.. గోడలు, పిల్లర్లకు అల్లుకున్న లతలు, వెరైటీ పండ్ల మొక్కలతో అసలది ఇల్లా లేక నర్సరీనా అనిపిస్తుంది. గోడలు, మిద్దెలు, పిల్లర్లు.. ఇలా ఖాళీ స్థలమే కనిపించకుండా మొక్కలు పచ్చదనంతో నింపేశాయి. చాలా మంది వృథా అనుకున్న వస్తువులన్నీ ఏదో ఓ మొక్కకు ఆశ్రయమిస్తూ ఆ ఇంట్లో కుండీలుగా దర్శనమిస్తాయి. జలవనరుల శాఖలో ఉద్యోగ విరమణ చేసిన మురళీ గోపాలకృష్ణ, కంకణాలపల్లి రాధా దంపతులదే ఈ నందనం. వీరిది వ్యవసాయ కుటుంబం కావడంతో కొన్నేళ్లుగా నచ్చిన మొక్కనల్లా తెచ్చి ఎంతో ఇష్టంగా పెంచుతున్నారు. పెరట్లో వేప, మామిడిలాంటి పెద్ద వృక్షాలూ ఉన్నాయి. ఇంటిలోపల, మొదటి, రెండో అంతస్తులోని మిద్దెలపై కూరగాయలు, ఆకుకూరలు, వెరైటీ పండ్లు, పూల మొక్కలు ఎన్నో ఆకర్షణీయంగా పెంచుతున్నారు. హ్యాపీ గార్డెన్స్, సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్, కాకినాడ గార్డెన్ లాంటి సంఘాల్లో కీలకంగా ఉంటూ ఎంతో మందికి మిద్దెతోట పెంపకంలో సూచనలిస్తున్నారు. వీరి కృషికి 2013లో రైతునేస్తం, 2023లో ఏరువాక పురస్కారాలు వచ్చాయి.

– ఈనాడు, కాకినాడ



మిద్దెతోట చూపిస్తున్న కంకణాలపల్లి రాధ

భారత్-అమెరికా మధ్య
సబ్‌సీ కేబుల్

(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ సంస్థ దృష్టి సారించిందని పిచాయ్ పేర్కొన్నారు. 'విద్యార్థులు, వృత్తి నిపుణుల కోసం గూగుల్ ఏఐ ప్రొఫెషనల్ సర్టిఫికెట్, కర్మయోగి భారత్ భాగస్వామ్యంతో 18 భాషల్లో.. 800 జిల్లాల్లోని 2 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఏఐలో శిక్షణ.. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు జెనరేటివ్ ఏఐ ద్వారా 10వేలకు పైగా పాఠశాలల్లోని 1.10 కోట్ల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నాం' అని పేర్కొన్నారు. శాస్త్రీయ పరిశోధనల్లో ఏఐని వినియోగించడం ద్వారా వాటిని మరింత వేగవంతం చేసేందుకుగాను 30 మిలియన్ డాలర్లతో ఏఐ ఫర్ సైన్స్ ఇంపాక్ట్ ఛాలెంజ్ ఏర్పాటుచేశామని తెలిపారు. దీని ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్, వాతావరణ మార్పుల్లాంటి రంగాల్లో ఏఐని ఉపయోగించి ఆవిష్కరణలను వేగవంతం చేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. 'గూగుల్ ఏఐ ఓవర్ వ్యూస్.. సెర్చ్ ఫలితాలు.. ఏఐ జెనరేటెడ్ సమ్మరీలాంటివి గత దశాబ్దంలో మేం సాధించిన ఫలితాలు. ఏఐ మోడ్ ఇప్పుడు 35 కొత్త భాషల్లో.. 200 దేశాల్లో అందుబాటులో ఉంది. రాబోయే రోజుల్లో రియల్ టైంలో సెర్చ్ లైవ్‌గా.. వాయిస్, కెమెరాతో పనిచేసే విధానం రాబోతోంది. దీనివల్ల మరింతమంది తమ భాషలో తమకు అవసరమైన అంశాలు సెర్చ్ చేసే అవకాశం వస్తుంది. జెమినై యాప్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా వృద్ధి చెందుతోంది. భారత్‌లో 10 భాషల్లో అందుబాటులో ఉంది. గూగుల్ డీప్‌మైండ్, భారత ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరిందని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను' అని తెలిపారు.

ఏఐ వినియోగంపై ప్రధానితో చర్చించా

'ఆరోగ్యం, అన్ని భాషల్లో సమాచారాన్ని విస్తరించడం, స్టార్టప్‌లు, వ్యవసాయం లాంటి రంగాల్లో ఏఐని ఎలా వినియోగించాలనే దానిపై ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో చర్చించాం' అని పిచాయ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



దీర్ఘకాల పెట్టుబడితోనే..

మనం పెట్టుబడి పెట్టాలనుకున్న ప్రతినిర్ణయం సరైంది కాకపోవచ్చు. అయితే సుమారు 60 శాతం తగిన నిర్ణయాలు తీసుకున్నా గొప్ప సంపదను సృష్టించవచ్చు. దీర్ఘకాలంపాటు పెట్టుబడిని కొనసాగించడం, మంచి షేర్లను ఎంపిక చేసుకోవడం, వైవిధ్యాన్ని పాటించడమే అన్నింటికన్నా ముఖ్యం.

– అనిల్ రాణా, పెట్టుబడిదారు

గ్రహం అనుగ్రహం

19–2–2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం

విదియ: సా. 4-43 తదుపరి తదియ

పూర్వాభాద్ర: రా. 9-49 తదుపరి ఉత్తరాభాద్ర

వర్జ్యం: లేదు

అమృత ఘడియలు: మ. 1-53 నుంచి 3-28 వరకు

దుర్ముహూర్తం: ఉ. 10-18 నుంచి 11-04 వరకు తిరిగి మ. 2-54 నుంచి 3-40 వరకు

రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు

సూర్యోదయం: ఉ.6.29; సూర్యాస్తమయం: సా.5.58

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	15.7	34.8
విజయనగరం	16.0	31.0
అనంతపురం	17.5	35.0
తిరుపతి	18.6	31.7
హైదరాబాద్	19.0	30.2
కడప	19.0	32.0
కర్నూలు	19.9	34.4
శ్రీకాకుళం	20.0	30.0
విజయవాడ	20.0	31.5
తాడేపల్లిగూడెం	20.0	33.0
గుంటూరు	20.0	33.0
విశాఖపట్నం	20.4	30.0
రాజమహేంద్రవరం	20.5	33.5
నరసాపురం	21.2	33.3
ఒంగోలు	21.8	31.7
నెల్లూరు	22.0	31.9

రూ.29,018 కోట్ల పెట్టుబడులు.. 22,407 మందికి ఉపాధి

- 27 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆమోదం
- ముఖ్యమంత్రి అధ్యక్షతన 15వ ఎస్ఐపీబీ సమావేశం
- ఇప్పటివరకు రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు
- వాటిద్వారా 8.58 లక్షల మందికి ఉపాధి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.29,018 కోట్ల పెట్టుబడులతో వివిధ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వాటిద్వారా 22,407 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు 27 సంస్థల నుంచి అందిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన 15వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'ప్రతిష్ఠాత్మక గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, బీపీసీఎల్ లాంటి మెగా ప్రాజెక్టులు వరుసగా ఏర్పాటుకావాలి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి అడ్డంకులు లేకుండా చూడాలి. భూములు కేటాయించినా నిర్ణీత వ్యవధిలో పనులు ప్రారంభించని సంస్థలతో సంప్రదింపులు జరపాలి. ప్రాజెక్టు నిర్మాణానికి ఆసక్తి లేదంటే భూములు వెనక్కి తీసుకోవాలి. ప్రతి ఒప్పందం వేగంగా అమలుకావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపంలోకి తేవాలి' అని అధికారులకు సీఎం సూచించారు. ఇప్పటివరకు 15 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.9,03,726 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని.. వాటిద్వారా 8,58,082 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం పేర్కొన్నారు.

సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. 'సొంత భూముల్లో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేవారికీ అదనపు ప్రోత్సాహకాలు అందించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్నారైలను ఆహ్వానించాలి' అని సూచించారు.

విశాఖలో ఐకానిక్‌గా 'భారత్ మండపం'

విశాఖపట్నంలో 'భారత్ మండపం' రాబోతోందని. . దాన్ని ఐకానిక్‌గా తీర్చిదిద్దేలా చూడాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. దేశంలోనే అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌గా నిలవాలన్నారు. 'ప్రతి జిల్లాలో శిల్పారామాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. కాకినాడ, ఏలూరు లాంటి ప్రాంతాలతో సహా.. రాష్ట్రంలో మరిన్ని హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు రావాలి. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా పర్యాటకరంగాన్ని ప్రోత్సహించాలి. సూర్యలంక, పోలవరం, పులికాట్, గండికోట, శ్రీశైలం, మదనపల్లె హార్సిలీ హిల్స్ లాంటి క్లస్టర్లు ఏర్పాటుచేసి.. అక్కడ షాపింగ్ మాల్స్, హోటళ్లు ఏర్పాటుచేస్తే పర్యాటకుల్ని ఆకట్టుకోవచ్చు. క్రీడా నగరం, క్రియేటివ్ సిటీ ఎకో సిస్టం లాంటివి నెలకొల్పాలి. హెల్త్ టూరిజం గణనీయంగా పెరగాలి. హాస్పిటాలిటీలో డీమ్డ్ యూనివర్సిటీ లాంటివాటిని ప్రోత్సహించాలి. ఆక్వా రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తులు వస్తేనే అమెరికాకు ఎగుమతులు పెరిగే అవకాశం ఉంటుంది. డెయిరీ, పౌల్ట్రీ, లైవ్‌స్టాక్, మాంసం ఎగుమతులు పెరిగేలా చూడాలి' అని పేర్కొన్నారు.

ఉద్యోగాల వివరాలతో నైపుణ్యం పోర్టల్

రాష్ట్రంలో ఇప్పటివరకు యువతకు లభించిన ఉపాధి వివరాలను నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించాలని సీఎం సూచించారు. 'ఇంకా ఎన్ని ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయనే వివరాలు తెలిసేలా రియల్ టైంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపినవి, విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించి కార్యకలాపాలు ప్రారంభించే తేదీని స్పష్టంగా పేర్కొనాలి. విజయవాడ, విశాఖ, తిరుపతిల్లో ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాలి' అని అధికారులకు సూచించారు.

★ తిరుపతి జిల్లాలో హెరిటేజ్ ఫుడ్స్ అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు సమావేశం నుంచి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బయటకు వెళ్లిపోయారు. ఆ ప్రతిపాదనపై చర్చించి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దానికి ఆమోదం తెలిపారు.



సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో నారాయణ, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, లోకేశ్, విజయానంద్, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్

ఎస్ఐపీబీలో ప్రభుత్వం ఆమోదించిన పెట్టుబడులు

సంస్థ పేరు	జిల్లా	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
వారీ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్	అనకాపల్లి	8,175	3,000
ఎన్టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ	కర్నూలు	4,500	3,100
అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్యాకేజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్	విశాఖపట్నం	2,387.81	1,000
క్రోమా ఆటార్ ఇంటర్నేషనల్	పల్నాడు	2,000	5,000
రెన్యూ ఫొటోవోల్టాయిక్స్	కర్నూలు	1,461	500
క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ	అనంతపురం	1,391	200
క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ-13	అనంతపురం	1,391	200
నాన్ గ్రీన్‌మెట్ ప్రైవేట్ లిమిటెడ్	నాయుడుపేట	1,366	340
సైబర్ సిటీ బిల్డర్స్ డెవలపర్స్ దివ్యశ్రీ హోల్డింగ్స్ కన్సార్షియం	తిరుపతి	1,226.32	1,500
యశస్వ పవర్ ఎల్ఎల్‌పీ	శ్రీసత్యసాయి	1,200	690
ఏసీఈ ఇంటర్నేషనల్ లిమిటెడ్	చిత్తూరు	786.15	1,000
ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్	నెల్లూరు	500	2,050
రుషికొండ బీచ్ రిసార్ట్స్	విశాఖపట్నం	424.20	450
అకేసియా హోటల్స్, రిసార్ట్స్	గుంటూరు	330	372
సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్	కర్నూలు	314.66	780
కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్	విశాఖపట్నం	280.51	310
ఎకో ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్	అల్లూరి	262.87	500
రాధికా వెజిటబుల్ ఆయిల్స్	విజయనగరం	240	304
హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్	తిరుపతి	209.68	35
సైక్ స్టోరేజ్ లిమిటెడ్	విశాఖపట్నం	106	285
ఎస్వీఎస్ కన్‌స్ట్రక్షన్స్	--	104	300
కంపాస్ ఎంటర్‌ప్రైజెస్	తూర్పుగోదావరి	101.28	150
వీరాంజనేయ హాస్పిటాలిటీ	విశాఖపట్నం	89.32	150
బాలాజీ యార్న్స్ బిల్డ్ వెల్	అనకాపల్లి	58.19	--
అక్షయ హోటల్స్ అండ్ రిసార్ట్స్	బాపట్ల	54.02	80
సిరి బయోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్	ఎన్టీఆర్	37	74
సిరి బయోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్	శ్రీసత్యసాయి	22	37

24న మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: సీఎం అధ్యక్షతన ఈ నెల 24న మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఇందులో చర్చించాల్సిన ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖలో అందించాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులకు సూచిస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్షేత్రస్థాయి సమస్యలకు సత్వర పరిష్కారం

- తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులకు అక్కడికక్కడే ఆమోదం
- ఎమ్మెల్యేలు, అధికారుల పనితీరుపైనా మదింపు
- సత్ఫలితాలనిస్తున్న సీఎం జిల్లాల వారీ సమీక్షలు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం రూ.23.70 కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టడంతో వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో తాగునీటి పథకం నిలిచిపోయిందని ఆ జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొస్తే.. నిధులు విడుదల చేసి దాన్ని పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చినందున... జిల్లా పేరును అన్నమయ్య మదనపల్లె జిల్లాగా మార్చాలని ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి కోరితే సీఎం సానుకూలంగా స్పందించారు. చిత్తూరులో కొత్త రైల్వేబ్రిడ్జి నిర్మాణానికి చర్య తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కోరగా.. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి, రైల్వేశాఖకు పంపించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల జిల్లాలవారీగా ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో చాలా సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. రూ.కోటి నుంచి రూ.10కోట్ల వరకు ఖర్చయ్యే ప్రాజెక్టులు, సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆమోదం తెలియజేస్తున్నారు. జిల్లాల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, ప్రధాన సమస్యల సత్వర పరిష్కారం లాంటి అంశాలపై నివేదికల ఆధారంగా సీఎం కూలంకషంగా సమీక్షిస్తున్నారు.

ఎమ్మెల్యేల పనితీరుపై చేసిన సర్వేలు, నివేదికల ఆధారంగా... వారికి సీల్డ్‌కవర్లలో ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేస్తున్నారు. శాసనసభ సమావేశాలు ముగిశాక సాయంత్రం సీఎం వద్ద రోజుకో జిల్లా చొప్పున సమీక్షిస్తున్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యల్ని, పెండింగ్‌లో ఉన్న, సగంలో ఆగిపోయిన ప్రాజెక్టుల గురించి వివరిస్తున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులతో ఒకేసారి సమావేశం నిర్వహించడంతో జిల్లాల్లోని ప్రధాన సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం లభిస్తోంది. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులకు వెంటనే నిధుల విడుదలకు సీఎం ఆదేశాలు జారీచేస్తున్నారు. కేంద్రం, వివిధ పథకాల ద్వారా ప్రాజెక్టుల్ని పూర్తి చేసే అంశంపైనా చర్చిస్తున్నారు. ఇప్పటివరకు కృష్ణా, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, అల్లూరి సీతారామరాజు మన్యం, పోలవరం జిల్లాల ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షలు ముగిశాయి.

ఎమ్మెల్యే పనితీరుపై మదింపు

ఎమ్మెల్యేల పనితీరుపైనా ఈ సమావేశంలో సీఎం సమీక్షిస్తున్నారు. ఏ ఎమ్మెల్యే ఎన్నిసార్లు 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్నారు? ఎన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు? ఎన్ని ప్రజాదర్బార్లు పెట్టారు? సామాజిక మాధ్యమాల్లో ఎంత చురుగ్గా ఉన్నారనే అంశాలపై పూర్తి సమాచారం సీఎం దగ్గర ఉంది. 6, 7 నివేదికలు, సర్వేలు, రిపోర్టుల ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును ఆయన మదింపు చేస్తున్నారు. బాగా పనిచేస్తున్నవారిని మెచ్చుకుంటున్నారు. వెనుకబడినవారికి పనితీరు మెరుగవ్వాలని సూచిస్తున్నారు.

అధికారుల పనితీరుపైనా నివేదికలు

అధికారుల పనితీరుపైనా సీఎం సమీక్షిస్తున్నారు. ప్రభుత్వ విభాగాల పనితీరు, సిబ్బంది కొరత, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, బస్సు సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ లాంటి అంశాలపై సర్వేల ఆధారంగా సమీక్షలు జరుగుతున్నాయి. పనిచేయని అధికారుల్ని, సమస్యలు సృష్టిస్తున్నవారిని భరించక్కర్లేదని ఎమ్మెల్యేల సమక్షంలో కలెక్టర్, ఎస్పీలకు సీఎం స్పష్టం చేస్తున్నారు. ఇన్‌ఛార్జి మంత్రుల పనితీరుపైనా సీఎం పలు సూచనలు చేస్తున్నారు. సోషల్ రీ ఇంజినీరింగ్, సమస్యల పరిష్కారం, నాయకత్వం పెంపు, పనిచేసిన వారికి గుర్తింపు లాంటి విషయాల్లో ఇన్‌ఛార్జి మంత్రులు మరింత క్రియాశీలంగా పనిచేయాలని సూచిస్తున్నారు. సీఎంతో జరుగుతున్న సమావేశాలపై ఎమ్మెల్యేలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

'మెటీరియల్' బిల్లుల అప్‌లోడ్‌లో ఏపీ టాప్

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకం కింద 2025-26లో మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన పనులకు ఇప్పటివరకు రూ.1,884 కోట్ల విలువైన బిల్లులు అప్‌లోడ్ చేసి, మన రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ వెల్లడించింది.



వంశధార నదిలో శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ స్నాన ఘట్టాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనం

పులకించిన వంశధార

- వైభవంగా శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థస్నానం
- భక్తులతో కిక్కిరిసిన నదీతీరం

జలుమూరు, నరసన్నపేట, సారవకోట, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: వంశధార నదీ తీరం భక్తజనంతో మురిసిపోయింది. శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ స్నానంతో పులకించిపోయింది. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం గ్రామంలోని శ్రీముఖలింగేశ్వరుడి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి చక్రతీర్థ స్నాన ఘట్టం కనులపండువగా సాగింది. ఉదయం 11.40 గంటలకు ఆలయం నుంచి పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను నదికి తరలించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు గంటల తరబడి నది సమీపంలో వేచిచూశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచీ భక్తులు వచ్చి స్వామి చక్రతీర్థ స్నాన ఘట్టంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బందోబస్తు నిర్వహించారు.



శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేట మండలం మిరియాపల్లి వద్ద రేవుకు చేరుకున్న ఉత్సవమూర్తులు

నేడు జైపుర్‌కి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రత్యేకాధికారి వికాస్ మర్మత్ వివాహానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాజస్థాన్ రాజధాని జైపుర్ వెళుతున్నారు. వికాస్ 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఆయన ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. గురువారం శాసనసభ సమావేశాలు ముగిశాక సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి జైపుర్ బయల్దేరుతారు. బృందావన్ ప్యాలెస్‌లో జరిగే వివాహానికి హాజరవుతారు. రాత్రి జైపుర్‌లోనే బస చేసి.. శుక్రవారం ఉదయం 7.45 గంటలకు దిల్లీ వెళతారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం దిల్లీ నుంచి బయల్దేరి హైదరాబాద్ చేరుకుంటారు.

విద్యుత్ కనెక్షన్ ఏకపక్షంగా తొలగించడం సరికాదు

స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: ముందస్తు నోటీసు ఇవ్వకుండా విద్యుత్ కనెక్షన్ తొలగించడం సరికాదని, నోటీసు ఇవ్వాల్సిన చట్టబద్ధ బాధ్యత అధికారులపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. విద్యుత్ ప్రాథమిక అవసరమని గుర్తుచేసింది. ఏకపక్షంగా విద్యుత్ కనెక్షన్ తొలగింపు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని తెలిపింది. పిటిషనర్ ట్రస్ట్‌కు ఏడు రోజుల్లోగా కొత్త మీటర్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించింది. మరోవైపు చట్ట ప్రకారం వ్యవహరించే హక్కు అధికారులకుంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య ఇటీవల తీర్పు ఇచ్చారు.

★ ప్రకాశం జిల్లా అద్దంకి-కాకానిపాలెంలోని కాకతీయ సేవా ట్రస్ట్ విద్యుత్ కనెక్షన్ తొలగించడాన్ని సవాలు చేస్తూ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ట్రస్ట్ ఛైర్మన్‌గా చెప్పుకొంటున్న మరో వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ముందస్తు నోటీసు ఇవ్వకుండా తమ విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారన్నారు.

ఈనాడు

పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా...

సుఖ సంతోషాల్లో ఎవరైనా భాగం పంచుకుంటారు కానీ, సంక్షోభ సమయాల్లో మనతో పాటు ఉండేవారే నిజమైన స్నేహితులన్నది సత్యం. పారిస్, న్యూదిల్లీల ఆప్తమిత్రత్వం అటువంటిదేనన్నది చరిత్ర చెబుతున్న వాస్తవం. పోఖ్రాన్ అణుపరీక్షల అనంతరం పలు పాశ్చాత్య దేశాలు ఇండియాపై కత్తులు దూసినప్పుడు ప్రాంతీయంగా భారత్ ఎదుర్కొంటున్న కఠిన భద్రతా సవాళ్లను ఫ్రాన్స్ ఒక్కటే అర్థం చేసుకుంది. ఆంక్షల విధింపునకు అంగీకరించకపోవడమే కాదు, అణు సహకారంపై ఇండియాతో తమ చర్చలను ఎవరూ అడ్డుకోలేరని స్పష్టంగా ప్రకటించింది. అప్పుడే 1998లో ఇరుపక్షాల నడుమ వ్యూహాత్మక భాగస్వామ్య (ఎస్‌పీ) బంధం ముడిపడింది. ఒక పాశ్చాత్య రాజ్యంతో 'ఎస్‌పీ' కుదుర్చుకోవడం ఇండియాకు అదే ప్రథమమైతే- యూరోపియన్ యూనియన్‌కు ఆవల ఫ్రాన్స్ మొదటిసారి భారతావనితోనే వ్యూహాత్మక మైత్రికి మొగ్గుచూపింది. నాటి నుంచి పరస్పర గౌరవం, విశ్వాసాల ప్రాతిపదికపై బలపడుతూ వచ్చిన ద్వైపాక్షిక సంబంధాలు- తాజాగా 'ప్రత్యేక ప్రపంచవ్యాప్త వ్యూహాత్మక భాగస్వామ్యం' (ఎస్‌జీఎస్‌పీ) స్థాయికి పటిష్ఠమయ్యాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ భారత పర్యటన సందర్భంగా వెలువడిన 'ఎస్‌జీఎస్‌పీ' ప్రకటనలో- అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులూ సవాళ్లను సమష్టిగా ఎదుర్కొంటూ, స్థిరమైన నియమబద్ధమైన ప్రపంచ క్రమాన్ని నెలకొల్పాలన్న రెండు దేశాల ఉమ్మడి ఆకాంక్షలు ప్రతిఫలిస్తున్నాయి!

ఇండియా, ఫ్రాన్స్ చెలిమికి కొత్త చివుళ్లు తొడగడంలో మోదీ, మెక్రాన్‌ల చొరవ సంస్తుతిపాత్రమైనది. ప్రధానిగా నిరుడు ఆరోసారి ఫ్రాన్స్‌లో పర్యటించిన మోదీ- రక్షణ, పారిశ్రామిక రంగాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను పట్టాలకెక్కించడంలో సఫలీకృతమయ్యారు. ఇంధన భద్రతకోసం అత్యాధునిక అణు రియాక్టర్లను సంయుక్తంగా నిర్మించే ఆలోచనను ఆ సందర్భంగా ఇరువురు నేతలు ప్రకటించారు. తాజాగా నాలుగోసారి భారత్‌కు విచ్చేసిన మెక్రాన్- భారత్‌కు కీలక రక్షణ సాంకేతికతల బదలాయింపుపై చాలా సానుకూలంగా స్పందించారు. కొత్తగా 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సిద్ధమవుతున్న ఇండియా- వాటిలో యాభైశాతం విడిభాగాలను ఇక్కడే తయారుచేయాలని పట్టుబడుతోంది. 'భారత్‌లో తయారీ'కి అది కొత్త సత్తువనిస్తుంది. ద్వైపాక్షిక రక్షణ సహకార ఒప్పంద పునరుద్ధరణ నుంచి ఇండియాలో హామర్ క్షిపణుల ఉత్పత్తి వరకు, అరుదైన ఖనిజాలు మొదలు స్టార్టప్‌ల దాకా భిన్న రంగాల్లో ఉభయతారక సహకారానికి మొన్నటి మోదీ, మెక్రాన్‌ల భేటీలో ఒప్పందాలు ముడిపడ్డాయి. ఏఐను జనశ్రేయోదాయకంగా వినియోగించుకోవడం, పరిశోధనలూ నవకల్పనల దిశగా కలిసికట్టుగా పనిచేయడం, సుస్థిరాభివృద్ధికి పరిశ్రమించడం వంటి ప్రస్తావిత లక్ష్యాలు పూర్తిగా సాకారమైతే ఇరుదేశాలకూ అవి లాభం చేకూర్చుతాయి!

ఇండో పసిఫిక్ ప్రాంతం(ఐపీఆర్)లో దాదాపు 20లక్షల మంది ఫ్రెంచి జనాభా నివసిస్తున్న నేపథ్యంలో చైనా విస్తరణవాదం ఫ్రాన్స్‌ను కలవరపరుస్తోంది. విలువైన సముద్ర వనరుల సంరక్షణ ద్వారా తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికీ ఐపీఆర్‌లో బీజింగ్ దూకుడును నియంత్రించడం పారిస్‌కు తప్పనిసరి అవసరం. ఆ మేరకు చైనాకు పగ్గాలు వేసేందుకు భారత్‌తో చెలిమి ఫ్రాన్స్‌కు సాయపడుతుంది. రక్షణ, వాణిజ్య విషయాల్లో ఒకటి రెండు దేశాలపైనే ఆధారపడకుండా ఉండటానికి, యూరప్‌తో విస్తృతంగా అనుసంధానం కావడానికి ఫ్రాన్స్‌తో అనుబంధం ఇండియాకు అక్కరకొస్తుంది. భిన్నధ్రువ ప్రపంచంలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకుంటూ స్వావలంబన సాధించడానికి, దేశీయంగా ఉపాధి అవకాశాల పెంపునకూ అది ఉపయుక్తమవుతుంది!



రచనకు ప్రత్యేకమైన భాషంటూ ఉండదు. ఎవరి భాషలో వాళ్లు తమ అనుభవాల నుంచి రాయాలి. మీ అనుభవాలను సరైన పదాల్లో ఎంత బాగా వ్యక్తీకరించగలరో అదే రచనకు ప్రత్యేకతను తెస్తుంది. పాఠకులు ఆ పాత్రల్లో తమను చూసుకునేలా చేస్తుంది.

– వైదేహి, కన్నడ రచయిత్రి

అదే అత్యుత్తమ సేవ...

రంగురంగుల ప్రకృతి శోభ వర్ణనాతీతం. భౌతికంగా, మానసికంగా విభిన్న తత్వాలు ఉన్న మానవ ప్రపంచం అంతకన్నా అద్భుతం. మానవత్వమనే ఏకసూత్రంతో భిన్నత్వంలో ఏకత్వంగా మనుషులంతా ఒకేతాటిపై కలిసిమెలిసి నడవగలిగితే అది మరింత అబ్బురమైన విషయం. మనుషులందరూ సమానమేనన్న భావనతోనే లోకంలో శాంతి పరిఢవిల్లుతుందని రంజాన్ మాసం సూచిస్తుంది. అహంకారంతో అజ్ఞానులు ఘర్షణకు మూలకారకులై లోకాన్ని చిన్నాభిన్నం చేసే ప్రయత్నంలో ఉంటారు. జ్ఞానులు వినయ సంపన్నులై సృష్టికర్తకు మోకరిల్లి సర్వ మానవ సమానతా సందేశాన్ని అందిస్తారు.

ఏ జాతికి చెందినవారికైనా ఇతర వర్గాల వారిపై ఎటువంటి ఆధిక్యతా ఉండదని ప్రియ ప్రవక్త మొహమ్మద్ (స.అ.వ.) బోధించారు. ధర్మనిష్ఠ, దైవభక్తి మాత్రమే మనిషి ప్రధానమని స్పష్టీకరించారు. అల్లాహ్ ఆదేశాలకు తలొగ్గి తమను తాము సమర్పించుకునే మహద్భాగ్యం కలిగించే రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనది. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటిచెప్పిన ప్రవక్త మొహమ్మద్(స.అ.వ.)పై ఖురాన్ గ్రంథం అవతరించింది. ఈ మాసంలో విశ్వాసులకు అందిన వరం ఇది.



ముప్పై రోజులపాటు కఠోర దీక్షతో చేసే ఉపవాసాలు మనిషిని చెడు అలవాట్లను వదిలి దైవమార్గం వైపు మళ్లిస్తాయి. జూదం, ధూమపానం, మద్యపానం వంటి బలహీనతల నుంచి కాపాడి అల్లాహ్ సమక్షంలో బలమైన విశ్వాసులుగా ఈ మాసం నిలుపుతుంది. రోజా చేసే ఆయువు పూటల నమాజ్‌తో పాటు ప్రత్యేక తరావీహ్ నమాజ్‌ను ఆచరించిన విశ్వాసులు అల్లాహ్ ప్రసన్నత పొంది క్షమార్హులవుతారు. ఇహపరలోకాల్లో పుణ్యఫలాలను పొందుతారని నమ్మకం. చిత్తశుద్ధి ఉన్నవారే దైవప్రసన్నతకు అర్హులవుతారని మర్చిపోకూడదు. నిర్ణీత సమయంలో భోజనాలు తాకకుండా వరసల్లో నిలబడి చేసే నమాజులు, దుఆలు, ఉపవాసదీక్ష విరమించే ఇఫ్తార్ విందులు సామాజిక అసమానతలను తొలగిస్తాయి. సంబంధ బాంధవ్యాలు బలపడతాయి. ఆర్థిక వ్యత్యాసాలు మరచి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మసంతృప్తి పొందిన విశ్వాసులు అల్లాహ్ భయభక్తులతో కాంతులీనుతారు. ఒకరికొకరం అండగా ఉన్నామన్న నమ్మకం పెరిగి అందరికీ అల్లాహ్ ఆశీస్సులు అందాలన్న ఆకాంక్ష బలపడుతుంది. ధార్మిక ఆలోచనలతో మెత్తటి మనసుతో మనిషి పునీతుడవుతాడు.

అదుపు ఉపవాసం, జకాత్ దానధర్మం, ప్రార్థనల కన్నా ఉన్నతమైన సత్కార్యం ఉందని అదే పరస్పర సంబంధాలను సరిచేసుకోవడమని ప్రవక్త మొహమ్మద్ (స.అ.వ.) ఉల్లేఖించారు. వివిధ వర్గాల వ్యక్తుల మధ్య తలెత్తిన అపోహలను తుడిచిపెట్టి ప్రేమ సుగుణాలతో ఉన్న మనుషులను నిర్మించడమే అత్యుత్తమ సేవగా ఇస్లాం పరిగణిస్తుంది. సమ సంపన్న ప్రతి ఒక్కరి బాధ్యతగా రంజాన్ మాసం తెలియజేస్తుంది. పవిత్ర ఖురాన్ గ్రంథపఠనం ద్వారా ధర్మసూక్ష్మాలు గ్రహించి మార్గదర్శక సూత్రాలను పాటించాలి. సమాజాన్ని కలుపుకొని సత్సంప్రదాయాల దిశగా నడిపించేలా కృషి చేయాలి. అల్లాహ్ అనుగ్రహించిన ఈ రంజాన్ మాసాన్ని సద్వినియోగం చేసుకుని దివ్యానుభూతిని పొందాలి.

– షేక్ బషీరున్నీసా బేగం

అంతర్యామి

అందరిదీ రక్షణ మార్గమే!



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ప్రాంతీయ సంఘర్షణలు, అణ్వస్త్ర హుంకరింపులు, ట్రంప్ పెడపోకడలతో పలు దేశాలు రక్షణ రంగానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇరువైపులా అణ్వస్త్ర దేశాలు కలిగిన భారత్ పరిస్థితి ఎప్పుడూ సంక్లిష్టమే. 'ఆపరేషన్ సిందూర్' తరవాత రక్షణ రంగ బలోపేతానికి భారత ప్రభుత్వం సైతం గట్టిగా సంకల్పించింది. 2026-27 రక్షణ బడ్జెట్‌ను అనూహ్యంగా పెంచడం, రఫేల్ యుద్ధవిమానాలు, సముద్ర నిఘా విమానాల కొనుగోలుకు పూనుకోవడమే ఇందుకు నిదర్శనం.

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులు దాదాపు 15 శాతం పెరిగాయి. సుమారు రెండు దశాబ్దాల తరవాత రక్షణ పద్దులో రెండంకెల వృద్ధి సాధ్యమైంది. కొత్త ఆయుధాల కొనుగోలుకు ఉద్దేశించిన మూలధన వ్యయం కింద కేటాయింపులనూ పెంచారు. మూలధన వ్యయంలో 75 శాతాన్ని దేశీయ పరిశ్రమల నుంచి కొనుగోళ్లకు ప్రత్యేకించడం విశేషం. ఆపరేషన్ సిందూర్ పరిణామాలు భావి యుద్ధతీరుతెన్నులపై మేల్కొలుపు సందేశంలా పనిచేశాయి. దీంతో సైనిక ఆధునికీకరణ, స్మార్ట్ ఆయుధాల సేకరణ, మెరుగైన పోరాట సన్నద్ధతలకు మునుపెన్నడూ లేనిస్థాయిలో ప్రాధాన్యం పెరిగింది. అయితే, తాజా రక్షణ కేటాయింపులు జాతీయ భద్రతా అంశాల్లో అంతరాన్ని కొంత మేర పూడ్చుకోవడానికే ఉపకరిస్తాయని, వాటిని పూర్తిగా తొలగించడానికి సరిపోవన్న అభిప్రాయం విశ్లేషకుల్లో ఉంది. 'సిప్రీ' అంచనాల ప్రకారం, రక్షణకు ఎక్కువగా ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ అయిదోది. అయితే ఆ వ్యయం ప్రస్తుత దేశ అవసరాల స్థాయిని ప్రతిబింబించడంలేదన్న విమర్శ ఉంది. ముఖ్యంగా చైనా సైనిక ఆధునికీకరణ వేగం కారణంగా, మన రక్షణ పద్దును గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. మరోవైపు తాజా బడ్జెట్‌లో రక్షణ శాఖకు ప్రతిపాదించిన మూలధన కేటాయింపుల్లో సింహభాగం ఇప్పటికే కొనుగోలు చేసిన ఆయుధాలకు సంబంధించిన కిస్తీల చెల్లింపులకే పోతుంది. కొత్త సమీకరణలకు నిధులు తక్కువగానే అందుబాటులో ఉంటాయి.



భారీగా అవసరాలు...

పొరుగు దేశంతో ఘర్షణలు తలెత్తిన సందర్భాల్లో కొన్నేళ్లపాటు రక్షణ బడ్జెట్‌కు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వాలు ఆ తరవాత అదేస్థాయి ఊపును కొనసాగించడం లేదని గత అనుభవాలు చెబుతున్నాయి. కార్గిల్ యుద్ధానంతరం భారత్ కొన్నేళ్ల పాటు జీడీపీలో 2.5శాతాన్ని రక్షణ రంగానికి కేటాయించింది. దీనివల్ల మన సైనిక బలగాల పోరాట సామర్థ్యం వేగంగా పెరిగింది. ఆ తరవాత జీడీపీలో రక్షణ బడ్జెట్ వాటా రెండుశాతం కన్నా తక్కువకు పడిపోయింది. దీంతో కీలక సైనిక ఆధునికీకరణ ప్రాజెక్టులు మందగమనంలో సాగుతున్నాయి. వాస్తవానికి రక్షణ రంగంలో భారత్ అవసరాలు భారీగా ఉన్నాయి. వాయుసేనలో ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య ఆందోళనకర స్థాయికి పడిపోయింది. ఈ లోటును కొంతవరకూ పూడ్చుకోవడానికి ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు భారత్ నడుం బిగించింది. ఫైటర్ జెట్లకు నింగిలోనే ఇంధనాన్ని నింపే ట్యాంకర్ విమానాలు, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు(అవాక్స్), రష్యా నుంచి అదనంగా ఎస్-400 రక్షణ వ్యవస్థ వంటివాటి కొనుగోలుకు కసరత్తు జరుగుతోంది. విదేశీ భాగస్వామ్యంతో జెట్ ఇంజిన్ల అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునికీకరణ చేపట్టాల్సి ఉంది. నౌకాదళంలో పీ-75(ఐ) ప్రాజెక్టు కింద ఆరు అధునాతన సబ్‌మెరైన్ల సమీకరణకు జర్మనీతో ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంది.

రక్షణపరంగా భారత్‌కు పొంచి ఉన్న ముప్పులు, అవసరాల నేపథ్యంలో కొన్నేళ్లపాటు రక్షణ రంగానికి జీడీపీలో మూడు శాతానికి మించి కేటాయింపులు జరపాలన్న డిమాండ్ ఎప్పటినుంచో వినిపిస్తోంది. కొత్తగా వస్తున్న హైటెక్ ఆయుధాల ధర భారీగా ఉంటోంది. తాజా బడ్జెట్‌లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), పలు ఇతర పరిశోధన సంస్థలకు కేటాయింపులు పెంచారు. నిజానికి ఇతర సంస్థలు చేసే పరిశోధనలతో రక్షణ రంగానికీ ప్రయోజనం ఉంటుంది. కానీ మన దేశంలో ఈ 'జోడు లబ్ధి' కోణంలో కసరత్తు ఎక్కువగా సాగడంలేదు. ప్రైవేట్ రంగంలోనూ ఆర్‌అండ్‌డీ పెరగాలి. రక్షణ కేటాయింపులను అభివృద్ధేతర అంశంగా చూడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. దేశీయ నౌకానిర్మాణం వల్ల అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని, దానివల్ల ఉపాధి రంగంపై 6.5రెట్ల ప్రభావం ఉంటుందన్న ప్రధానమంత్రి వ్యాఖ్యలను వారు గుర్తుచేస్తున్నారు. పెరిగిన రక్షణ కేటాయింపులను ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే సాధనంగా పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు. దేశీయ ఆయుధ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే ఎగుమతులూ పెరుగుతాయి. ఇందుకోసం పెద్ద పరిశ్రమలతోపాటు చిన్న సంస్థలనూ ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. రక్షణ ఉత్పత్తి అధికమైతే దేశంలో మానవ నైపుణ్యాలు, పరిశోధనలు పెరుగుతాయి.

బలంగా ఉండటం అనివార్యం

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చైనా దొంగచాటుగా సాయం అందించడంతో ఆ రెండు దేశాల కుమ్మక్కు తంత్రం బట్టబయలైంది. భారత్‌ను దొంగ దెబ్బతీయాలన్న డ్రాగన్ కుట్ర తేటతెల్లమైంది. దీంతో మనం మరింత అప్రమత్తంగా ఉండక తప్పదు. భవిష్యత్‌లో పాక్, చైనాలను ఉమ్మడిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితికి సన్నద్ధం కావాలి. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగల బాంబులు, నింగిలో సంచరిస్తూ అదును చూసి విరుచుకుపడే లాయిటరింగ్ మ్యునిషన్లను భారీగా నిల్వ చేసుకోవాల్సిన అవసరాన్ని 'ఆపరేషన్ సిందూర్' సూచించింది. ఆ దిశగా తాజా రక్షణ కేటాయింపులు ఒక ముందడుగేనని చెప్పొచ్చు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత యుద్ధ వ్యతిరేక, శాంతికాముక దేశంగా ఉన్న జపాన్ కూడా నేడు రక్షణ రంగానికి జీడీపీలో 2.2శాతం నిధులు కేటాయిస్తోంది. పెద్దగా శత్రు బెడదలేని ఆస్ట్రేలియా కూడా అదే బాటలో పయనిస్తోంది. ఐరోపా దేశాలదీ ఇదే దారి. ప్రస్తుత భౌగోళిక-రాజకీయ పరిస్థితుల్లో సరిహద్దులను కాచుకోవడం ప్రాణావసరం. యుద్ధాలు రాకూడదనుకుంటే రక్షణపరంగా బలంగా ఉండాల్సిందే. నేడు ప్రపంచ యవనికపై 'బలవంతుడి' మాటే చెల్లుతుందన్నది గుర్తుంచుకోవాలి.

– కంభంపాటి సురేష్

కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలన్నట్లు... పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకుంటారు చాలామంది. రెండంతస్తుల మెట్లు ఎక్కితే ఆయాసపడేవారు ఎవరెస్ట్ ఎక్కాలన్నది నా ఆశయం అని చెబితే విన్నవాళ్లు నవ్వరూ..? కానీ మనలో చాలామంది పనులు అలాగే ఉంటాయి. అందుకే లక్ష్య సాధనలో విఫలమవుతుంటారు.

సూర్య తొంభై కిలోలపైనే బరువుంటాడు. ఇంటర్వ్యూలకు వెళ్తుంటే అక్కడ అందరూ చక్కగా టక్ చేసుకుని టై, బెల్ట్ పెట్టుకుని రావడం చూసి తానూ తగ్గాలనుకున్నాడు. నెలకి పది కిలోల చొప్పున మూడు నెలల్లో ముప్పై కిలోలు తగ్గాలని ప్లాను. అందుకని జిమ్‌కి వెళ్లి అతిగా వ్యాయామం చేయడంతో పాటు డైటింగ్ కూడా మొదలెట్టాడు. నెల తిరిగేసరికి నీరసించి, కండరాల నొప్పులతో కుప్పకూలిపోయాడు.



ఒక్కో అడుగు వేస్తేనే...

బరువు తగ్గడం ఏమో కానీ పూర్తిగా ఆరోగ్యం చెడిపోయింది. కాస్త తేరుకున్నాక పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని కోచింగ్‌లో చేరాడు. వాళ్లు ఒక్కో చాప్టరూ లోతుగా చెప్పడం అతడికి నచ్చలేదు. రోజుకు మూడు చాప్టర్లన్నా పూర్తి చేయకపోతే ఎలా అని వాళ్లతో గొడవపడేవాడు. పరీక్షకు ప్రిపేరయ్యే పద్ధతి అది కాదని వాళ్లంటే సొంతంగా చదువుకుంటానని కోచింగ్ మానేశాడు. కొన్నాళ్లకు జాబ్ కొట్టడం తన వల్ల కాదని యూట్యూబ్ ఛానల్ పెట్టాడు. మూడు నెలలైనా సబ్‌స్క్రైబర్స్ మూడు వందలు దాటలేదు. అదీ తనకు అచ్చిరావడం లేదనుకుని వదిలేశాడు.


సూర్య లాంటివాళ్లు చాలామందే ఉంటారు. లక్ష్యం తప్ప దాన్ని చేరుకునే మార్గం గురించి అవగాహన ఉండదు. అందుకే అసాధ్యమైన లక్ష్యాలు పెట్టుకుంటారు. వాటిని చేరుకోలేక ఎదుటి వారిమీదో, పరిస్థితుల మీదో నెపం వేసి తప్పుకొంటారు. ఒక్కో మెట్టూ ఎక్కితేనే పై అంతస్తుకు చేరుకుంటాం. ఒకేసారి పదిమెట్లూ ఎక్కలేం కదా! ఏ విషయంలోనైనా అదే వర్తిస్తుంది. ఒక లక్ష్యం సాధించాలనుకున్నప్పుడు దానికి సరైన మార్గాన్ని కూడా నిర్దేశించుకోవాలి. సూర్య విషయమే తీసుకుంటే నెలకు అత్యధికంగా 3, 4 కిలోలు తగ్గడం గొప్ప. అది ఆరోగ్యకరం కూడా. కానీ పదికిలోలు తగ్గాలని అతిగా శ్రమిస్తే మొదటికే మోసం వచ్చింది. పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నప్పుడు ఒక ప్రణాళిక ప్రకారం సన్నద్ధం కావాలి. తుపాను స్పీడుతో సిలబస్ అంతా కొద్ది రోజుల్లో చదివేయడం పరీక్ష రాసేవారికి పనికొచ్చే పద్ధతి కాదని అతనికి తెలియదు. అలాగే యూట్యూబ్ కూడా. ఓపిగ్గా, మంచి కంటెంట్‌తో కొన్నాళ్లపాటు చేస్తూ ఉంటే క్రమంగా చూసేవారి సంఖ్య పెరుగుతుంది. నాలుగు వీడియోలు పెట్టి లక్షల్లో సబ్‌స్క్రైబర్లు రావాలంటే ఎలా వస్తారు?

లక్ష్యం ఏదైనా కానీ... దాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించుకోవాలి. అప్పుడు ఒక్కో భాగాన్ని సాధించడం తేలికవుతుంది. అలా విజయం దిశగా ఒక అడుగు ముందుకెళ్లడం మనసుకు ఉత్సాహాన్నిస్తుంది. మరో అడుగు వేయడానికి ఆసక్తి పెరుగుతుంది. అలా అంచెలంచెలుగా అనుకున్నది సాధిస్తేనే ఎవరైనా విజేతలవుతారు.

– మనిగిరి అశ్విని

వలస చదువులు

నాణ్యమైన ఉన్నత చదువుల కోసమని ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు వివిధ దేశాలకు వలస వెళ్తుంటారు. 2001లో ఇలా పలు దేశాలకు చెందిన 22లక్షల మంది విదేశీ విద్యాసంస్థల్లో చేరితే, 2022 నాటికి ఆ సంఖ్య ఏకంగా 69 లక్షలకు చేరింది. వీరిలో అత్యధికులు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీలకే వెళ్తున్నారు. 'బ్రిక్స్' కూటమి దేశాల విషయానికి వస్తే... రష్యా, చైనాలకే చాలామంది అంతర్జాతీయ విద్యార్థులు వెళ్తున్నారు. ఇక 2016లో 6.85లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో చేరితే, నిరుడు ఆ సంఖ్య 18లక్షలు దాటిపోయింది. 2024లో ఒక విదేశీ విద్యార్థి చదువుకోవడానికని ఇండియా వస్తే, మన దగ్గర నుంచి 28 మంది చొప్పున విదేశాలకు వెళ్లినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2011, 2023 సంవత్సరాల్లో 'బ్రిక్స్' ఆకర్షించిన విదేశీ విద్యార్థుల్లో ఆయా దేశాల వాటా (శాతాల్లో)...



(ఆధారం: యునెస్కో నివేదిక)

పాక్ జట్టూ వెస్టిండీస్ బాటలోనే!

నిరుడు ఆసియా కప్‌లో ఫైనల్ సహా మూడు మ్యాచ్‌ల్లో భారత్, పాకిస్థాన్ జట్లు తలపడ్డాయి. మూడుసార్లూ ఇండియాదే విజయం. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌లో పాక్‌ను ఏకంగా 61 పరుగుల తేడాతో ఓడించింది భారత్. ఇప్పటిదాకా ఈ టోర్నీలో రెండు జట్లూ తొమ్మిదిసార్లు తలపడితే- ఎనిమిదిసార్లు మనదే విజయం. వన్డే ప్రపంచకప్‌లోనైతే ఎనిమిదికి ఎనిమిదిసార్లూ ఇండియాదే గెలుపు. 2008 ముంబయి ఉగ్రదాడుల నేపథ్యంలో భారత్-పాక్ మధ్య క్రికెట్ సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. 2013 తరవాత ద్వైపాక్షిక సిరీస్‌లు నిలిచిపోయాయి. ఐసీసీ టోర్నీలు, ఆసియాకప్‌ల్లో మాత్రమే రెండు జట్లూ తలపడుతున్నాయి. వాటిలో పాక్ ఎప్పుడూ చతికిల పడుతోంది.



మొన్నటి టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత్ ముందు చిన్న జట్టులా కనిపించింది పాకిస్థాన్. ఆ పోరులో పాక్ నుంచి పెద్దగా పోటీయే లేదు. ఉత్కంఠ అసలే లేదు. చాలా ఏళ్లుగా దాయాది జట్టుపై మన ఆధిపత్యం ఇలాగే కొనసాగుతోంది. దీంతో భారత్-పాక్ మ్యాచ్‌ల మీద అంతకంతకూ ఆసక్తి సన్నగిల్లిపోతోంది. చరిత్ర తెలిసినవాళ్లకు పాకిస్థాన్ క్రికెట్ జట్టు ఇంత బలహీనంగా మారిపోవడం ఆశ్చర్యం కలిగించకమానదు.

గతమెంతో ఘనం...


ఒకప్పుడు భారత్, పాక్ క్రికెట్ జట్ల మ్యాచ్‌ను ఓ యుద్ధంలాగే చూసేవారు అభిమానులు. రెండు జట్ల ఆటగాళ్లూ మైదానంలో ప్రాణం పెట్టి ఆడేవాళ్లు. చెప్పాలంటే, ద్వైపాక్షిక సిరీస్‌ల్లో పాక్‌దే ఆధిపత్యంగా ఉండేది. రెండు దశాబ్దాలుగా పాక్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్నాసరే... ఇప్పటికీ వన్డేల్లో 58-73తో భారత్ వెనకబడే ఉందంటే దాయాది జట్టు ఒకప్పుడు ఎంత పటిష్ఠంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. 1992 వన్డే ప్రపంచకప్ గెలిచినప్పుడు కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్‌కు తోడు జావెద్ మియాందాద్, సలీమ్ మాలిక్, ఇంజమాముల్ హక్, వసీమ్ అక్రమ్ లాంటి ఆటగాళ్లతో పాక్ జట్టు చాలా బలంగా ఉండేది. తరవాత వకార్ యూనస్, సయీద్ అన్వర్, మహ్మద్ యూసుఫ్, సక్లయిన్ ముస్తాక్, యూనస్ ఖాన్, షాహిద్ అఫ్రిది, అబ్దుల్ రజాక్, షోయబ్ అక్తర్ వంటి నాణ్యమైన క్రికెటర్లు పాక్ క్రికెట్ ప్రమాణాలు తగ్గకుండా చూశారు. అప్పట్లో బలహీన జట్టే అయినా... ప్రపంచకప్‌ల్లో మాత్రం మొదట్నుంచి ఇండియానే పైచేయి సాధిస్తూ వచ్చింది.

సౌరభ్ గంగూలీ 2000లో కెప్టెన్ అయ్యాక భారత జట్టు రాత మారింది. కొన్నేళ్లలోనే ప్రపంచ మేటి జట్లలో ఒకటిగా ఎదిగింది. తరవాత ధోని, కోహ్లి, రోహిత్ లాంటి మేటి ఆటగాళ్ల నాయకత్వంలో భారత జట్టు అత్యున్నత ప్రమాణాలతో సాగాయి. ప్రపంచ క్రికెట్లోనే అత్యంత ధనిక బోర్డుగా ఎదిగిన బీసీసీఐ... పకడ్బందీ వ్యవస్థను నిర్మించడంతో ఇండియా బలీయమైన క్రికెట్ శక్తిగా తయారైంది. ఐపీఎల్ యువ క్రికెటర్ల పాలిట కల్పతరువులా మారింది. వివిధ స్థాయుల్లో దేశవాళీ టోర్నీలను పకడ్బందీగా నిర్వహించడం... రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు కోచ్‌లుగా మారి యువ ఆటగాళ్లను సానబట్టడంతో ఎప్పటికప్పుడు కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తోంది. పాకిస్థాన్‌లో దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. 2008 ముంబయి దాడుల తరవాత భారత్ ఒక్కసారీ పాక్‌లో పర్యటించలేదు. ఆ దేశం సురక్షితం కాదని విదేశీ జట్లూ పర్యటనలు తగ్గించేశాయి. దాంతో ఆదాయానికి భారీగా గండిపడి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సంక్షోభంలోకి జారిపోయింది. అక్కడ అంతర్జాతీయ సిరీస్‌ల పునరుద్ధరణ జరిగినా, విదేశీ అగ్రశ్రేణి ఆటగాళ్లు పాకిస్థాన్ వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ద్వితీయ శ్రేణి జట్లు పర్యటిస్తున్నా, ఆ సిరీస్‌లు పాక్ క్రికెట్‌కు ఉపయోగపడట్లేదు.

రాజకీయాలు, అవినీతితో కుదేలు

పాకిస్థాన్‌లో క్రికెట్ ప్రతిభకు లోటులేదు కానీ, ఆ ప్రతిభను గాడిలో పెట్టే వ్యవస్థ లేకపోవడమే పెద్ద సమస్యగా తయారైంది. ప్రపంచ మేటి ఆటగాళ్లుగా ఎదుగుతారని ఆశలు రేకెత్తించి, కొన్నేళ్లకే కనుమరుగైపోయిన ఉమర్ అక్మల్ లాంటి క్రికెటర్లు చాలామందే ఉన్నారు. పాకిస్థాన్ మంత్రి అయిన మోసిన్ నఖ్వీ రెండేళ్లుగా పాక్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ బాధ్యతలు వెలగబెడుతున్నారు. ఆయనొచ్చాక బోర్డులో రాజకీయం ప్రబలిపోయింది. దీనికితోడు జట్ల ఎంపికలో అక్రమాలు, వసతుల కొరత వంటి అనేక కారణాలతో పాక్ క్రికెట్ పతనావస్థకు చేరింది. 2011లో భారత్‌కు వన్డే ప్రపంచకప్ అందించిన కోచ్‌గా నీరాజనాలు అందుకున్న కిర్‌స్టన్... నిరుడు పాక్ జట్టు కోచ్ అయిన కొన్ని నెలలకే వైదొలిగారు. మరో కోచ్ గిలెస్పీదీ అదే బాట. ఒకప్పుడు ప్రత్యర్థులను వణికించి, ఇప్పుడు సాధారణ జట్టులా మిగిలిపోయిన వెస్టిండీస్ బాటలోనే పాక్ కూడా సాగుతోంది. మేటి జట్లు ఇలా బలహీనపడిపోవడం ప్రపంచ క్రికెట్‌కు మంచిది కాదనడంలో సందేహం లేదు.

– చంద్రశేఖర్‌రెడ్డి తిమ్మాపురం




మాదకద్రవ్యాలు.. బెట్టింగ్స్.. రుణయాప్‌ల జోలికి వెళ్లొద్దు బ్రో..

'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు రేపు

కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడంతో అనేకమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. బాగా చదువుకునే విద్యార్థులకు సైతం మత్తును అలవాటు చేసి.. వారి జీవితాలతో మాదకద్రవ్యాల విక్రేతలు చెలగాటం ఆడుతున్నారు. ఒకసారి మత్తుకు అలవాటుపడితే.. దానిలోనుంచి బయటకురాలేనంతగా యువత బానిసలుగా మారిపోతున్నారు. మరోవైపు బెట్టింగ్ ముఠాల చేతుల్లోనూ విద్యార్థులు పావులుగా మారుతున్నారు. మాదకద్రవ్యాలు, బెట్టింగ్ కోసం.. రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు సైతం తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. తిరిగి కోలుకోలేనంతగా కుటుంబాలు చితికిపోతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బెట్టింగ్, రుణ యాప్‌లలో విద్యార్థులు ఎలా చిక్కుకుంటున్నారనే దానిపై అవగాహన కల్పించేందుకు 'ఈనాడు, ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరగనుంది. ఆయా రంగాల్లోని నిపుణులు హాజరై విద్యార్థులకు వాస్తవ పరిస్థితిపై అవగాహన కల్పిస్తారు. - ఈనాడు, అమరావతి

వేదిక: కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తాతినేనినగర్, 100 అడుగుల రోడ్డు, తాడిగడప | 20.02.26 (శుక్రవారం) | ఉదయం 10.30 గంటలకు



భవానీద్వీపంలో బుధవారం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ 50 ఏళ్ల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. - భవానీపురం, న్యూస్‌టుడే

దూసుకొస్తూ.. ప్రాణాలు హరిస్తూ..!

- ☛ ద్విచక్ర వాహనాలతో మైనర్ల స్వైర విహారం
- ☛ రహదారి ప్రమాదాల్లో అమాయకుల బలి



★ సయ్యద్ **అబూబకర్ సిద్ధిఖ్...** చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో పలావ్ సెంటర్ నడిపి జీవనం సాగిస్తున్నాడు. 2024 మార్చిలో తన దుకాణం వద్ద రోడ్డు దాటుతుండగా పదో తరగతి విద్యార్థి (మైనర్) ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చి ఢీకొట్టాడు. సిద్ధిఖ్ రెండు కాళ్లు విరిగిపోయాయి. తలకు బలమైన గాయమై కోమాలోకి వెళ్లి.. బయటకొచ్చాడు. ఇప్పటికీ నాలుగు అడుగులు వేయలేని దుస్థితి.



★ కానూరులో **శ్రీహర్షవర్ధన్** అనే పదోతరగతి విద్యార్థిని బలి తీసుకున్నది కూడా మైనర్లే. పదో తరగతి విద్యార్థులు ముగ్గురు బైక్‌పై వేగంగా దూసుకొచ్చి రోడ్డు దాటుతున్న హర్షను ఢీకొట్టారు. మైనర్‌కు వాహనం ఇచ్చినందుకు బాలుడి తండ్రిపై కేసు నమోదైంది. ★ ఉయ్యూరులో ఓ బాలుడు (17) బైక్‌పై దూసుకెళ్లి రోడ్డు దాటుతున్న పాదచారిని ఢీకొట్టి.. అతని చావుకు కారణమయ్యాడు.

– ఈనాడు, అమరావతి

★ కోడూరుకు చెందిన బాలుడు (16) మితిమీరిన వేగంతో బైక్ నడుపుతూ వెళ్లి ప్రమాదానికి గురై చనిపోయాడు.
★ చల్లపల్లిలో రెండు బైక్‌లను పోటీపోటీగా నడుపుతున్న ఇద్దరు మైనర్లను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో మృత్యువాతపడ్డారు.
★ విజయవాడ భానూనగర్‌వాసి పెదపూడి రాజారావు.. బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా.. మధురానగర్‌కు చెందిన ఓ బాలుడు ద్విచక్రవాహనంతో దూసుకొచ్చి ఢీకొట్టాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజారావు మృతి చెందాడు. బాలుడి తండ్రిపై కేసు నమోదైంది.



ద్విచక్ర వాహనాలతో మైనర్లు రహదారులపైకి దూసుకొస్తుండడంతో.. ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మానసిక పరిపక్వత లేని వయసులో బైక్‌లను వారికి ఇచ్చి.. రహదారులపైకి వదులుతున్న తల్లిదండ్రులే అసలు దోషులని.. పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందుకే.. చట్టపరంగా వారే కేసులను ఎదుర్కొంటున్నారు. అవగాహన తరగతులను నిర్వహిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. పిల్లలు అడిగిన వెంటనే. బండి తాళాలు వారి చేతిలో పెడుతున్నారు.


కానూరులో పది చదివే విద్యార్థులు చేసిన ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసినోళ్లంతా.. ఆ ఘటనను మరచిపోలేకపోతున్నారు. కామయ్యతోపు ఆర్చి దగ్గర నుంచి ముగ్గురూ వాహనంపై దూసుకొచ్చారు. మధ్యలో మరి కొందరిని కూడా ఢీకొట్టేవారే. చివరికి.. శ్రీహర్ష ప్రాణాలను హరించారు. సయ్యద్ అబూబకర్ సిద్ధిఖ్‌ను ఢీకొట్టింది కూడా ఓ పాఠశాల విద్యార్థే. తన కుటుంబానికి ఆధారంగా ఉన్న.. సిద్ధిఖ్ ఇప్పుడు వారికి భారంగా మారాడు.

అదుపులేని వేగంతో..

మైనర్లు ద్విచక్ర వాహనాలను.. అదుపు చేయలేనంత వేగంగా దూసుకెళుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. దానికితోడు వాహనం స్టాండ్‌లను కొద్దిగా తెరిచి.. రహదారికి తాకిస్తూ.. నిప్పులు కురిపిస్తూ వెళ్లడం, చిత్రవిచిత్ర శబ్దాలతో.. ముగ్గురేసి ఒకే వాహనంపై వెళ్లడమూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఖాళీగా రోడ్డు కనిపిస్తే చాలు. 15-20 ఏళ్ల లోపు వాళ్లు. స్కిడ్‌లు.. స్టంట్‌లు చేస్తూ.. తోటి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. టైర్లు గాలిలోకి లేపి విన్యాసాలు చేయడం.. అకస్మాత్తుగా రోడ్డుపై ఎవరైనా అడ్డొస్తే.. అదుపు చేయలేక ఢీకొడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

జరిమానా రూ.లక్షల్లో

☛ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏటా.. కనీసం వెయ్యి మంది మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ దొరుకుతున్నారు. వీరికి వేస్తున్న జరిమానా రూ.లక్షల్లో ఉంటోంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్: (గురువారం) సాయంత్రం: 6.16
సహరి: (శుక్రవారం) ఉదయం: 5.13

జనన.. మరణాల నమోదు
21 రోజుల్లోగా ఉచితం

జనన, మరణాల నమోదు 21 రోజుల్లోగా ఉచితంగా చేయించుకోవచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు. జనన, మరణ రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం జీవో నంబరు 28 ద్వారా కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ★ 21 నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ.25. ★ ఏడాదిలోపు అయితే జిల్లా జనన, మరణ రిజిస్ట్రార్ అనుమతి తప్పనిసరి. చెల్లించాల్సిన అపరాధ రుసుం రూ.250. ★ ఏడాది తరువాత రిజిస్ట్రేషన్ చేయించాలంటే జిల్లా మెజిస్ట్రేట్/ఆర్డీవో నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలి. రూ.500 అపరాధ రుసుం చెల్లించాలి. ★ బిడ్డ పుట్టిన రోజు నుంచి ఏడాదిలోపు పేరు ఉచితంగా నమోదు చేయించుకోవచ్చు. - నగరపాలక సంస్థ

చూస్తే మీరు.. ఆశ్చర్యపోతారు

ఇదీ ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్ (రోడ్ డాక్టర్). దీని సాయంతో రోడ్డుపై గుంతలను తక్కువ సమయంలో సులువుగా పూడ్చవచ్చు. నగరపాలక సంస్థ దీనిని అందుబాటులోకి తీసుకొచ్చింది. సంప్రదాయ పద్ధతుల్లో తారును అధిక ఉష్ణోగ్రతలో కాల్చాలి. ఈ యంత్రంతో కాలుష్య రహితంగా పాత తారును అదే ఉష్ణోగ్రతలో రీసైక్లింగ్ చేసి కొత్త తారులా ఉపయోగించుకోవచ్చు.
-ఈనాడు, అమరావతి





దాచుకున్నారు.. తీసుకోరేమనీ..!

రూ.258.96 కోట్లు ఆర్‌బీఐకి బదిలీ ★ ఉమ్మడి జిల్లాలో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 11,10,456

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి కొంతకాలం లావాదేవీలు నిర్వహించిన తరవాత ఏళ్ల పాటు వాటిని పట్టించుకోకుండా వదిలేశారు. వ్యక్తిగత, ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సంస్థలకు చెందిన ఖాతాల్లో పదేళ్లకు పైగా లావాదేవీలు జరపకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ ఖాతాలుగా గుర్తించారు. ఇందులోని మొత్తాలను తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ నిల్వలను అధికారులు ఆర్బీఐకి బదిలీ చేశారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, వ్యక్తిగత, ప్రైవేటు సంస్థల అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు 11,10,456 ఉండగా అందులో రూ.258.96 కోట్లు తలిపోయాయి.

అవగాహన లేక.. మరచిపోయి..

ప్రైవేటు వ్యక్తులకు అవగాహన లేకపోవడం, ఖాతాల విషయం మరచిపోవడంతో ముందుకు రావట్లేదు. ఇటీవల రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వ ఖాతాల్లో అన్‌క్లెయిమ్డ్‌గా ఉన్న సొమ్ము వెంటనే తిరిగి తెచ్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 10,383 ప్రభుత్వ ఖాతాల్లో ఉన్న రూ.12.72కోట్లు వెనక్కి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.
✪ ఇప్పటివరకు ఉమ్మడి కృష్ణాలో అన్ని రకాల అన్‌క్లెయిమ్డ్ ఖాతాల నుంచి రూ.10.16 కోట్లు క్లెయిమ్ చేసుకున్నారు.
✪ ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండాలన్న ఉద్దేశంతో 2015-16లో కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున జన్‌ధన్ ఖాతాలను తెరిపించింది. వీటి ద్వారా లావాదేవీలు నిర్వహించక పదేళ్లు దాటిపోయింది. దీంతో అవన్నీ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల జాబితాల్లోకి చేరాయి.

సొమ్ము తిరిగి పొందాలంటే..

✪ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల్లోని సొమ్ము తిరిగి తీసుకునేందుకు ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించింది. ఖాతాదారులు వారికి సంబంధించి లావాదేవీలు నిలిపేసిన ఖాతాల వివరాలు తెలుసుకోవడానికి యూడీజీఎం వెబ్‌సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ✪ సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. బ్యాంకులో కొత్తగా కేవైసీ చేసుకొని ఆ సొమ్ము తిరిగి పొందవచ్చు.
✪ అన్‌క్లెయిమ్డ్ ఖాతాలకు సంబంధించి ఏమైనా సందేహాలున్నా.. సొమ్ము తిరిగి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా ఖాతా కలిగిన బ్యాంకు, లేదా లీడ్ బ్యాంకు కార్యాలయాలను సంప్రదించాలని ఉమ్మడి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లు రవీంద్రరెడ్డి, కె.ప్రియాంక తెలిపారు.

ఉద్యోగ మేళా నేడు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దుర్గామల్లేశ్వర సిద్ధార్థ కళాశాల, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ లబ్బీపేటలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే మేళాకు ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, ఫార్మా, హెల్త్‌కేర్ తదితర రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తాజా బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, పాన్ కార్డులు తీసుకు రావాలని సూచించారు. ఎంపికైన వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు.



కనకదుర్గ వంతెన విభాగినిపై విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ వంతెనపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పూర్తిగా కూలిపోయి ప్రమాదం జరగకముందే వాటిని సరిచేయాల్సి ఉంది.
- ఈనాడు, అమరావతి

రాజధాని రైతులకు ప్లాట్లు


ప్లాటు కేటాయించిన వారికి ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఇస్తూ..

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు ఇచ్చిన రైతులకు బుధవారం రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. ఈ- లాటరీ విధానంలో అర్హులైన 77 మంది రైతులకు మొత్తం 151 ప్లాట్లు కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. అందులో 80 నివాసం, 71 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ★ మెట్ట భూములకు సంబంధించిన 35 మంది రైతులకు 53 ప్లాట్లు కేటాయింపులు చేశారు. అందులో 31 నివాసం, 22 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. జరీబు భూములకు సంబంధించి 42 మంది రైతులకు 98 ప్లాట్లు కేటాయించగా.. అందులో 49 నివాసం మరో 49 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ★ ప్లాట్లు పొందిన వారిలో ఉండవల్లి, పెనుమాక, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, వెంకటపాలెం, మందడం గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని సీఆర్డీఏ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ వసంతరాయుడు సూచించారు. ఆయా స్థలాలు ఉన్న ప్రాంతాలను సర్వేయర్‌ల సహాయంతో తెలుసుకోవచ్చన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యంతో బహుళ ప్రయోజనాలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సూక్ష్మ సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ రైతులకు సూచించారు. మండల పరిధిలోని రేపూడి గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. రైతు జి.విష్ణువర్ధన్ రెడ్డి సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. సాగునీటి వనరుల సద్వినియోగంలో బిందు, తుంపర సేద్యం చాలా కీలకమైందని చెప్పారు. రాయితీపై బిందు, తుంపర సేద్య పరికరాలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా అన్నదాతలకు పరికరాలు అందజేస్తామని తెలిపారు. తిరువూరు ఆర్డీవో కె.మాధురి, ఏపీ ఎంఐపీ పీడీ ఎం.సుభాని, ఉద్యాన శాఖ అధికారి నరేంద్ర కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ రంగారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సేవలు నచ్చేలా.. పౌరులు మెచ్చేలా...

- ◆ అందుబాటులో ఏపీసీఆర్డీఏ పరిష్కారం 2.0
- ◆ సంతృప్తి స్థాయిలపై ఆడిట్

ఈనాడు, అమరావతి

సీఆర్డీఏ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఏపీ సీఆర్డీఏ పరిష్కారం 2.0 ద్వారా రైతులు కాలు కదపనవసరం లేకుండానే అర్జీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. పరిష్కారం ఏ దశలో.. ఏ అధికారి వద్ద ఉందో తెలుసుకునేలా వెబ్‌సైట్ నిర్వహిస్తోంది. అర్జీ స్థితిపై కారణాలు తెలియజేస్తూ సమగ్ర వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించింది.

గత సెప్టెంబరు నుంచి ఇప్పటివరకు...
- ✪ మొత్తం అర్జీలు: 2,693
- ✪ పరిష్కారమైనవి: 2,313
- ✪ పెండింగ్: 309
- ✪ రీఓపెన్ చేసినవి: 71

అసంతృప్తి వ్యక్తం చేసినవారు : **277**

వివిధ మార్గాల్లో అర్జీల స్వీకరణ

★ రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ప్రతి శనివారం అర్జీలు, ప్రతి రోజూ వినతులు స్వీకరిస్తున్నారు. ★ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామదర్శిని; గ్రామసభల్లో, ఆయా కార్యాలయాలకు వస్తున్న వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ★ రాజధాని గ్రామాల్లోని యూనిట్ కార్యాలయాలు, జిల్లా ప్రజా ఫిర్యాదుల విభాగానికి అందుతున్న రాజధాని ప్రాంత అర్జీలను కూడా స్వీకరిస్తున్నారు. ★ రాజధాని పనులు జరుగుతున్న ప్రాంతంలో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేశారు. ★ సీఆర్డీఏ పరిష్కారం 2.0 వెబ్‌సైట్‌లో వాట్సప్ ద్వారా అర్జీలు అప్‌లోడ్ చేయొచ్చు. ఇందుకు చరవాణి, ఆధార్‌కార్డు నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏఐ సాయం తీసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు లేదా ఆంగ్లం ఎంచుకోవచ్చు.

పరిష్కారం చూపిస్తారు..

★ ఫిర్యాదు/అర్జీ నమోదు అనంతరం పరిష్కరించాల్సిన అధికారి, దరఖాస్తుదారుడికి సంక్షిప్త సందేశం వెళ్తుంది.
★ సంబంధిత అధికారి సమస్యను పరిష్కరించి అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ ఇస్తారు. సంతృప్తి లేఖను తీసుకోవాలి. ★ పరిష్కారం అనంతరం సీఆర్డీఏ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఫోన్ చేసి అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారా? లేదా? సమాచారం సేకరిస్తారు. అసంతృప్తి వ్యక్తం చేసినవారి వివరాలు ఆడిట్ అధికారుల బృందానికి వెళ్తాయి. ఆయా విభాగాల ఉన్నతాధికారులు అర్జీ పరిష్కరించిన విధానాన్ని పరిశీలించి సంతృప్తి చెందితే పిటిషన్‌ను మూసేస్తారు. లేదంటే రీఓపెన్ చేసి తొలిదశ నుంచి మళ్లీ పరిశీలిస్తారు. ★ అధికారుల స్థాయిలో పరిష్కరించలేని అర్జీలను కమిషనర్, సీఆర్డీఏ అథారిటీ, అవసరమైతే ప్రభుత్వస్థాయిలోని ఉన్నతాధికారులకు పంపిస్తారు. ★ వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా కమిషనర్ ప్రతి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

పెండింగ్‌లో ఇలా...

పురోగతిలో	163
అదనపు సమాచారం కోసం	2
ఉన్నతాధికారులకు పంపినవి	144

రీఓపెన్ చేసిన 71 అర్జీలు..

పురోగతిలో ఉన్నవి	31
ఉన్నతాధికారులకు పంపినవి	40

3న కనకదుర్గమ్మ ఆలయం మూసివేత

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3న దుర్గగుడిని మూసి వేస్తున్నట్లు వైదిక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న ఉదయం 10 గంటలకు కవాట బంధనం (మూసివేయడం) చేసి తిరిగి 4న వేకువజామున 3 గంటలకు కవాట ఉద్ఘాటన(తలుపులు తెరవడం) చేస్తారని తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ప్రతి నెల నిర్వహించే గిరిప్రదక్షిణతోపాటు శాంతి కల్యాణం, చండీహోమం, పంచహారతులు, పల్లకీ సేవ వంటి ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 4న వేకువజామున 3 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలు తెరవడంతోపాటు దేవతామూర్తులకు సుప్రభాత సేవ, స్నపనాభిషేకం, ప్రాతఃకాలార్చన, నివేదన, హారతి నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 8 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారని తెలిపారు. తెల్లవారుజామున నిర్వహించే వస్త్ర సేవ, ఖడ్గమాలార్చన, నవగ్రహ శాంతి హోమం, గణపతి హోమం వంటి ఆర్జిత సేవలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. చండీహోమం, లక్ష కుంకుమార్చన సేవలను ఉదయం 8:30 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు.

ఎంఎస్‌ఎంఈ పార్కులకు.. స్థలాలు సిద్ధం


వాంబేకాలనీలో సేకరించిన ఐదెకరాల స్థలం

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థలాల ఎంపిక పూర్తయింది. ఇప్పటికే విజయవాడ మధ్య, జగ్గయ్యపేట, మైలవరంలో స్థలాల గ్రౌండింగ్ పనులు ఆరంభించారు. తాజాగా విజయవాడ తూర్పు, పశ్చిమ, జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామలోనూ స్థలాల ఎంపిక పూర్తి చేసి గ్రౌండింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఐదు ఎకరాల నుంచి 50 ఎకరాల వరకూ స్థలాలు సేకరించారు. ఇక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు రూ.42కోట్లు కేటాయించారు.
విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాల, లిడ్‌క్యాప్‌కు సంబంధించిన ఖాళీ స్థలాలు పరిశీలించారు. ఈ రెండింటిలో ఒకచోట ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోనూ ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎంపిక చేసి లేఔట్ వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. తిరువూరులోని చీమలపాడులో ఇటీవల వివాదాల్లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం స్థలాన్ని ఎంఎస్‌ఎంఈ పార్కుగా మార్చనున్నారు. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. నందిగామలోని పెద్దవరంలో స్థలం ఎంపిక పూర్తయింది.

పురోగతిలో మూడు నియోజకవర్గాలు..

జిల్లాలో తొలిదశలో భాగంగా జగ్గయ్యపేట, విజయవాడ మధ్య, మైలవరం నియోజకవర్గాల్లో ఇప్పటికే స్థలాల్లో పనులు ఆరంభమయ్యాయి. లేఔట్ పనులు తుది దశకు చేరాయి. జగ్గయ్యపేటలో పది ఎకరాల్లో లేఔట్ సిద్ధమవుతోంది. ఇక్కడ ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు స్థలాలు కేటాయించనున్నారు. విజయవాడ మధ్య, మైలవరంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసి ఎంఎస్‌ఎంఈలకు కేటాయిస్తారు. ఇక్కడా గ్రౌండింగ్ పనులు తుది దశకు చేరాయి. మధ్య నియోజకవర్గం వాంబేకాలనీలోని ఎక్సెల్ ప్లాంట్‌కు చెందిన ఐదు ఎకరాలు, మైలవరంలో చెరువు పక్కన ఆరు ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు రాబోతున్నాయి.

స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి కల్పన..

ప్రతి నియోజకవర్గంలో ఉండే యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. భారీ పరిశ్రమల కంటే ఎక్కడికక్కడ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతోనే ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యం. నగర నియోజకవర్గాల్లో స్థలాభావం వల్ల ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలను ఎంఎస్‌ఎంఈలకు కేటాయించేలా సన్నాహాలు చేస్తున్నారు.
– ఈనాడు, అమరావతి

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డిప్లొమా, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, జిల్లా నైపుణ్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన నుంచి ధ్రువపత్రం అందజేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో వెళ్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 99857-59304, 63050-04318 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

చెన్నైలో నిందితుల కోసం అన్వేషణ

■ త్రుటిలో తప్పించుకున్న సుబ్రమణి రాజావెంకట్

ఈనాడు, అమరావతి: ఇటీవల యనమలకుదురులో వెలుగుచూసిన అద్దె ఖాతాల కేసులో ఇప్పుడు సీన్ చెన్నైకి మారింది. ఈ కేసులో అసలు సూత్రధారుల కోసం సైబర్ పోలీసు ప్రత్యేక బృందం చెన్నైలో మకాం వేసింది. ఇప్పటికే అరెస్టు అయిన సోదరులు రవికుమార్, స్టీవెన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సుబ్రమణి రాజా వెంకట్ కోసం ప్రత్యేక బృందం వేట సాగిస్తోంది. విజయవాడలో అమాయకులతో తెరిపించిన ఖాతాలను చెన్నైలో వీరి బంధువైన వెంకట్‌కు పంపించేవారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఓటీపీలు చెప్పడం, నగదును ఇతర ఖాతాలకు బదిలీ చేసేవారు. ✪ చెన్నైలో వెంకట్‌తో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో బృందం విచారిస్తోంది. అతని చిరునామా కనుక్కొని రాజా వెంకట్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే అతను పరారయ్యాడు. నగరంలోని పలు ప్రాంతాలు, అతని స్నేహితుల నుంచి వాకబు చేస్తున్నారు. మరో నిందితుడు ఆకాశ్ ఆచూకీ ఇంతవరకు తెలియలేదు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నానని అందరినీ నమ్మిస్తూ అద్దె ఖాతాల ద్వారా చట్టవిరుద్ధ లావాదేవీలు చేస్తున్నట్లు తేలింది. నిందితుడి ఫోన్ స్విచాఫ్‌లో ఉండడంతో అతని స్నేహితుల నంబర్లపై నిఘా పెట్టారు. అతని కుటుంబ సభ్యులను విచారించినా పెద్దగా సమాచారం రాలేదని తెలిసింది.

నమ్మించి.. నిలువునా ముంచేసి..

రైల్వే ఉద్యోగాల పేరుతో రూ. లక్షల్లో దోపిడీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

ఉద్యోగాల పేరుతో దాదాపు రెండేళ్లుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న దందాలో చిక్కుకున్న బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. మోసాన్ని గుర్తించి ప్రశ్నించిన వారిపైనే ఎదురు కేసులు పెడుతున్న నేపథ్యంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ బాధితులు వాపోతున్నారు.

రైల్వేలో చిరుద్యోగిగా పనిచేస్తున్న ఎం. కిషోర్.. మచిలీపట్నం రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సహచరులు కరీముల్లా, షఫి, అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చిన్నా తదితరుల సహకారంతో పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. ఈ క్రమంలో కిషోర్.. రైల్వేలో టీసీ, క్లర్క్ తదితర పోస్టుల పేరుతో కనిష్ఠంగా రూ.5 లక్షల చొప్పున పలువురి వద్ద నుంచి నగదు, ఖాళీ చెక్కులు వసూలు చేశాడు. అనంతరం వారికి పీఎఫ్ ఖాతా నంబర్లు, రైల్వే స్టాంపులతో కూడిన ఫేక్ నియామక పత్రాలు, ఐడీ కార్డులు పంపుతూ సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగంలో చేరేందుకు కాస్త ఆలస్యం అవుతుందంటూ నమ్మబలికాడు. ఆలస్యంపై ఎవరైనా నిలదీస్తే విజయవాడ, ఇతర ప్రాంతాలకు మాట్లాడదామంటూ పిలిచి యూనియన్ నాయకుల పేరుతో కొందరిని పరిచయం చేసి త్వరలోనే ఉద్యోగం వస్తుందని ఆశలు కల్పించేవాడు. ఇదే తరహాలో మచిలీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద నుంచి నగదు దోచేసి వారిని మభ్యపెడుతూ వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన నాగపద్మ తనకు వచ్చిన నియామక పత్రాన్ని రైల్వే ఉద్యోగులకు చూపించి అది నకిలీదని నిర్ధారించుకోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.



కిషోర్ ఇంటి వద్ద నకిలీ నియామక పత్రాలు చూపిస్తున్న బాధితులు

అడిగినందుకు ఎదురు కేసు: బాధితురాలు నాగపద్మతో పాటు మచిలీపట్టణానికి చెందిన గంగాభవాని ఈ నెల 7న మచిలీపట్నంలోని కిషోర్ నివాసానికి వచ్చారు. కిషోర్, అతనికి అండగా నిలిచిన చిన్నా కలిసి 'అల్లరి చేసుకోవద్దు.. మీకు ఉద్యోగాలు ఖాయం.. రేపు రండంటూ వారిని పంపేశారు. మరుసటి రోజు కిషోర్ ఇంటికి వెళ్లగా ఎవరూ ఆచూకీ లేకపోవడంతో బాధితులు చిలకలపూడి స్టేషన్‌కు వెళ్లి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. అనంతరం బాధితులు తిరిగి కిషోర్ ఇంటికి వెళ్లి అతని కోసం నిరీక్షించారు. ఈలోగా పోలీసులు అక్కడకు వచ్చి రాత్రి మీరే కిషోర్‌పై దాడి చేశారంటూ అతడు ఫిర్యాదు ఇచ్చాడని, ఈ కేసులో నిందితులుగా ఉన్నారంటూ నాగపద్మ, గంగాభవానిలను స్టేషన్‌కు తీసుకువెళ్లడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ నెల 14న కాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఇదే అంశంపై తాను ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తనను వెనక్కి పంపేశారని నాగపద్మ వాపోతోంది.

యూనిఫాం పేరుతోనూ దండుకున్నారు

ఉద్యోగం పేరుతో రూ. 3.50 లక్షలు వివిధ రూపాల్లో తీసుకున్నారు. ఎప్పుడు విధుల్లో చేరాలని ప్రశ్నించగా త్వరలోనే అని చెబుతూ మీకు రైల్వే యూనిఫాం వచ్చిందని, దాని కోసం రూ.5,000 ఇవ్వాలంటూ అదనంగా దండుకున్నారు. - గంగాభవానీ

రూ.60 లక్షలకు ష్యూరిటీ అంటూ నోటీసు

డబ్బులు పోగొట్టుకుని ఉద్యోగం రాకపోగా.. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నుంచి రూ.60 లక్షల రుణానికి మీరు ష్యూరిటీగా ఉన్నారంటూ మెసేజ్ వచ్చింది. దీన్ని బట్టి నా వద్ద నుంచి తీసుకున్న చెక్కులను అడ్డుపెట్టుకుని కిషోర్ మరో రుణమోసానికి పాల్పడ్డాడన్న భయం వెంటాడుతోంది. - నాగపద్మ

'వాలిడేషన్ యాక్టు పింఛను నిబంధనలకు విరుద్ధం'



మాట్లాడుతున్న అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గోపాలకృష్ణన్

పటమట, న్యూస్‌టుడే: పింఛను సవరణను వేతన సవరణతో అనుసంధానం చేయడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.గోపాలకృష్ణన్ అన్నారు. బుధవారం పటమట సెంటర్‌లోని రఘురామ కల్యాణ వేదికలో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పింఛనుదారుల సంక్షేమ సంఘం ఏపీ సర్కిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలకృష్ణన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పింఛను సవరణ మంజూరు చేయాలని దిల్లీ హైకోర్టు ఆదేశించిందని, కానీ ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడం వల్ల పెండింగ్‌లో ఉందని తెలిపారు. విలీన ఉద్యోగులందరూ త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో పీబీ, సీఏటీ తీర్పును మార్గదర్శకంగా తీసుకుని 2017 నుంచి పింఛను సవరణ అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వాలిడేషన్ యాక్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, అది పింఛను నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఆ చట్టం గత, ప్రస్తుత పింఛనుదారుల మధ్య సమానత్వాన్ని దెబ్బతీస్తుందని వివరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ మాట్లాడుతూ... 8వ సెంట్రల్ పే కమిషన్‌లో పెన్షన్ రివిజన్ అంశం చేర్చలేదని గుర్తు చేశారు. పైగా అమలు తేదీపై స్పష్టత లేక 2026కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. వాలిడేషన్ యాక్టుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పింఛనుదారుల సంఘాలు ఏకమై నిరసన తెలుపుతున్నాయని, సుప్రీం కోర్టులో మూడు రిట్ పిటిషన్లు కూడా దాఖలయ్యాయని తెలిపారు. సర్కిల్ కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు, సభ్యులు కె.ఎస్.కోటేశ్వరరావు, ప్రకాశరావు, భాస్కరరావు, డి.ఎం.దుర్గారావు, కె.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-24/22, టమాటా-14, బెండ-24, పచ్చిమిర్చి-46, కాకర-32, బీర-30/28, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-30, దొండ-40, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-30, దోస-16/26, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్ రూట్-28, కీరదోస-42, బీన్స్-58/64, క్యాప్సికమ్-60, చింతకాయలు-65, నిమ్మ (డజను)-36/40, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25 **(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

ఎమ్మెల్సీ రఘురామ్‌కు పితృవియోగం

గొల్లపూడి, న్యూస్‌టుడే : వైకాపా ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి చంద్రశేఖర్‌రావు(88) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైకాపా అధ్యక్షుడు జగన్ గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వచ్చి చంద్రశేఖర్‌రావు భౌతికకాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రులు విడదల రజని, పేర్ని నాని, జోగి రమేష్, కురసాల కన్నబాబు, వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ నందిగం సురేష్ తదితరులు నివాళులర్పించారు.



చంద్రశేఖర్‌రావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జగన్



కల్యాణమూర్తులకు ప్రదక్షిణలు నిర్వహిస్తున్న దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు బుధవారం నిర్వహించారు. గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీలో ఉంచి మంగళ వాయిద్యాలతో ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణమూర్తులకు ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా పవళింపు సేవను అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, సభ్యులు శ్రీనివాసరావు, పద్మావతి ఠాకూర్, సరోజనిదేవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

21న కృష్ణాయపాలెంలో సేంద్రియ మేళా

మామిడి తోటలో జిల్లా స్థాయి కార్యక్రమం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం కృష్ణాయపాలెం మామిడి తోటలో ఈ నెల 21వ తేదీన జిల్లా స్థాయిలో భారీ సేంద్రియ మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, పొలంలో సేంద్రియ కర్బనాన్ని పెంచుకోవాల్సిన అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తారు. సేంద్రియ ఉత్పత్తులపై ప్రజల్లో చైతన్యం కలిగించడం, సాగుపై రైతులకు సామర్థ్య అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సంస్థలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు ఉంటాయన్నారు. సాగుకు అవసరమైన ఉత్పాదితాలనూ ప్రదర్శించనున్నట్టు తెలిపారు. రైతులు-నిపుణుల పరస్పర చర్చా వేదిక ద్వారా సందేహాల నివృత్తితో పాటు, మేధో మథనానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఆదర్శ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్.పి.ఒ.ఎస్.లు), ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వారిని సత్కరిస్తారు.

22న విజయవాడలో...: ఈ నెల 22వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రకృతి వ్యవసాయ మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, వినియోగదారులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పన, మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేయడం, ఎంవోయూలపై అవగాహనతో పాటు, అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటారు. ఈ-కామర్స్ సంస్థలు, బిగ్ బాస్కెట్ వంటి సంస్థలు పాల్గొంటాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించి, రైతుల ఆదాయాభివృద్ధికి తోడ్పడేలా ఈ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

త్వరలో సీబీజీ ప్లాంట్ ప్రారంభం: కలెక్టర్

హాజరుకానున్న సీఎం చంద్రబాబు

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే: వ్యవసాయ, మున్సిపల్ వ్యర్థాలతో పర్యావరణ హిత గ్యాస్ తయారు చేసే లక్ష్యంతో సీబీజీ ప్లాంటును ఏర్పాటు చేయడం మంచి పరిణామమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. పరిటాల సమీపంలో రిలయన్స్ న్యూఎనర్జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయోగ్యాస్(సీబీజీ) ప్లాంట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. రోజుకు 22 టన్నుల సీబీజీ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ప్లాంట్ పనితీరు, గ్యాస్ ఉత్పత్తి అయ్యే విధానాన్ని వివరించారు. 30 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పుతున్న ఈ ప్లాంట్‌ను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని కలెక్టర్ లక్ష్మీశ మీడియాకు తెలిపారు. ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు రైతులకు ఆదాయ మార్గం ఉండే ఇటువంటి ప్లాంట్‌ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, సంస్థ డీజీఎం శ్రీకాంత్, మేనేజర్ శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఏపీ

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) 50 ఏళ్ల వేడుకను విజయవాడలోని భవానీద్వీపంలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, 1.22 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమన్నారు. పీపీపీ విధానంలో పెట్టుబడులే లక్ష్యంగా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంపొందించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోడ్ షోలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ.. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా టూరిజం పాలసీ రూపొందించినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, కాటేజీలు, రెస్టారెంట్‌ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీటీడీసీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి, ఈడీలు పద్మావతి, ఎం.శేషగిరి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న మంత్రి దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, ఎండీ ఆమ్రపాలి

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీనగర్ ఎన్జీవో కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మార్చి 4, 5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు ఆటలు, నృత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న ఇందిరాగాంధీ స్టేడియంలో క్రీడా పోటీలు, 5న దండమూడి రాజగోపాల్ స్టేడియంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 9న మహిళలను సన్మానించడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, పి.మాధవి, కె.శివలీల, కె.సరస్వతి, ఎస్.దీప్తి, బి.శాంతి, పి.సరిత, తులసీదాస్, నాగమల్లేశ్వరి, బి.విజయశ్రీ, శ్రీదేవి, బి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్, రమణ తదితరులు

మునిరాజా వేధింపులపై లోతైన దర్యాప్తు

మొబైల్ సీజ్ చేసి, ఎఫ్ఎస్ఎల్‌కు పంపిన పోలీసులు

ఈనాడు - అమరావతి: ఒంటరి మహిళ, ఆమె కుమార్తెను అసెంబ్లీ కార్యాలయం ఏఎస్వో మునిరాజా లైంగికంగా వేధించిన కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై మహిళ ఇటీవల రెండోసారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమెను వేధించిన వారిలో ఇంకా ఎవరైనా ఉన్నారా? అన్న కోణంలో విచారిస్తున్నారు. ఫిర్యాదులో నిందితుడి సహోద్యోగులు, బంధువుల పేర్లను ప్రస్తావించింది. తన ఇంటికి అక్రమంగా ప్రవేశించి వీడియోలు చిత్రీకరించినట్లు పేర్కొంది. దీంతో వీరి పాత్ర ఎంత వరకు ఉందన్న దానిపై అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఫిర్యాదీ, ఆమె కుమార్తెకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఉన్నాయా? అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఆ సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి దానిని ఫోరెన్సిక్ ల్యాబ్ విశ్లేషణ నిమిత్తం పంపించారు. ఎఫ్ఎస్ఎల్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా పోలీసులు ముందుకు సాగనున్నారు. మహిళకు నిందితుడి, అతని సహోద్యోగుల నుంచి ఏమైనా కాల్స్ వచ్చాయా? అన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. వీరి సీడీఆర్‌లను తెప్పించి పరిశీలించనున్నారు. ఈ కేసులో పోలీసులు సాక్షుల స్టేట్‌మెంట్లను కోర్టులో రికార్డు చేయించనున్నారు.

నెట్‌బాల్ పోటీల విజేత సావిత్రిబాయి ఫులె వర్సిటీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల మైదానంలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగిన అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో సావిత్రిబాయి ఫులె వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు విజేతగా నిలిచింది. కాలికట్ (కేరళ), కృష్ణా (ఏపీ), హేమచంద్ యాదవ్ వర్సిటీ (దుర్గ్) జట్లు వరుసగా తర్వాత స్థానాలు కైవసం చేసుకున్నాయి. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కృష్ణా, హేమచంద్ యాదవ్ వర్సిటీ జట్ల మధ్య పోటీ ఉత్కంఠగా సాగింది. కృష్ణా వర్సిటీ గెలిచి తృతీయ బహుమతి సాధించింది. చివరి లీగ్ పోటీలో సావిత్రిబాయి ఫులె, కాలికట్ వర్సిటీ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఒక్క పాయింట్ తేడాతో సావిత్రిబాయి ఫులె జట్టు విజేతగా నిలిచింది. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కృష్ణా వర్సిటీ ఉపకులపతి కూన రాంజీ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. అనిమిని మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో శాప్ లీగ్స్ ప్రారంభించామని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా శాప్ వార్షిక క్రీడా క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. శాప్ నగదు ప్రోత్సాహకాలు అందుకున్న వారిలో 70 శాతం మహిళా క్రీడాకారిణులే ఉన్నారని గుర్తు చేశారు. పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి జె.నవీన లావణ్యలత పోటీల నివేదిక ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వీసీ మాట్లాడుతూ.. పోటీలను విజయవంతం చేసేందుకు సహకరించిన స్టెల్లా కళాశాల యాజమాన్యం... తదితరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచిన సావిత్రిబాయి ఫులె, కృష్ణా వర్సిటీ జట్లకు రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు రూ.10,116 చొప్పున తన సొంత నిధులు అందజేశారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష, జేఎన్‌యూకే స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఏఐయూ పరిశీలకుడు విష్ణు చౌదరి, టోర్నీ చీఫ్ రిఫరీ ఆకాష్ బత్రా, ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీ రాంజీ నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న సావిత్రిబాయి ఫులె జట్టు

ట్రాక్టర్ ట్రక్కు పల్టీ.. ఒకరి మృతి

వత్సవాయి, పెనుగంచిప్రోలు: సుబాబుల్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు పల్టీ కొట్టడంతో కూలీ దుర్మరణం చెందారు. వత్సవాయి మండలం కొత్త వేమవరం-వత్సవాయి గ్రామాల మధ్య రైల్వే అండర్ పాస్ సమీపంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ట్రాక్టర్ నుంచి ట్రక్కు విడిపోవడంతో పల్టీ కొట్టింది. ట్రక్కుపై ఉన్న నందిగామ మండలం రుద్రవరానికి చెందిన ముప్పాళ్ల పండు కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్ కెసిరెడ్డి పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని ఫాంహౌస్‌లో సీజ్ చేసిన నగదు, సీసీ ఫుటేజీ భద్రపరచాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. మద్యం ముడుపుల కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు రూ. 11కోట్లు నగదు సీజ్ చేశారు. రాజ్ కెసిరెడ్డి ఆదేశాలతోనే నగదు దాచినట్లు తమ విచారణలో తేలిందని సిట్ అధికారులు పేర్కొన్నారు. దీనిపై నిందితుడి తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది శరత్‌చంద్ర, పిటిషనర్ తరఫున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఉత్తర్వులిచ్చేందుకు ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.

బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడు తాండ్ర రమేష్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. దీనిపై వాదనలు ప్రారంభం కావాల్సి ఉండగా.. నిందితుడి తరఫు న్యాయవాది వినతి మేరకు వాయిదా వేశారు. ఈనెల 23వ తేదీకి న్యాయాధికారి లెనిన్‌బాబు వాయిదా వేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 244 చికెన్ స్కిన్‌లెస్ - 254.

'కూటమి నిర్ణయంతో ఆయుష్ వైద్యాభివృద్ధి'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఆయుష్ క్లినిక్స్, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, నిర్వహణకు ఏపీ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002 సవరణల బిల్లు శాసనసభలో ఆమోదం పొందడంపై ది ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్ డైరెక్టర్ డాక్టర్ వేముల భానుప్రకాశ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్రంలోని ఆయుర్వేద వైద్యుల సంఘాలు ఆయుష్ వైద్యానికి ప్రత్యేక క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కావాలని కోరుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఆయుష్ క్లినిక్స్, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌కు చట్టబద్ధమైన విధానాన్ని ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. దీనివల్ల అధికారిక గుర్తింపు వస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల అనుసంధానం, భవిష్యత్తులో ప్రభుత్వ ఆరోగ్య పథకాలతో ఆయుష్ ఆసుపత్రులను చేర్చేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ వైద్య అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

ఆయుష్ వైద్యశాలకు స్థల పరిశీలన


అధికారులతో చర్చిస్తున్న ఆయుష్ జిల్లా వైద్యాధికారి రత్నప్రియదర్శిని

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ వైద్యశాల ఏర్పాటుకు ఆయుష్ శాఖ జిల్లా వైద్యాధికారి రత్నప్రియదర్శిని స్థలాన్ని పరిశీలించారు. స్థానిక టిడ్కో గృహాల ప్రాంగణం వద్ద వైద్యశాలకు 3.08 ఎకరాలు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం నందిగామకు వైద్యశాల మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయుష్ పూర్వ వైద్యాధికారి [illegible] కలిసి వైద్యశాల భవన నిర్మాణానికి స్థలాన్ని ఆమె పరిశీలించారు. స్థలంలో పిచ్చిమొక్కలు, కంప చెట్లు ఉండటంతో శుభ్రం చేయించాలని కోరారు. త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, [illegible] రావు, డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్‌రావు, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ మనబోతుల శ్రీరామ్, తెదేపా పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు దారెల్లి బుజ్జి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ◆ తిరువూరు పట్టణం 2వ వార్డులోని డ్రెయిన్‌లో చెత్త పేరుకుందని స్థానికుడు జయరామ్ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు.
◆ తిరువూరు పట్టణం 6వ వార్డులోని డ్రెయిన్ వ్యర్థాలతో నిండి మురుగు పారడం లేదని స్థానికుడు మోహన్‌రావు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

హైదరాబాద్‌కు ఇంద్ర ఏసీ బస్సు సౌకర్యం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్(బీహెచ్ఈఎల్)కు నూతన ఇంద్ర ఏసీ బస్సును బుధవారం రాత్రి నుంచి నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ బస్సు ప్రతి రోజు రాత్రి 8.45 గంటలకు బయలుదేరి ఉదయం 5 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని చెప్పారు.

తెదేపా కార్యకర్తలకు అండగా లోకేశ్


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలకు అండగా మంత్రి లోకేశ్ ఉంటారని మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. మై టీడీపీ యాప్‌కు సంబంధించిన గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఆలోచనకు అనుగుణంగా ప్రతి తెదేపా కార్యకర్తకు ఉపయోగపడేలా ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ పథకాలు, పనులకు సంబంధించిన వివరాలు ఇందులో తెలుస్తాయని చెప్పారు. రాష్ట్ర స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. పార్టీ, ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి వివరాలు ఈ యాప్‌లో ఉంటాయని పేర్కొన్నారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సేవలే లక్ష్యం


రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు- రాజవరం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి.శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఈ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి బీసీ.జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసే 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంతో నెమలి, ఉమ్మడి దేవరపల్లి, కొణిజెర్ల గ్రామాల ప్రజలకు విద్యుత్తు సరఫరా మెరుగు పరిచేందుకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. డిస్కం ఈఈ ఎ.సత్యనారాయణ, డీఈఈ పి.రామకృష్ణ, ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వికాస్ విద్యార్థికి అభినందన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక వికాస్ కళాశాలలో చదువుతున్న గుంజి ముత్తయ్య జేఈఈ మెయిన్స్‌లో 87.34 పర్సంటైల్ సాధించి ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన ముత్తయ్య పేద కుటుంబంలో జన్మించినప్పటికీ జాతీయ స్థాయి సాంకేతిక విద్యా సంస్థల్లో సీటు సాధించాలనే లక్ష్యంతో పగలు కళాశాలలో తరగతులకు హాజరు అవుతూ రాత్రి సమయంలో ఆన్‌లైన్‌లో వేదాంత యాప్ ద్వారా క్లాసులకు హాజరై కష్టపడి చదవడం ద్వారానే ఈ ఫలితాన్ని సాధించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని వికాస్ విద్యాసంస్థల అధినేత ఎన్.నర్సిరెడ్డి, పలువురు అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

లెదర్ పార్కు ఏర్పాటుతో ప్రజలకు ఉపాధి


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తిరువూరు నియోజకవర్గంలో తోళ్ల పరిశ్రమ(లెదర్ పార్కు) ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. శాసనసభ సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. భూసేకరణ పూర్తయితే లెదర్ పార్కు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. అదే విధంగా తిరువూరు మండలం రామన్నపాలెంలో జమీందారీ వ్యవస్థ రద్దు కావడంతో వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వేలాది ఎకరాల భూమిని సర్వే చేసి పేదలకు నివాస స్థలాలుగా కేటాయించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నివాస గృహాల స్థలాలను 22ఎలో కలిపారని, ఆ సమస్యకు విముక్తి కల్పించి పేదలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అతివల ఇంట.. అక్షర వెలుగులు

'ఉల్లాస్'తో పెరిగిన అక్షరాస్యత

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే


గంపలగూడెం మండలంలో చదువుకుంటున్న మహిళలు

ఒకప్పుడు వయోజన విద్య.. ఇప్పుడు అక్షర ఆంధ్ర(ఉల్లాస్).. రెండింటి లక్ష్యం సమాజంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే. కూటమి ప్రభుత్వం 2025 జనవరి నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేసింది. ముందుగా స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించారు. దశల వారీగా వారిని అక్షరాస్యులుగా మార్చేందుకు కార్యాచరణ రూపొందించారు. తిరువూరు నియోజకవర్గంలో 172 గ్రామైక్య సంఘాల పరిధిలో 75 వేల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలున్నారు. వీరిలో 15,151 మంది నిరక్షరాస్యులుగా గుర్తించారు. 2025లో తొలి విడతగా 1720 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. 2026లో అంతే సంఖ్యలో ఎంపిక చేసి చదువు నేర్పుతున్నారు. ఇది కూడా వంద రోజుల కార్యక్రమం. మార్చి నెలాఖరుకు రాయడం, చదవడం నేర్పిస్తారు.

మండలం	వీవోలు	నిరక్షరాస్యులు	వాలంటీర్లు
గంపలగూడెం	44	5,035	501
తిరువూరు	37	3,142	330
ఎ.కొండూరు	40	3,509	374
విస్సన్నపేట	51	3,465	350

పది మందికి ఒక వాలంటీర్

తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ప్రతి పది మంది మహిళలకు స్వచ్ఛందంగా విద్యా బోధన చేసేందుకు ఒక కార్యకర్తను ఎంపిక చేశారు. నియమితులైన వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి బోధనకు అవసరమైన పుస్తకాలు అందజేశారు. మూడు నెలలు పాటు రోజూ సాయంత్రం రెండు గంటలు వాలంటీర్ విద్యా బోధన చేయాల్సి ఉంది. మహిళల్లో సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా పథకం అమలవుతోంది.

ఇందులో నేర్చుకునే అంశాలు

చదవడం, రాయడం, చరవాణి వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తారు. పరిసరాల శుభ్రత, ఆరోగ్యం, ఆహారం, ఇరుగు పొరుగు, ఆచార వ్యవహారాలు, పిల్లల పెంపకం తదితర వాటిని వివరిస్తారు. సంఘం ఎన్నికల నిర్వహణ తీరు, చట్టాలను తెలియజేస్తారు. టోల్‌ఫ్రీ నంబర్ల ఉపయోగం, గడియారంలో సమయం చూడడం, సంక్షిప్త సందేశాలు పంపడం, ఈ- మెయిల్, సామాజిక మాధ్యమాలు వాడకం. బ్యాంకు లావాదేవీలు, యూపీఐ చెల్లింపులు దీనికి టీసీఎస్ సంస్థ సాంకేతిక సాయం అందించనుంది.

అందరూ విద్యావంతులు కావాలి



ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావడమే ఉల్లాస్ లక్ష్యం. గ్రామాల్లో నిరక్షరాస్యులైన ప్రతి పది మంది మహిళలకు ఒక టీచర్‌ను(వాలంటీర్) నియమించాం. 2025 జనవరిలో ఈ కార్యక్రమం ప్రారంభించగా దశల వారీగా అమలు చేస్తున్నాం. ఎస్‌హెచ్‌జీల్లో చదువుకున్న వారిని విద్యా వాలంటీర్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం.
- ఎన్.గురవయ్య, వెలుగు ఏపీఎం, గంపలగూడెం మండలం

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

జి.కొండూరు, న్యూస్‌టుడే: షేక్‌స్పియర్ విలియం జయంతిని పురస్కరించుకుని బుధవారం చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు వాసు, కిరణ్, నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. చెవుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.


షేక్ స్పియర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు, ఉపాధ్యాయులు

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు


జి.కొండూరులో నిరసన తెలుపుతున్న సహకార సంఘాల ఉద్యోగులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా పరిష్కారం కాని తమ న్యాయమైన డిమాండ్లకు సత్వరమే న్యాయం చేయాలని కేడీసీసీబీ ఉద్యోగ సంఘాలు కోరాయి. స్థానిక కేడీసీసీ బ్యాంకు ఆవరణలో మైలవరం నియోజకవర్గం పరిధిలోని 24 సహకార సంఘాల ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. జీవో నం.36 అమలు, 2019 తర్వాత విధుల్లో చేరిన వారిని రెగ్యులర్ చేయడం, 2014, 2019 వేతన సవరణ చట్టం తమకు వర్తింపజేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సంఘాల్లో సేవలు నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు బొల్లినేని రఘురాం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరు గోపిరెడ్డి, జి.కొండూరు బ్రాంచి ఆర్గనైజర్ సీహెచ్ కిషోర్ బాబు, మైలవరం, ఇబ్రహీంపట్నం ఆర్గనైజర్లు సాంబశివరావు, సతీష్ పాల్గొన్నారు.

రోడ్డా.. డంపింగ్ యార్డా?



మండల పరిధిలోని కంభంపాడులో కొందరు రోడ్డు పక్కన చెత్త వేసి డంపింగ్ యార్డులా మారుస్తున్నారు. దీంతో అక్కడకు కోతులు, పందులు, శునకాలు చేరుతున్నాయి. అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. ఆ సమయంలో పలువురు భయాందోళకు గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎ.కొండూరు

రంగాపురం కేజీబీవీలో 687 కిలోల బియ్యం స్వాధీనం


బస్తాలు పరిశీలిస్తున్న సుశీలాదేవి, శివనాగరాజు, రమేష్‌బాబు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం కస్తూర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో అధికారులు బుధవారం రాత్రి తనిఖీ చేసి అధికంగా ఉన్న 687 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజు, ఎంఈవో పి.రమేష్ బాబులతో కలిసి కేజీబీవీలో నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, స్థానిక రేషన్ డీలర్ కోటేశ్వరరావుకు అప్పగించినట్లు తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు. కేజీబీవీ ఎస్‌వో శ్యామలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇటీవల ఏ.కొండూరు మండలం కేజీబీవీ ఘటనలో ఆమెను విధుల నుంచి తప్పించారు. పిల్లలకు పెట్టాల్సిన బియ్యం పక్కదారి పట్టించేందుకు ఒక గదిలో నిల్వ చేసి ఉంచినట్లు తెలుస్తోంది.

నివేదిక తప్పుల తడక.. ఆదాయం లేక..

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే


ఫెర్రీ ప్రాంతంలో నివాసాల మధ్య ఖాళీ స్థలం

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో సమీపంలోని నివాసితులు ఇబ్బందులు పడుతుంటే ఆదాయం రాక పురపాలిక మీనమేషాలు లెక్కిస్తోంది. మేజర్ పంచాయతీలుగా ఉన్న కొండపల్లి, ఇబ్రహీంపట్నంలు అయిదేళ్ల కిందట కొండపల్లి పురపాలిక సంఘంగా మారింది. ఆ సమయంలో ఆయా ప్రాంతాలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయ వివరాలను అధికారులు పురపాలిక శాఖకు సమర్పించాల్సి ఉంది. అయితే అప్పటి అధికారుల నిర్లక్ష్యంతో పాటు సిబ్బంది కొరతగా ఉండటంతో పురపాలిక పరిధిలోని పన్నుల ఆదాయ నివేదికను తప్పుల తడకగా శాఖకు ఇచ్చారు. దీంతో పురపాలికలోని ఖాళీ స్థలాల వివరాలు అసంపూర్తిగానే నమోదయ్యాయి. వెంచర్ల రూపంలో ఉన్నవి, సాధారణంగా ఉన్న స్థలాలకు సంబంధించిన ఆదాయం పురపాలికకు చేరుకోవడం లేదు. ఇదిలా ఉంటే ఈ ఖాళీ స్థలాలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వాటిల్లో జమ్ము, ముళ్ల కంపలు, మురుగు నీరు చేరి అపరిశుభ్రతకు వేదికగా మారాయి. వీటి వల్ల దోమలు విపరీతమై కాలాలతో సంబంధం లేకుండా ఆయా ప్రాంతాల వారి రక్తాన్ని పీల్చుకు తాగేస్తున్నాయి. అంతే కాకుండా ఆయా ప్రాంతాల్లో విష సర్పాల భయం అందరిని వేధిస్తోంది.

హద్దులు ఏర్పాటు చేసుకొని..

పదేళ్లలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి శివారు ప్రాంతాలు విపరీతంగా విస్తరించాయి. ఎక్కడికక్కడ నిర్మాణాలు పెరిగిపోయాయి. కొందరు కొండ ప్రాంతాలను ఆక్రమించుకొని ప్లాట్లు వేసి విక్రయించారు. గతంలో ఎందుకూ పనికి రాని స్థలాలు, డాక్యుమెంట్లు లేని స్థలాలు సైతం నేడు రూ.లక్షలు పలుకుతున్నాయి. అదే సమయంలో విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉన్న సంపన్నులు స్థలాలు కొనుగోలు చేసి వాటికి హద్దులు ఏర్పాటు చేసుకొని వదిలేశారు. ఈ క్రమంలోనే ఫెర్రీకి వెళ్లే ప్రాంతంలో అనేక కాలనీలు వెలిశాయి. వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు, వాటి పక్కనే అపార్టుమెంట్లు నిర్మాణమయ్యాయి. దీంతో ఖాళీ స్థలాల పారిశుద్ధ్య సమస్య కూడా అధికంగా ఇక్కడే మొదలైంది.

పారిశుద్ధ్యం నిర్వహిస్తున్నాం

కొండపల్లి పురపాలిక పరిధిలో అనేక ఖాళీ స్థలాలు ఉన్నాయి. కొన్నింటికి పన్నులు వసూలు చేస్తూనే ఉన్నాం. మరి కొన్నింటిని గుర్తించి పత్రాలు ఉన్న స్థలాలకు పన్నులు విధిస్తున్నాం. ఖాళీ స్థలాల యాజమానుల వివరాలు లేని వాటి సంఖ్య ఇప్పటికే గుర్తించాం. త్వరలో వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు ఖాళీ స్థలాల ప్రాంతాల్లో అవసరం మేరకు పారిశుద్ధ్యం నిర్వహిస్తూనే ఉన్నాం. - **వెంకటరత్నం, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్, కొండపల్లి**

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



ప్రమాణం చేస్తున్న మహిళా పోలీసులు, డీసీపీ లక్ష్మీనారాయణ, అధికారులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అధికంగా ఉందని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విజయవాడ గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. వీటిని తీసుకుంటే ఆ దుష్ప్రభావం ఆ వ్యక్తి కుటుంబం, సమాజంపై ఉంటుందన్నారు. 'డ్రగ్స్‌పై దండ యాత్ర'లో భాగంగా మహిళా పోలీసులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర బుధవారం గంపలగూడెంలో ప్రారంభం కాగా తోటమూల వరకు 'మత్తు పదార్థాలు వద్దు.. బంగారు భవిష్యత్తు ముద్దు' నినాదంతో ప్రదర్శన చేశారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడారు. సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న మహిళా పోలీసులతో కలిసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేశారు. స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికతో మెరుగైన ఫలితాలు


మైలవరం : విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మైలవరం, న్యూస్‌టుడే: పది విద్యార్థులకు నిర్దేశించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా సిలబస్‌ను పూర్తి చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సూచించారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. పది విద్యార్థులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఎంఈవో బి.రాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: వెలగలేరు గ్రామంలోని చనుమోలు ఫకీర్రాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో చంద్రకళ బుధవారం సందర్శించారు. పదో తరగతిలో షైనింగ్ స్టార్లు, రైజింగ్ స్టార్లుగా గుర్తించిన విద్యార్థులు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెగిరెడ్డిపాడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వెలగలేరు హెచ్ఎం కె.పద్మ, చెగిరెడ్డిపాడు హెచ్ఎం పి.విజయ్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రంగాపురం కేజీబీవీ, డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులం, రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలను డీఈవో చంద్రకళ బుధవారం తనిఖీ చేశారు. పది విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఎంఈవో పి.రమేష్ బాబు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘానికి వితరణ


కార్యక్రమంలో నాగ సుబ్రహ్మణ్యం కుమార్తెలు, కుటుంబ సభ్యులు

విస్సన్నపేట: మండల పరిధి నరసాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య నాయకుడు గంధం వెంకట నాగ సుబ్రహ్మణ్యం (దత్తుడు) ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బుధవారం ఆయన దశదినకర్మ నేపథ్యంలో నలుగురు కుమార్తెలు, అల్లుళ్లు కలిసి మృతుడి జ్ఞాపకార్థంగా విస్సన్నపేట ఆర్యవైశ్య సంఘం వారికి ఫ్రీజర్ బాక్స్‌ను వితరణ చేశారు. అలాగే నరసాపురం స్వర్ణ గ్రామ పంచాయతీకి వాటర్ కూలర్‌ను ఇచ్చారు.

తెదేపా నాయకుడి మృతి పార్టీకి తీరని లోటు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పాతనాగులూరుకు చెందిన మాజీ ఉప సర్పంచి, తెదేపా నాయకుడు బల్లి డేవిడ్ రాజు(50) మృతి పార్టీకి తీరని లోటు అని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.విజయబాబు అన్నారు. డేవిడ్ రాజు అయిదు రోజులుగా గుంటూరులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు పలువురు తెదేపా నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేటి నుంచి రంజాన్ దీక్షలు ప్రారంభం


విద్యుత్తు వెలుగుల్లో ఊటుకూరులోని మసీద్

గంపలగూడెం, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మండలంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ముస్లింలు ఏర్పాటు పూర్తి చేశారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక, ఇబ్రహీంపట్నం మండలంలోని మసీదుల్లో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేయాలని మత పెద్దలు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో తపస్సుకాల ప్రార్థనలు


విభూదితో అభ్యంగనం చేస్తున్న ఫాదర్ అనిల్

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ఆర్సీఎం దేవాలయంలో తపస్సుకాల ఉపవాస ప్రార్థనలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ అనిల్ ఆధ్వర్యంలో విభూదితో అభ్యంగనం, దీక్షలు ఇచ్చారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ సిస్టర్స్, ఉపదేశకులు, 16 సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నంలోని చర్చిల్లో ఫాదర్లు 40 రోజుల ఉపవాస ప్రార్థనలను బుధవారం ప్రారంభించారు. మాలాధారణ చేసిన భక్తులు నిష్ఠతో వాటిని పూర్తి చేయాలని ఫాదర్లు సూచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: కొండపర్వలోని శ్రీభ్రమరాంబిక మల్లేశ్వర స్వామి వారి కల్యాణ ఉత్సవాలు, గట్టు తిరునాళ్ల సందర్భంగా భక్తులు ఆలయ హుండీలో వేసిన కానుకలను ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది బుధవారం లెక్కించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా హుండీ ఆదాయం రూ. 4,00,000 వచ్చినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ మట్టా వేణుగోపాలరావు, ట్రస్ట్ సభ్యులు బుక్కి వెంకట రామలక్ష్మి నరసింహారావు, సర్పంచి రమేష్ తెలిపారు. వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, అక్కిరెడ్డి ఉమా మహేశ్వరరావు, సామాజిక కార్యకర్త శివ పాల్గొన్నారు.

21న తిరుపతమ్మ తిరునాళ్లపై సమీక్షా సమావేశం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో ఈ నెల 21న ఆర్డీవో కె.బాలకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. మార్చి 4 నుంచి 8వ తేదీ వరకు తిరునాళ్లు జరుగనున్నాయి. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ శాఖల నుంచి చేయాల్సిన పనులపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆలయం సత్రాలు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే సమావేశానికి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

మినీ గోకులం షెడ్లతో పాల ఉత్పత్తిదారులకు మేలు


రిబ్బను కత్తిరిస్తున్న తెదేపా నాయకులు, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మినీ గోకులం షెడ్లతో పాల ఉత్పత్తిదారులకు మేలు జరుగుతుందని తెదేపా నాయకుడు ఎం.నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం అన్నేరావుపేట పంచాయతీ పరిధిలోని సీతారాంపురంలో మినీ గోకులం షెడ్డును అధికారులు, ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రభాకరరావు, బి.రమేష్, సీహెచ్.చందా, ఎం.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం

కొండపల్లి: క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన మనస్మోహపత్ర, బెబినా మొహబత్రా దంపతులు కొండపల్లి పారిశ్రామిక వాడలో పనులు చేసుకుంటూ పుట్టలమ్మ గట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం భార్యాభర్తలకు చిన్నపాటి వివాదం జరిగింది. అనంతరం మనస్మోహపత్ర ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రికి ఇంటికి వచ్చే సమయానికి బెబినా మొహబత్రా ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకొని ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులతో వైకాపా కార్యకర్తల వాగ్వాదం

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలో పోలీసు సిబ్బంది, వైకాపా కార్యకర్తలకు మధ్య బుధవారం మధ్యాహ్నం వాగ్వాదం చోటు చేసుకుంది. గొల్లపూడిలోని ఎమ్మెల్సీ తలశిల రఘురాం నివాసానికి మాజీ సీఎం జగన్ వస్తున్న నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో మార్గంలోని వైకాపా కార్యకర్తలను లోపలకు వెళ్లాలంటూ పోలీసు కానిస్టేబుల్ ఒకరు సూచించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే మాజీ మంత్రి పేర్ని నాని అక్కడకు వచ్చి సర్ది చెప్పగా వివాదం సద్దుమణిగింది.

తిరువూరు సంత మార్కెట్‌లో అగ్నిప్రమాదం


కాలిపోతున్న హోటల్

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు సంత మార్కెట్‌లో బుధవారం ఉదయం చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో తాటాకు హోటల్ పూర్తి కాలిపోయింది. వంట గ్యాస్ పైపు లీకై హోటల్ నిర్వాహకురాలు నెక్కడపు.విజయకు చెందిన తాటాకు హోటల్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే సంత నిర్వాహకులు పామర్తి.చంటి, కృష్ణా రెడ్డి అప్రమత్తమై అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి రాంబాబు తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు, ప్రాణ నష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హోటల్లోని సామగ్రి, కొంత నగదు పూర్తిగా కాలిపోయినట్లు విజయ వాపోయారు.

పౌష్టికాహారం పంపిణీ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తహీనతలో బాధపడుతున్న చిన్నారులు, నిరుపేదలకు రూ.10 వేలు విలువైన పౌష్టికాహారాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంకటశ్రీనివాసరావు అందించారు. ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ-4 కార్యక్రమంలో భాగంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నవవధువుపై నోట్ల వాన

ఇంటర్నెట్ డెస్క్: పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లాలో జరిగిన ఓ వివాహ వేడుకలో నవవధువుపై నోట్ల వర్షం కురిపించారు. వధువు వేదిక వద్ద నిలబడి ఉండగా.. పంజాబీ పాటల హోరులో కుటుంబసభ్యులు ఆమెపై కరెన్సీ నోట్లను వెదజల్లుతున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. మొత్తం రూ.8.5 కోట్ల విలువైన కరెన్సీ నోట్లను వెదజల్లినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి తగ్గట్టే వీడియోలో నేలంతా నోట్లు పరుచుకొని కనిపిస్తున్నాయి. "అబ్బే సరదాగా రూ.2 లక్షలు మాత్రమే వెదజల్లాం" అని వరుడి సోదరుడు సికందర్ సింగ్ తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. మరో వైపు.. వధువుపై వెదజల్లడానికి రూ.4 లక్షల విలువైన కరెన్సీ నోట్లను వినియోగించినట్లు ఈ వివాహ కార్యక్రమాన్ని నిర్వహించిన ఈవెంట్ మేనేజరు చెప్పడం గమనార్హం.



థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ.. ఉద్యోగులకు రూ.20 కోట్ల కార్లు

ఇంటర్నెట్ డెస్క్: కేరళలోని హైలైట్ గ్రూపు సంస్థ 30 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉద్యోగులకు ఖరీదైన కార్లను బహుమతిగా ఇచ్చింది. రిటైల్ స్పేస్ రంగానికి చెందిన ఈ సంస్థ కోళికోడ్‌లో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో రూ.20 కోట్ల విలువైన కానుకలను అందజేసింది. సంస్థ ప్రారంభం నుంచి సేవలందిస్తున్న 47 మందికి వివిధ మోడళ్ల కార్లు ఇచ్చారు. 2030 నాటికి తమ సంస్థను మరింత విస్తరించి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యాజమాన్యం ప్రకటించింది. ఈ కంపెనీకి త్రిశ్శూర్, కోళికోడ్‌లలో లగ్జరీ మాల్స్ ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మరో 10 మాల్స్ అభివృద్ధి దశలో ఉన్నాయి. మొత్తం 10 వేల మంది ఉద్యోగులు సంస్థలో పనిచేస్తున్నారు. 680 మిలియన్ డాలర్ల వ్యయంతో త్వరలో భారీ ట్రేడ్ సెంటర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతోంది.



బామ్మగారు.. బంగారం

78 ఏళ్ల వయసులో గోల్డ్ మెడల్‌తో పీజీ

ఈటీవీ భారత్: సీనియర్ సిటిజన్లు పదవీ విరమణ తర్వాత కూడా జీవితాన్ని గొప్పగా ఆస్వాదించవచ్చనే సందేశాన్ని 78 ఏళ్ల సుష్మా మోఘే సమాజానికి చాటారు. ఈ వయసులో మరాఠీ సాహిత్యంలో పీజీ చేసిన సుష్మా మొదటి ర్యాంకుతో ఉత్తీర్ణురాలు కాగా.. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, వీసీ రాకేశ్ సింఘాయ్



ఆమెకు గోల్డ్ మెడల్ అందజేశారు. ఇండోర్ నగరానికి చెందిన సుష్మా తొలుత మ్యూజిక్ కోర్సులో డిగ్రీ చదివారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాలలో సంగీత ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూనే కెమిస్ట్రీలో పీజీ చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల ఉద్యోగ జీవితం నుంచి రిటైరయ్యాక, పలు పుస్తకాలను హిందీ నుంచి మరాఠీలోకి అనువదించారు. సొంతంగా డజను పుస్తకాలు రాసి ప్రచురించారు. తాజాగా ఇండోర్‌లోని దేవీ అహిల్యా విశ్వవిద్యాలయం నుంచి పీజీ చేసి మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో మనవడు రేయాంశ్ సమక్షంలో బంగారు పతకం అందుకున్నారు.



బృందమంటే వ్యక్తులు కలిసి పనిచేయడమే కాదు

కార్యక్షేత్రంలో బృందమంటే కొందరు వ్యక్తులు కలిసిపనిచేయడమే కాదు. సంరక్షణ, గౌరవం, నమ్మకాలపై ఏర్పడిన ఓ బంధం. గొప్ప బృందాల్లో సభ్యులు ఫలితాలపై మాత్రమే దృష్టిని కేంద్రీకరించరు..తోటి సభ్యుల అభ్యున్నతినీ పట్టించుకుంటారు.


– అనుష్క సోహం, అంత్రప్రెన్యూర్

ఛాతీ భాగాన్ని ఉద్దేశపూర్వకంగా తాకడం అత్యాచార యత్నమే

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- అలహాబాద్ హైకోర్టు వివాదాస్పద ఉత్తర్వుల కొట్టివేత

దిల్లీ: మహిళల ఛాతీ భాగాన్ని ఉద్దేశపూర్వకంగా తాకడం, పైజామా నాడాను లాగడం అత్యాచారం యత్నం కిందకు రాదంటూ ఓ కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వులను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు అమానవీయంగా వ్యవహరించిందని, స్పష్టంగా ఉన్న నేర న్యాయ సూత్రాలను కూడా తప్పుగా అన్వయించిందని పేర్కొంది. ఐపీసీలోని సెక్షన్ 376 కింద, పోక్సో చట్టంలోని సెక్షన్ 18 కింద స్పెషల్ జడ్జి జారీ చేసిన సమన్లను పునరుద్ధరించింది. మూడో పక్షం వ్యక్తులు జోక్యం చేసుకోవడంతోనే నిందితులు అత్యాచారానికి పాల్పడలేదని పేర్కొంది. నిందితుల చర్యలు నేరం చేయడానికి సిద్ధమవ్వడం కిందకు రావని, అత్యాచారయత్నం కిందకే వస్తాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం స్పష్టంచేసింది. ఐపీసీలో నేర ప్రయత్నానికి ఎక్కువ శిక్ష ఉంటుంది. సిద్ధమవ్వడానికి(ప్రిపరేషన్) తక్కువ శిక్ష ఉంటుంది. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులు 11 ఏళ్ల బాలిక ఛాతీ భాగాన్ని పట్టుకున్నారు. పైజామా నాడాను లాగారు. బాలిక అరుపులు విని ఆ మార్గంలో వెళుతున్న వ్యక్తులు జోక్యం చేసుకున్నారు. దీనిపై కాస్‌గంజ్ పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి.. నిందితులకు సమన్లు జారీ చేశారు. అలహాబాద్ హైకోర్టు మాత్రం అభియోగాల తీవ్రతను తగ్గించింది. నిందితుల ప్రవర్తన అత్యాచార యత్నం కిందకు రాదని పేర్కొంది. వారు కేవలం బాలిక దుస్తులు తీసి నగ్నంగా నిలబెట్టేందుకు మాత్రమే ప్రయత్నించారని అభిప్రాయపడింది. దీన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాలిక అరుపులు విని జనం రావడంతోనే అత్యాచార ప్రయత్నం విఫలమైందని.. నిందితులకు నేరం చేసే ఉద్దేశం ఉందని స్పష్టం చేసింది.

■ ఈ కేసులో మరో కీలకమైన ఆదేశం కూడా సుప్రీంకోర్టు జారీ చేసింది. లైంగిక నేరాల వంటి సున్నితమైన కేసుల్లో న్యాయమూర్తులు అనుసరించాల్సిన విధానాలపై మార్గదర్శకాలను రూపొందించాలని భోపాల్‌లోని జాతీయ జ్యుడీషియల్ కమిటీని ఆదేశించింది. ఈ అంశంపై గతంలో రాజ్యాంగ ధర్మాసనాలు పలు ఆదేశాలు జారీచేశాయని.. కానీ అవి ఫలితాలను ఇవ్వలేదని, అందుకే సమగ్రమైన విధి విధానాలను రూపొందించాలని పేర్కొంది.



కులం, మతం, ప్రాంతీయ వివక్షతో వ్యక్తులపై దాడులు తిరోగామి చర్యలే

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్య

దిల్లీ: జాతి, మతం, కులం, ప్రాంతం ఆధారంగా వ్యక్తులను గుర్తించి వివక్ష చూపడం, హింసాత్మక దాడులకు పాల్పడడం తిరోగామి చర్యలేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిన తర్వాత కూడా ఇలాంటి వివక్ష కొనసాగడం శోచనీయమని తెలిపింది. ఈ నేరాల పట్ల కఠినంగా వ్యవహరించి వాటిని నిరోధించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం పేర్కొంది. ఈశాన్య ప్రాంత ప్రజలపై దేశంలోని వివిధ చోట్ల జరుగుతున్న వివక్షాపూరితమైన హింసను నిరోధించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని తోసిపుచ్చుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే, పిటిషన్‌లోని అంశాలను పరిశీలించి సంబంధిత ప్రభుత్వ విభాగానికి పంపించి చర్యలు తీసుకునేలా చూడాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ఆదేశించింది. త్రిపురకు చెందిన 24 ఏళ్ల ఎంబీఏ విద్యార్థి దేహ్రాదూన్‌లో దారుణ హత్యకు గురైన నేపథ్యంలో గత ఏడాది డిసెంబరు 28న ఈ వ్యాజ్యం దాఖలైంది.

విద్యార్థుల వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ వెల్లడి

దిల్లీ: భారతీయ విద్యార్థుల కోసం వీసా, ప్రవేశాల ప్రక్రియలను సరళీకరిస్తామని, ఫ్రాన్స్‌లో ఆంగ్ల మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ హామీ ఇచ్చారు. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను ఏడాదికి 30,000కు పెంచడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. భారత్ పర్యటనలో భాగంగా బుధవారం దిల్లీలోని ఎయిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మహారాష్ట్రలో 5 శాతం ముస్లిం రిజర్వేషన్ల రద్దు


ప్రభుత్వంపై ప్రతిపక్షాల ధ్వజం

ముంబయి: విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలకున్న 5 శాతం రిజర్వేషన్లను మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి సంబంధించిన ప్రభుత్వ తీర్మానాన్ని విడుదల చేసింది. మరాఠాలకు 16శాతం, ముస్లింలకు 5శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ.. కాంగ్రెస్-ఎన్సీపీ నేతృత్వంలోని గత ప్రభుత్వం 2014లో ఆర్డినెన్సు తీసుకొచ్చింది. తాజాగా మహాయుతి కూటమి ప్రభుత్వం దీన్ని తొలగించింది. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి. భాజపా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మైనారిటీలకు వ్యతిరేకమని పేర్కొన్నాయి.

ప్రజాస్వామ్యానికి హానికరం: ముస్లిం కోటా తొలగించడం ప్రజాస్వామ్యానికి హానికరమని, ఇది మైనారిటీ ప్రజలను అభివృద్ధి నుంచి దూరం చేస్తుందని ముంబయి నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్షా గైక్వాడ్ వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయంతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మాజీ సభ్యుడు నసీమ్ ఖాన్ ఆరోపించారు. ముస్లిం నేతలను భాజపా గౌరవించదని, ఆ పార్టీతో ముస్లింలకు న్యాయం జరగదని ఎన్సీపీ(ఎస్పీ) పేర్కొంది. మరోవైపు, ముస్లింలు ఐఏఎస్, ఐపీఎస్‌లు అవడం ప్రభుత్వానికి ఇష్టం లేదని ఏఐఎంఐఎం నేత, మాజీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ ఆరోపించారు.

ఏఐ ఎక్స్‌పోలో చైనా రోబో వివాదం

- వెంటనే స్టాల్‌ను ఖాళీ చేయించిన ప్రభుత్వం
- దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారన్న రాహుల్ గాంధీ



దిల్లీ: దేశ రాజధానిలో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ ఎక్స్‌పోలో ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయం చేసిన తప్పిదం తీవ్ర వివాదానికి దారి తీసింది. చైనాలో తయారైన ఓ రోబో డాగ్‌ను తామే తయారు చేశామని ఆ విశ్వవిద్యాలయ ప్రతినిధి ప్రకటించడం వివాదానికి కారణమైంది. వెంటనే స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌పో నుంచి ఆ విశ్వవిద్యాలయ స్టాల్‌ను తొలగించింది.

నొయిడాకు చెందిన గల్గోటియాస్ వర్సిటీ ఏఐ ఎక్స్‌పోలో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఒక రోబో డాగ్‌ను ప్రదర్శించింది. దీనిపై ఆ వర్సిటీ కమ్యూనికేషన్స్ ప్రొఫెసర్ నేహా సింగ్ డీడీ న్యూస్‌తో మంగళవారం మాట్లాడారు. ఆ రోబోను తమ వర్సిటీకి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తయారు చేసిందని వివరించారు. ఈ వీడియో వైరల్ కావడంతో సోషల్ మీడియాలో ఆ రోబో అసలు విషయాన్ని బయటపెట్టారు. అది యూనిట్రీ గో-2 రోబో అని, చైనాలోని యూనిట్రీ తయారు చేసిందని వెల్లడించారు. దీంతో వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ వర్సిటీ స్టాల్‌ను ఖాళీ చేయించింది. మరోవైపు వర్సిటీ యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. ఆ రోబో డాగ్ సాంకేతిక మూలాల గురించి తమ ప్రతినిధికి తెలియదని, కెమెరా ముందు అత్యుత్సాహంతో తప్పుడు సమాచారాన్ని అందించారని ఓ ప్రకటనలో తెలిపింది.

■ ఏఐ సమిట్‌లో చైనా వస్తువులను ప్రదర్శించి దేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన ఒక ప్రచార ఆర్భాటంగా ఏఐ సదస్సును ఆయన అభివర్ణించారు.

విమానాల్లో అనుచిత ప్రవర్తనపై ఉక్కుపాదం

- ముసాయిదా నిబంధనలు తీసుకొచ్చిన డీజీసీఏ

దిల్లీ: విమానాల్లో అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికులపై ఉక్కుపాదం మోపాలని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) నిర్ణయించింది. ఈ మేరకు కొత్త ముసాయిదా నిబంధనలు రూపొందించింది. ఇవి అమల్లోకి వస్తే అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికులను 30 రోజుల వరకు నిషేధించే హక్కు ఎయిర్‌లైన్స్ సంస్థలకు లభించనుంది. గతంలో స్వతంత్ర దర్యాప్తు కమిటీ నిర్ధారిస్తేనే శిక్ష పడేది. కొత్త ప్రతిపాదనల ప్రకారం, స్వతంత్ర సంస్థకు విమానయాన సంస్థలు నివేదించనక్కర్లేదు. నేరుగా చర్య తీసుకోవచ్చు. అనుచిత ప్రవర్తన పరిధిలోకి విమానంలో పొగ తాగడం, అనుమతి లేకుండా సురక్షిత పరికరాలను వినియోగించడం, ఆందోళనలు నిర్వహించడం, నినాదాలు చేయడం కూడా తీసుకొచ్చారు. చెక్-ఇన్, విశ్రాంతి ప్రదేశాలు, బోర్డింగ్ ప్రవేశాల దగ్గర అనుచితంగా ప్రవర్తించే ప్రయాణికులపై కూడా ఇక నుంచి ఎయిర్‌లైన్స్ సంస్థలు నిఘా ఉంచనున్నాయి. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. సైగలతో, మాటలతో వేధింపులకు గురి చేస్తే లెవెల్-1 నేరంగా పరిగణిస్తారు. మూడు నెలల వరకు వేటు పడుతుంది. భౌతిక దాడులు, లైంగిక వేధింపులు లెవెల్-2 కిందకు వస్తాయి. ఆరు నెలల వరకు నిషేధం ఉంటుంది. ఇతరుల ప్రాణాలకు హాని కలిగించేలా ప్రవర్తిస్తే లెవెల్-3 కింద కనిష్ఠంగా రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిషేధం విధించవచ్చు. విమాన సిబ్బంది ఉన్న ప్రదేశంలోకి చొరబడితే లెవల్ 4 నేరమవుతుంది. దీనికి కూడా రెండేళ్లు అంతకంటే ఎక్కువ నిషేధం వర్తిస్తుంది. జాతీయ భద్రతకు ప్రమాదం కలిగించే వ్యక్తులపైనా నిషేధం విధించే వెసులుబాటును కొత్త నిబంధనలు కల్పించనున్నాయి. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజలు, సంబంధిత భాగస్వాములు తమ సూచనలు, అభ్యంతరాలను వచ్చే నెల 16 లోపు పంపాలని డీజీసీఏ పేర్కొంది.

మానవ సేవే పరమావధిగా ఇస్కాన్ ప్రయాణం

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



మాయాపూర్: సనాతన ధర్మ విలువలను ప్రపంచ దేశాలకు చేరవేయడంలో ఇస్కాన్ సంస్థ కీలకంగా పనిచేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ మానవ సేవే పరమావధిగా ముందుకు వెళుతోందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్‌లో పర్యటిస్తున్న ఆయన.. నదియా జిల్లా మాయాపూర్‌లోని ఇస్కాన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ 152వ జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ.. తాను ఇక్కడకు ప్రభుత్వ ప్రతినిధిగా రాలేదని.. చైతన్య మహాప్రభు భక్తునిగా వచ్చానని పేర్కొన్నారు. "దేశంలో పర్యటిస్తున్నప్పుడు ఇస్కాన్ ప్రభావాన్ని గమనించాను. మీరు ప్రచురించిన భగవద్గీత అన్ని వయసుల వారికీ, అన్ని వర్గాల వారికీ అక్కరకు వస్తోంది. అయితే భక్తి దగ్గరే ఇస్కాన్ ఆగిపోలేదు. ఎక్కడైనా విపత్తు తలెత్తితే అక్కడకు వెళ్లి చేయందించే మొట్టమొదటి సంస్థగా నిలుస్తోంది. ఆహార పంపిణీ శిబిరాలు ఏర్పాటు, విద్య, వైద్య రంగాలను పేదవారికి చేరువ చేయడానికి అనేక కార్యక్రమాలను చేపడుతోంది' అని అమిత్ షా కొనియాడారు.

హిందువులు కనీసం ముగ్గురిని కనాలి: భాగవత్

లఖ్‌నవూ: హిందూ సమాజం ఏకం కావాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధిపతి మోహన్ భాగవత్ అన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా, అప్రమత్తంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. హిందూ జనాభా తగ్గిపోవడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే హిందూ కుటుంబాలు ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చేందుకు ఆలోచించాలని సూచించారు. మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలోని సరస్వతి శిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మత మార్పిళ్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని తెలిపారు. సామరస్యం లేకపోవడమే వివక్షకు దారితీస్తోందని, పౌరులందరూ ఒకే దేశం-ఒకే జన్మభూమి అనే భావన కలిగి ఉండాలన్నారు. మహిళలు సహజంగానే శక్తిమంతులని, వారికి స్వీయ రక్షణ విద్య నేర్పించాలని చెప్పారు.

భారత్‌కు ఎప్పుడొస్తానో చెప్పలేను

- బాంబే హైకోర్టుకు తెలిపిన విజయ్ మాల్యా

ముంబయి: బ్రిటన్‌ను విడిచి వెళ్లకుండా తనపై నిషేధం ఉన్నందువల్ల భారత్‌కు ఎప్పుడొస్తానన్న విషయాన్ని చెప్పలేనని పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా బుధవారం బాంబే హైకోర్టుకు తెలిపారు. మోసం, మనీ లాండరింగ్ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్న ఆయన తన న్యాయవాది అమిత్ దేశాయ్ ద్వారా హైకోర్టుకు సమాధానమిచ్చారు. 2016లో తన పాస్‌పోర్టును భారత ప్రభుత్వం రద్దు చేసిందని, ఇంగ్లాండ్, వేల్స్‌లోని కోర్టులు తనను దేశం విడిచి వెళ్లకుండా నిషేధించాయని అందులో పేర్కొన్నారు. ఈ కారణంగానే భారత్‌కు తిరిగి వచ్చే కచ్చితమైన తేదీని తెలపలేనన్నారు. తనను పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గతంలో మాల్యా హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తిరిగి భారత్‌కు వచ్చిన తర్వాతే ఈ విషయంపై విచారణ జరుపుతామంటూ ధర్మాసనం స్పష్టం చేసింది. అసలు ఆయనకు స్వదేశానికి తిరిగొచ్చే ఉద్దేశం ఉందా..లేదా అని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా మాల్యా తన సమాధానాన్ని హైకోర్టుకు తెలిపారు. ఆయన సమాధానంపై స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

హిమంత 'అస్సాం జిన్నా': గౌరవ్ గొగొయ్

గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిమంతను 'అస్సాం జిన్నా'గా అభివర్ణించారు. ఈ నెల 22న భాజపాలో చేరనున్న రాష్ట్ర కాంగ్రెస్ మాజీ చీఫ్ భూపెన్ కుమార్ బోరాను హస్తం పార్టీలోని చిట్టచివరి హిందూ నేతగా హిమంత పేర్కొనడంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయత నేతలకు హిమంత 'హిందూ ధ్రువపత్రాలు' ఇవ్వాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. భాజపాలో చేరేవారంతా రాజకీయ జీవితంలో ప్రాధాన్యం లేనివారుగా మిగిలిపోతారని, భూపెన్ బోరాకు కూడా అదే పరిస్థితి ఎదురవుతుందని గొగొయ్ పేర్కొన్నారు.

■ కాంగ్రెస్‌ను వీడనుండటంపై భూపెన్ స్పందిస్తూ.. రాజీనామా లేఖను కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపిన తర్వాత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిపారు. 2007 నుంచి తమ మధ్య ఉన్న అనుబంధంతో పాటు పార్టీ కోసం పడిన కష్టం గురించి ఆయన తనతో మాట్లాడినట్లు బోరా పేర్కొన్నారు. కానీ తన రాజీనామా లేఖపై ఒక్క మాటా మాట్లాడలేదన్నారు.

రాజస్థాన్‌లో మధ్యయుగం నాటి ఆలయం

పురావస్తు శాఖ తవ్వకాల్లో బయల్పడిన అవశేషాలు

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని ఝుంఝును ప్రాంతంలో త్యోందా గ్రామ సమీపంలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో మధ్యయుగం నాటి ఆలయ ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇక్కడ లక్ష్మీ, గణేశుడి విగ్రహ భాగాలు కూడా లభ్యమయ్యాయి. ఇవి 11-12వ శతాబ్దాలకు చెందినవిగా పురావస్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఆలయం రాజ్‌పుత్ కాలానికి లేదా అంతకంటే ముందు యుగానికి చెందినదిగా తెలుస్తోంది. ఈ ఆనవాళ్లు మధ్యయుగంలో చరిత్రను తెలుసుకునేందుకు ఉపయోగపడతాయని నిపుణులు చెబుతు



న్నారు. గత నెలలో ఈ తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కనుగొన్న ప్రతి పురాతన వస్తువులను జాగ్రత్తగా నమోదు చేస్తూ, ఫొటోగ్రఫీ, సంరక్షణ చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాస్త్రీయ విశ్లేషణ, కచ్చితమైన కాల నిర్ధారణ పూర్తయిన తర్వాత ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యం మరింత స్పష్టంగా తెలుస్తుందన్నారు.

జాతీయ భద్రతకు రాహుల్ ప్రమాదకరం: రిజిజు

ఇంటర్నెట్ డెస్క్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. విదేశీ పర్యటనల సమయంలో వేర్పాటువాదులు, మావోయిస్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జి సోరోస్ వంటి వ్యక్తులతో రాహుల్ సమావేశమవుతున్నారని ఆరోపించారు. జాతీయ భద్రతకు ఆయన చాలా ప్రమాదకరమన్నారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ.. సభా చర్చలకు తరచూ అంతరాయం కలిగిస్తారన్నారు. పార్లమెంటు సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలతో వాకౌట్ చేయడం వంటి పిల్లచేష్టలు చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు.

2016 అమెరికా అధ్యక్ష ఎన్నికలు.. ట్రంప్ విజయానికి పుతిన్ మద్దతుపై కొనసాగుతున్న విచారణ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ 2016లో తొలిసారి ఎన్నికైనప్పుడు ఆయన విజయానికి రష్యా సాయమందించిందన్న అంశంపై దేశ న్యాయ విభాగం విచారణ కొనసాగిస్తోంది. బరాక్ ఒబామా అధ్యక్షునిగా ఉన్న రోజుల్లో తనను రాజకీయంగా దెబ్బ తీసేందుకే ఈ వాదనను లేవనెత్తారని ట్రంప్ భావిస్తున్నారు. ఈ ప్రచారానికి బాధ్యులైన అధికారులపై కక్ష తీర్చుకోవాలని ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగానే 2016 నాటి అమెరికా ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌ను ఓడించేందుకు పుతిన్ జోక్యం చేసుకున్నారన్న అంశంపై విచారణలో పాల్గొన్న అధికారులందరికీ న్యాయశాఖ సరికొత్త నిర్దేశాలు జారీ చేసింది. బరాక్ ఒబామా కాలంలో ఇందుకు సంబంధించి నిఘా విభాగం అంచనాలకు ప్రాతిపదిక అయిన పత్రాలు, సాక్ష్యాలు సమర్పించాలని న్యాయశాఖ గత నవంబరులో జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. తాజా ఆదేశాల్లో తదనంతరం వెల్లడైన సాక్ష్యాధారాలేవో తెలియజేయాలని కోరింది. ఈ విషయంపై వ్యాఖ్యానించడానికి న్యాయశాఖ నిరాకరించింది. అయితే తాజా ఆదేశాలు పలువురు మాజీ నిఘా విభాగం ఉన్నతాధికారులు, పోలీసు విభాగం అధికారులకు పంపినట్టు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. 2016 ఎన్నికల్లో ట్రంప్ విజయానికి రష్యా పాటుపడిందని బరాక్ ఒబామా పాలనాకాలం పూర్తయ్యే చివరి రోజుల్లో వెలువడిన ఒక అధికారిక నివేదిక పేర్కొంది. డెమోక్రటిక్ పార్టీకి చెందిన నేతల ఈ-మెయిల్‌లను రష్యా హ్యాక్ చేసి వాటిని లీక్ చేసిందని, తద్వారా డెమోక్రటిక్ పార్టీని అప్రతిష్ఠపాల్జేసి ట్రంప్‌నకు మేలు జరిగేలా చేసిందని పలు నివేదికలు అప్పట్లో పేర్కొన్నాయి.

ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీకి పక్కలో బల్లెం!

- ప్రత్యర్థి జులుజ్‌నీకి పెరుగుతున్న జనాదరణ



లండన్: రష్యా సేనలు తమ భూభాగంలోకి చొచ్చుకువస్తున్న ప్రస్తుత తరుణంలో ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీ సొంతింటి పోరునూ బలంగానే ఎదుర్కొంటున్నారు. ఆయన రాజకీయ ప్రత్యర్థిగా పేరు పొందిన వాలెరీ జులుజ్‌నీ.. జనాదరణలో పైచేయి సాధిస్తున్నారు. బ్రిటన్‌లో ఉక్రెయిన్ రాయబారిగా పనిచేస్తున్న వాలెరీ జలుజ్‌నీ గతంలో ఉక్రెయిన్ సైనిక దళాధిపతిగా పనిచేశారు. ఆయనను ఆ పదవి నుంచి తొలగించి 2024లో బ్రిటన్‌కు ఉక్రెయిన్ రాయబారిగా నియమించారు.ఆయన ఇన్నాళ్లూ జెలెన్‌స్కీతో తన రాజకీయ వైరుధ్యాన్ని బహిరంగంగా చర్చించడానికి ఇష్టపడలేదు. రష్యాతో యుద్ధం నాలుగో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న ప్రస్తుత తరుణంలో అసమ్మతి గళం దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తుందని ఆయన వాదన. యుద్ధానంతరం ఎన్నికలు జరిగితే దేశాధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తిగా ఉన్నారు. ఇటీవల ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన జెలెన్‌స్కీతో తనకున్న విరోధాన్ని గురించి తొలిసారి చర్చించారు. దేశాన్ని కాపాడుకునేది ఎలాఅనే విషయంపై తనకూ, జెలెన్‌స్కీకి మధ్య భేదాభిప్రాయాలు ఉండేవని చెప్పారు. 2022లో రష్యా దురాక్రమణ అనంతరం ఈ విభేదాలు ప్రబలిపోయాయన్నారు. యుద్ధభూమిలో సాధించిన అనేక విజయాల కారణంగా జులుజ్‌నీకి దేశంలో ప్రజాదరణ పెరిగింది. అయినప్పటికీ ఆయనను జెలెన్‌స్కీ పదవి నుంచి తొలగించి బ్రిటన్‌కు రాయబారిగా పంపారు. తన ప్రత్యర్థికి ఉన్న ప్రజాదరణను నిలువరించేందుకే జెలెన్‌స్కీ ఈ చర్యకు పాల్పడ్డారని, ఒకవేళ ఎన్నికలు జరిగితే జులుజ్‌నీయే ఆధిక్యం సాధిస్తారని సర్వేలు చెబుతున్నాయి.

నేను రాహుల్‌వాదిగా ఎలా ఉండగలను?: మణిశంకర్



దిల్లీ: తాను గాంధీవాదిని, నెహ్రూవాదిని, రాజీవ్‌వాదిని తప్పిస్తే రాహుల్‌వాదిని మాత్రం కానని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి స్పష్టంచేశారు. తాను ఇందిరావాదిని కానని, ఆమె ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని నిరంకుశత్వంగా మార్చేయడాన్ని ఏమాత్రం సమర్థించలేనని చెప్పారు. రాహుల్ గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యపై బుధవారం పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడారు. "నాకు ఆరేళ్లు, తమ్ముడికి నాలుగేళ్లు ఉన్నప్పుడు మహాత్మాగాంధీ మమ్మల్ని ఎత్తుకుని.. మేమిద్దరం తనకి సూర్యచంద్రులమని అన్నారు. అప్పటినుంచి నేను గాంధీవాదిని అయ్యాను. నాకు ఆరేళ్ల వయసు నుంచి 23 ఏళ్లు వచ్చేవరకు ప్రధానిగా నెహ్రూ ఉన్నారు. నేను ఎదుగుతున్న వయసులో ఆయన ఆలోచనల ప్రభావం బాగాపడింది. అందుకని నెహ్రూవాదిగా భావించుకుంటాను. రాజీవ్ గాంధీ నన్ను పీఎంవోలోకి తీసుకుని సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. అందుకని ఆయన్ని ఇష్టపడతా. రాహుల్‌తో మాత్రం అలాంటి అవకాశం రాలేదు" అని వివరించారు.

కునో పార్కులో మూడు కూనలకు జన్మనిచ్చిన చీతా

దిల్లీ: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో 'గామిని' అనే చీతా మూడు కూనలకు జన్మనిచ్చింది. 2022లో దక్షిణాఫ్రికా నుంచి దీన్ని భారత్‌కు తీసుకొచ్చారు. తాజా కూనలతో కలిపి దేశంలో చీతాల సంఖ్య 38కి చేరిందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రతి కూన జననం 'ప్రాజెక్ట్ చీతా'ను



బలపరుస్తుందన్నారు. చీతాలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించి వాటి వృద్ధికి కృషి చేస్తున్న పార్కు సిబ్బంది, వైద్యులను ఆయన అభినందించారు. గామిని మూడు కూనలకు జన్మనివ్వడంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా హర్షం వ్యక్తం చేశారు. వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యంలో ఇది దేశానికే చరిత్రాత్మక విజయమని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

జెనీవాలో అర్ధాంతరంగా ముగిసిన రష్యా- ఉక్రెయిన్ శాంతి చర్చలు

జెనీవా: అమెరికా మధ్యవర్తిత్వంలో రష్యా-ఉక్రెయిన్ మూడో దఫా శాంతి చర్చలు రెండో రోజైన బుధవారం అర్ధాంతరంగా ముగిశాయి. రెండో రోజు చర్చలు ప్రారంభమైన రెండు గంటలకే ముగిశాయని అధికారులు తెలిపారు. చర్చల సందర్భంగా ఇరుదేశాల మధ్య నెలకొన్న రాజకీయ, సైనిక వైరుధ్యాలను తొలగించేందుకు అమెరికా అధికారులు ప్రయత్నించారు. రాజకీయ, సైనిక అంశాలపై చర్చలు జరిగాయని ఉక్రెయిన్ ప్రతినిధి బృందం సభ్యుడైన రుస్తెమ్ ఉమరోవ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. తొలి రోజైన మంగళవారం ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన చర్చలు మరుసటి రోజు అంతకంటే చాలా తక్కువ సమయం సాగాయి" అని మీడియా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇంతకు ముందు అబుధాబీలో జరిగిన చర్చలు కూడా ఎలాంటి సానుకూల ఫలితాలూ సాధించలేదు. గత సంవత్సర కాలంగా ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు తమ ప్రభుత్వం చేస్తున్న కృషి అర్థవంతమైన ప్రగతి సాధిస్తోందని అమెరికా ప్రభుత్వ దూత స్టీవ్ విట్కాఫ్ సోషల్ మీడియా ద్వారా చెప్పారు.

■ ఉక్రెయిన్‌లోని పౌర ఆవాసాలపై రష్యా క్షిపణుల వర్షం కురిపిస్తోంది. తాజాగా 126 దీర్ఘశ్రేణి డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది.

వసుంధర

vasundhara@eenadu.in

ఎప్‌స్టీన్ రహస్యం... ఆమె ఛేదించారు!

ఒకరిద్దరు కాదు. వందలు, వేల మంది బాలికలు, యువతులు... పేదరికం, కుటుంబ నిరాదరణ, మోడలింగ్ ఆసక్తులు... పలు కారణాలతో ఎప్‌స్టీన్ అనే సంపన్న కామాంధుడి వలకి చిక్కారు, సెక్స్ ట్రాఫికింగ్‌కి బలయ్యారు. ఆ చీకటి సాలె గూడు నుంచి బయటపడిన కొందరమ్మాయిల కథలు వింటే... ఎలాంటి సమాజంలో ఉన్నాం, మృగాళ్ల నుంచి ఆడపిల్లలను ఎంత జాగ్రత్తగా రక్షించుకోవాలి... అన్నదాన్ని తెలియజేస్తున్నాయి.

ఎప్‌స్టీన్ ఫైల్స్... జుగుప్సాకరమైన ఈ ఇంటర్నేషనల్ సెక్స్ ట్రాఫికింగ్ స్కామ్ సెగ ఇప్పుడు మనదేశాన్నీ తాకింది. ఆ వికృత కామక్రీడకు బలైనవాళ్లలో మనదేశ బాలిక పేరూ ఉండటంతో మరోసారి దీని మీద చర్చ మొదలైంది. అయితే, కొన్నేళ్ల కిందటి ఎప్‌స్టీన్ కేసును తిరగదీసి, 2019లో అతనికి జైలుశిక్ష పడటంలో మయామీ హెరాల్డ్ పత్రికకు చెందిన మహిళా ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ కీలకపాత్ర పోషించారు. పేరు **జూలీ కె.బ్రౌన్**. 80 మంది బాధితుల్ని కలిశారీమె. వాళ్ల కథల్నీ ఎప్‌స్టీన్ అరాచక వ్యవస్థనీ సిరీస్‌గా ప్రచురించారు. ఆ కథనాల్ని 'పర్వర్షన్ ఆఫ్ జస్టిస్' పేరుతో పుస్తకంగానూ తీసుకొచ్చారు

అసలు ఎప్‌స్టీన్ కేసు శోధించాలన్న ఆలోచన ఆమెలో ఎలా మొదలైందన్నది తెలుసుకునే ముందు....



జెఫ్రీ ఎప్‌స్టీన్... అమెరికన్ ఫైనాన్షియర్. బాలికలు, యువతుల జీవితాలతో ఆడుకున్న కామపిశాచి. దేశాధినేతలు, వ్యాపారులు, మేధావులతో పరిచయాలు పెంచుకుని అపర కుబేరుడిగా ఎదిగాడు. అసాంఘిక, అశ్లీల సామ్రాజ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. ప్రైవేటు దీవుల్ని కొని, ఇంద్ర భవనాలు నిర్మించి, అనేక దేశాల నుంచి అమ్మాయిల్ని రప్పించి పార్టీలు ఇచ్చేవాడు. ఫ్లోరిడాలోని తన పామ్‌బీచ్ నివాసంలో 14 ఏళ్ల అమ్మాయిని లైంగికంగా వేధించాడని 2005లో అతనిమీద కేసు నమోదైంది. దర్యాప్తుకోసం వెళ్లిన పోలీసులు న్యూడ్ పెయింటింగులతో నిండిన ఆ ఇంటి గోడల్ని చూసి నివ్వెరపోయారు. చివరకు ఎప్‌స్టీన్ నేరాన్ని ఒప్పుకోవడంతో 2008లో జైలు శిక్ష పడింది. డబ్బు బలంతో నాన్ ప్రాసిక్యూషన్ (ప్లీ డీల్)ఒప్పందం చేసుకున్నాడు. ఫలితం తేలికపాటి జైలుశిక్ష పడగా 13 నెలలకే విడుదలయ్యాడు. జైల్లోనూ రాచమర్యాదలే. నిజానికి అతనిమీద మోపిన నేరానికి కనీసం 20 ఏళ్ల జైలుశిక్ష పడాలి. కానీ అలా జరగలేదు. ఇదే బ్రౌన్‌లో ఆసక్తిని రేకెత్తించింది. ఎవరితను... ప్లీ డీల్ ఎలా పొందాడు... అనుకుంటూ అతనిపై ఓ కన్నేసి ఉంచారీమె!

ఎలా శోధించారు?

కేసు విచారణకు సంబంధించిన లీగల్ డాక్యుమెంట్లను 2017లో క్షుణ్ణంగా పరిశీలించారు బ్రౌన్. వాటిల్లో బాధితుల పేర్లకు బదులుగా జేన్‌డో1, జేన్‌డో2... అని రాస్తారు. కానీ వాటి ద్వారానే 80 మంది బాధితుల వివరాలు సేకరించి వాళ్లని కలిశారు. అందుకామె చాలా కష్టపడ్డారు. ఎంతో దూరాలు ప్రయాణించేవారు. చాలామంది భయంతో నోరు విప్పేవారు కాదు. ఎనిమిది మంది అమ్మాయిలు మాత్రం ధైర్యంగా ముందుకొచ్చి ఎప్‌స్టీన్ వికృతచేష్టల్నీ, తమమీద జరిగిన అకృత్యాల్నీ వినిపించారు. దాదాపుగా అందరిదీ ఒకటే కథ. ఫీజులకోసం కొందరూ కార్పొరేట్ టౌన్ పార్టీల ఆశతో ఇంకొందరూ అతని గాలానికి చిక్కినవాళ్లే. డ్రగ్స్‌కి బానిసైన బాలికల్నీ చేరదీసేవారు. వీళ్లని వెతికి తెచ్చే పని ఎప్‌స్టీన్ గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మ్యాక్స్‌వెల్‌ది... తన స్నేహితుడు గొప్ప దాత అనీ, ఫీజులు కట్టి సాయం చేస్తాడనీ, మసాజ్ చేస్తే చాలనీ, 200 డాలర్ల చొప్పున ఇస్తామని తీసుకెళ్లేది. అక్కడ వాళ్లమీద అఘాయిత్యం చేయడమే కాదు, ఆ దృశ్యాలను రహస్య కెమెరాల్లో చిత్రించి, భయపెట్టి లొంగదీసుకునేవారు. వాళ్ల స్నేహితుల్నీ తీసుకొస్తే డబ్బులిస్తామనీ ఆ అమ్మాయిలకే ఆశ చూపించేవారు. ఒకమ్మాయి పాతిక మందినీ మరొకమ్మాయి నలభై మందినీ ఎప్‌స్టీన్‌కి పరిచయం చేశారట. ఇలా ఎప్‌స్టీన్ కామానికి బలైన బాలికలెందరో. ఆ నరకం నుంచి బయటికొచ్చి వాళ్లు చెప్పేవి వినడానికే సమాజం సిగ్గుపడుతుందంటే... ఆ అమ్మాయిలెంత నరకం అనుభవించి ఉంటారు? పైగా వాళ్లను న్యాయ విచారణలో ప్రశ్నలతో హింసించారు, జీతంకోసం పనిచేసే వేశ్యలుగా చిత్రించారు ఎప్‌స్టీన్ న్యాయవాదులు.

వాళ్లందరినీ కలిసిన బ్రౌన్... 2018లో ఆ అమ్మాయిలు ఎదుర్కొన్న లైంగిక హింస గురించి సిరీస్‌గా ప్రచురించారు. అప్పటి అటార్నీ జనరల్ అలెగ్జాండర్ అకోస్టా మధ్యవర్తిత్వం వహించిన 2008 నాటి నాన్ ప్రాసిక్యూషన్ ఒప్పందమే అతనికి తేలికపాటి శిక్ష పడటానికి కారణమన్న విషయాన్ని ఆమె బహిర్గతం చేశారు. ట్రాఫికింగ్ నెట్‌వర్క్, ఆరోపణలు, మీటూ ఉద్యమం ఊపందుకోవడం, బ్రౌన్ కథనాలతో న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూషన్ ఎప్‌స్టీన్ కేసును తిరగదీసింది. దర్యాప్తు మళ్లీ ప్రారంభమైంది. ప్లీ డీల్ బాధితుల హక్కులను ఉల్లంఘించిందనీ, ట్రాఫికింగ్ జరిగిందనీ.. అన్న ఆరోపణలతో జులై 6, 2019న ఎప్‌స్టీన్‌ను న్యూయార్క్‌లో అరెస్ట్ చేశారు. తరవాత కొన్ని రోజులకే అకోస్టా యూఎస్ కార్మిక కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. ఆగస్టు 10న విచారణకోసం ఎదురుచూస్తూ జైలు గదిలో అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు ఎప్‌స్టీన్.



బ్రౌన్

ఎవరీ జూలీ కె. బ్రౌన్?

బ్రౌన్ స్వస్థలం ఫిలడెల్ఫియా.. చిన్నతనం నుంచీ ఎన్నో కష్టాలు పడ్డారు. ఒంటరి తల్లి పెంపకంలో పెరిగారు. చుట్టుపక్కల, స్కూల్లో అవమానాలు, వేధింపులు ఎదుర్కొన్నారు. పరిశోధనాత్మక కథనాలమీద ఆసక్తితో స్కూలు వార్తాపత్రికకి ఎడిటర్‌గా పనిచేశారు బ్రౌన్. పదహారేళ్ల వయసులో బయటి ప్రపంచంలోకి వచ్చి సొంత జీవితాన్ని ప్రారంభించారు. కాలేజీ ఫీజులకోసం కొరియర్‌గా, ఫ్యాక్టరీలో వర్కర్‌గా ఎన్నో పనులు చేశారు. జర్నలిజంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ఫిలడెల్ఫియా డెయిలీ న్యూస్‌లో కొంతకాలం చేశాక మయామీ హెరాల్డ్‌కి వచ్చారు. ఓ దశలో ఉద్యోగం పోతుందనే అనుకున్నారట. కానీ యాజమాన్యం మద్దతు లభించడంతో ఆమె ధైర్యంగా తన కథనాలను ప్రచురించారు.

ఈ ఒక్క కేసే కాదు, దీనికి ముందు జైళ్ల అరాచక వ్యవస్థపై నాలుగేళ్లపాటు శోధించి, కథనాలు రాశారు బ్రౌన్. అవి అధికారుల రాజీనామాలకూ అవినీతిపరుల తొలగింపునకీ దారితీశాయి. 30 ఏళ్ల కెరియర్‌లో రెండుసార్లు ప్రసిద్ధ జార్జ్ పోల్క్ అవార్డుతోపాటు మరెన్నో పురస్కారాల్నీ అందుకున్నారు. పులిట్జర్ ప్రైజ్ గెలుచుకున్న మయామీ టీమ్‌లో ఈమె ఒకరు. 2020లో టైమ్ మ్యాగజీన్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పీపుల్ జాబితాలోనూ చేరారు. ఎప్‌స్టీన్ అరెస్ట్‌తో అంతా ఆమె ధైర్యాన్నీ తెగువనీ ప్రశంసించారు. అప్పుడు 'భయాన్ని పక్కనబెట్టి తమ కథలను కెమెరా ముందు చెప్పిన ధైర్యవంతులైన బాధితులే రియల్ హీరోలు' అన్నారీమె. అంతేకాదు, 'వాళ్లు తమకు జరిగిన అన్యాయం గురించి చెబుతుంటే సమాజం ఎంతగా కుళ్లిపోయిందో తెలుస్తోంది. పిల్లల్ని రక్షించాల్సిన బాధ్యత మనదే. అలాంటిది ఎంతోమంది టీనేజర్లు బలైన ఈ ఘోర నేరాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే... వాళ్లకి ఏమని సమాధానం చెబుతాం?' అంటోన్న బ్రౌన్ పట్టుదల, వృత్తి పట్ల ఉన్న నిబద్ధత అభినందనీయం!

హలీమ్ సీడ్స్ మంచివేనా?

మా పాపకు 15ఏళ్లు. జుట్టు బాగా రాలుతోంది. ఈమధ్య హలీమ్ సీడ్స్ గురించి ఎక్కువగా వింటున్నాం. వీటిని వాడితే జుట్టు రాలడం తగ్గుతుందా? ఇవి మంచివేనా? మా అమ్మాయికి వీటిని ఇవ్వొచ్చా? – దివ్య

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

హలీమ్ సీడ్స్, అడేలి గింజలు వీటిలో ఐరన్, కొన్ని రకాల విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. అయితే, మీ అమ్మాయికి జుట్టు రాలుతోంది అంటున్నారు. దీనికి చాలా కారణాలుంటాయి. ముందు వాటిని గమనించాలి. హిమోగ్లోబిన్ ఎంత ఉంది. ఎత్తుకు తగ్గ బరువు, సమతులాహారం తీసుకుంటుందా ఇలాంటి విషయాలేవీ మీరు చెప్పలేదు. ఒకవేళ మీ పాప ఉండాల్సిన బరువు కంటే ఎక్కువుండి పీసీఓఎస్, పీసీఓడీ వంటి సమస్యలుంటే ఆహారంలో మార్పులు చేసుకుంటూ వీటిని ఎన్ని రోజులు, ఎంత మొత్తంలో తీసుకోవాలనేది ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే వీటిలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు, పీచు పదార్థాలు, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ సి వంటివి ఎక్కువగా ఉంటాయి. కాబట్టి తన శరీరానికి రోజువారి ఆహారంలో ప్రొటీన్లు, మినరల్స్ ఎంత అవసరమో చెక్ చేసుకుని తన ఆహార నియమాల ప్రకారం వీటిని వాడాల్సి ఉంటుంది. సాధారణంగా టీనేజ్ అమ్మాయిలకు రోజుకి 18మి.గ్రా. ఐరన్ అవసరం. మీ అమ్మాయి ఎత్తుకు తగ్గ బరువు ఉండి ఇతర అనారోగ్య సమస్యలేవీ లేవు అనుకుంటే, రోజుకి 5గ్రా. హలీమ్ గింజల్ని రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం తేనె, నిమ్మరసం కలిపి గానీ, ఫ్రూట్ జ్యూస్‌తో కలిపిగానీ తీసుకోవచ్చు. అంతేకాదు, నెలసరి సమస్యలున్నవారు, పాలిచ్చే తల్లులు, బరువు తగ్గాలనుకున్నవారు వీటిని తీసుకోవచ్చు. కానీ పోషకాహార నిపుణుల సూచనలు మేరకు సమయం, పరిమాణం తప్పక పాటించాలి.

మరీ అంతగా ఆధారపడాలా?



చిన్నప్పుడు అమ్మతో మార్కెట్‌కి వెళ్లడం గుర్తుందా? అప్పుడదో సరదా అనుభవం. కూరగాయలు, సరకులు తీసుకున్నాక అవతలివ్యక్తి ధరల వివరాలు చెప్పడం ఆలస్యం... గాల్లోనే లెక్కలేసి మొత్తమెంతో చెప్పేసేది. అలా చెప్పడం మనకు అప్పట్లో ఓ అద్భుతం. ఇంటి బడ్జెట్ మొత్తం తన మెదడులో నిక్షిప్తమై ఉండేది. ఫోన్ నంబర్లయినా సరే... టకటకా చెప్పేసేది. అప్పట్లో మనమూ అంతే! మరి ఇప్పుడు? ఠక్కున ఓ ఇద్దరి నంబర్లనీ సరిగా చెప్పలేం. చిన్న లెక్కకీ కాల్‌క్యులేటర్ తెరవాల్సిందే. చిన్న సందేహాన్నీ, సరదా ప్రశ్నల్నీ ఆలోచించే సమయమేది? గూగుల్‌లో చకచకా వెతకాల్సిందే. అదైతే క్షణాల్లో సమాధానం ఇచ్చేస్తుంది, సమయం వృథా ఉండదని మన భావన. కానీ ఈ తీరు మనకేం చేస్తోంది? బహుమతిగా చిన్నవయసులోనే మతిమరుపును ప్రసాదిస్తోంది. అంతేకదా! ఒక వస్తువును కొన్నాళ్లు వాడకుండా పక్కనపెట్టండి. తరవాత పనిచేయకుండా మొరాయిస్తుంది అవునా? మెదడూ అంతే. ప్రతిదానికీ సాంకేతికత మీద ఆధారపడుతోంటే అదీ బద్ధకంగా తయారవుతుంది. కాబట్టే, నిన్న మొన్నటి విషయాలూ గుర్తుకురావు. మనతో చదువుకున్నవాళ్ల పేర్లూ మర్చిపోతుంటాం.

యాభయ్యో అరవయ్యో దాటాక అనుకుంటే సర్లే అనుకోవచ్చు. ముప్పయ్యో పడిలో ఉన్నవాళ్లూ ఇదే మాట. కేవలం మర్చిపోవడమే అనుకుంటున్నారేమో! దీంతో ఏకాగ్రత తప్పుతుంది. సృజనాత్మకతకు చోటుండదు, మానసిక అలసట... చెప్పుకొంటూ పోవాలే కానీ జాబితా పెరుగుతూ పోతుంది. చూశారా ఎంత సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయమో! కాబట్టి...

రోజూ కొద్దిసేపు మెంటల్ మ్యాథ్స్ అంటే కనీసం చిన్న చిన్న లెక్కలైనా మనసులో వేసుకోవడం మొదలుపెట్టండి. పాతరోజుల్లోలా ఫోన్‌నంబర్లు, సరకులు గుర్తుంచుకోవడానికి ప్రయత్నించండి. పుస్తకాలు, వ్యాసాలు చదవండి. అయితే సోషల్‌మీడియా పోస్టులు కాదు. చిట్టిపొట్టి వార్తలు అంతకన్నా కాదు. పెద్ద వ్యాసాలు చదవండి. పజిల్స్, బ్రెయిన్ గేమ్స్ వంటివీ మేలు చేసేవే. పెన్ను పట్టి చిన్న చిన్న విషయాలైనా రాస్తూ ఉండండి.. . ఇదీ జ్ఞాపకశక్తిపై చెరగని ముద్రవేసేదే. మెసేజ్‌లు పక్కనపెట్టి, మాట్లాడండి. వీలుంటే నేరుగా వెళ్లి కలిసినా మంచిదే. ఇలా చేస్తోంటే మెదడూ చురుగ్గా ఉంటుంది. మతిమరపూ దూరమవుతుంది. నేటి రోజుల్లో సాంకేతికతని పూర్తిగా పక్కన పెట్టలేం. కానీ దానిమీద అతిగా ఆధారపడటమూ ప్రమాదమే. కాబట్టి, అప్పుడప్పుడూ మీ మెదడుకి పని చెప్పండి. చురుగ్గా, ఆరోగ్యంగా ఉంటూ మీలో ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. ప్రయత్నిస్తారుగా మరి?

హక్కుల కోసమే ఆమె పోరు..!

ఏషియన్ ఉమన్ ఆఫ్ అచీవ్‌మెంట్ అవార్డు... క్వీన్ ఎలిజబెత్ 2ని కలిసే అవకాశం... మేనేజర్లు, సీఈవోల పొగడ్తలు... అన్నీ **సంజూ పాల్** పనికి దక్కిన కితాబులే. ఎందుకంటే మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా ఆమె ఉద్యోగంలో చేరినప్పట్నుంచీ పనే ధ్యాస. కెరియర్‌లో రాణించాలనీ, ఉన్నత పదవుల్ని అధిరోహించాలనీ కలలు కన్నారామె. అందుకు అనుగుణంగానే కష్టపడ్డారూ, మార్గాన్నీ ఏర్పాటుచేసుకున్నారు. తను అనుకున్నది సాధించి, పదోన్నతికి దగ్గరవుతోందన్న సందర్భంలో... విపరీతమైన కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరారామె. ఎండోమెట్రియాసిస్ సమస్య ఉందన్నారు. 'శస్త్రచికిత్స తప్పనిసరి అన్నారు వైద్యులు. దీంతో చేయించుకోక తప్పలేదు. కానీ తర్వాత చాలా బలహీనంగా అనిపించేది. డాక్టర్లు మూడునెలలు విశ్రాంతి తీసుకోవాలని చెప్పినా... నెలకే ఆఫీసుకు వెళ్లా. రక్తస్రావమయ్యేది, నీరసం, నిస్సత్తువ ఆవరించినా పనిలోనే ప్రశాంతతను వెతుక్కున్నా. అలా ఆరునెలలు గడిచాయి. హెచ్‌ఆర్ నుంచి నన్ను ఉద్యోగం నుంచి తీసేస్తున్నట్లు మెయిల్ వచ్చింది. ఈ ఆరు నెలల్లో లక్ష్యాల్ని చేరుకోలేకపోవడమే కారణంగా చూపించార'ని గుర్తుచేసుకుంటారు సంజూ. కెరియర్‌కి బ్రేక్. తను ఇంత కష్టపడి పనిచేసినా... అనారోగ్య సమస్యల్ని పట్టించుకోకుండా ఇలా ఉద్యోగం నుంచి తీసేయడం జీర్ణించుకోలేకపోయిందామె. తొలగింపును సవాల్ చేస్తూ యూకేలోని ఎంప్లాయిమెంట్ ట్రైబ్యునల్‌లో కేసు వేసింది. 'యూకేలోని ప్రతి పదిమందిలో ఒక మహిళ ఈ ఎండోమెట్రియాసిస్ సమస్యతో బాధపడుతున్నారు. వీళ్లలో సగానికిపైగా ఉద్యోగాలు చేసేవారే. అలాంటి వాళ్లని ఈ కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయం' అని పోరాటం మొదలుపెట్టారు సంజు. దీన్ని ఓ వైకల్యంగా గుర్తించమని కోరుతున్నారు. అయితే 2022లో తనకు అనుకూలంగానే తీర్పు వచ్చినా... నష్టపరిహారం మాత్రం అందలేదు. అందుకే 2026లో మళ్లీ కేస్ రీఓపెన్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారీమె. దాంతో ఈమె పోరాటం నెట్టింట వైరల్ అవుతోంది.




సంజూ

ప్రసవానంతరం బరువు తగ్గేలా..



పిల్లలు పుట్టాక బరువు పెరుగుతారు చాలామంది. దాన్ని తేలిగ్గా తీసుకోకుండా... అదుపులో ఉంచుకోవాలి. ఇందుకోసం జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ప్రసవానంతరం మహిళలు ఎదుర్కొనే మొదటి సమస్య నిద్రలేమి. దీనివల్లా బరువు పెరుగుతారు. ఈ సమయంలో పిల్లల వేళలకు తగ్గట్లే మీరూ నిద్రపోగలిగితే సమస్యను అధిగమించొచ్చు. రాత్రే పడుకోవాలని పెట్టుకుంటే మీపై ఒత్తిడి, అలసట పెరిగిపోతాయి. ఇది మరిన్ని చిక్కులకు దారితీస్తుంది. ఇప్పటివరకూ మందులు, విటమిన్లు... అంటూ పోషకాలన్నీ తీసుకుంటారు. ప్రసవమవ్వగానే ఒక్కసారిగా అవన్నీ మానేస్తారు. ఆ పని చేయకండి. దీంతో ఆకలి పెరిగి మితిమీరి తినే ప్రమాదం ఉంది. వైద్యుల సలహాతో కనీసం ఆరేడు నెలలు డైట్ ప్లాన్ చేసుకోండి. పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే తెల్ల అన్నం, బ్రెడ్, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండాలి. బదులుగా సంక్లిష్ట పిండిపదార్థాలు అందించే బ్రౌన్‌రైస్, ఇతర పోషకాల కోసం పప్పుధాన్యాలూ, పండ్లూ, ఆకుకూరలూ, కూరగాయలూ ఎక్కువగా తీసుకోవాలి. పాల ఉత్పత్తి కోసం ఎక్కువ కెలొరీలు తీసుకోవడం తప్పనిసరే కానీ.. అయితే అవి శరీరానికి మేలు చేసే పదార్థాల నుంచి అందేలా చూసుకోవాలి. చక్కెర ఉన్న పదార్థాల వినియోగం మానేయాలి. లేదంటే బరువు ఇంకా పెరగడం, శరీరంలో శక్తి తగ్గడం, హార్మోన్ల అసమతూకం లాంటి సమస్యలు మొదలవుతాయి. సిజేరియన్ వల్ల బరువులెత్తే వ్యాయామాలు చేయలేకున్నా... వాకింగ్, యోగా, ధ్యానం వంటివాటిని కొనసాగించండి. ఇవన్నీ మిమ్మల్ని నాజూగ్గా మార్చడమే కాదు... నిరాశ, కుంగుబాటులనూ దూరం చేస్తాయి.

బంగారం - వెండి



18న ముగింపు

	బంగారం (24క్యా.)	ఆర్నమెంట్ (22క్యా.)	వెండి (కిలో)
హైదరాబాద్	1,58,700	1,41,750	2,49,992
విజయవాడ	1,52,080	1,41,350	2,48,300
ప్రొద్దుటూరు	1,53,300	1,41,040	2,46,000
రాజమహేంద్రవరం	1,54,200	1,41,350	2,60,000
విశాఖపట్నం	1,54,210	1,41,350	2,46,000
తమిళనాడు	-----	1,42,300	2,60,000

మీకు తెలుసా!

తుమ్ములు రావడానికి చాలా కారణాలే ఉన్నా... కొందరికి సూర్యకాంతి చూడటం వల్ల కూడా వస్తుంటాయట. ఒక్కసారిగా ముఖంపై వెలుతురు పడినప్పుడు మెదడులో నాడులు ఒక్కసారిగా ప్రతిస్పందించి గందరగోళానికి గురవడంతో ఇలా జరుగుతుందట. ఇది వంశపారంపర్యంగానూ రావొచ్చట. స్కూల్ ఆఫ్ ఆప్టోమెట్రీ నిర్వహించిన సర్వేలో 67శాతం మంది మహిళలకి ఈ తుమ్ములు వచ్చాయంటున్నారు నిపుణులు.

మైమరిపించే పియోనీ అందాలు!





రోజా పువ్వులను తలపించే అందం, కార్నేషన్‌లను మరిపించే ఆకారం... పియోనీ పూల సొంతం. పెంచుకునే ప్రదేశానికీ, అలంకరించిన చోటుకీ వన్నె తెచ్చే ఈ మొక్క గురించి మీకు తెలుసా?

అందం, సంపద, ప్రేమ, గౌరవాలకు చిహ్నంగా భావించే పియోనీ పూలు ఆసియాతోపాటు యూరప్, అమెరికాల్లోని పలు ప్రాంతాల్లో విరివిగా కనిపిస్తాయి. రెండు వేల ఏళ్ల క్రితం నుంచీ చైనీస్ వంటకాల్లోనూ, ఔషధాల్లోనూ వాడుతున్నారట. మనదేశంలోనూ ఇవి పెరుగుతాయి. ప్రాంతాన్ని బట్టి హిమాలయన్ పియోనీ, మమేఖ్, కశ్మీర్ మిడ్... అంటూ ఒక్కోపేరుతో పిలుస్తున్నారు. ఈ మొక్కలు ఒక్కసారి నాటితే వందేళ్ల పాటు బతికేయగలవు. కాబట్టే ఎక్కువమంది వీటిని పెంచుకోవడానికి ఆసక్తి చూపిస్తారట. నీలం మినహా తెలుపు, గులాబీ, ఎరుపు, పసుపు, ఊదా వంటి వర్ణాల్లోనూ విరబూస్తాయి. పరిమాణంలో పెద్దవిగా సువాసన కలిగి ఉంటాయి. అంతేకాదు, ఇవి రకాన్ని బట్టి తీపి, గులాబీ, సిట్రస్, మసాలా... వంటి సువాసనలూ వెదజల్లుతాయట.

ఎలా పెంచాలంటే...

పియోనీ దుంపల్ని నేల ఉపరితలం నుంచి 1-2 అంగుళాల కింద నాటుకుంటే చాలు. కుండీల్లోనూ బాగా నిలదొక్కుకుంటాయి. అయితే కాస్త పెద్ద పరిమాణంలో ఉన్నదాన్ని ఎంచుకోవాలి. నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. సూర్యకాంతి నేరుగా తగిలేలా చూసుకోవాలి. అంటే కనీసం 6-8 గంటల పాటు ప్రత్యక్షంగా తగలాలి. నీళ్లను క్రమం తప్పకుండా పోయాలి. కానీ, అవి నిలిచి పోకుండా చూసుకోవాలి. ఒకటికంటే ఎక్కువ మొక్కలు నాటినప్పుడు వాటి మధ్య 2-3 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే, ఇవి కాస్త పెద్దగా పెరుగుతాయి. పియోనీ మొక్కలకు నైట్రోజన్ అధికంగా ఉన్న ఎరువులు వేయకూడదు. ఆకులు ఎక్కువగా, పూలు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. బదులుగా ఎన్‌పీకే 5-10-10 సమగ్ర ఎరువు లేదా బోన్‌మీల్‌ని నెలకోసారి ఇవ్వాలి. సంవత్సరానికి ఒకసారి మొక్క చుట్టూ ఉన్న మట్టిని తవ్వి కంపోస్ట్ వేయాలి. ఈ మొక్కలకు పురుగులు వచ్చే అవకాశం తక్కువ. అప్పుడప్పుడూ చీమలు చుట్టుముడతాయి. బూడిద రంగు పురుగులు, తెగులు కనిపిస్తాయి. ఇలాంటప్పుడు వ్యాధి సోకిన కొమ్మల్ని తొలగించి ఆకుల్ని శుభ్రపరిస్తే చాలు. ఫంగిసైడ్, వేపనూనె వంటివి ఉపయోగించొచ్చు.

ఇంటి తోట











గొడవెందుకో ఆలోచించారా..?

'అమ్మా నేనీ అబ్బాయితో వేగలేకున్నా... ఏం చేసినా తప్పంటాడు' అంటూ తల్లితో తమ బాధను పంచుకోని అమ్మాయిలు ఉండరేమో. అయితే దానికి సమాధానంగా భార్యాభర్తలన్నాక గొడవలు సహజం అంటూ పెద్దవాళ్లూ సర్దిచెప్పే ప్రయత్నమే చేస్తారు. కానీ ఎప్పుడైనా ఆలోచించారా... అసలు వాదనలు ఎందుకు వస్తున్నాయి. అవి గొడవలుగా ఎందుకు మారుతున్నాయి. వీటికి కారణాలేంటి అని? ఎందుకంటే... యూ'గవ్' అనే సంస్థ చేసిన సర్వే ప్రకారం దంపతుల మధ్య వారానికి ఒక్కసారైనా తగాదాలు చోటుచేసుకుంటున్నాయట. కొత్తగా పెళ్లయిన జంటలైతే మరీ మూడురోజులకోసారి గొడవ పడుతున్నారట. అయితే వీటిల్లో దాదాపు 69శాతం పరిష్కరించలేనివేనట. ఎందుకంటే ఇవన్నీ జీవనశైలి, వ్యక్తిత్వ విభేదాలకు సంబంధించినవి. ఉదాహరణకు దంపతుల్లో ఒకరిది ఖర్చు చేసే స్వభావం అయితే, మరొకరు పొదుపు చేయాలనుకోవడం, ఒకరు సామాజికంగా అందరితో కలిసిపోవాలని కోరుకుంటే... మరొకరు ఇంట్రావర్ట్‌లవ్వడం వంటివి. వీటిల్లో తక్షణ మార్పులు కోరుకోవడం వల్లే తగాదాలు జరుగుతున్నాయి అంటున్నాయి అధ్యయనాలు. ఇవి ఒక్కరోజులో వచ్చినవి కాదు. పెరిగే వాతావరణం, ఎదిగే క్రమంలో ఎదురయ్యే ఒడుదొడుకులు, చుట్టూ ఉన్న వ్యక్తులు ఇవన్నీ వాళ్లని ప్రభావితం చేస్తాయి. దీర్ఘకాలంలోనే వీటికి పరిష్కారం దొరుకుతుంది. అలాంటి వాటిని మార్చాలని తగాదాలు పడుతూ ప్రస్తుతాన్ని పాడుచేసుకుంటున్నారు ఇప్పటి జంటలు. బదులుగా సఖ్యత, సర్దుకుపోవడం, ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడంపై సమయాన్ని కేటాయిస్తే... గొడవల్లో సగానికిపైగా సద్దుమణుగుతాయి అంటున్నారు నిపుణులు.





భారత్ నుంచి ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీ

- ఆ సామర్థ్యం, వ్యవస్థ ఇక్కడ ఉన్నాయ్
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్


ఏఐ సమిట్ సందర్భంగా ప్రధాని మోదీతో, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

ప్రపంచ స్థాయి కృత్రిమ మేధ (ఏఐ) దిగ్గజాన్ని అందించే సామర్థ్యం భారత్‌కు ఉందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అభిప్రాయపడ్డారు. 'అసాధారణ' కంపెనీల సృష్టికి తగ్గట్లుగా, భారత్‌లో వ్యవస్థలు రూపాంతరం చెందుతున్నాయని అన్నారు. భారత్‌లోనే ప్రపంచ స్థాయి కంపెనీ ఏర్పాటై, 'తదుపరి సుందర్' ఇక్కడే ఉండేందుకు ఏం చేయాలని ప్రశ్నించగా.. 'ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. ఫ్లిప్‌కార్ట్, ఓయో వంటి దేశీయ అంకురాల విజయాలు అందుకు సాక్ష్యమ'ని 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌'లో ఆయన వివరించారు. సర్వమ్ వంటి కంపెనీలు స్థానిక ఏఐ మోడళ్లను అభివృద్ధి చేస్తున్నాయని గుర్తుచేశారు. ఏఐ వ్యవస్థలపై టెక్ కంపెనీలు భారీ మొత్తాలు వేగంగా పెట్టుబడి పెట్టడాన్ని పిచాయ్ సమర్థించారు. దేశ వృద్ధికి జాతీయ రహదారులు, రైల్వేల విస్తరణ ఎంత ముఖ్యమో, టెక్ వ్యవస్థల అనుసంధానానికి సంబంధిత మౌలిక వసతులు అత్యవసరమని తేల్చి చెప్పారు.

✦ ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని సుందర్ పిచాయ్ కలిశారు. నిపుణులైన విద్యార్థులు, ఉద్యోగులతో గూగుల్ ఏ విధంగా అనుసంధానం కాగలదనే అంశాన్ని చర్చించారు.

మైక్రోసాఫ్ట్ రూ.4.5 లక్షల కోట్ల పెట్టుబడులు

వర్ధమాన, వెనకబడ్డ దేశాల్లో (గ్లోబల్ సౌత్) ఏఐని విస్తరించడం కోసం ఈ దశాబ్దం చివరికల్లా 50 బిలియన్ డాలర్ల(సుమారు రూ.4.5 లక్షల కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. మొత్తం అయిదు అంశాల (మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, బహుభాషా ఏఐ అభివృద్ధి, స్థానిక ఆవిష్కరణలు, ఏఐ వ్యాప్తి గణన)పై ఈ నిధులు వెచ్చించనున్నట్లు కంపెనీ తెలిపింది.

✦ మైక్రోసాఫ్ట్ ఎలివేట్ కార్యక్రమంలో భాగంగా 2030 కల్లా భారత్‌లో 2 కోట్ల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించింది.

ఏజెంటిక్ ఏఐ తర్వాత మెషీన్ వాయిస్‌దే రాజ్యం

ఏఐ వ్యవస్థలో ఏజెంటిక్‌ఏఐ వేగంగా వృద్ధి చెందుతోంది. ఇక తదుపరి మెషీన్ వాయిస్‌దే రాజ్యం కానుందని ప్రోసస్, బీసీజీ నివేదిక పేర్కొంది. ప్రస్తుత, వచ్చే సంవత్సరాల్లో ఇన్‌పుట్/అవుట్‌పుట్ మోడళ్లు(ఆడియో ఇన్‌పుట్, స్పీచ్‌అవుట్‌పుట్ టు టెక్స్ట్) వంటివి భావోద్వేగాలను జత చేస్తాయని పేర్కొంది. ఇటీవల ఏఐ వ్యాప్తి పెరిగినా.. వ్యవసాయం, విద్య, ప్రజారోగ్యంలోనూ ఆర్థిక సేవలు, తయారీల్లో మాదిరిగా వేగవంత ప్రగతి సాధించాల్సి ఉంది అని నివేదిక అభిప్రాయపడింది.

ఎన్‌విడియాకు భారత్ కీలక హబ్

ఇక్కడి డెవలపర్లు, అంకుర సంస్థల నిర్వాహకులు, భాగస్వాముల కారణంగా.. తమకు ఏఐ ఆవిష్కరణలో అత్యంత కీలక కేంద్రాల్లో ఒకటిగా భారత్ మారిందని ఎన్‌విడియా ఎండీ(దక్షిణాసియా) విశాల్ ధూపర్ పేర్కొన్నారు. ఎన్‌విడియా 'నెమోట్రాన్‌'తో ఏఐ అప్లికేషన్లను పలు సంస్థలు వినియోగిస్తున్నాయన్నారు. ఇందులో ఎన్‌పీసీఐ, సర్వమ్.ఏఐ, జోహో, భారత్‌జెన్ వంటివి ఉన్నాయి. ఇటీవలి బడ్జెట్‌లో విదేశీ డేటా కంపెనీలకు 20 ఏళ్ల పన్ను విరామాన్ని ప్రకటించడం వల్ల, ఏఐ విస్తరణకు వీలు కల్పించినట్లయిందని ఎన్‌విడియా సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ శంకర్ త్రివేది పేర్కొన్నారు.

డ్రోన్లు-రోబోల ద్వారా ఇంటికే సరకు డెలివరీ

✦ హైపర్‌లోకల్ డ్రోన్ డెలివరీ ప్లాట్‌ఫాం అయిన స్కైఎయిర్ మొబిలిటీ.. తన ఎండ్-టు-ఎండ్ అటానమస్ వాణిజ్య డెలివరీ వ్యవస్థను సమిట్‌లో ప్రదర్శించింది. గ్రౌండ్ రోబోటిక్స్, ఏరియల్ డ్రోన్ల సహకారంతో మానవ జోక్యం లేకుండా వినియోగదారు ఇంటికే.. ప్యాకేజీలను ఇది డెలివరీ చేస్తుంది.

✦ గిగావాట్-స్కేల్ ఏఐ ఫ్యాక్టరీ ఇన్‌ఫ్రా నిర్మించడం కోసం ఎన్‌విడియాతో ఒక సంయుక్త సంస్థను ఎల్ అండ్ టీ ప్రతిపాదించింది.

మరో 2 లక్షల కోట్ల డాలర్ల టెక్ మార్కెట్: యాక్సెల్

టెక్నాలజీ ద్వారానే భారత దేశం వచ్చే దశాబ్ద కాలంలో మరో 2 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.180 లక్షల కోట్ల) మార్కెట్ విలువ జోడించడానికి సిద్ధంగా ఉందని, అమెరికా కేంద్రంగా పనిచేసే వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ యాక్సెల్ తెలిపింది. ప్రస్తుతం భారత కార్పొరేట్ సంస్థల మొత్తం మార్కెట్ విలువలో టెక్నాలజీ కంపెనీల వాటా 4-5 శాతంగానే ఉందని, రాబోయే పదేళ్లలో ఇది 15-20 శాతానికి పెరగొచ్చని ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యాక్సెల్ పార్టనర్ ప్రయాంక్ స్వరూప్ అభిప్రాయపడ్డారు. ఏఐ, అంకురాల వల్ల ఇంతటి మార్పు వస్తుందన్నారు. నెలవారీ రూ.100 ధరతోనే వైద్య సలహాలు, బోధన, ఆర్థిక సలహాల వంటివి ఏఐతో సాకారం చేయొచ్చన్నారు. 100 బి.డాలర్ల (దాదాపు రూ.9 లక్షల కోట్ల) విలువైన కంపెనీల సృష్టి జరుగుతుందని, వీటి సంఖ్య భారీగా పెరగొచ్చన్నారు.

✦ భారత్‌లో వేగంగా వృద్ధి చెందుతున్న టెక్నాలజీ, ఏఐ అంకుర వ్యవస్థకు మద్దతు పలికేందుకు 150 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1360 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు క్వాల్‌కామ్ ప్రకటించింది.

✦ ఏఐ వల్ల ఎమ్ఎస్ఎమ్ఈలకు 30 నిమిషాల్లోపే రుణ మంజూరు సాధ్యమవుతోందని బిజినెస్‌నెక్స్ట్ సీఈఓ నిషాంత్ సింగ్ పేర్కొన్నారు.

✦ దిల్లీకి సమీపంలో ఏర్పాటు చేయబోతున్న తన ఏఐ కంప్యూటింగ్ హబ్‌లో వినియోగించేందుకు 2 బి.డాలర్ల (రూ.18000 కోట్ల)కు పైగా విలువైన ఎన్‌విడియా తాజా చిప్‌లను కొనుగోలు చేస్తున్నట్లు యోటా డేటా సర్వీసెస్ ప్రకటించింది. ఆగస్టు కల్లా వాటిని పొందనున్నట్లు తెలిపింది.

బ్యాంకుకు వెళ్లకుండానే డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్

ఐఓబీ ప్రత్యేక పోర్టల్

కుటుంబ సభ్యుడు/సభ్యురాలిని కోల్పోయిన వారు, సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాకు సంబంధించి డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం దీర్ఘకాలమైన సవాళ్లను ఎదుర్కోవడం చూస్తున్నాం. బ్యాంకుశాఖ చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) 'ఆన్‌లైన్ డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ పోర్టల్'ను తీసుకొచ్చింది.

క్లెయిమ్ చేసుకోవడం ఎలా?: ఐఓబీ ఆన్‌లైన్ డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ పోర్టల్‌లో మరణించిన ఖాతాదారు సమాచారం, క్లెయిమ్ చేసే కుటుంబ వారి వివరాలను నమోదు చేయాలి. కోరిన పత్రాలను అప్‌లోడ్ చేయాలి. తొలి దశలో https:///digital.iob.bank.in/deathclaimonline ని సందర్శించాలి. రెండో దశలో కొత్త క్లెయిమ్‌పై క్లిక్ చేయాలి. మూడో దశలో క్లెయిమ్ నామినేషన్‌తో ఉందా? లేదా అనేది ఎంచుకోవాలి. నాలుగో దశలో మొబైల్ నంబరు, ఆధార్ నంబరు నమోదు చేయాలి. తుది దశలో నిబంధనలు, షరతులను అంగీకరించాలి. రూ.15 లక్షల వరకు క్లెయిమ్‌ల కోసం బ్యాంక్ సరళీకృత విధానాన్ని అమలు చేయనుంది. దీనికి థర్డ్ పార్టీ పూచీకత్తు అవసరం లేదు. 15 రోజుల వ్యవధిలో సెటిల్‌మెంట్ పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నట్లు ఐఓబీ తెలిపింది.

నిస్సాన్ 7 సీట్ల ఎంపీవీ గ్రావిటీ

పరిచయ ధర రూ. 5.65 లక్షలు



నిస్సాన్ మోటార్ ఇండియా 7 సీట్ల బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) గ్రావిటీని ఆవిష్కరించింది. దీని పరిచయ ధర రూ.5.65 లక్షలు (ఎక్స్-షోరూమ్). 6 ఎయిర్‌బ్యాగ్‌లు, 1.0 లీటర్, 3 సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్, 5-స్పీడ్ మాన్యువల్, 5-స్పీడ్ ఈజెడ్ షిఫ్ట్ (ఏఎంటీ) ఆప్షన్లలో ఈ కారు లభ్యమవుతుంది. వేరియంట్ల వారీగా విసియా రూ.5.65 లక్షలు, అసెంటా రూ.6.59 లక్షలు, ఎన్-కనెక్టా రూ.7.20 లక్షలు, టెక్నా రూ.7.91 లక్షలు, ఎన్-కనెక్టా ఏఎంటీ రూ.7.80 లక్షలు, టెక్నా ఏఎంటీ రూ.8.49 లక్షల్లో (ఎక్స్-షోరూమ్) లభిస్తాయి. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి.

హైదరాబాద్ కేంద్రంగా ఏఐ విప్లవం

- 5 ఏళ్లలోనే రోగుల చెంతకు కొత్త ఔషధాలు
- సనోఫీ ఈవీపీ మడేలీన్ రోచ్

ఈనాడు, హైదరాబాద్: ఔషధ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు తాము సిద్ధమవుతున్నామని సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (ఈవీపీ) మడేలీన్ రోచ్ ప్రకటించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత సాయంతో ఔషధాల తయారీ కాలాన్ని సగానికి తగ్గించడమే కాకుండా, ప్రపంచంలోనే తొలి 'ఏఐ పవర్డ్ బయోఫార్మా' కంపెనీగా అవతరించడమే తమ లక్ష్యమని.. ఈ ప్రక్రియలో హైదరాబాద్ వెన్నెముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఆసియా-2026 సదస్సు రెండో రోజు ఆమె కీలకోపన్యాసం చేశారు. 'సాధారణంగా ఒక కొత్త మందు పరిశోధన నుంచి రోగులకు అందేందుకు పదేళ్ల సమయం పడుతుంది. ఏఐ సాంకేతికత వినియోగించడం ద్వారా ఈ కాలాన్ని అయిదేళ్లకు తగ్గించాలని సనోఫీ ఆశిస్తోంది. దీనికోసం సంస్థ వనరులలో 50 శాతాన్ని ఆవిష్కరణల కోసమే కేటాయిస్తున్నాం. సనోఫీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 5 ప్రధాన జీసీసీల్లో హైదరాబాద్ అత్యంత కీలకం. ఇక్కడ 2,600 కొత్త ఉద్యోగాలు కల్పించడం వల్ల, ఈ కార్యకలాపాలను విస్తరించనున్నాం' అని తెలిపారు.

మహిళా నాయకత్వంలో..: సనోఫీ హైదరాబాద్ హబ్‌ను ఒక సమర్థ మహిళా నాయకురాలు మృణాల్ దుగ్గల్ నడిపించడం గర్వకారణమని రోచ్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఉద్యోగుల్లో పీహెచ్‌డీ లేదా మాస్టర్స్ చేసిన వారే 50% మంది ఉన్నారని, వీరంతా డేటా, ఏఐ, డిజిటల్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పనిచేస్తున్నారని తెలిపారు. ఏఐ వినియోగంలో భద్రత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు రోచ్ తెలిపారు.

యూనికార్న్ దిశగా స్కైరూట్

రూ.1800 కోట్ల నిధుల సమీకరణకు సన్నాహాలు!

SKYROOT AEROSPACE

హైదరాబాద్: అంతరిక్ష రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైదరాబాద్ అంకురం స్కైరూట్ ఏరోస్పేస్.. వ్యాపార విస్తరణ, సాంకేతికత అభివృద్ధి కోసం సుమారు రూ.1,800 కోట్ల (200 మి.డాలర్ల) నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం. ఇది పూర్తయితే కంపెనీ 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9000 కోట్ల) విలువతో.. భారత తొలి స్పేస్-టెక్ యూనికార్న్‌గా అవతరించనుంది. నిధుల సమీకరణ, మైనారిటీ వాటాల విక్రయం కోసం కోటక్ మహీంద్రా క్యాపిటల్‌ను ఆర్థిక సలహాదారుగా స్కైరూట్ నియమించుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులతో ఈ సంస్థ చర్చలు తుది దశలో ఉన్నాయి. ఈ నిధుల సమీకరణ కోసం కంపెనీ కొత్త షేర్లను జారీ చేయనుంది.

హెచ్‌యూఎల్ రూ.2,000 కోట్ల పెట్టుబడులు

దిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజ సంస్థ హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) సౌందర్య, వెల్‌బీయింగ్, గృహ సంరక్షణ విభాగాల్లో తయారీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు బుధవారం వెల్లడించింది. ప్రతిపాదిత పెట్టుబడి ప్రణాళికను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదించినట్లు నియంత్రణ సంస్థలకు హెచ్‌యూఎల్ సమాచారమిచ్చింది. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వచ్చే రెండేళ్లలో ఈ పెట్టుబడులను పెడతామని సంస్థ పేర్కొంది. గృహ సంరక్షణ విభాగంలో సర్ఫ్ ఎక్సెల్, రిన్ వీల్, డొమెక్స్, విమ్, సిఫ్, కంఫర్ట్ వంటి ప్రముఖ బ్రాండ్లను హెచ్‌యూఎల్ కలిగి ఉంది.

డాక్టర్ రెడ్డీస్ చేతికి బ్రిటన్ కంపెనీ బ్రాండ్లు

బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే మెర్క్యురీ ఫార్మా గ్రూప్ ట్రేడ్‌మార్క్‌లు అయిన ప్రోగినోవా, సైక్లో ప్రోగినోవాలతో పాటు సంబంధిత ఆస్తులను డాక్టర్ రెడ్డీస్ 32.15 మిలియన్ డాలర్ల (సుమారు రూ.290 కోట్ల)కు కొనుగోలు చేసింది. ఇందువల్ల తమ గైనకాలజీ పోర్ట్‌ఫోలియో బలోపేతం అవుతుందని, హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ విభాగంలోకి ప్రవేశిస్తున్నామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

కోహాన్స్ లైఫ్‌లో 1.8% వాటా విక్రయం

కోహాన్స్ లైఫ్‌సైన్సెస్‌లో 1.8% వాటాకు సమానమైన 70 లక్షల షేర్లను జాస్తి ఫ్యామిలీ ట్రస్ట్ విక్రయించింది. షేరు రూ.309 చొప్పున బ్లాక్‌డీల్‌లో జాసుబ్ ప్రాపర్టీ హోల్డింగ్స్‌కు ఈ వాటా విక్రయం వల్ల జాస్తి ఫ్యామిలీ ట్రస్టుకు రూ.216 కోట్లు లభించాయి. గత డిసెంబరు చివరకు కోహాన్స్ లైఫ్‌లో జాస్తి ఫ్యామిలీ ట్రస్ట్‌కు 6.4% వాటా ఉంది.

కోడి గుడ్డు

19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లకు రూపాయల్లో)

హైదరాబాద్	520
వరంగల్	522
విజయవాడ	525
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593

ఆవిష్కరణల కేంద్రాలుగా జీసీసీలు



ఈనాడు, హైదరాబాద్: 'ప్రపంచ ఫార్మా, జీవ శాస్త్ర రంగంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ)లు సరికొత్త అధ్యాయాన్ని రచిస్తున్నాయి. వ్యయ నియంత్రణ కేంద్రాలుగా పరిగణించే స్థాయి నుంచి, అంతర్జాతీయ ఆవిష్కరణలకు వ్యూహాత్మక శక్తులుగా ఇవి రూపాంతరం చెందుతున్నాయి' అని నిపుణులు పేర్కొన్నారు. బయో ఆసియా 2026 సదస్సులో భాగంగా నిర్వహించిన 'బిల్డింగ్ ఇన్నోవేషన్- ఫస్ట్ జీసీసీస్: ఆర్అండ్‌డీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పలు కీలక విషయాలను వెల్లడించారు.

ఆవిష్కరణలకు ఏఐ ప్రాణం పోస్తోందని చర్చకు సమన్వయకర్తగా వహించిన హెల్త్‌ఆర్క్ వ్యవస్థాపకుడు, సీఈఓ పురవ్ గాంధీ అన్నారు. ఎంఎస్‌డీ చీఫ్ ఏఐ ఆఫీసర్ ఆంటోన్ గ్రూమ్ కీలకోపన్యాసం చేస్తూ.. సంస్థాగతంగా కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడం ద్వారా, ఔషధ అణువుల ఆవిష్కరణను వేగవంతం చేయొచ్చని పేర్కొన్నారు. సెమాంటిక్ డేటా లేయర్స్, జనరేటివ్ ఏఐ మోడల్స్ ద్వారా దశాబ్దాల పరిశోధనా సమాచారాన్ని విశ్లేషించి, క్లినికల్ పరిశోధనా పత్రాలను సులభతరం చేయొచ్చని వివరించారు. నోవార్టిస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గేల్ హార్వుడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న బృందాలు ఏఐ ఆధారిత ఇంజిన్లను తయారు చేస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికాలోని రోగులకు, వైద్యులకు మెరుగైన అనుభవాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. భారత్‌లో తమ ఆవిష్కరణల కేంద్రాలను విస్తరిస్తున్నట్లు టాకెడా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ పటేల్, ఒలింపస్ కార్పొరేషన్ సీటీఓ సయ్యద్ నవీన్ వెల్లడించారు. హైదరాబాద్‌లో అపారమైన ప్రతిభ, డిజిటల్ నైపుణ్యాలు అందుబాటులో ఉన్నాయని, జీసీసీల వృద్ధికి ఇవి ఎంతో కీలకమని ఆమ్జెన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సోమ్ ఛటోపాధ్యాయ, యూనీల్యాబ్స్ గ్రూప్ సీఈఓ బద్రి శ్రీనివాసన్ వెల్లడించారు.

రోగి సంక్షేమమే లక్ష్యంగా..



ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ రంగంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) సహాయక కేంద్రాలుగా మాత్రమే కాకుండా, రోగికి నేరుగా ప్రయోజనం చేకూర్చే వ్యూహాత్మక భాగస్వాములుగా ఉంటున్నాయని నిపుణులు తెలిపారు. బయో ఆసియాలో భాగంగా 'రోగులకు మేలు చేసే దిశగా జీసీసీల పరివర్తన' అంశంపై చర్చ నిర్వహించారు. సమన్వయకర్త, కేపీఎంజీ పార్ట్‌నర్ షాలిని పిళ్లై మాట్లాడుతూ.. పెరుగుతున్న వృద్ధుల జనాభా, ఆరోగ్య నిపుణుల కొరత, కఠినతరమవుతున్న నిబంధనలు, ధరల నియంత్రణ వంటి అంశాలు ఆరోగ్య పరిశ్రమను ప్రభావితం చేస్తుంటే, కృత్రిమ మేధ వల్ల వినూత్న మార్పులు వస్తున్నాయని తెలిపారు.

నోవో నార్డిస్క్ వైస్ ప్రెసిడెంట్ ఆనంద్ జైన్ మాట్లాడుతూ తమ భారతీయ కేంద్రాలు అంతర్జాతీయ స్థాయిలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయని వివరించారు. ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ శివ కుమార్ పద్మనాభన్ మాట్లాడుతూ.. కణ, జన్యు చికిత్సల వంటి ఆధునిక పద్ధతులకు భారత్‌లోని జీసీసీలు జీవనాడిగా పనిచేస్తున్నాయని తెలిపారు. వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) ద్వారా.. క్లినికల్ ట్రయల్స్ ఎలా ఉంటాయో చూపుతున్నామని.. ఇది రోగులలో భయాన్ని పోగొట్టి, చికిత్సపై అవగాహన పెంచుతుందని వివరించారు. క్లినికల్ పరీక్షల ఫలితాలను విశ్లేషించే సమయాన్ని 30 వారాల నుంచి ఏఐ సాయంతో 6 వారాలకు తగ్గించగలిగామని ఎలి లిల్లీ సర్వీసెస్ ఇండియా ఏవీపీ మనీష్ అరోరా తెలిపారు. బెక్టన్ డికిన్సన్ టెక్నాలజీ క్యాంపస్ సీనియర్ డైరెక్టర్ శ్రీనివాస్ పెద్ది మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని టి-హబ్, టీ-వర్క్స్ వంటి వ్యవస్థల వల్ల నమూనాల రూపకల్పన ప్రక్రియ 5 నెలల నుంచి రోజులకు తగ్గిందని పేర్కొన్నారు. ఓపెల్లా హెల్త్‌కేర్ డిజిటల్ జీసీసీ హెడ్ ఈషా జునేజా మాట్లాడుతూ.. సరఫరా వ్యవస్థ విశ్లేషణ, ఇ-కామర్స్, డేటా అనలిటిక్స్ వంటి అంశాల్లో భారత్ కేంద్రంగా నవకల్పనలు జరుగుతున్నాయని తెలిపారు.

సుస్థిర అభివృద్ధికి కార్పొరేట్ సంస్థల కృషి

హురున్-పెర్పెచువల్ నివేదిక



ఈనాడు, హైదరాబాద్: ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనకు భారత కార్పొరేట్ సంస్థలు కృషి చేస్తున్నాయని హురున్-పెర్పెచువల్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. బుధవారం హైదరాబాద్‌లో 'పెర్పెచువల్ క్యాపిటల్ హురున్ ఇండియా ఇంపాక్ట్ 50-2026' నివేదిక విడుదలైంది.

ఈ కంపెనీలన్నీ: వాతావరణ అనుకూలం, నీటి వినియోగం, లింగసమానత్వం వంటి విభాగాల్లో అత్యుత్తమ పనితీరుతో హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉద్గారాల తగ్గింపు, పర్యావరణహిత డిజిటల్ పరిష్కారాల్లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రెండో స్థానంలో నిలిచింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి సుస్థిరతలోనూ తన ప్రత్యేకత చాటుకుంది. జాబితాలోని 50 కంపెనీల్లో 26 ముంబయి కేంద్రంగానే ఉన్నాయి. పుణె, అహ్మదాబాద్ నగరాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, దివీస్ ఈ జాబితాలో స్థానం సంపాదించాయి. పరిశ్రమల పరంగా చూస్తే.. గనుల రంగం నుంచి 7 కంపెనీలు, సాఫ్ట్‌వేర్, ఎనర్జీ, వినియోగ రంగాల నుంచి మిగతా కంపెనీలున్నాయి. పర్యావరణంతో పాటు సామాజికాంశాల్లోనూ ఈ 50 కంపెనీలు చొరవ చూపుతున్నాయి. రూ.8,000 కోట్లకు పైగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో, సుమారు 20 కోట్ల మందిపై ఇవి ప్రభావం చూపిస్తున్నాయి. దాదాపు 4.7 లక్షల మంది మహిళలకు ఉపాధి కల్పించాయి. కంపెనీ బోర్డుల్లో 109 మంది మహిళా ప్రతినిధులు ఉన్నారు. 7,000 మందికి పైగా దివ్యాంగులకు ఈ సంస్థలన్నీ కలిపి ఉపాధి కల్పించాయి.

పెర్పెచువల్ క్యాపిటల్ పార్ట్‌నర్ అన్విత ప్రశాంత్ మాట్లాడుతూ.. జాబితాలోని 25 కంపెనీలు లింగస మానత్వంపై స్పష్టంగా ఉండటం సంతోషకరమని తెలిపారు. మరో పార్ట్‌నర్ ప్రణవ్ ప్రశాంత్ స్పందిస్తూ.. సుస్థిరత అనేది ఇప్పుడు కార్పొరేట్ సంస్థల ప్రధాన వ్యాపార వ్యూహంగా మారిందని పేర్కొన్నారు. హురున్ ఇండియా వ్యవస్థాపకుడు అనస్ రెహమాన్ జునైద్ మాట్లాడుతూ.. సుస్థిరత కాగితాలకే పరిమితం కాకుండా, కంపెనీల ఆచరణలో కనిపిస్తోందని పేర్కొన్నారు.

ఎన్‌విడియాతో ఎన్‌పీసీఐ భాగస్వామ్యం

దిల్లీ: అమెరికా టెక్ దిగ్గజ సంస్థ ఎన్‌విడియాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. భారత చెల్లింపుల వ్యవస్థ కోసం ప్రత్యేకంగా రూపొందించిన తమ ఏఐ మోడల్ సామర్థ్యాలను విస్తరించడానికి, మెరుగుపరచడానికి ఎన్‌విడియాతో కలిసి పనిచేయనున్నట్లు ఎన్‌పీసీఐ తెలిపింది. భారీ స్థాయి, రియల్ టైమ్ చెల్లింపు వ్యవస్థల మారుతున్న అవసరాలకు ఈ భాగస్వామ్యం తోడ్పాటు ఇస్తుందని, నమ్మకం, స్థిరత్వం కలిగిన భద్రమైన వ్యవస్థలను అందిస్తుందని ఎన్‌పీసీఐ వెల్లడించింది. భారీ జనాభాకు చెల్లింపు సేవలను అందించడంలో ఎన్‌పీసీఐకు ఉన్న అనుభవం, ఎన్‌విడియా అధునాతన ఏఐ, కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను ఈ భాగస్వామ్యం అనుసంధానించనుంది. ఈ ఒప్పందంలో భాగంగా.. ఎన్‌విడియాకు చెందిన 'నెమోట్రాన్' ఓపెన్ మోడళ్లను ఎన్‌పీసీఐ వినియోగించనుంది. దీని ద్వారా చెల్లింపుల రంగానికి అవసరమైన 'ఫౌండేషన్ ఏఐ మోడల్'ను అభివృద్ధి చేస్తారు. ఎన్‌పీసీఐ ఇటీవల పైలట్ ప్రాజెక్టుగా 'యూపీఐ హెల్ప్ అసిస్టెంట్'ను ప్రవేశపెట్టింది. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంలో ఇది సహాయపడుతుంది. దీనికి ఫిమీ (ఫైనాన్షియల్ మోడల్ ఫర్ ఇండియా), ఫైన్ ట్యూన్డ్, ప్రీ-ట్రైన్డ్ స్మాల్ ల్యాంగ్వేజ్ మోడల్ (ఎస్ఎల్ఎం) తోడ్పాటు అందిస్తుంది.

అమెరికా కోకింగ్ కోల్ దిగుమతి చేసుకుందాం

వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



దిల్లీ: మన దేశం ముడి చమురు, కోకింగ్ కోల్ వంటి వనరులను వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అమెరికా నుంచి అధిక నాణ్యత కలిగిన కోకింగ్ కోల్ దిగుమతి చేసుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) అప్లికేషన్ల కోసం గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూలు), డేటా కేంద్రాల కోసం పరికరాలు, అధిక పనితీరు కలిగిన కంప్యూటింగ్ కూడా అమెరికా నుంచి దిగుమతి అవుతాయని వివరించారు.

పవర్ మెక్‌కు రూ.1,000 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల సంస్థ పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, థర్మల్ విద్యుత్ విభాగంలో రూ.1,000 కోట్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకుంది. మిర్జాపూర్ థర్మల్ ఎనర్జీ (యూపీ) నుంచి రూ.515 కోట్లు, మహాన్ ఎనర్జెన్ నుంచి రూ.490 కోట్ల కాంట్రాక్టులు లభించాయి.

రూ.2.50 లక్షల పైకి కిలో వెండి

ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు బుధవారం మళ్లీ పెరిగాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.55 గంటలకు ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 99 డాలర్లు పెరిగి 4,977 డాలర్లకు, ఔన్సు వెండి ధర 3 డాలర్లు అధికమై 77 డాలర్లకు చేరాయి. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,59,300, కిలో వెండి ధర రూ.2,50,500 వద్ద స్థిరపడ్డాయి.

ఆఖర్లో కొనుగోళ్ల వెల్లువ

సెన్సెక్స్ ▲283 83734 | నిఫ్టీ ▲94 25819

- సూచీలకు కొనసాగిన లాభాలు
- మెరిసిన బ్యాంకింగ్, లోహ షేర్లు

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.1154.34 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు... రూ.404.34 కోట్లు

ట్రేడింగ్ చివర్లో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో వరుసగా మూడో రోజూ స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. బ్యాంకింగ్, లోహ, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసివచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 4 పైసలు పెరిగి 90.68 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 2.43% పెరిగి 69.05 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.90 లక్షల కోట్లు పెరిగి రూ.472.01 లక్షల కోట్ల (5.21 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

మధ్యాహ్నం వరకు నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ 83,553.59 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో (క్రితం ముగింపు 83,450.96) ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒక దశలో 83,163.62 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. మధ్యాహ్నం తర్వాత తిరిగి లాభాల్లోకి వచ్చిన సూచీ చివరకు 283.29 పాయింట్ల లాభంతో 83,734.25 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 93.95 పాయింట్లు పెరిగి 25,819.35 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,828.05 వద్ద గరిష్ఠాన్ని; 25,645.15 వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

19 రాణించాయ్: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 11 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 2.9%, ఐటీసీ 2.21%, యాక్సిస్ బ్యాంక్ 1.47%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.3%, ఎంఅండ్ఎం 1.18%, ఎల్అండ్‌టీ 1.06% పెరిగాయి. ఎటెర్నల్ 1.53%, టెక్ మహీంద్రా 1.34%, ఇన్ఫోసిస్ 1.27%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.06%, అదానీ పోర్ట్స్ 1% నష్టపోయాయి.

సిగరెట్ కంపెనీల షేర్ల జోరు

ఎక్సైజ్ సుంకం పెంపును వినియోగదార్లకు బదిలీ చేసే నిమిత్తం, సిగరెట్ ధరలను కంపెనీలు పెంచుతున్నట్లు వార్తలు రావడంతో గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేరు 20%, ఐటీసీ 2.21%, వీఎస్‌టీ ఇండస్ట్రీస్ షేరు 2.97% లాభపడ్డాయి.

ఎస్ఏటీఆర్ఏసీ..తయారీ కేంద్రం

టిప్పర్‌లు, ట్రక్కులు లాంటి వాణిజ్య వాహనాలకు బాడీ- బిల్డింగ్ చేసే సంస్థ ఎస్ఏటీఆర్ఏసీ.. తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ వద్ద భారీ తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. లాజిస్టిక్స్, మౌలిక, పారిశ్రామిక, ప్రభుత్వ రంగాల్లో పెరుగుతున్న రవాణా గిరాకీ అవసరాలను తీర్చేందుకు ఈ కొత్త కేంద్రం ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది.

రూ.2500 కోట్లతో ఫెడెక్స్ కార్గో హబ్

నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 3,00,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో పూర్తి స్థాయి ఆటోమేటెడ్ కార్గో హబ్‌ను ఫెడెక్స్ ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ.2,500 కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. ఈ హబ్ కార్యకలాపాలు ప్రారంభమైతే.. లాజిస్టిక్స్, గిడ్డంగులు, రవాణా తదితర రంగాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6,000 మందికి ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది.



ఓపెన్ ఏఐతో భాగస్వామ్యాలు

ప్రయాణ ప్లాట్‌ఫామ్‌లపై కృత్రిమ మేధ అనుసంధానాన్ని వేగవంతం చేసేందుకు ఓపెన్ ఏఐతో భాగస్వామ్య ఒప్పందాన్ని ఇక్సిగో కుదుర్చుకుంది. ఇక్సిగోతో పాటు కన్‌ఫర్మ్‌టికెట్, అభిబస్ లాంటి సంస్థలకు ఏఐ అనుసంధానం విషయంలో ఈ ఒప్పందం ఉపయోగపడనుంది.

✦ ప్రయాణాల కోసం జరిపే విచారణల ఆధారంగా. ఏ ప్రదేశానికి వెళ్లేందుకు అధిక విచారణలు వస్తున్నాయనే విషయాన్ని తెలుసుకునేందుకు కృత్రిమ మేధను మేక్‌మైట్రిప్ ఉపయోగించుకోనుంది. ఇందుకుగాను ఓపెన్‌ఏఐతో ఆ సంస్థ జట్టుకట్టింది. అధిక విచారణలు ఏ ప్రదేశానికి వస్తున్నాయో తెలుసుకోవడం ద్వారా, వాటిని బుకింగ్‌లుగా మార్చుకునేందుకు ప్రయత్నించడమే ఈ ఒప్పందం వెనక సంస్థ లక్ష్యం.



సభా సమయం

దేవుడితో రాజకీయాలు చేయడం వైకాపా వారికి వెన్నతో పెట్టిన విద్య

- నెయ్యి కల్తీపై చర్చిద్దామంటే... ఇందాపూర్ అంటారేంటి..?
- ఏ దేవాలయానికీ 'హెరిటేజ్' నెయ్యి సరఫరా చేయలేదు
- సంబంధం లేని వ్యక్తులు..సంస్థలపై బురద జల్లాలని వైకాపా చూస్తోంది
- హోంమంత్రి అనిత, శాసనమండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ ధ్వజం



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మంత్రి అనిత. చిత్రంలో తెదేపా ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, బీద రవిచంద్ర, అనురాధ, రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, కావలి గ్రీష్మ, వేపాడ చిరంజీవిరావు తదితరులు

ఈనాడు, అమరావతి: దేవుడితో రాజకీయాలు చేయడం వైకాపా వారికి వెన్నతో పెట్టిన విద్య అని హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. దేవుడంటే భయం, భక్తి వారికి లేవని మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన అంశంపై చర్చిద్దామంటే..వైకాపా ఎమ్మెల్సీలు మాత్రం 'ఇందాపూర్ డెయిరీ' అంటూ విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధం లేని వ్యక్తులు, సంస్థల పేర్లు ప్రస్తావిస్తూ ప్రభుత్వం మీద బురద జల్లాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. 'హెరిటేజ్ డెయిరీ ఇప్పటి వరకూ ఏ దేవాలయానికీ, సంస్థకూ నెయ్యి సరఫరా చేయలేదని స్పష్టం చేశారు. ఇందాపూర్ డెయిరీ నుంచి చీజ్, స్కిమ్డ్ మిల్క్, పన్నీర్ మాత్రమే హెరిటేజ్ కొనుగోలు చేసిందన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ సహా తెదేపా ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తదితరులతో కలిసి బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'నెయ్యి కల్తీపై ఏ చర్చకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కల్తీ జరిగినట్టు నాలుగు రిపోర్టులు స్పష్టం చేశాయి. ఈ విషయాన్ని వైకాపా నేత వైవీ సుబ్బారెడ్డి కూడా అంగీకరించారు. రూ.240 కోట్ల అవినీతి జరిగిందని సీబీఐ ఛార్జిషీటులో పేర్కొంది. వీటన్నింటిపై చర్చిద్దామంటే వైకాపా వారు సంబంధం లేని విషయాలు ప్రస్తావిస్తూ రెండు రోజులుగా మండలిలో రాద్ధాంతం చేస్తున్నారు' అని అనిత మండిపడ్డారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటనను విలేకరులు ప్రస్తావించగా...నిందితుడు గంజాయి మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని...తర్వాత మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడించారు.

మండలిని ఆర్డర్‌లో పెట్టడంలో ఛైర్మన్ విఫలం

శాసన మండలిని ఆర్డర్‌లో పెట్టడంలో ఛైర్మన్ విఫలమయ్యారని అనురాధ మండిపడ్డారు. 'కల్తీ నెయ్యి వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే 'హెరిటేజ్, ఇందాపూర్' పేర్లను వైకాపా వారు తీసుకొచ్చి రాద్ధాంతం చేస్తున్నారు. ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్‌కు కో-మాన్యుఫ్యాక్చరింగ్ లొకేషన్. మనీ లాండరింగ్ కేసుల్లో ఇరుక్కున్న జగన్‌రెడ్డికి మినిమమ్ బిజినెస్ ప్యాటర్న్స్ కూడా తెలియవా? వారి పార్టీ నుంచి ఎన్ని వాయిదా తీర్మానాలు వస్తున్నాయో కూడా శాసనమండలి విపక్ష నేతకు తెలియదు' అని పంచుమర్తి అనురాధ ఎద్దేవా చేశారు.

ఒకే పార్టీ.. రెండు వాయిదా తీర్మానాలు

- రెండో రోజూ మండలిలో వైకాపా గందరగోళం
- పోడియంలోకి చొచ్చుకెళ్లి నిరసన
- ఎలాంటి చర్చ లేకుండా సభ గురువారానికి వాయిదా

ఈనాడు, అమరావతి: తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారం రెండో రోజూ శాసనమండలిని కుదిపేసింది. ఈ అంశంపై చర్చించేందుకు వైకాపా సభ్యులు రెండు వేర్వేరు వాయిదా తీర్మానాలను బుధవారం సభలో ప్రవేశపెట్టారు. ఒకే పార్టీ రెండు వేర్వేరు తీర్మానాలు అందించడం గమనార్హం. తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చర్చించేందుకు ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి.. ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానానికి(తితిదే) నెయ్యి సరఫరా అంశంపై చర్చించేందుకు వైకాపా ఎమ్మెల్సీలు రమేష్‌యాదవ్, కె.ఆర్.జె భరత్, సిపాయి సుబ్రమణ్యంలు వాయిదా తీర్మానాలు సభలో ప్రవేశపెట్టారు. ఆ రెండింటినీ ఛైర్మన్ మోషేనురాజు తిరస్కరించారు. వైకాపా నుంచి గెలుపొందిన కల్యాణచక్రవర్తి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. కానీ, అది ఇప్పటికీ ఆమోదం పొందకపోవడంతో సాంకేతికంగా ఆయన వైకాపా సభ్యుడిగా సభలో కొనసాగుతున్నారు. వాయిదా తీర్మానాల తిరస్కరణతో వైకాపా సభ్యులు నినాదాలు, నిరసనలతో సభలో గందరగోళం సృష్టించారు. మూకుమ్మడిగా పోడియంలోకి చొచ్చుకెళ్లారు. దీంతో 10.03 గంటలకు ప్రారంభమైన సభను ఛైర్మన్ మోషేనురాజు 10.12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం 1.04 గంటలకు ప్రారంభమైన తర్వాత కూడా వైకాపా సభ్యులు ఆందోళన కొనసాగించారు. ఒకసారి తిరస్కరించిన వాయిదా తీర్మానాలను మళ్లీ అనుమతించేది లేదని ఛైర్మన్ ఎంతగా చెబుతున్నా వారు పట్టించుకోలేదు. నిరసనల మధ్యే కాపు సామాజికవర్గానికి బీసీ హోదా కల్పించాలంటూ ఎమ్మెల్సీ నాగేంద్రరావు ఇచ్చిన ప్రశ్నను సభ్యుడు ఉపసంహరించుకున్నట్లు ఛైర్మన్ సభకు తెలిపారు. చివరికి సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు మధ్యాహ్నం 1.09 గంటలకు ప్రకటించారు. మొత్తంగా 14 నిమిషాల పాటే సభ నిర్వహణ సాధ్యమైంది.

దేవుడిపై వైకాపా సభ్యులకు భక్తి లేదు: మంత్రి అనిత

దేవుడిపై వైకాపా సభ్యులకు భక్తి లేదు. దేవుడిని కూడా రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంలో రూ.240 కోట్ల ముడుపులు ఆ పార్టీ నేతలకు ముట్టాయి. ఇలాంటి వాళ్లు దేవుడికి సంబంధించిన విషయాన్ని సభలో ప్రస్తావిస్తున్నారు. సభ సమయం మాకు చాలా విలువైంది. ఈరోజంతా వైకాపా ఎమ్మెల్సీలు వృథా చేశారు. ఎలాంటి చర్చకైనా సిద్ధమని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

ప్రశ్నోత్తరాలు నిర్వహించాలనే ఆలోచన లేదా?

– మంత్రి పయ్యావుల కేశవ్



సభ్యులకు ప్రశ్నోత్తరాలు నిర్వహించాలన్న ఆలోచన లేనట్లుంది. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

సమస్యలు చర్చించనివ్వకుండా అడ్డుకుంటున్నారు

– గాదె శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ



"ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు మండలిలో చర్చించనివ్వకుండా వైకాపా సభ్యులు అడ్డుకుంటున్నారు. అత్యంత కీలకమైన బడ్జెట్‌పై చర్చ నడవనివ్వకుండా రెండు రోజులుగా మండలికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. మెజారిటీ సభ్యులున్నారని ఇలా వ్యవహరించడం సరికాదు'.

నిజాలు తెలియాలనే వాయిదా తీర్మానం ఇచ్చాం

ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణచక్రవర్తి



ఈనాడు, అమరావతి: కల్తీ నెయ్యి అంశంలో ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలనే మండలిలో వాయిదా తీర్మానం ఇచ్చినట్లు ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణచక్రవర్తి తెలిపారు. ఈ అంశంపై చర్చకు ఛైర్మన్ నిరాకరించడం సరైన పద్ధతి కాదన్నారు. సంబంధం లేని హెరిటేజ్ అంశాన్ని పట్టుకొని వ్యక్తిగత ఎజెండాతో వైకాపా వారు మండలిని స్తంభింపజేయడం సరికాదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం వీరు విలేకరులతో మాట్లాడారు. 'మేం ఎప్పుడో వైకాపాకు రాజీనామా చేశాం. ఇప్పటికీ మా రాజీనామా అంగీకరించలేదు. గతంలో ఛైర్మన్ మమ్మల్ని పిలిచి మాట్లాడారు. మళ్లీ పిలిచినా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. మండలి దృష్టిలో మేం వైకాపా సభ్యులమా.. కాదా' అని రాజశేఖర్ ప్రశ్నించారు. 'ఛైర్మన్ మండలిని నడిపించే పరిస్థితి లేదు. మేం వైకాపా సభ్యులం కాదని మండలిలో విపక్ష నేత చెబుతున్నారు. అలాంటప్పుడు మాకు వారి వెనక ఎందుకు సీట్లు కేటాయించారు?' అని కల్యాణచక్రవర్తి పేర్కొన్నారు.

లడ్డూ తయారీలో దేవుడి సొమ్ము దోపిడీపై చర్చ జరగాలి

- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



ఈనాడు, అమరావతి: 'తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యి కల్తీ అయ్యిందని.. పంది కొవ్వు, గొడ్డు కొవ్వు కలిశాయని నిందలు వేసిన చంద్రబాబు. . దేవదేవుడి ప్రసాదం రూపంలో ఎలా దోచుకుంటున్నారో తేలాలి. కిలో రూ.320కి కొనాల్సిన నెయ్యిని, హెరిటేజ్‌తో సంబంధాలున్న ఇందాపూర్ డెయిరీ ద్వారా రూ.700కి సరఫరా చేస్తూ ఎలా దోచుకుతింటున్నారో తెలియాలి. ఈ అంశంపై మండలిలో చర్చ జరగాలి. జరిగిన మోసమేంటో ప్రజలకు తెలియాలి' అని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'ఇందాపూర్ డెయిరీతో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు సంస్థలకు ఉన్న అనుబంధంపై ప్రశ్నిస్తే తితిదేతో వివరణ ఇప్పించారు. దానికి బదులు సభలోనే చర్చించొచ్చు కదా? ప్రభుత్వంలో ఉన్నవారు ఇలాంటి తప్పులు చేస్తే. . అధికారంలో కొనసాగే హక్కు ఉందా? కూటమి ప్రభుత్వానికి ఒక్కరోజూ అధికారంలో కొనసాగే హక్కు లేదు' అని బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు.

రెడ్, ఎల్లో కాదు... బ్లూ బుక్: 'మంత్రి లోకేశ్ మీద నాకు ప్రేమ, కోపం లేవు. ఆయన ఇప్పుడిప్పుడే రాజకీయాల్లో ఎదుగుతున్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్, ఎల్లో బుక్ కాకుండా బ్లూ బుక్ రాజ్యాంగం నడిస్తే బాగుంటుంది' అని బొత్స సత్యనారాయణ అన్నారు. కాపులను బీసీల్లో చేర్చాలనే అంశంపై శాసన మండలిలో తొలుత ప్రశ్న వేసిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు.. తర్వాత ఎందుకు ఆ ప్రశ్నను ఉపసంహరించుకున్నారని ప్రశ్నించారు.

వాళ్లు మా పార్టీలో లేరు

వైకాపా నాయకులకు ఒక స్టాండ్ లేదా? మండలిలో వైకాపా రెండు రకాల తీర్మానాలు ప్రవేశపెట్టిందేమని ఒక విలేకరి అడిగిన ప్రశ్నపై బొత్స స్పందిస్తూ మర్రి రాజశేఖర్, బల్లి కల్యాణ చక్రవర్తి తమ పార్టీలో లేరని, తెదేపాలో చేరారని సెల్‌ఫోన్‌లో ఫొటో చూపించారు. వాళ్ల తీర్మానంతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

- 'లడ్డూ విషయంలో చంద్రబాబు దేవుడ్ని, ప్రజలను మోసం చేశారు. తప్పులు వాళ్లు చేసి వైకాపాపై బురద జల్లారు. లడ్డూకు వాడే నెయ్యిపై వాయిదా తీర్మానం ఇస్తే చర్చించడానికి ఎందుకు భయపడుతున్నారు?' అని వైకాపా ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వరుదు కల్యాణి, కల్పలతా రెడ్డి, తోట త్రిమూర్తులు ప్రశ్నించారు.

సభలో రెండోరోజూ పలకని మైకులు

ఈనాడు, అమరావతి: శాసనసభలో వరుసగా రెండోరోజు కూడా మైక్ సిస్టం మొరాయింపు కొనసాగింది. బుధవారం ఉదయం సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు దీనిపై ప్రకటన చేశారు. ఆడియో సిస్టమ్‌లో సాంకేతిక సమస్య పరిష్కారానికి రాత్రంతా ప్రయత్నం చేయగా, కొంతమేరకు పరిష్కారం అయిందని చెప్పారు. టెక్నీషియన్ ముంబయి నుంచి వస్తున్నారని తెలిపారు. సభాపతి ఎవరి పేరు పిలిస్తే, వాళ్లు తమ టేబుల్‌పై ఉన్న మైక్ బటన్ నొక్కి మాట్లాడాలని సూచించారు. ప్రశ్నోత్తరాలు, శూన్యగంటలో కొందరు ఎమ్మెల్యేలు మాట్లాడుతున్న సమయంలో వారి టేబుల్ వద్ద మైకులు సరిగ్గా పనిచేయకపోవడంతో సిబ్బంది వెళ్లి కార్డ్‌లెస్ మైకులు ఇచ్చారు.

జీరో అవర్‌లో బడ్జెట్‌లో ప్రసంగం

శూన్యగంటలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా.. ఆయన తన నియోజకవర్గ పరిధిలో సమస్యపై ప్రస్తావించకుండా, బడ్జెట్‌పై ప్రసంగం మొదలుపెట్టారు. కొంతసేపటికి అది గుర్తించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. ఇది శూన్యగంట అని గుర్తుచేశారు. దీంతో తాను బడ్జెట్‌పై ప్రసంగానికి అవకాశం ఇచ్చారని భావించి మాట్లాడానని శ్రీనివాస్ తెలిపారు.

61 నియోజకవర్గాల్లో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు

- పీపీపీ విధానంలో నిర్మించేందుకు ప్రతిపాదన
- శాసనసభలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 50 పడకల లోపు ఆసుపత్రులున్న నియోజకవర్గాలను గుర్తించి, అక్కడ పీపీపీ విధానంలో 100 పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించాలని ప్రతిపాదించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇందుకోసం తొలి దశలో 61 నియోజకవర్గాలను గుర్తించినట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆసుపత్రుల ఉన్నతీకరణపై ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, ముప్పిడి వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జ్యోతుల నెహ్రూ, వెనిగండ్ల రాము అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. '30 పడకల నుంచి 50కి, 50 నుంచి 100 పడకలకు ఆసుపత్రుల ఉన్నతీకరణకు 39 ప్రతిపాదనలు వచ్చాయి. అవి ఆర్థిక శాఖ ముందున్నాయి. హైవేలపై ప్రతి 100 కి.మీ.కు ట్రామా కేర్ సెంటర్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు వాటిని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో రూ.600 కోట్లతో 24 జిల్లాల్లో క్రిటికల్ కేర్ బ్లాకుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదనంగా మరో నాలుగు జిల్లాలకు వీటిని ప్రతిపాదించాం' అని వెల్లడించారు.

22ఏ నుంచి భూముల తొలగింపు సరళతరం

– రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



రాష్ట్రంలో పెద్దఎత్తున భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని, అందులో నుంచి ప్రైవేటు వాటిని తొలగించే ప్రక్రియను మరింత సరళతరం చేస్తామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. శాసనసభలో మంత్రి మాట్లాడుతూ.. 'సీఎం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో నేను, స్పెషల్ సీఎస్, సీసీఎల్ఏతో బృందంగా ఏర్పడి, సమీక్షలు చేస్తూ.. సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రతి కలెక్టర్ రెవెన్యూ క్లినిక్‌లు, స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నారు. నిషేధిత జాబితా భూములపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఈ ప్రక్రియలో ఇన్‌ఛార్జి మంత్రులు కూడా భాగస్వాములవుతున్నారు' అని వివరించారు. అంతకుముందు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రామన్నపాలెం గ్రామంలో జమీందారి వ్యవస్థను రద్దుచేసే క్రమంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న వందలాది ఎకరాలపై సమగ్ర సర్వే చేయాలన్నారు. అనేక నివాస ప్రాంతాలను '22ఏ' లో చేర్చారని, దాన్నుంచి వాటిని తొలగించాలని కోరారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ.. విశాఖ జిల్లాలో 1978, 1979లలో ఇద్దరు మాజీ సైనికులకు ఇచ్చిన భూములను వంక పోరంబోకుగా చూపి, నిషేధిత జాబితాలో పెట్టారని.. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సమగ్ర డ్రెయిన్ సిస్టమ్ ప్రాజెక్టు

– వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో డ్రెయిన్ల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో అవి పూడికతో నిండిపోయాయని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సమగ్ర డ్రెయిన్ సిస్టమ్ ప్రాజెక్టు చేపట్టేందుకు వీలుగా సర్వే చేయిస్తున్నట్లు చెప్పారు. ఏదైనా బ్యాంకు సహకారంతో ఆయా డ్రెయిన్లను బాగు చేయిస్తామని ప్రకటించారు. శాసనసభలో రాజోలు ఎమ్మెల్యే దేవవర ప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని 9 గ్రామాలు, రాజోలు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లో పెద్దఎత్తున కొబ్బరి చెట్లు ఎండిపోయి, పడిపోయాయి. ఒక్కో చెట్టుకు రూ.వెయ్యి చొప్పున పరిహారం ఇచ్చేందుకు రూ.10 కోట్లతో ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపాం. వయసు మీరిన కొబ్బరి చెట్ల స్థానంలో కొత్తవి నాటేందుకు కేంద్ర ప్రభుత్వం పథకం తీసుకొచ్చింది. ఈ ప్రాంతంలో ఆ పథకాన్ని అమలు చేస్తాం' అని వెల్లడించారు.

బడ్జెట్‌పై ఎమ్మెల్యేలు ఏమన్నారంటే?

ఈనాడు-అమరావతి: బడ్జెట్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు శాసనసభలో బుధవారం మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వీలుగా ప్రభుత్వం బడ్జెట్ రూపొందించినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించినట్లు వివరించారు.

ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులివ్వాలి

సుజనా చౌదరి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే



'ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. నిధుల కొరత కారణంగా సమస్యల పరిష్కారం కష్టమవుతోంది. నియోజకవర్గానికి రూ.2 కోట్లు ఇచ్చి 1:5 నిష్పత్తిలో మరో రూ.8 కోట్లు ప్రభుత్వేతర సంస్థ(ఎన్‌జీవో)ల నుంచి సేకరించాలని ఎమ్మెల్యేలకు సూచించేలా ప్రత్యేక విధానం తెస్తే బాగుంటుంది. దీనివల్ల ప్రభుత్వం ప్రకటించిన పీ4 కార్యక్రమం కూడా విజయవంతమవుతుంది. పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేయిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం. మైనింగ్ తవ్వకాలపై మైనింగ్ కార్పొరేషన్ ద్వారా ఇంటర్నేషనల్ టెండరింగ్ చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. రాష్ట్ర బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యమిచ్చారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలపరిచేలా దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలతో రూపొందించారు'

అన్ని వర్గాలకూ భరోసా: జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట ఎమ్మెల్యే



'సామాన్యుల నుంచి సంపన్నుల వరకు.. అందరికీ భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఇది చూసి ప్రతిపక్ష పార్టీకి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధికి వీలుగా మూడు ఆర్థిక జోన్లు ఏర్పాటు చేయడం అభినందనీయం. వ్యవసాయ బడ్జెట్ రైతులకు దన్నుగా నిలిచింది. పోలవరం ప్రాజెక్టు 91% పూర్తి చేయడం గొప్ప విషయం. ప్రాజెక్టులకు ప్రాధాన్యం కల్పించినట్లే నిర్వాసితుల్లోనూ సంతోషం వెల్లివిరియాలి'

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి ప్రాధాన్యం

కె.జగదీశ్వరి, కురుపాం ఎమ్మెల్యే



'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వం నిధులు కేటాయించింది. గిరిజనుల సంక్షేమానికి రూ.9,190 కోట్లు కేటాయించినందుకు గిరిజనుల తరఫున ప్రభుత్వానికి ధన్యవాదాలు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకే దక్కుతుంది'.

విద్యార్థులకు పోలవరం సందర్శనకూ అవకాశమిస్తాం

శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు



ఈనాడు, అమరావతి: విద్యార్థులు చదువు పూర్తయ్యాక కేవలం ఉద్యోగాల గురించే ఆలోచించకుండా.. రాజకీయాల్లోకి కూడా రావాలని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. అసెంబ్లీ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు బుధవారం సుమారు 300 మంది విద్యార్థులు వచ్చారు. గ్యాలరీలో కూర్చుని తిలకించారు. సభ విరామ సమయంలో స్పీకర్ వారితో ముచ్చటించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఆరు రోజులుగా సభను 1,400 మంది విద్యార్థులు సందర్శించారని తెలిపారు. అసెంబ్లీ కార్యకలాపాలను వీక్షించేందుకు అనుమతించినట్లే.. విద్యార్థులకు త్వరలో పోలవరం ప్రాజెక్టును సందర్శించేందుకూ అవకాశం కల్పిస్తామని స్పీకర్ చెప్పారు. వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన విద్యార్థులతో సంబంధిత నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, సుందరపు విజయ్‌కుమార్, అమిలినేని సురేంద్రబాబు, బోడె ప్రసాద్, బొమ్మిడి నాయకర్, బండారు శ్రావణి, యార్లగడ్డ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభలో 7 బిల్లులకు ఆమోదం

ఈనాడు, అమరావతి: శాసనసభలో ఏడు బిల్లులకు సభ్యుల నుంచి ఆమోదం లభించింది. నిర్మాణ సమయంలో ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) 50 శాతానికి తగ్గింపుతోపాటు 18 ఏళ్ల వయస్సు నిండిన యువత కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఏడాదిలో నాలుగుసార్లు అవకాశం కల్పించే చట్ట సవరణ బిల్లును సభ ఆమోదించింది. ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రులపై నియంత్రణ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్ల వినియోగదారుల నుంచి ప్రస్తుతం యూనిట్‌కి 6 పైసలు చొప్పున వసూలు చేస్తున్న విద్యుత్ సుంకాన్ని రూపాయికి పెంచుతూ చేసిన చట్ట సవరణను సభ్యులు ఆమోదించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో కుష్టు అనే పదం తొలగింపునకు సంబంధించి మంత్రులు ప్రవేశపెట్టిన చట్ట సవరణ బిల్లులను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ విషయాన్ని ఉపసభాపతి రఘురామకృష్ణమరాజు సభలో ప్రకటించారు.

ఏడాదిలో నాలుగుసార్లు కొత్త ఓటర్ల నమోదు

ఇకపై కొత్త ఓటు హక్కు నమోదుకు ఏడాదిలో నాలుగుసార్లు అవకాశం కల్పిస్తూ శాసనసభలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ సవరణ బిల్లును సభ్యులు ఆమోదించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తరఫున పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు జనవరి 1న మాత్రమే కొత్త ఓటర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉండటంతో.. జనవరి 1 తరువాత 18 ఏళ్లు నిండిన వారు మళ్లీ ఆ తేదీ వరకు వేచి చూసేవారు. చట్ట సవరణ ప్రకారం ఇక నుంచి జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు ఒకటో తేదీల్లో కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. 'ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఓటర్ల జాబితాల్లో తప్పులు సరిదిద్దేలా కూడా చర్యలు తీసుకోవాలి. మృతులు, వృత్తి, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని ఓటర్ల జాబితాల్లో నుంచి తొలగించాలి' అని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, లోకం నాగమణి, ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆయుష్ ఆసుపత్రులపైనా నియంత్రణ

రాష్ట్రంలో పెద్దఎత్తున ఏర్పాటవుతున్న ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రులపై పర్యవేక్షణ, నియంత్రణకు ప్రతిపాదించిన సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అలోపతి వైద్యం అందిస్తున్న ఆసుపత్రులపై ప్రభుత్వానికి ఇప్పటివరకు నియంత్రణ అధికారం ఉంది. ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిపైనా ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వీలుంటుందన్న అభిప్రాయంతో ఏపీ అలోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టానికి సవరణను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతిపాదించారు. దీనివల్ల మిగతా వాటిలా ఆయుష్ క్లినిక్‌లు, ఆసుపత్రుల వివరాలు కూడా వైద్య ఆరోగ్యశాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

చట్టాల్లో 'కుష్టు' పదం తొలగింపునకు ఆమోదం

సుప్రీం కోర్టు ఆదేశాలపై వివిధ ప్రభుత్వశాఖల చట్టాల్లో కుష్టు అనే పదం తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వం సూచనపై పురపాలక, పట్టణాభివృద్ధి, దేవాదాయ, ధర్మాదాయశాఖల మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి ప్రవేశపెట్టిన మూడు చట్ట సవరణ బిల్లులను శాసనసభ ఆమోదించింది. కుష్టు అనే పదం సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారిని అవమానించేలా, మనోభావాలు దెబ్బతీసేలా ఉందని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ప్రభుత్వ చట్టాల్లో నుంచి ఆ పదం తొలగించాలని సూచించడంతో కేంద్రం తదుపరి చర్యలు చేపట్టింది.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రూ.లక్ష చొప్పున కూపన్

బడ్జెట్ సమావేశాల సందర్భంగా అందజేత

ఈనాడు, అమరావతి: బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున క్రోమా స్టోర్లలో చెల్లుబాటయ్యే కూపన్లు అందించారు. ప్రతి బడ్జెట్ సమావేశాలకూ కూపన్లు ఇవ్వడం ఆనవాయితీ. బుధవారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు బయటకు వచ్చే సమయంలో.. వారి నుంచి సంతకాలు తీసుకుని కూపన్లు అందజేశారు.

అన్నీ తెలిసే నాతో ఆడుకుంటున్నారుగా!

శాసనసభ ఆవరణలో తెదేపా ఎమ్మెల్యేలు, వైకాపా ఎమ్మెల్యే మధ్య సరదా సంభాషణ

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం వైకాపా ఎమ్మెల్యే చంద్రశేఖర్ బుధవారం శాసనసభ ఆవరణలో తెదేపా ఎమ్మెల్యేలకు ఎదురుపడినప్పుడు వారి మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. తెదేపా నేతలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, అశోక్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలను చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా పలకరించారు. బిల్‌గేట్స్ స్థాయి తెలియకుండా ఆయన్ని విమర్శించే స్థాయికి మీ పార్టీ దిగజారిపోయిందేంటని.. తెదేపా ఎమ్మెల్యేలు ఆయన్ను ప్రశ్నించారు. 'అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ లెక్కలు అడగకుండా ప్రెస్‌మీట్ పెట్టి బిల్‌గేట్స్ టీ, కాఫీ ఖర్చుల గురించి మాట్లాడి నవ్వులపాలయ్యారు కదా' అని ఎంఎస్ రాజు వ్యాఖ్యానించారు. దానికి చంద్రశేఖర్.. 'అన్నీ తెలిసే నాతో ఆడుకుంటున్నారుగా.. మీకో నమస్కారం' అంటూ అక్కడి నుంచి నవ్వుతూ వెళ్లిపోయారు.



టీమ్‌ఇండియా లాంఛనాన్ని పూర్తి చేసింది. టీ20 ప్రపంచకప్‌లో వరుసగా నాలుగో విజయం సాధించిన భారత్.. అగ్రస్థానంతో గ్రూప్ దశను ముగించింది. దూబె చెలరేగిన వేళ.. నెదర్లాండ్స్‌ను ఓడించింది. సౌకర్యంగానే గెలిచినా.. పసికూనపై టీమ్‌ఇండియా బంతితో, బ్యాటుతో ఆశించినంత ఆధిపత్యాన్ని ప్రదర్శించలేక పోయింది. బంతితో భారత్‌ను నిలువరించగలిగిన నెదర్లాండ్స్.. బ్యాటుతోనూ పోరాడింది.

చాంపియన్స్

మనోడు.. మన జట్టుపై

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

వెస్టిండీస్ × ఇటలీ	వేదిక: కోల్‌కతా, ఉ॥ 11.00
శ్రీలంక × జింబాబ్వే	వేదిక: కొలంబో, మ॥ 3.00
అఫ్గానిస్థాన్ × కెనడా	వేదిక: చెన్నై, రా॥ 7.00


ఆర్యన్ దత్

భారత్‌తో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ ఓడినా.. ఆ జట్టు స్పిన్నర్ ఆర్యన్ దత్ ఆకట్టుకున్నాడు. కొత్త బంతితో బౌలింగ్‌ను ఆరంభించిన 22 ఏళ్ల ఈ పొడగరి ఆఫ్‌స్పిన్నర్.. మొదట అభిషేక్ శర్మను డకౌట్ చేసి భారత అభిమానులకు షాక్ ఇచ్చాడు. ఎక్కువగా స్పిన్ తిప్పకుండా.. లెగ్ వికెట్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఆర్యన్ విసిరిన బంతికి అభి క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. పాకిస్థాన్‌తో గత మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్‌ను కూడా అతడే పెవిలియన్ చేర్చాడు. 4 ఓవర్లలో కేవలం 19 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. ఆర్యన్ తండ్రిది భారతే. 1980లో అతడి కుటుంబం పంజాబ్‌లోని హోషియార్‌పుర్ నుంచి నెదర్లాండ్స్‌కు వలస వెళ్లింది. అక్కడ స్థిరపడినా.. ఆ కుటుంబానికి భారత్‌తో ఎంతో అనుబంధం ఉంది. 2011 ప్రపంచకప్‌ను చూశాక అతడికి క్రికెట్‌పై ఇష్టం పెరిగింది. ఎం.ఎస్.ధోనిని ఆదర్శంగా తీసుకుని ఆటలోకి వచ్చాడు. నెదర్లాండ్స్‌లోనే క్రికెట్ నేర్చుకున్న ఆర్యన్.. చండీగఢ్‌లో మూడు సంవత్సరాలు శిక్షణ పొందాడు. 2021లో నేపాల్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆర్యన్.. 2023 వన్డే ప్రపంచకప్‌లోనూ ఆడాడు. దక్షిణాఫ్రికాపై సంచలన విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. 2024లో నమీబియాతో ప్రపంచకప్ లీగ్-2 మ్యాచ్‌లో 6 వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇప్పటిదాకా 53 వన్డేలు, 29 టీ20లు ఆడిన ఈ స్పిన్నర్.. వన్డేల్లో 62, టీ20ల్లో 30 వికెట్లు తీశాడు.

గ్రూప్ దశలో భారత్‌కు అగ్రస్థానం

- నెదర్లాండ్స్‌పై విజయం

ఆధిపత్యం లేదు.. కానీ అజేయమే

- చెలరేగిన దూబె


వరుణ్ చక్రవర్తి 3/14


అహ్మదాబాద్

టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను భారత్ అజేయంగా ముగించింది. గ్రూప్-ఎ చివరి మ్యాచ్‌లో బుధవారం 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివమ్ దూబె (66; 31 బంతుల్లో 4×4, 6×6) మెరవడంతో మొదట భారత్ 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఆర్యన్ దత్ (2/19), డెలీడ్ (0/28) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. వాన్ బీక్ 56 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. బాస్ డెలీడ్ (33; 23 బంతుల్లో 3×4, 1×6) టాప్ స్కోరర్. మరో అయిదుగురు బ్యాటర్లు 20పై స్కోర్లు చేశారు. వరుణ్ చక్రవర్తి (3/14), శివమ్ దూబె (2/35) రాణించారు. బుమ్రా (1/17) పొదుపుగా బౌలింగ్ చేశాడు. దూబెకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

పోరాడిన..: భారత్ గెలుపుపై ఏ దశలోనూ సందేహాలు లేకున్నా.. ఛేదనలో నెదర్లాండ్స్ బ్యాటింగ్ ఆకట్టుకుంది. అయితే ఆరంభం నుంచి ఆ జట్టు వెనుకబడే ఉంది. పవర్‌ప్లే ముగిసే సరికి ఆ జట్టు 36/1తో నిలిచింది. ఆ తర్వాత లెవిట్ (24)ను హార్దిక్ ఔట్ చేశాడు. ఆకర్‌మ్యాన్ (23)తో కలిసి డెలీడ్ ఇన్నింగ్స్‌ను నడిపించడంతో 12 ఓవర్లకు నెదర్లాండ్స్ 94/2తో నిలిచింది. అయితే వరుణ్ తర్వాతి ఓవర్లో ఆకర్‌మ్యాన్, ఆర్యన్ దత్‌ను ఔట్ చేసి.. ఆ జట్టును దెబ్బతీశాడు. కాసేపటి తర్వాత డెలీడ్‌ను దూబె వెనక్కి పంపాడు. డచ్ జట్టు 14వ ఓవర్లకు 112/5తో నిలవగా.. సాధించాల్సిన రన్ రేట్ బాగా పెరిగిపోయింది. నెదర్లాండ్స్ ఇన్నింగ్స్‌ను భారత్ త్వరగానే ముగిస్తుందని అనిపించింది. కానీ ఆ జట్టు సాధ్యమైనంత వరకు పోరాడింది. క్లాసెన్ (26), క్రోస్ (25 నాటౌట్), ఎడ్వర్డ్స్ (15) తమ జట్టును పోటీలో ఉంచే ప్రయత్నం చేశారు. నెదర్లాండ్స్ ఆఖరి బంతి వరకూ ఆడింది.

ఆఖర్లో విధ్వంసంతో..: అంతకుముందు టీమ్‌ఇండియాకు అంత తేలికగా పరుగులు రాలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన డచ్ బౌలర్లు.. ఇన్నింగ్స్‌లో చాలా భాగం భారత బ్యాటర్లను కట్టడి చేయగలిగారు. కానీ ఒకే ఒక్కడి మెరుపు ఇన్నింగ్స్ టీమ్‌ఇండియాకు మెరుగైన స్కోరును అందించింది. అతడే శివమ్ దూబె. మిగతా బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడ్డా.. దూబె మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ గట్టి లక్ష్యాన్ని నిర్దేశించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అతడు నిలవకపోతే టీమ్‌ఇండియా పరిస్థితి భిన్నంగా ఉండేదే. స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా ఆఫ్‌స్పిన్నర్ ఆర్యన్ దత్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అయితే ఆఖరి అయిదు ఓవర్లలో విధ్వంసంతో ఇన్నింగ్స్‌ను టీమ్‌ఇండియా సంతృప్తికరంగా ముగించింది.

దూబె ధనాధన్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలో గట్టి దెబ్బ తగిలింది. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్ అభిషేక్ మూడో బంతికే వెనుదిరిగాడు. ఆర్యన్ దత్ అతణ్ని వెనక్కి పంపాడు. ఇషాన్ కిషన్ (18; 7 బంతుల్లో 2×4, 1×6) కొన్ని చక్కని షాట్లు ఆడినా.. ఎక్కువసేపు నిలువలేదు. అయిదో ఓవర్లో, దత్ బౌలింగ్‌లోనే బౌల్డయ్యాడు. బంతి తక్కువ ఎత్తులో రావడంతో షాట్లు ఆడడం బ్యాటర్లకు కాస్త కష్టమైంది. తిలక్ వర్మ (31; 27 బంతుల్లో 3×4, 1×6), సూర్యకుమార్ (34; 28 బంతుల్లో 2×4, 1×6) నిలిచినా.. పరుగులు వేగంగా రాలేదు. 9వ ఓవర్లో తిలక్ వెనుదిరిగేసరికి స్కోరు 69 పరుగులే. 6 నుంచి 11 ఓవర్ల మధ్య భారత్‌కు 32 పరుగులే వచ్చాయి. అయితే చెలరేగి ఆడిన దూబె.. ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేశాడు. నిలదొక్కుకోవడానికి కాస్త సమయం తీసుకున్న అతడు.. ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించాడు. ఆకర్‌మ్యాన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదేశాడు. స్వేచ్ఛగా ఆడలేకపోయిన సూర్యకుమార్ 14వ ఓవర్లో వెనుదిరగడంతో 41 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అతడి స్థానంలో వచ్చిన హార్దిక్ (30) మొదట భారీ షాట్లు ఆడలేకపోయాడు. కానీ దూబె మాత్రం రెచ్చిపోయాడు. వాండెర్‌మెర్వ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, వాన్‌బీకర్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్‌తో అభిమానులను ఉర్రూతలూగించాడు. హార్దిక్ తొలి 16 బంతుల్లో 16 పరుగులే చేశాడు. అతడు 19వ ఓవర్లో జోరందుకున్నాడు. ఆ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన హార్దిక్.. ఆఖరి ఓవర్లో ఇంకో సిక్స్ కొట్టి, ఇన్నింగ్స్ ఆఖరి బంతికి ఔటయ్యాడు. అంతకంటే ముందు దూబె ఓ సిక్స్ కొట్టి నిష్క్రమించాడు. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 75 పరుగులు రాబట్టింది.


దూబె 66

ఆ పోరుకు ఇది ప్రాక్టీస్

ఇప్పటికే సూపర్-8 చేరిన భారత్‌కు నెదర్లాండ్స్ మ్యాచ్ నామమాత్రమే. కానీ ఈ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆడడం జట్టుకు కలిసొచ్చే అంశం. ఇక్కడే భారత్ ఆదివారం తన తొలి సూపర్-8 మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాతో ఆడుతుంది. ఈ టోర్నీలో భారత్ తర్వాత అంత ఆధిపత్యం చెలాయిస్తోంది దక్షిణాఫ్రికానే. ఆ జట్టు కూడా గ్రూప్ దశను నాలుగు విజయాలతో ముగించింది. ప్రపంచకప్‌నకు ముందు నెల కిందటే భారత్‌లో పర్యటించిన అనుభవమూ ఆ జట్టుకు బాగానే ఉపయోగపడుతుంది. టోర్నీలో ఫామ్‌ను బట్టి చూస్తే ఆ జట్టుతో పోరు భారత్‌కు సవాలే. అహ్మదాబాద్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు బాగా సహకరిస్తుంది. కానీ ప్రపంచకప్‌లో ఇక్కడ బ్యాటింగ్ కొంచెం కష్టంగానే ఉంటోంది. నెదర్లాండ్స్ లాంటి చిన్న జట్టుపై భారత బ్యాటర్లు కూడా ఇబ్బంది పడ్డారు. పిచ్ స్పిన్‌కు బాగా అనుకూలించడంతో తడబాటు తప్పలేదు. ఆదివారం కూడా స్పిన్నర్లను ఎదుర్కోవడం అంత తేలిక కాదన్నది స్పష్టం. బుధవారం నాటి అనుభవంతో బ్యాటర్లు మరింత బాగా సన్నద్ధం కావాల్సిన అవసరం కనిపిస్తోంది. మన స్పిన్నర్లు దక్షిణాఫ్రికా బ్యాటర్లను బాగానే ఇబ్బంది పెట్టే అవకాశముంది.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (బి) ఆర్యన్ 0; ఇషాన్ కిషన్ (బి) ఆర్యన్ 18; తిలక్ (సి) వాండర్ మెర్వ్ (బి) వాన్ బీక్ 31; సూర్యకుమార్ (సి) హ్యూటన్ (బి) క్లీన్ 34; దూబె (సి) హ్యూటన్ (బి) బీక్ 66; హార్దిక్ (సి) వాండెర్‌మెర్వ్ (బి) వాన్ బీక్ 30; రింకు నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లు) **193; వికెట్ల పతనం:** 1-0, 2-39, 3-69, 4-110, 5-186, 6-193; **బౌలింగ్:** ఆర్యన్ దత్ 4-0-19-2; వాన్ బీక్ 4-0-56-3; ఆకర్‌మ్యాన్ 3-0-36-0; క్లీన్ 4-0-38-1; బాస్ డెలీడ్ 4-0-28-0; వాండెర్‌మెర్వ్ 1-0-15-0

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: లెవిట్ (సి) సుందర్ (బి) హార్దిక్ 24; ఓడౌడ్ (బి) వరుణ్ 20; డెలీడ్ (సి) వరుణ్ (బి) దూబె 33; ఆకర్‌మ్యాన్ (సి) రింకు (బి) వరుణ్ 23; ఆర్యన్ (బి) వరుణ్ 0; ఎడ్వర్డ్స్ (బి) బుమ్రా 15; క్లాసెన్ (సి) సుందర్ (బి) దూబె 26; క్రోస్ నాటౌట్ 25; వాన్ బీక్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **176; వికెట్ల పతనం:** 1-35, 2-51, 3-94, 4-94, 5-112, 6-125, 7-172; **బౌలింగ్:** అర్షదీప్ 3-0-22-0; బుమ్రా 3-0-17-1; సుందర్ 4-0-36-0; వరుణ్ చక్రవర్తి 3-0-14-3; హార్దిక్ 3-0-40-1; అభిషేక్ 1-0-10-0; దూబె 3-0-35-2


ఫైనల్ చేరిన ఆనందంలో జమ్మూకశ్మీర్ జట్టు

జమ్మూకశ్మీర్ తొలిసారి..

రంజీ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశం

కల్యాణి: దేశవాళీ క్రికెట్లో చిన్న జట్టుగా ముద్ర పడ్డ జమ్మూకశ్మీర్.. రంజీ ట్రోఫీలో తొలిసారిగా ఫైనల్‌కు చేరుకుని చరిత్ర సృష్టించింది. బుధవారం ముగిసిన మ్యాచ్‌లో ఆ జట్టు ఆరు వికెట్ల తేడాతో బెంగాల్‌పై విజయం సాధించింది. 1959-60లో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసిన జమ్మూకశ్మీర్.. 67 ఏళ్లలో మొదటిసారిగా ఫైనల్ బెర్తు సొంతం చేసుకుంది. 126 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 43/2తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు కొద్దిసేపటికే లాంఛనం పూర్తి చేసింది. 34.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వంశ్‌రాజ్ శర్మ (43 నాటౌట్; 83 బంతుల్లో 4×4, 1×6), అబ్దుల్ సమద్ (30 నాటౌట్; 27 బంతుల్లో 1×4, 3×6) అయిదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించారు. తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 328 పరుగులు చేయగా.. జమ్మూకశ్మీర్ 302 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ 99 పరుగులకే కుప్పకూలింది. జమ్మూకశ్మీర్ జట్టును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి అభినందించారు.

కర్ణాటక ఖాయమైనట్లే

లఖ్‌నవూ: రంజీ ట్రోఫీలో కర్ణాటకకు ఫైనల్ బెర్తు ఖాయమైనట్లే. ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో కర్ణాటకకు భారీ తొలి ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 149/5తో బుధవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 88.5 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటైంది. విద్యాధర్ పాటిల్ (3/40), విజయ్‌కుమార్ వైశాఖ్ (3/45), శ్రేయస్ గోపాల్ (2/41) విజృంభించడంతో కర్ణాటక 503 పరుగుల ఆధిక్యం సాధించింది. ఉత్తరాఖండ్‌ను ఫాలోఆన్ ఆడించే అవకాశమున్నా.. కర్ణాటక రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 63.5 ఓవర్లలో 299 పరుగులు సాధించింది. రవిచంద్రన్ స్మరణ్ (127; 149 బంతుల్లో 12×4, 3×6) వరుసగా రెండో సెంచరీ నమోదు చేశాడు. కృతిక్ కృష్ణ (52; 97 బంతుల్లో 9×4), కేఎల్ రాహుల్ (70 బ్యాటింగ్; 67 బంతుల్లో 3×4, 5×6) అర్ధ సెంచరీలు రాబట్టారు. గురువారం మ్యాచ్‌కు చివరి రోజు కాగా ప్రస్తుతం కర్ణాటక ఖాతాలో 802 పరుగులు ఉన్నాయి. కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 736 పరుగులకు ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ గెలిచే అవకాశాలు ఏమాత్రం లేవు కాబట్టి కర్ణాటక ఫైనల్ చేరడం లాంఛనమే.

అమ్మాయిలు సిరీస్ సాధిస్తారా?


హర్మన్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌పై భారత మహిళల జట్టు గురి పెట్టింది. తొలి టీ20లో నెగ్గి ఉత్సాహంతో ఉన్న హర్మన్‌ప్రీత్ బృందం.. రెండో మ్యాచ్‌లోనూ జోరు కొనసాగించి సిరీస్ పట్టేయాలని చూస్తోంది. గురువారం కాన్‌బెర్రాలో రెండో టీ20 జరగనుంది. వర్ష ప్రభావిత తొలి పోరులో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 21 పరుగుల తేడాతో నెగ్గింది. ఆ మ్యాచ్‌లో భారత బౌలర్లు అదరగొట్టారు. అరుంధతి రెడ్డి (4/22), రేణుక సింగ్ (2/14) అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఇక బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, షఫాలి వర్మ, హర్మన్, రిచా ఘోష్ సూపర్ ఫామ్‌లో ఉండటం కలిసొచ్చేదే. దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్, శ్రీ చరణిలతో స్పిన్ విభాగం కూడా బలంగా కనిపిస్తోంది. సొంతగడ్డపై సిరీస్‌ను కాపాడుకోవడం కోసం సోఫీ మోలనూ నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టు గట్టిగా ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు.

ఒకసారి డకౌటైతే పొరపాటు అనుకుంటాం. రెండోసారి అంటే గ్రహపాటు అనుకుంటాం. కానీ మూడోసారి కూడా అదే జరిగితే? ఎన్నో అంచనాల మధ్య టీ20 ప్రపంచకప్‌లో అడుగు పెట్టిన టీమ్ ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఇలాంటి ప్రదర్శన చేస్తాడని ఎవ్వరూ ఊహించి ఉండరు! కీలకమైన పాకిస్థాన్ పోరులోనే కాదు.. అమెరికా, నెదర్లాండ్స్ లాంటి చిన్న జట్లపైనా ఖాతా తెరవకపోవడం అనూహ్యం. ప్రపంచకప్‌లో మూడు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్‌కు దిగి ఒక్కటంటే ఒక్క పరుగూ చేయకుండా గ్రూప్ దశను ముగించిన చెత్త రికార్డు అభిషేక్ పేరిటే ఉంటుందేమో!

షేక్ చేస్తాడనుకుంటే.. షేక్ అయ్యాడే

ఈనాడు క్రీడావిభాగం



అభిషేక్ బౌల్డ్

ఈ ప్రపంచకప్‌లో భారత్ నుంచి ప్రత్యర్థి జట్లకు అతి పెద్ద ముప్పు అభిషేక్ శర్మే అవుతాడని.. విరాట్ కోహ్లి లేని లోటును అతనే భర్తీ చేస్తాడని అంచనాలు కలిగాయి టోర్నీ ముంగిట. కానీ గ్రూప్ దశలో కనీసం ఖాతా కూడా తెరవలేడని ఎవ్వరూ ఊహించి ఉండరు. అనారోగ్యం వల్ల నమీబియాతో మ్యాచ్‌లో ఆడలేకపోయిన అభి.. మిగతా మూడు మ్యాచ్‌ల్లోనూ అవసరం లేని దూకుడుతో వికెట్లు సమర్పించుకున్నాడు. దూకుడుతో కూడిన తన శైలిని అతను మార్చుకోవాల్సిన పని లేకపోయినా.. కొంచెం క్రీజులో కుదురుకునే వరకు ఆచితూచి ఆడడం, బంతిని బట్టి షాట్ ఆడాల్సిన అవసరాన్ని విశ్లేషకులు సూచించినా అతను పట్టించుకోవడం లేదు. వరుసగా రెండు డకౌట్ల తర్వాత కూడా అతను జాగ్రత్త పడలేదు. ముందు సింగిల్ తీసేందుకు ప్రయత్నించాలన్న గావస్కర్ సూచనను అభిషేక్ పాటించి ఉండాల్సింది. బౌలర్లను మరీ తక్కువ అంచనా వేసి.. అడ్డదిడ్డంగా షాట్లు ఆడబోయి ఔటైపోతున్నాడు. ఒకట్రెండు డాట్‌బాల్స్ పడగానే అతడిలోని విధ్వంసక బ్యాటర్ అహం దెబ్బ తిన్నట్లుగా బంతిని చూడకుండా బ్యాట్ ఊపేయడం వల్లే పాక్‌పై, నెదర్లాండ్స్‌పై వికెట్ కోల్పోవాల్సి వచ్చింది. టోర్నీ ముంగిట అభిషేక్‌పై ఉన్న అంచనాలన్నీ ఇప్పుడు తలకిందులయ్యాయి. ప్రత్యర్థి జట్లను షేక్ చేస్తాడనుకున్న ఈ ఓపెనర్.. ఇప్పుడు తనే షేక్ అయిపోయినట్లు కనిపిస్తున్నాడు. ఈ స్థితిలో ఒత్తిడిని అధిగమించడం సవాలే. గ్రూప్ దశ వైఫల్యాన్ని బట్టి అభిషేక్ పనైపోయిందనుకోవడానికి వీల్లేదు. ఇప్పటికీ అతను విలువైన బ్యాటరే. లీగ్ దశలో అతడి వైఫల్యం జట్టుపై ఎక్కువ ప్రభావం చూపలేదు. భారత్ సులువుగానే సూపర్-8కు చేరుకుంది. కానీ తర్వాతి దశలో ప్రతి మ్యాచ్ కీలకమే కాబట్టి.. అతను అప్రమత్తం కావాల్సిందే. సఫారీ జట్టుతో మ్యాచ్‌లో కొంచెం కుదురుకునే వరకు ఎదురు చూస్తే.. తర్వాత పాత అభిషేక్‌ను చూడొచ్చు. ఒకవేళ కీలకమైన సూపర్-8 దశ నుంచే అభిషేక్ తన అసలు ఆటను చూపిస్తాడేమో! వేచి చూద్దాం!

పాక్.. రైట్ రైట్

- సూపర్-8లోకి ప్రవేశం
- నమీబియాపై భారీ గెలుపు


ఫర్హాన్ 100 నాటౌట్


తారిఖ్ 4/16

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో చివరి సూపర్-8 బెర్తును పాకిస్థాన్ సొంతం చేసుకుంది. గ్రూప్-ఎ నుంచి భారత్ ఇప్పటికే ముందంజ వేయగా.. రెండో బెర్తు పాక్ సొంతమైంది. గత మ్యాచ్‌లో భారత్ చేతిలో చిత్తయిన పాక్.. నమీబియాపై 102 పరుగుల భారీ విజయంతో లీగ్ దశను ముగించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సాహిబ్‌జాదా ఫర్హాన్ (100 నాటౌట్; 58 బంతుల్లో 11×4, 4×6) టీ20 కెరీర్‌లో తొలి శతకం సాధించడంతో మొదట పాక్ 3 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. జాక్ బ్రసెల్ రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో ఉస్మాన్ తారిఖ్ (4/16), షాదాబ్ ఖాన్ (3/19) ధాటికి నమీబియా 17.3 ఓవర్లలో 97 పరుగులకే ఆలౌటైంది. లారెన్ స్టీన్‌క్యాంప్ (23), అలెగ్జాండర్ వాల్‌షెంక్ (20) మినహా బ్యాటర్లెవరూ కనీసం రెండంకెల స్కోరు చేయలేదు. సూపర్-8లో పాక్.. శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లాండ్‌లతో తలపడుతుంది.

రెచ్చిపోయిన ఫర్హాన్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్‌కు మెరుగైన ఆరంభం దక్కింది. ఫర్హాన్, మరో ఓపెనర్ సయీమ్ అయూబ్ (14) తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించారు. ఆ తర్వాత ఫర్హాన్‌కు కెప్టెన్ సల్మాన్ ఆఘా (38; 23 బంతుల్లో 3×4, 2×6) తోడయ్యాడు. మైబర్గ్ వేసిన తొమ్మిదో ఓవర్లో ఆఘా ఒక సిక్స్, ఫర్హాన్ రెండు సిక్స్‌లు బాది మొత్తం 22 పరుగులు రాబట్టారు. ఫర్హాన్ 37 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. ఆఘా, ఖవాజా నఫే (5) వరుస ఓవర్లలో ఔటైనప్పటికీ.. పాక్ ఇబ్బంది పడలేదు. షాదాబ్ ఖాన్ (36 నాటౌట్; 22 బంతుల్లో 1×4, 3×6)తో కలిసి ఫర్హాన్ చెలరేగడంతో పాక్ భారీ స్కోరు సాధించింది. ఫర్హాన్ చివరి ఓవర్లో శతకం (57 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. ఫర్హాన్, షాదాబ్ అభేద్యమైన నాలుగో వికెట్‌కు 81 పరుగులు జత చేశారు.

పోటీ లేకుండానే: భారీ ఛేదనలో నమీబియా కనీస పోటీ ఇవ్వలేదు. పవర్‌ప్లే ముగిసేసరికి 40/2తో నిలిచిన నమీబియా.. స్పిన్నర్లు తారిఖ్, షాదాబ్‌ల ధాటికి విలవిలలాడింది. ఆ జట్టు 18 పరుగులకే చివరి 6 వికెట్లు చేజార్చుకుని ఘోర పరాజయాన్ని చవిచూసింది. నమీబియా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడింది.

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ 100 నాటౌట్; అయూబ్ (సి) గ్రీన్ (బి) బ్రాసెల్ 14; ఆఘా (సి) ఎరాస్మస్ (బి) బ్రాసెల్ 38; నఫే (సి) అండ్ (బి) ఎరాస్మస్ 5; షాదాబ్ ఖాన్ నాటౌట్ 36; ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం:** (20 ఓవర్లలో 3 వికెట్లకు) **199; వికెట్ల పతనం:** 1-40, 2-107, 3-118; **బౌలింగ్:** స్మిట్ 3-0-28-0; ఎరాస్మస్ 3-0-25-1; ట్రంపుల్‌మ్యాన్ 4-0-36-0; బ్రసెల్ 4-0-48-2; మైబర్గ్ 2-0-27-0; బెర్నార్డ్ 4-0-33-0

నమీబియా ఇన్నింగ్స్: స్టీన్‌క్యాంప్ (సి) ఉస్మాన్ (బి) నవాజ్ 23; ఫ్రైలింక్ (బి) మీర్జా 9; లాఫ్టీ ఈటన్ రనౌట్ 5; ఎరాస్మస్ (సి) ఉస్మాన్ (బి) షాదాబ్ 7; వాల్‌షెంక్ (సి) ఉస్మాన్ (బి) షాదాబ్ 20; స్మిట్ (సి) షాదాబ్ (బి) తారిఖ్ 9; గ్రీన్ (సి) అయూబ్ (బి) షాదాబ్ 7; ట్రంపుల్‌మాన్ (బి) తారిఖ్ 0; మైబర్గ్ (సి) ఉస్మాన్ (బి) తారిఖ్ 8; బెర్నార్డ్ (బి) తారిఖ్ 1; బ్రసెల్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7, **మొత్తం:** (17.3 ఓవర్లలో) **97; వికెట్ల పతనం:** 1-32, 2-39, 3-43; 4-49, 5-79, 6-81, 7-81, 8-95, 9-96; **బౌలింగ్:** అష్రాఫ్ 2-0-16-0; సల్మాన్ మీర్జా 2-0-11-1; అయూబ్ 2-0-10-0; నవాజ్ 4-0-22-1, షాదాబ్ 4-0-19-3, తారిఖ్ 3.3-1-16-4

ఎదురులేని దక్షిణాఫ్రికా

- యూఏఈపై ఘనవిజయం
- మెరిసిన బోష్, నోకియా


బోష్ 3/12

దిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశను దక్షిణాఫ్రికా అజేయంగా ముగించింది. సూపర్-8కు ముంగిట ఆ జట్టు అదిరే విజయాన్ని అందుకుంది. బుధవారం గ్రూప్-డి మ్యాచ్‌లో మార్‌క్రమ్ సేన 6 వికెట్ల తేడాతో యూఏఈని ఓడించింది. పేసర్లు కార్బిన్ బోష్ (3/12), నోకియా (2/28) విజృంభించడంతో మొదట యూఏఈ 20 ఓవర్లలో 122/6కే పరిమితమైంది. అలీషన్ షరాఫు (45; 38 బంతుల్లో 5×4, 1×6), కెప్టెన్ మహ్మద్ వసీమ్ (22; 12 బంతుల్లో 4×4) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. ఛేదనలో డెవాల్డ్ బ్రెవిస్ (36; 25 బంతుల్లో 1×4, 3×6), రికెల్టన్ (30; 16 బంతుల్లో 3×4, 2×6), మార్‌క్రమ్ (28; 11 బంతుల్లో 5×4, 1×6) మెరుపులతో దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలోనే 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇప్పటికే సూపర్-8 చేరిన సఫారీ జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలవగా.. యూఏఈ ఒకే విజయం (కెనడాపై)తో టోర్నీని ముగించింది. ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్ (6) ఇప్పటికే సూపర్-8 చేరింది. నామమాత్రపు పోరు కావడం, భారత్‌తో ఆదివారం సూపర్-8 మ్యాచ్ ఉండడంతో లుంగి ఎంగిడి, మార్కో యాన్సెన్‌లకు బుధవారం దక్షిణాఫ్రికా విశ్రాంతి ఇచ్చింది. నోకియాను టోర్నీలో తొలిసారి ఆడించింది.

మెరిసిన బ్రెవిస్, రికెల్టన్: మొదట యూఏఈ పరుగుల కోసం కష్టపడిన పిచ్‌పై ఛేదనలో దక్షిణాఫ్రికా అదరగొట్టింది. ఓపెనర్లు మార్‌క్రమ్, డికాక్ (14) 2.5 ఓవర్లలో 32 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ముఖ్యంగా ఉన్నంతసేపు మార్‌క్రమ్ చెలరేగాడు. హైదర్ అలీ వేసిన మూడో ఓవర్లో అతడు 3 ఫోర్లు, ఓ సిక్స్ బాదాడు. అదే ఓవర్లో చివరి బంతికి అతడు ఔటయ్యాడు. కొన్ని షాట్లు ఆడిన డికాక్ సైతం మరో ఓవర్ తర్వాత మార్‌క్రమ్‌ను అనుసరించాడు. ఈ స్థితిలో బ్రెవిస్, రికెల్టన్ స్కోరు తగ్గకుండా చూశారు. 8వ ఓవర్లో బ్రెవిస్ ఓ సిక్స్, ఫోర్ కొట్టగా... 10వ ఓవర్లో రికెల్టన్ రెండు సిక్స్‌లు బాదాడు. సఫారీ జట్టు విజయానికి చేరువైన స్థితిలో రికెల్టన్, బ్రెవిస్ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. స్టబ్స్ (6 నాటౌట్), జేసన్ స్మిత్ (3 నాటౌట్) పని పూర్తి చేశారు. అంతకుముందు యూఏఈ బ్యాటర్లకు సఫారీ పేసర్లు బోష్, నోకియా కళ్లెం వేశారు. యూఏఈ ఇన్నింగ్స్‌ను కాస్త మెరుగ్గానే ఆరంభించింది. 4.2 ఓవర్లకు 38/0తో నిలిచింది. అయితే ఓవర్ తేడాతో ఓపెనర్లు మహ్మద్ వసీం, ఆర్యాంశ్ (13) వికెట్లను కోల్పోయిన యూఏఈ ఇబ్బందుల్లో పడింది. ఒకవైపు అలీషన్ షరాఫు నిలిచినా.. అతడికి మద్దతు ఇచ్చేవాళ్లు లేకపోయారు. బోష్, నోకియాతో పాటు లిండ్ కట్టుదిట్టంగా బంతులు వేయడంతో యూఏఈ బ్యాటర్లు బ్యాట్ ఝుళిపించలేకపోయారు.

సంక్షిప్త స్కోర్లు. యూఏఈ: 122/6 (షరాఫు 45, వసీమ్ 22; బోష్ 3/12, నోకియా 2/28, లిండ్ 1/17)

దక్షిణాఫ్రికా: 13.2 ఓవర్లలో 123/4 (బ్రెవిస్ 36, రికెల్టన్ 30, మార్‌క్రమ్ 28)



ఐఎన్ఎస్ తరంగిణి నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు గౌరవ వందనం సమర్పిస్తున్న నావికులు



విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నేవీ సిబ్బంది



ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో యుద్ధ నౌకలు







రాష్ట్రపతి ప్రయాణిస్తున్న సుమేధను అనుసరిస్తున్న నౌకలు ★ ఫ్లీట్ రివ్యూలో మెరైన్ కమాండోల విన్యాసాలు ★ బాంబుల వర్షం కురిపిస్తున్న యుద్ధ విమానాలు

సంద్రంలో యుద్ధ నౌకల గర్జన

- నౌకాదళాల శక్తి చాటేలా ఐఎఫ్ఆర్
- పాల్గొన్న 66 భారత, 19 విదేశీ యుద్ధ నౌకలు

ఈనాడు, విశాఖపట్నం: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) విశాఖ తీరంలో అబ్బురపరిచేలా సాగింది. 66 భారత, 19 విదేశీ యుద్ధనౌకలు, మూడు జలాంతర్గాములు, 60కిపైగా యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. భారత త్రివిధ దళాధిపతి హోదాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ ఆరు వరుసల్లో నిలిపిన యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మొదట తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం ప్రాంగణానికి చేరుకున్న ఆమె.. నౌకాదళం నుంచి గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. అనంతరం రాష్ట్రపతి గౌరవార్థం నౌకాదళం 21 తుపాకుల సెల్యూట్‌ను సమర్పించింది.

గంటన్నరపాటు సమీక్ష

'యునైటెడ్ త్రూ ఓషన్స్' నినాదంతో భారత యుద్ధ నౌకలు, డోర్నియర్, మిగ్ విమానాలు, ధ్రువ్ హెలికాప్టర్లు తమ పాటవాన్ని ప్రదర్శించాయి. రాష్ట్రపతి ప్రయాణిస్తున్న నౌక మొదట వెళ్లగా దాన్ని అనుసరిస్తూ ఐఎన్ఎస్ సుమిత్ర, సుకన్య వెళ్లాయి. ఆరు వరుసలుగా ఏర్పడిన నౌకలను.. ఐఎన్ఎస్ సుమేధలో రాష్ట్రపతి మూడుసార్లు తిరిగి గంటన్నర పాటు సమీక్షించారు. ఆయా యుద్ధ నౌకలపై నుంచి నావికులు వందనం చేయగా రాష్ట్రపతి అభివాదం చేశారు.



ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ ఐఎఫ్ఆర్‌ను వీక్షిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఆయన సతీమణి శ్రీశ్రావ్య, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్, నేవీ ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యులు

అబ్బురపరిచిన విన్యాసాలు

ఐఎఫ్ఆర్‌లో హెలికాప్టర్ నుంచి నావికులు తాడుతో దిగి సముద్ర జలాలను తాకుతూ చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. మెరైన్ కమాండోలు అత్యంత వేగంతో స్పీడ్ బోట్లపై దూసుకెళుతూ నైపుణ్యం ప్రదర్శించారు. చేతక్ హెలికాప్టర్లు త్రివర్ణ పతాకాలతో గగనతలంలో సందడి చేశాయి. ఐఎన్ఎస్ సంకుల్, సింధు కేసరి, సింధు కీర్తి జలాంతర్గాములు సముద్ర జలాల్లో నుంచి నుంచి ఒక్కసారిగా పైకి లేచి రాష్ట్రపతికి అభివాదం చేశాయి. మిగ్ యుద్ధ విమానాలు గగనతలంలో ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించాయి. ధ్రువ్, సీ కింగ్, కమోవ్ 31 ఫాల్కన్స్, హాక్ హెలికాప్టర్ల విన్యాసాలు భళా అనిపించాయి. కోస్టుగార్డు పహారా విమానాలు, డోర్నియర్ కైట్స్ ప్రదర్శనగా వెళ్లాయి. ఫ్రాన్స్‌కు చెందిన అట్లాంటిక్-2 విమానం ఆకర్షించింది.



ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణిస్తూ అభివాదం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి, సీఎం చంద్రబాబు

ద్వీపాన్ని తలపించిన ఐఎన్ఎస్ విక్రాంత్

భారత యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ సముద్రంపై ఒక ద్వీపంలా కనిపించింది. ఐఎన్ఎస్ తరంగిణి, ఆర్నాలా, అస్త్రధారిణి, మకర్, తర్ముగ్లి, కంజర్, సాగర, హురావి, కథల్‌పూర్, రణ్‌వీర్, చెన్నై, థార్‌కాస్ తదితర నౌకలు పాల్గొన్నాయి. థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, జపాన్, మయన్మార్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఇరాన్, రష్యా, మలేసియా, ఇండోనేసియా, యూఏఈ, శ్రీలంక, వియత్నాం, మాల్దీవులు తదితర.. 74 దేశాలు ఐఎఫ్ఆర్‌లో భాగస్వాములయ్యాయి.

నేడు విశాఖకు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం విశాఖ రానున్నారు. దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి, ఉదయం 11 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి నౌకాదళం స్థావరానికి వెళ్లి 'మిలన్-2026'ని ప్రారంభిస్తారు. అనంతరం నేవీ ఉన్నతాధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షిస్తారు. సముద్రిక ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని దేశ, విదేశాలకు చెందిన నేవీ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

సంయుక్త విన్యాసాలకు విశాఖ సిద్ధం

భారతదేశం మొదటిసారిగా ఐఎఫ్ఆర్, మిలన్‌లను సంయుక్తంగా నిర్వహిస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గురువారం నౌకాదళ విన్యాసాలు, అంతర్జాతీయ సిటీ పరేడ్‌లను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. మిలన్‌లో 74 దేశాలు పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్కే బీచ్‌లో ఫైనల్ రిహార్సల్స్ నిర్వహించారు.

లోకేశ్ టీం వర్సెస్ నాదెండ్ల టీం

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తలపడనున్న రెండు క్రికెట్ జట్లు

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించనున్న వ్యక్తిగత, బృంద క్రీడా పోటీలకు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఏయే క్రీడా పోటీలు నిర్వహించాలి, ఎలాంటి జెర్సీలు ఇవ్వాలి, ట్రోఫీలు, పతకాలు ఎలా ఉండాలనే అంశాలపై చర్చించారు. ప్రాథమికంగా కొన్ని రకాల జెర్సీలను ఖరారు చేశారు. ట్రోఫీల నమూనాలను పరిశీలించారు. మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్‌ల నేతృత్వంలో రెండు క్రికెట్ టీంలను సిద్ధం చేశారు. సభ్యులు ఇంకా ఎక్కువ మంది ముందుకువస్తే టీంల సంఖ్యను పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. వ్యక్తిగత క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఎక్కువ మంది సభ్యులు ఆసక్తి కనబరుస్తున్నారని కమిటీ సభ్యులు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆసక్తి ఉన్నవారందరూ పోటీల్లో పాల్గొనేలా సమన్వయం చేయాలని స్పీకర్ స్పష్టం చేశారు. పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించబోయే సాంస్కృతిక వేడుక నిర్వహణపైనా ఆయన చర్చించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 24న మధ్యాహ్నం పోటీలు లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. పరుగు పందెం, కబడ్డీ, త్రో బాల్, టెన్నీకాయిట్, వాలీబాల్, చెస్, క్రికెట్, క్యారమ్స్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, షటిల్, టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశంలో క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, క్రీడల సమన్వయ కమిటీ సభ్యులుగా ఉన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, కాల్వ శ్రీనివాసులు, గణబాబు, సుందరపు విజయ్‌కుమార్‌లతో పాటు శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాక్టీస్ షురూ: క్రికెట్ టీంలో ఉన్న సభ్యులు ఇప్పటికే ప్రాక్టీస్ ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌కి ప్రత్యేకంగా సభ్యులను విభజించుకుని కసరత్తులు చేస్తున్నారు.

ఊయలే ఉరితాడై.. బాలిక మృతి



సునంద భాగ్యలక్ష్మి

మార్కాపురం, న్యూస్‌టుడే: చీరతో కట్టిన ఊయల మెడకు బిగుసుకోవడంతో బాలిక మృత్యువాత పడిన ఘటన మార్కాపురం పట్టణంలో చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ జయ కుమార్, భార్య వెంకటమ్మలు పట్టణ శివారు ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి సునంద భాగ్యలక్ష్మి (7), ఓ బాబు (4) ఉన్నారు. మంగళవారం రాత్రి బాలిక సునంద భాగ్యలక్ష్మి ఆడుకుంటూ.. ఇంటి వరండాలో చీరతో కట్టిన ఊయల వద్దకు వెళ్లి, అందులో తల పెట్టి ఆడుకోసాగింది. ఈ క్రమంలో చీర మెడకు బిగుసుకుపోయి.. బాలిక అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్రమత్తమైన తల్లి, బంధువులు పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పాప మృతి చెందినట్లు తెలిపారు. తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు

బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ నిర్వహణ



వస్త్రాల స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేశారు. సమావేశాలు ముగిసే వరకూ వీటిని కొనసాగించనున్నారు. వీటిలో పొందూరు చొక్కాలు, పంచెలు, కండువాలు, మాధవవరం, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, రాజమహేంద్రవరం, మచిలీపట్నం చీరలు తదితరాలు విక్రయిస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తదితరులు చేనేత ప్రదర్శనల్ని సందర్శించిన ఫొటో గ్యాలరీలతో ఓ స్టాల్ ఏర్పాటు చేశారు. 40 శాతం డిస్కౌంట్‌తో విక్రయాలు జరుపుతున్నారు. చీరలు రూ.800 నుంచి రూ.26,000 వరకూ అందుబాటులో ఉన్నాయి.

చేనేత వస్త్రాలు కొనుగోలు చేయండి..

చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాల్సిందిగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభ్యుల్ని కోరారు. ఈ స్టాళ్లను మంత్రి సవిత బుధవారం సందర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని.. దీంతో నేతన్నకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు.

అది నేరపూరిత సొమ్మే

- రాంకీ ఫార్మా ప్లాట్ల జప్తుపై తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఈడీ

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తులపై నమోదుచేసిన కేసులో జప్తు చేసిన ఆస్తులు నేరపూరిత సొమ్మేనంటూ తెలంగాణ హైకోర్టుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం నివేదించింది. ఈడీ జప్తుచేసిన ఆస్తులకు కేసుతో నేరుగా సంబంధం ఉందని స్పష్టం చేసింది. బ్యాంకు హామీల ద్వారా విడుదల చేయడానికి వీల్లేదంది. సీబీఐ నమోదుచేసిన కేసు ఆధారంగా ఈడీ కేసు నమోదుచేసి ఆస్తులను జప్తు చేసిందని, జప్తు చెల్లదంటూ అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పు వెలువరించగా దాన్ని సవాలు చేస్తూ ఈడీ, రాంకీ హైకోర్టులో అప్పీళ్లు దాఖలుచేశాయి. జప్తు చేసిన ఆస్తులకు సమాన విలువను బ్యాంకు డిపాజిట్ స్వీకరించి విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని రాంకీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ పి.శ్యాం కోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మ వాదనలు వినిపిస్తూ రాంకీ ఫార్మాసిటీలో 16 ప్లాట్లను ఈడీ జప్తు చేసిందన్నారు. ఫార్మాసిటీకి 500 మీటర్లు గ్రీన్‌బెల్ట్‌గా వదిలిపెట్టాలని మొదట నిర్ణయించి తర్వాత దాన్ని 250 మీటర్లకు, ఆపైన 50 మీటర్లకు కుదించడం ద్వారా రాంకీ ప్రత్యక్షంగా లబ్ధి పొందిందని తెలిపారు. ఇలా కుదించి రూపొందించిన 16 ప్లాట్లను జప్తు చేశామని, ఇది నేరపూరిత సొమ్మేనని తెలిపారు. ఇతర కేసుల్లో బ్యాంకు డిపాజిట్లను జప్తు చేశామని, వాటిలో ప్రత్యామ్నాయ హామీ ఇస్తే విడుదల చేయడానికి ఈడీనే అంగీకరించిందన్నారు. ప్రస్తుత కేసు మిగిలినవాటితో భిన్నమైనదని, నేరుగా నేరపూరిత సొమ్మేనని చెప్పారు. రాంకీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ విశాఖపట్నంలో ఫార్మాసిటీ ఏర్పాటు నిమిత్తం సుప్రీంకోర్టు కమిటీ ఫార్మాసిటీ ఆవల అర కిలోమీటరు గ్రీన్‌బెల్ట్ ఏరియాగా బఫర్‌జోన్ వదలిపెట్టాలని ఆదేశించిందన్నారు. దీనిపై తర్వాత వచ్చిన సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బయట అర కిలోమీటరు కంటే లోపల 250 మీటర్లు బఫర్‌జోన్ వదిలిపెట్టాలని సూచించారన్నారు. తర్వాత బఫర్‌జోన్ బయట ఉంటుందని, 250 మీటర్లు వదిలిపెడితే 900 ఎకరాలే మిగులుతుందని చెప్పామన్నారు. టెండరు ఒప్పందం ప్రకారం 50 మీటర్లు గ్రీన్‌బెల్ట్ ప్రాంతంగా వదిలిపెడతామన్న ప్రతిపాదనకు నాటి సీఎం అంగీకరించారని తెలిపారు. ప్రస్తుత ప్లాట్లను కొనుగోలు చేసి, ఫార్మా కంపెనీల ఏర్పాటుకు బహుళజాతి కంపెనీలు ఎదురుచూస్తున్నాయన్నారు. నేరపూరిత సొమ్ము రూ.114 కోట్లు అని ఈడీ పేర్కొంటోందని, ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తామని, దానిపై వడ్డీ కూడా కేసు విచారణలో అది నేరపూరిత సొమ్మేనని తేలితే స్వాధీనం చేసుకోవచ్చన్నారు. ఈడీ అప్పిలేట్ అథారిటీ అది నేరపూరిత సొమ్ము కాదని వెల్లడించిందని, సీబీఐ కోర్టులో కేసు పూర్తయ్యేదాకా అన్యాక్రాంతం చేయరాదన్న షరతును సవాలు చేస్తూ తామూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న ధర్మాసనం ఉత్తర్వులను వాయిదా వేసింది.

నేటినుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

దిల్లీ: దేశవ్యాప్తంగా పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం రాత్రి నెలవంక కనిపించిందని, రంజాన్ ఉపవాసాలు గురువారం ప్రారంభమై నెలరోజుల పాటు కొనసాగుతాయని దిల్లీ చాందినీ చౌక్‌లోని ఫతేపురి మసీదు మౌలానా ముఫ్తీ ముకర్రమ్ అహ్మద్ ప్రకటించారు.

21న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది క్రమంగా పశ్చిమ-వాయవ్య దిశగా శ్రీలంక వైపుగా కదులుతూ గురువారం లోగా తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. శనివారం(21న) ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని కొన్ని వాతావరణ మోడళ్లు సూచిస్తున్నాయి. ఇదీ సోమవారం నాటికి శ్రీలంక తీరం వైపు కదులుతుందని అంచనా. దీనిపై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు తగ్గొచ్చని తెలిపింది. శని, ఆది, సోమవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. బుధవారం రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలులో గరిష్ఠ ఉష్ణోగ్రత 34.4 డిగ్రీలుగా నమోదైంది.

కొవ్వూరు పురపాలక పీఠం తెదేపా పరం

పల్లా సమక్షంలో ఆ పార్టీలో చేరిన ఛైర్‌పర్సన్, నలుగురు కౌన్సిలర్లు



తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరిన ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పురపాలక పీఠం అధికారికంగా తెదేపా పరమైంది. వైకాపా తరఫున 4వ వార్డు నుంచి గెలిచి ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న బావన రత్నకుమారి.. 3, 10, 15, 20 వార్డుల కౌన్సిలర్లు వరిగేటి లలితకుమారి, బత్తి నాగరాజు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పతివాడ నాగమణి బుధవారం వైకాపాకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. మంగళగిరిలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారితోపాటు మాజీ కౌన్సిలర్లు బావన రాజేష్, పతివాడ రామారావు, నాయకులు వరిగేటి సుధాకర్, కె.విజయ్‌కుమార్ తదితరులు తెదేపా కండువాలు కప్పుకొన్నారు. కాగా కొవ్వూరు పట్టణ పరిధిలో 23 వార్డులు ఉన్నాయి. గత పురపాలక ఎన్నికల్లో వైకాపా 15, తెదేపా 7, భాజపా నుంచి ఒకరు విజయం సాధించారు. దీంతో వైకాపా పాలకవర్గం ఏర్పాటైంది. తాజా పరిణామాలతో ఎక్స్‌అఫిషియో సభ్యుడైన తెదేపా ఎమ్మెల్యేతో కలిపి కూటమి బలం 14కు చేరింది. ప్రస్తుతం వైకాపాకు 10 మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో ఇద్దరు వైస్‌ఛైర్మన్లు.

గతంలోనే బయటికొచ్చి..: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది తర్వాత ఛైర్‌పర్సన్, ముగ్గురు కౌన్సిలర్లు వైకాపాకు రాజీనామా చేస్తున్నామంటూ గతేడాది జూన్ 7న సంతకాలతో కూడిన ప్రతులను విడుదల చేశారు. ఇప్పుడు ఆ నలుగురితో పాటు మరో కౌన్సిలర్ సైతం తెదేపాలో చేరారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తెదేపా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకట రమణచౌదరి, జోన్-2 పరిశీలకులు సుజయ్‌కృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

18 రోజుల జైలు జీవితాన్ని ఎంజాయ్ చేశా

- జైలు నుంచి విడుదలైన అనంతరం మాజీ మంత్రి అంబటి రాంబాబు

రాజమహేంద్రవరం (కంబాలచెరువు, వి.ఎల్.పురం, ఏవీఏ రోడ్డు), న్యూస్‌టుడే: 'ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని రోజులు జైలులో ఉంచినా వెనకడుగు వేయను. వైకాపా అధినేత జగన్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా కూల్చేవరకూ నా పోరాటం ఆగదు' అని మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి బుధవారం సాయంత్రం విడుదలైన ఆయన బయట విలేకర్లతో మాట్లాడారు. తనను అన్యాయంగా జైలులో పెట్టారని ఆరోపించారు. ఈ 18 రోజుల జైలుజీవితం ఎంత కఠినంగా ఉన్నా ఎంజాయ్ చేశానన్నారు. జైలు వద్ద మాజీ మంత్రులు వేణు, తానేటి వనిత, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, మాజీ ఎంపీ వంగా గీత తదితరులు రాంబాబును కలిశారు.

జైలువద్ద వైకాపా శ్రేణుల రచ్చ

కారాగారం నుంచి అంబటి విడుదల సందర్భంగా వైకాపా శ్రేణులు రచ్చరచ్చ చేశారు. ఆయన బయటికొస్తుండగా బారికేడ్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అతి కష్టం మీద నిలువరించగలిగారు. కారులో రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటికి అంబటి బయలుదేరగా.. జై జగన్ అని నినాదాలు చేస్తూ పార్టీ జెండాలు, డప్పు వాయిద్యాలతో రావడంతో ట్రాఫిక్ స్తంభించి జనం నరకం చూశారు. జక్కంపూడి నివాసం ఎదుటి రోడ్డు వద్ద వైకాపా శ్రేణుల తాకిడితో రాకపోకలు నిలిచిపోయాయి. రాంబాబు బుధవారం రాత్రి జక్కంపూడి నివాసంలోనే బస చేశారు.



చేతులు ఊపుతూ జైలు నుంచి బయటికొస్తున్న అంబటి రాంబాబు

సంక్రాంతి వసూళ్ల కేసులో అంబటికి షరతులతో బెయిల్

పోలీసు దర్యాప్తునకు సహకరించాలని ఆదేశం

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాలకు పింఛనుదారుల నుంచి డబ్బులు తీసుకుని లాటరీ టికెట్లు అంటగట్టిన కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేస్తూ గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ న్యాయస్థానం జడ్జి కుముదిని బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీసులు దాఖలుచేసిన కస్టడీ పిటిషన్‌ను కొట్టేశారు. పోలీసుల దర్యాప్తునకు అంబటి సహకరించాలని, కేసులో సాక్షులను ప్రభావితం చేయకూడదని న్యాయమూర్తి షరతులు విధించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కేసులో అంబటికి స్థానిక కోర్టు ఈ నెల 1న రిమాండ్ విధించింది. అనంతరం పట్టాభిపురం, సత్తెనపల్లి పోలీసులు వేర్వేరుగా పీటీ వారంట్లపై కోర్టులో హాజరుపరచడంతో ఈ కేసుల్లో రిమాండ్ విధించారు. అప్పటి నుంచి జైల్లో ఉన్న ఆయనకు గతంలో రెండు కేసుల్లో బెయిల్ లభించింది. ఇప్పుడు తాజా కేసులోనూ బెయిల్ రావడంతో విడుదలయ్యారు.

37 రాజ్యసభ స్థానాలకు మార్చి 16న ఎన్నికలు

దిల్లీ: వచ్చే ఏప్రిల్‌లో ఖాళీ కానున్న 37 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ద్వైవార్షిక ఎన్నికల కోసం ఎన్నికల సంఘం (ఈసీ) బుధవారం షెడ్యూలు ప్రకటించింది. ఈ నెల 26న సంబంధిత ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని.. వచ్చే నెల 16న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపింది. 10 రాష్ట్రాలకు చెందిన ఈ 37 రాజ్యసభ స్థానాలు ఏప్రిల్ 2, 9 తేదీలతో ఖాళీ కానున్న సంగతి గమనార్హం. వీటిలో అత్యధికంగా మహారాష్ట్ర నుంచి ఏడు సీట్లు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో తమిళనాడు (6), పశ్చిమ బెంగాల్ (5), బిహార్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ (2), ఛత్తీస్‌గఢ్ (2), హరియాణా (2), హిమాచల్ ప్రదేశ్ (1) ఉన్నాయి. ఏప్రిల్‌లో పదవీకాలం ముగియనున్న ప్రముఖ నేతల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ (జేడీయూ), శరద్ పవార్ (ఎన్సీపీ-ఎస్పీ), రాందాస్ అఠవాలే (ఆర్పీఐ-ఏ), తిరుచ్చి శివ (డీఎంకే) తదితరులు ఉన్నారు. తెలంగాణ నుంచి ఎగువ సభకు ఎన్నికైన అభిషేక్ సింఘ్వీ (కాంగ్రెస్), కె.ఆర్.సురేశ్ రెడ్డి (భారాస) పదవీకాలం ఏప్రిల్ 9తో పూర్తికానుంది.

★ ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, అస్సాంలలో భాజపా సొంతంగానో, పాలక సంకీర్ణంలో మిత్రపక్షంగానో అధికారంలో ఉంది. ఎగువ సభలో పార్టీ బలం పెరిగేందుకు ఇది దోహదపడనుంది. ఏప్రిల్‌లో 9 మంది భాజపా ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీ 15-18 స్థానాలు గెల్చుకునే అవకాశాలు ఉన్నాయి. హిమాచల్, తమిళనాడు, తెలంగాణ, బెంగాల్‌లలో విపక్షపార్టీల ప్రభుత్వాలు ఉన్నాయి.

9వ తేదీ దాటితే ఈకేవైసీ కుదరదు

రైతులను తిప్పి పంపుతున్న రెవెన్యూ యంత్రాంగం

ఈనాడు, అమరావతి: పట్టాదారు పాసు పుస్తకాలకు ఈకేవైసీ చేయాలంటే ప్రతి నెల 9వ తేదీ వరకే అవకాశం.. తర్వాత రైతులొచ్చినా కుదరదంటూ రెవెన్యూ అధికారులు వెనక్కి పంపేస్తున్నారు. మళ్లీ ఎప్పుడు ఈకేవైసీ తీసుకుంటారో.. వారికి కొత్త పాసు పుస్తకాలు ఎప్పుడిస్తారన్న దానిపై స్పష్టత లేదు. దీంతో పలుచోట్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. రీసర్వే పూర్తయిన 4,783 గ్రామాల్లో జగన్ బొమ్మలతో ఇచ్చిన వాటి స్థానంలో రాజముద్రతో కూడిన కొత్త పాసు పుస్తకాలు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 22.33 లక్షల పుస్తకాలు ముద్రించి, ఈ ఏడాది జనవరి 2 నుంచి 9 వరకు పంపిణీ చేశారు. తీరా వాటిలో రైతుల పేర్లు, విస్తీర్ణం, మొబైల్ నంబర్లలో తప్పులు దొర్లడం, చనిపోయిన వారి పేర్లతోనూ ముద్రించడంతో భూ యజమానుల్లో ఆందోళన వ్యక్తమైంది. దీంతో వాటన్నిటినీ సరిచేసి, తప్పుల్లేని పాసు పుస్తకాల్ని పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారు.

ప్రతి నెలా నియోజకవర్గానికి రెండు గ్రామాల్లో..

ప్రతి నియోజకవర్గంలో రీసర్వే పూర్తయిన రెండు గ్రామాల్ని ఎంచుకుని తప్పులను సరిదిద్దాలని రెవెన్యూ శాఖ ఆదేశాలిచ్చింది. దీని ప్రకారం రైతులకు నెల ముందు నుంచే భూముల వివరాలు తెలియజేసి, వారి ఈకేవైసీ తీసుకోవాలి. తర్వాతే పాసు పుస్తకాల ముద్రణకు పంపాలి. వాటిని ప్రతి నెలా 2వ తేదీ నుంచి 9వ తేదీ లోగా ప్రజాప్రతినిధులతో భూ యజమానులకు పంపిణీ చేయించాలి. ఫిబ్రవరిలో 280 గ్రామాల పరిధిలో 1.83 లక్షల పాసు పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. మార్చిలోనూ ఇదేవిధంగా అందజేయాలని అధికారులు నిర్ణయించారు.

ఎప్పుడైనా ఈకేవైసీ తీసుకోవాలంటున్న రైతులు

ఎంపిక చేసిన గ్రామాల్లోని వీఆర్వోలు అక్కడి భూ యజమానులకు ముందుగా అన్ని వివరాలతో కూడిన ముసాయిదా పట్టాదారు పాసు పుస్తకాల కాపీలు అందించాలి. వాటిలో వివరాలన్నీ సరిగా ఉన్నాయో లేదో ధ్రువీకరణ తీసుకోవాలి. మార్చిలో పంపిణీ చేసే పట్టాదారు పాసు పుస్తకాలకు.. ఫిబ్రవరి 9వ తేదీ వరకే ఈకేవైసీకి అవకాశం ఇచ్చారు. 10వ తేదీ నుంచి రైతులు అందుబాటులో ఉన్నా.. ఈకేవైసీ తీసుకోవడం లేదు. 9వ తేదీ తర్వాత యాప్ పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. మళ్లీ ఎప్పుడు ఈకేవైసీ తీసుకుని పాసు పుస్తకాలిస్తారని అడిగితే తమకేం తెలియదని చెబుతున్నారు.

★ తర్వాత నెలలో అదే నియోజకవర్గంలో మరో రెండు గ్రామాల్ని ఎంపిక చేసుకుని, పంపిణీకి అవకాశం ఇస్తారు. కిందటి నెలలో పంపిణీ చేసిన గ్రామాల్లో మిగిలిన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకునే అవకాశం ఉండటం లేదు. అంటే వారికి 1బీ వివరాలు తెలియడం లేదు. తప్పులు సరిదిద్ది కొత్త పాసు పుస్తకాలిచ్చే అవకాశం లేదు. దీంతో తప్పులు లేని పాసు పుస్తకాలు పంపిణీ చేయాలనే లక్ష్యం పూర్తిగా నెరవేరడం లేదు. నిర్దేశిత గడువు లేకుండా ఎప్పుడైనా ఈకేవైసీ తీసుకుని, పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చే విధానం అమలు చేయాలని భూ యజమానులు కోరుతున్నారు.



ఉన్నదానిని విస్మరిస్తాం

మనం సాధారణంగా లేనిదాని గురించి చింతిస్తాం. ఉన్న దానిని విస్మరిస్తాం. ఉన్నప్పుడు పట్టించుకోం. దూరమవుతున్నప్పుడు గుండెలకు హత్తుకుంటాం. విలువ తెలుసుకోవడానికి నష్టం జరిగేదాకా వేచి ఉండడం ఎందుకు? విచిత్రమైన ఈ మానవ నైజం నుంచి బయటపడాలి.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

అన్ని రాష్ట్రాలకూ స్వయం ప్రతిపత్తి కావాలి

- జస్టిస్ కురియన్ జోసెఫ్ నివేదిక రాజ్యాంగ సవరణ సన్నాహానికి శ్రీకారం వంటిది
- తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: 'అన్ని రాష్ట్రాలకూ స్వయం ప్రతిపత్తి కావాలని జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ వెల్లడించింది. రాజ్యాంగ సవరణ సన్నాహానికి ఈ కమిటీ నివేదిక శ్రీకారం వంటిది' అని తమిళనాడు శాసనసభలో ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై తమిళనాడు ప్రభుత్వం గతంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తన నివేదిక తొలి భాగాన్ని 16న స్టాలిన్‌కు అందజేసింది. బుధవారం ఆ నివేదికను స్టాలిన్ శాసనసభలో ముందుకు తెస్తూ.. 'ఇది రాజ్యాంగ సవరణ సన్నాహానికి శ్రీకారం' అని అన్నారు. అన్ని అధికారాలను కేంద్ర ప్రభుత్వం తన వద్దే ఉంచుకొని నిరంకుశ ధోరణితో రాష్ట్ర ప్రభుత్వాలను గౌరవించడం లేదని విమర్శించారు. అన్నింటికీ కేంద్రం దయ కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితి మారాలని, దీనికి పరిష్కారమే ఈ ఉన్నతస్థాయి కమిటీ నివేదిక అని వెల్లడించారు. అన్ని రాష్ట్రాలు కలిసి నడిపించే సమాఖ్య పాలన ప్రభుత్వంగా కేంద్రం వ్యవహరించాలన్నదే తమ లక్ష్యమన్నారు. పార్లమెంటు ఉభయసభల్లోనూ ఈ విధానానికి మద్దతు తెలిపే ప్రజాస్వామిక శక్తులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని ఏకం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలకు నివేదిక ప్రతులను పంపనున్నట్లు తెలిపారు.

కృష్ణా ట్రైబ్యునల్‌కు కేంద్ర ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధం

- సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదన
- తదుపరి విచారణ 25కి వాయిదా
- అమరావతిలో అన్ని పనులూ జరుగుతున్నాయి: జస్టిస్ బాగ్చి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య కృష్ణా జలాల పంపిణీ ఎలా చేయాలన్న విషయం గురించి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 89లో స్పష్టంగా ఉన్నా.. కేంద్రం దానికి అతీతంగా అంతర్రాష్ట్ర జలవివాద చట్టం-1956లోని నిబంధనలను అనుసరించి 2024 అక్టోబర్ 6న అదనపు ప్రతిపాదనలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, విభజన చట్టానికి విరుద్ధమని, అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టానికి కూడా విరుద్ధమేనని సుప్రీంకోర్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విన్నవించింది. పార్లమెంటు చేసిన చట్టం అమల్లో ఉండగా, దాన్ని కాదని కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీచేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. అందుకే అదనపు ప్రతిపాదనలను తోసిపుచ్చాలని కోరింది.

ఇప్పటికీ అమల్లో 1976 నాటి అవార్డే

కృష్ణా ట్రైబ్యునల్-1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీలతో పాటు, అంతకుమించి కేటాయింపులుంటే వాటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య పంపిణీ చేసే అంశాన్ని పరిశీలించాలని ప్రతిపాదిస్తూ కేంద్ర జలశక్తి శాఖ 2023 అక్టోబర్ 6న జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ అదే ఏడాది రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన రిట్ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వీఎం పంచోలిల ధర్మాసనం ముందు ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా బుధవారం సుమారు 45 నిమిషాలు వాదనలు వినిపించారు. అప్పటికి కోర్టు పనిగంటలు పూర్తికావడంతో తదుపరి విచారణను ధర్మాసనం వచ్చే బుధవారానికి (25వ తేదీ) వాయిదా వేసింది. కృష్ణా ట్రైబ్యునల్-2కి కేంద్రం చేసిన ప్రతిపాదనలు చట్టవిరుద్ధమని తాజా వాదనల్లో న్యాయవాది జైదీప్ గుప్తా ప్రధానంగా పేర్కొన్నారు. '1976లో వెలువడిన కృష్ణా ట్రైబ్యునల్-1 అవార్డులో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు నీటి కేటాయింపులు చేశారు. ఆ అవార్డే ఇప్పటికీ అమల్లో ఉంది. 2004లో ఏర్పాటైన కృష్ణా ట్రైబ్యునల్-2 జారీచేసిన అవార్డును ఇప్పటివరకూ నోటిఫై చేయలేదు. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. విభజన చట్టంలోని సెక్షన్ 89లో కృష్ణా ట్రైబ్యునల్-1 ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటిని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య ఎలా పంపిణీ చేయాలన్న విషయాన్ని స్పష్టంగా పొందుపరిచారు. కొత్త రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ముందు రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులకు ఇరు రాష్ట్రాలూ కట్టుబడి ఉండాలని ఆ సెక్షన్‌లోని వివరణలో ఉంది. అందువల్ల మిగిలిన వాటినే ప్రాజెక్టుల వారీగా కేటాయించాలి. అందుకే సెక్షన్ 89లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ అంశాన్ని పరిశీలించడానికి కేంద్రం కృష్ణా ట్రైబ్యునల్-2 గడువును రెండేళ్లు పెంచుతూ 2014 మే 15న ఉత్తర్వులిచ్చింది. కృష్ణా ట్రైబ్యునల్-1 కేటాయించిన 811 టీఎంసీలను 512:299 టీఎంసీల చొప్పున పంచుకొనేందుకు 2014 జూన్ 18న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఒక మధ్యంతర ఒప్పందం కుదుర్చుకున్నాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం నీటి కేటాయింపులు కోరుతూ తెలంగాణ దాఖలుచేసిన ఐఏ-13ని కృష్ణా ట్రైబ్యునల్ డిస్పోజ్ చేస్తూ 20.9.2023న జారీచేసిన ఉత్తర్వుల్లో... ఆ అంశాలను పరిశీలించే న్యాయపరిధి తమకు లేదని చెప్పింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కొత్తది కాబట్టి కృష్ణా ట్రైబ్యునల్-1 కేటాయించిన 811 టీఎంసీల నుంచి దానికి కేటాయించే అధికారం తమకు లేదని చెప్పింది. అందువల్ల ట్రైబ్యునల్ తన పరిధిని సెక్షన్ 89 కింద ఉన్న అంశాలకే పరిమితం చేసుకుంది. కానీ కేంద్రం దాన్ని ఉల్లంఘిస్తూ 6.10.2023న కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా కొత్త ప్రతిపాదనలు చేయడం చట్ట, రాజ్యాంగవిరుద్ధం'' అని జైదీప్ గుప్తా పేర్కొన్నారు.

కృష్ణా నది ఒడ్డునే మా విల్లాలు: జస్టిస్ బాగ్చి

ఏపీ న్యాయవాది జైదీప్ గుప్తా రెండు రాష్ట్రాల మధ్య కృష్ణానది ప్రవహిస్తున్న తీరు గురించి వివరిస్తూ జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి అక్కడ పనిచేసినందున దాని గురించి వారికి పూర్తిగా అవగాహన ఉంటుందని గుర్తుచేశారు. అప్పుడు జస్టిస్ బాగ్చి జోక్యం చేసుకుంటూ 'నేను ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసినప్పుడు మా విల్లాలు కృష్ణానది ఒడ్డునే ఉండేవి. కృష్ణానది అందంగా ప్రవహిస్తూ అమరావతిలోని హైకోర్టు కిందగా వెళ్లేది. ఇప్పుడు అక్కడ పెద్ద హైకోర్టు భవనం నిర్మిస్తున్నారు. అదృష్టవశాత్తు ప్రస్తుతం అన్ని పనులూ సక్రమంగా జరుగుతున్నాయి'' అని వ్యాఖ్యానించారు.

తుపానును కచ్చితంగా అంచనా వేసే ఆధునిక పరికరం

- దేశంలోనే మొదటిసారిగా రూపొందించిన ఎన్ఐఓటీ


సముద్రంలో డేటా సేకరిస్తున్న డబ్ల్యూవీపీ, వేవ్ రైడర్ బోయ్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తుపానును కచ్చితంగా అంచనా వేసే ఆధునిక పరికరాన్ని చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ) రూపొందించింది. ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ మాట్లాడుతూ.. సముద్ర పర్యవేక్షణ, తీర ప్రాంత కార్యకలాపాలకు సంబంధించిన డేటా పొందేందుకు దేశంలోనే మొదటిసారిగా అలల శక్తితో పనిచేసే ఆధునిక పరికరాన్ని తమ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిందని తెలిపారు. దేశీయంగా తయారుచేసిన ఈ వేవ్ ప్రొపెల్డ్ వర్టికల్ ప్రొఫైలర్(డబ్ల్యూవీపీ)ను చెన్నై సముద్ర తీరంలో 50 మీటర్ల లోతున విజయవంతంగా పరీక్షించినట్లు పేర్కొన్నారు. సముద్రపు నీటి లవణీయత, ఉష్ణోగ్రతలే.. తుపాను ఏర్పడటం, బలపడడం, ప్రయాణించే దిశ, బలహీనపడటం వంటి అంశాలను నిర్ణయిస్తాయన్నారు. తుపానుకు సంబంధించిన డేటా సేకరించేందుకు ఇప్పటివరకు సముద్రమట్టం కింద మ్యూరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి 10 సెన్సార్ల ద్వారా డేటా పొందుతున్నామని చెప్పారు. వేవ్ ప్రొపెల్డ్ వర్టికల్ ప్రొఫైలర్ ద్వారా 12 సెన్సార్లు చేసే పనిని ఒక్క సెన్సార్ ద్వారా చేయొచ్చని తెలిపారు. సముద్రపు అలల శక్తిని ఉపయోగించుకుని దానిని పైకి, కిందకు కదిలేలా రూపొందించారన్నారు. ఈ పరికరాన్ని సముద్రపు అలల స్వభావాన్ని అంచనా వేసే వేవ్ రైడర్ బోయ్‌కు 55 మీటర్ల లోతులో అనుసంధానిస్తారన్నారు. వాటి నుంచి అందే డేటా ఆధారంగా తుపానును కచ్చితంగా అంచనా వేయొచ్చని వివరించారు.

ఐటీయూబీఆర్ డైరెక్టర్ ఎన్నికలో భారత్‌కు మద్దతు ఇవ్వండి

- యూకే మంత్రికి కేంద్రమంత్రి పెమ్మసాని వినతి


యూకే మంత్రి కనిష్క నారాయణ్‌తో కేంద్రమంత్రి పెమ్మసాని, ఐటీయూబీఆర్ డైరెక్టర్ పదవికి భారత్ తరఫున పోటీచేస్తున్న రేవతి


ఈనాడు, దిల్లీ: అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ ఆధ్వర్యంలోని రేడియో కమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్ పదవికి జరిగే ఎన్నికలో భారత్ తరఫున పోటీచేస్తున్న ఎం.రేవతికి మద్దతు ఇవ్వాలని యూకే ఏఐ వ్యవహారాల మంత్రి కనిష్క నారాయణ్‌కు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన కనిష్క నారాయణ్‌తో కేంద్రమంత్రి పెమ్మసాని ఇక్కడి తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్లోబల్ స్పెక్ట్రం నిర్వహణ, రేడియో కమ్యూనికేషన్‌లో భారత్-యూకేల మధ్య పరస్పర సహకారం గురించి చర్చించారు. 2027-30 సంవత్సరాలకు ఐటీయూ కౌన్సిల్‌కు భారత్ ప్రాతినిధ్యం వహించడానికి యూకే మద్దతు అవసరమని పెమ్మసాని చెప్పారు. భారత టెలికాం రంగంలో కృత్రిమమేధ కీలకపాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. భారత్‌కున్న సామర్థ్యాలను, యూకే పరిశోధన బలాలను కలిపితే ఏఐ, 6జీ లాంటి రంగాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలను నెలకొల్పవచ్చని పెమ్మసాని అభిప్రాయపడ్డారు. భారత జాతీయ క్వాంటమ్ మిషన్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, సెక్యూరిటీ నెట్‌వర్క్‌లలో సహకరించుకోవడానికి విస్తృత అవకాశాలున్నందున ఇరు దేశాలూ అందిపుచ్చుకోవాలని కోరారు.

నిరాధార ఆరోపణలు ఉపసంహరించుకుని.. బేషరతుగా క్షమాపణ చెప్పండి

- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు
- వైకాపా నేత బొత్స సత్యనారాయణకు హెరిటేజ్ ఫుడ్స్ లీగల్ నోటీసు

ఈనాడు, అమరావతి: 'ఇందాపూర్ డెయిరీ ద్వారా తితిదేలో పరోక్షంగా నెయ్యి సరఫరా కాంట్రాక్టులు దక్కించుకున్నారంటూ తమ సంస్థపై చేసిన నిరాధార ఆరోపణలను శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, వైకాపా నేత బొత్స సత్యనారాయణ తక్షణమే ఉపసంహరించుకోవాలి. బేషరతు క్షమాపణలు చెప్పాలి' అని హెరిటేజ్ ఫుడ్స్ డిమాండ్ చేసింది. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ హెరిటేజ్ ఫుడ్స్ న్యాయవాది జి.మల్లికార్జునరావు బుధవారం బొత్సకు లీగల్ నోటీసు పంపారు. '1992లో ఏర్పాటైన హెరిటేజ్ సంస్థకు పాల సేకరణ, ప్రాసెసింగ్, పాల ఉత్పత్తుల విక్రయాలతో 16 రాష్ట్రాల్లో మంచి పేరుంది' అని అందులో వివరించారు. హెరిటేజ్ సంస్థ ప్రతిష్ఠ దెబ్బతీయడానికే ఉద్దేశపూర్వకంగా బొత్స సత్యనారాయణ వైకాపా నేతలతో కలిసి విలేకర్ల సమావేశం పెట్టి, ఆరోపణలు చేశారని, అవి 18.2.2026న సాక్షి పత్రిక, డిజిటల్ ఎడిషన్లలో ప్రచురితమయ్యాయని లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. నిజానికి హెరిటేజ్ ఫుడ్స్, ఇందాపూర్ డెయిరీ యాజమాన్యాల మధ్య ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి యాజమాన్య సంబంధం లేదని నోటీసులో వివరించారు. 'హెరిటేజ్ ఫుడ్స్ 22 సంస్థలతో కలిసి సిండికేట్‌గా ఏర్పడిందని బొత్స చేసిన ఆరోపణలు నిరాధారం. హెరిటేజ్ ప్రతిష్ఠ దెబ్బతీయడానికే ఉద్దేశపూర్వకంగా ఈ పదం ఉపయోగించారు. రాజకీయ లబ్ధి కోసం, దురుద్దేశంతోనే ఆరోపణలు చేశారని స్పష్టమవుతోంది. ఏపీ, తెలంగాణల్లో హెరిటేజ్ పరువు తీయడానికి కుట్రపన్నారు. నిరాధార ఆరోపణలపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకునే హక్కు మా క్లయింట్‌కు ఉంది' అని నోటీసులో పేర్కొన్నారు.

తమిళనాడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో.. సరికొత్త గర్భనిరోధక పరికరం


'ఇంప్లానన్ ఎన్ఎక్స్‌టీ' గర్భనిరోధక పరికరం

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఇంప్లానన్ ఎన్ఎక్స్‌టీ' అనే ఆధునిక గర్భనిరోధక పరికరాన్ని మహిళలకు ఉచితంగా అమరుస్తున్నారు. ఈ మేరకు సంబంధిత వివరాలను కుటుంబ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ నటరాజన్, మదురై రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు గాయత్రి వెల్లడించారు. అగ్గిపుల్ల పరిమాణంలో ఉండే మెత్తటి ప్లాస్టిక్ పరికరాన్ని మహిళల మోచేతి చర్మం కింద అమర్చుతారన్నారు. ఇందులో ఉండే ప్రత్యేక హార్మోన్ నిరంతరం శరీరంలోకి విడుదలవుతూ మూడేళ్లపాటు గర్భం రాకుండా అడ్డుకుంటుందని చెప్పారు. ఆ లోపు గర్భం దాల్చాలనుకుంటే దానిని తీసివేస్తే సరిపోతుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.3 వేల వరకు ఉంటుందన్నారు. గర్భనిరోధక మాత్రలు, కాపర్-టీ కన్నా ఇది సురక్షితమైందని తెలిపారు. కొత్త విధానంపై వైద్యులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పరికరం చెన్నై, ధర్మపురి జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉందని వెల్లడించారు.

జీవితం భారమైందని భార్యను కడతేర్చాడు

- మానసిక సమస్యలతో ఇస్రో విశ్రాంత ఉద్యోగి దారుణం


సంధ్యాశ్రీ, నాగేశ్వరరావు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మానసిక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఇస్రో మాజీ ఉద్యోగి నాగేశ్వరరావు తన భార్య సంధ్యాశ్రీ (60)ని దారుణంగా హతమార్చాడు. విజయవాడకు చెందిన నాగేశ్వరరావు ఉద్యోగ నిమిత్తం కొన్నేళ్ల కిందటే బెంగళూరుకు వచ్చాడు. ఆవలహళ్లి సమీపంలోని బొమ్మనహళ్లిలో స్థిరపడ్డారు. దంపతులిద్దరు స్థానిక వర్చుసో అపార్ట్‌మెంట్‌లో ఉంటుండగా వీరి ఏకైక కుమార్తె విదేశాల్లో ఉంటోంది. కొద్ది రోజుల కిందటి నుంచి నాగేశ్వరరావుకు మానసిక సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలోనే జీవితం భారమైందని ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. కానీ, తను చనిపోతే భార్య ఒంటరి అవుతుందని భావించి బుధవారం ఉదయం ఆమె ముఖంపై దిండు పెట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఆ తర్వాత తనూ ఉరేసుకోవాలనుకొని.. భయపడి ఆగిపోయినట్లు బెంగళూరు వైట్‌ఫీల్డ్ విభాగం డీసీపీ సైదులు అడావత్ తెలిపారు. ఆవలహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైడెన్ డేటా సెంటర్ ఏర్పాటుకు అదనపు భూములు

- గతంలో 480 ఎకరాలకు బదులు.. 601 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకారం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయనున్న 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ కోసం అదనపు భూములు కేటాయించేందుకు అంగీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో మూడు ప్రాంతాల్లో 480 ఎకరాలు డేటా సెంటర్ కోసం కేటాయించేందుకు గతంలో అనుమతించింది. దీన్ని 601.40 ఎకరాలకు పెంచాలని సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. గతంలో రాంబిల్లి దగ్గర 160 ఎకరాలు, అడవివరం, ముడసర్లోవ దగ్గర 120 ఎకరాలు, తర్లువాడ దగ్గర 200 ఎకరాలు కేటాయించారు. తాజాగా సంస్థ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు తర్లువాడ దగ్గర 266.60 ఎకరాలు, అడవివరం, ముడసర్లోవ దగ్గర 160 ఎకరాలు, రాంబిల్లి దగ్గర 174.80 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆ భూములను అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా) లిమిటెడ్ పేరిట కేటాయించాలని రైడెన్ కోరింది.

మూడు ఎస్‌పీవీల ఏర్పాటు

మూడు ప్రాంతాల్లో డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి మూడు ఎస్‌పీవీలను అదానీ సంస్థ ఏర్పాటు చేసింది. వైజాగ్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్(అడవివరం, ముడసర్లోవ), వైజాగ్ మెగా డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్ (తర్లువాడ), వైజాగ్ రాంబిల్లి డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్ (రాంబిల్లి)గా ఏర్పాటు చేసినట్లు.. వాటికి సంబంధించిన డీపీఆర్‌లను ప్రభుత్వానికి అందించింది. డేటా సెంటర్ల నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వంతో సంప్రదింపుల కోసం అదానీ ఇండియా ఇన్‌ఫ్రా, అదానీ కనెక్స్ సంస్థను నోటిఫైడ్ పార్టనర్‌గా ఎంపిక చేసినట్లు రైడెన్ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ వీసీఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

రూపాలే కాదు.. మార్కులూ ఒకేలా!


మహ్‌రూఫ్ అహ్మద్‌ఖాన్, మస్‌మార్ అహ్మద్‌ఖాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సాధారణంగా కవలలు దాదాపు ఒకేలా కనిపిస్తారు. వారికి జేఈఈలో మార్కులు కూడా ఒకేలా వస్తే.. ఆశ్చర్యం అనిపిస్తుంది కదా? ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కి చెందిన కవలలు మహ్‌రూఫ్ అహ్మద్‌ఖాన్, మస్‌మార్ అహ్మద్‌ఖాన్ ఇద్దరూ జేఈఈ మెయిన్-2026లో 99.98 పర్సంటైల్ సాధించి సత్తా చాటుకున్నారు. రాజస్థాన్‌లోని కోటాలో వీరు ఒకేచోట కోచింగ్ తీసుకున్నారు. ముంబయి ఐఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్ చదువుతామని, తర్వాత సివిల్స్‌కు సన్నద్ధమవుతామని వీరిద్దరూ చెబుతున్నారు.

ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే

- విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: కొలంబోలో ఆదివారం జరిగిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ప్రభుత్వ ధనం వెచ్చించి తాను వెళ్లినట్లు సాక్షి మీడియాలో వచ్చిన వార్తను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఖండించారు. ''ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే. నా డబ్బులతో నేను మ్యాచ్ చూస్తిని. నీ డబ్బులు ఏమైనా ఖర్చు చేశానా జగన్?'' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. లోకేశ్ కొలంబో పర్యటన కోసం ప్రభుత్వ ధనం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ప్రభుత్వం ఇచ్చిన ఫ్యాక్ట్ చెక్‌ను లోకేశ్ పోస్టు చేశారు.

మాకెందుకు న్యాయం జరగడం లేదు?

- 18 ఏళ్లుగా పోరాడుతున్నా ఫలితం లేకపోయింది
- కోర్టులో కన్నీటిపర్యంతమైన ఆయేషా మీరా తల్లిదండ్రులు

ఈనాడు – అమరావతి: '2007లో ఆయేషా మీరా హత్య జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు దర్యాప్తు జరిగింది. ఎనిమిదేళ్ల పాటు సీబీఐ దర్యాప్తు సాగింది. తుది నివేదికను పరిశీలిస్తే చాలా లోపాలు ఉన్నాయి. 18 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ఇంతవరకు మాకు న్యాయం జరగలేదు. ఈ మధ్య కాలంలో పెద్దవాళ్లను కూడా అరెస్టు చేస్తున్నారు కదా. ఐపీఎస్ అధికారులను కూడా మినహాయించడం లేదు. మరి.. మా విషయంలో మాత్రం ఎందుకు న్యాయం జరగడం లేదు?' అని ఆయేషా మీరా తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా సీబీఐ కోర్టులో కన్నీటిపర్యంతమయ్యారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు నివేదిక ఇవ్వాలని, రీపోస్ట్‌మార్టం అనంతరం ఆయేషా శరీర అవశేషాలను తిరిగి ఇప్పించాలని వారు దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం విజయవాడ సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా వారు తీవ్ర ఆవేదన వెలిబుచ్చగా న్యాయాధికారి అన్నపూర్ణ వారిని అనునయించారు. న్యాయం జరగలేదని భావిస్తే.. ప్రైవేటు కేసు కానీ ప్రొటెస్ట్ పిటిషన్ కానీ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. తమకు అంత ఆర్థిక స్థోమత లేదని, ఇంకా పోరాటం చేయలేమని షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా చెప్పారు. పిటిషన్ వేస్తే.. ప్రభుత్వమే న్యాయసహాయం అందిస్తుందని న్యాయాధికారి వివరించారు. ఈ కేసులో తాము ప్రొటెస్ట్ పిటిషన్లు వేయబోమని వారు సమాధానమిచ్చారు.

పోలీసులను రక్షించేందుకే సీబీఐ పాట్లు

హైకోర్టు చెప్పినా సరే.. సీబీఐ కొత్తగా దర్యాప్తు చేయలేదని, గతంలో పోలీసులు సాగించిన విచారణ ఆధారంగానే వారి దర్యాప్తు సాగించారని ఆయేషా మీరా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ వాదించారు. పునర్విచారణ కోసం సీబీఐ మృతురాలి తల్లిదండ్రుల వద్దకు రానేలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే అప్పట్లో తాము సాక్ష్యం చెప్పామని సీబీఐ విచారణలో రెవెన్యూ, పోలీసు అధికారులు స్టేట్‌మెంట్లు ఇచ్చారని నివేదికను న్యాయవాది శ్రీనివాస్ చదివి వినిపించారు. అయినా వారిపై చర్య తీసుకోలేదని చెప్పారు. ఆయేషా శరీర అవశేషాలను తల్లిదండ్రులకు ఇస్తే సంప్రదాయం ప్రకారం ఖననం చేస్తారని తెలిపారు. అప్పట్లో 10 రోజుల్లో తిరిగి ఇచ్చేస్తామని చెప్పి తీసుకెళ్లినా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. దీంతో వాటిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు ఆదేశాలు జారీచేస్తామని న్యాయాధికారి చెప్పారు. రంజాన్ నెల ప్రారంభమైనందున మతపెద్దలతో మాట్లాడి రెండు రోజుల్లో తేదీ చెబుతామని షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా చెప్పారు. దీనికి అంగీకరించిన న్యాయాధికారి తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేశారు.

ఫిర్యాదీకి వినియోగదారుల కమిషన్ జరిమానాలు

- దురుద్దేశపూర్వకంగా కేసులు వేసినట్లు గుర్తింపు

ఈనాడు, హైదరాబాద్: సైదాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నిరాధార ఆరోపణలతో, దురుద్దేశపూర్వకంగా కేసులు దాఖలు చేస్తున్నారని గుర్తించిన జిల్లా వినియోగదారుల కమిషన్-2 అతడికి జరిమానాలు విధించింది.

- ఇనార్బిట్‌మాల్‌లోని పీవీఆర్ సినిమాస్ స్క్రీన్-5లో సినిమా చూడటానికి ఫిర్యాదీ 2022 జులై 10న బుక్ మై షో ద్వారా నాలుగు టిక్కెట్లు(ప్రతి టికెట్ రూ.1300 చొప్పున) బుక్ చేశారు. థియేటర్‌కు వెళ్లాక టాయిలెట్లు మరమ్మతుల్లో ఉండటాన్ని గుర్తించి, సిబ్బందిని అడిగితే, కిందనే ఉన్న మరో శౌచాలయం వినియోగించమని సూచించారు. ఇది సేవాలోపమని ఆరోపిస్తూ.. ఫిర్యాదీ 2024 జూన్‌లో కమిషన్‌లో కేసు వేశారు. 2022 జులై 3 నుంచి 13 జులై 2022 వరకు థియేటర్‌లోని 6 స్క్రీన్లలో విక్రయించిన టిక్కెట్ల డబ్బు మొత్తం వినియోగదారులకు రిఫండ్ చేయడంతోపాటు, మానసిక వేదనకు పరిహారంగా తనకు రూ.8,396(టికెట్ల ఆధారంగా), ఖర్చుల కోసం రూ.6,396, అనైతిక వ్యాపారంగా పేర్కొంటూ రూ.7,996 చెల్లించాలని ఫిర్యాదీ కోరారు. టాయిలెట్ల విషయంలో సిబ్బంది సహాయం అందించారని, ఇతర వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రాలేదని చెప్పిన పీవీఆర్ వాదనలతో కమిషన్ ఏకీభవిస్తూ.. ఫిర్యాదీకి రూ.10,000 జరిమానాతో పాటు రూ.5000(రూ.2,500 చొప్పున బుక్ మై షో, పీవీఆర్‌కు) చెల్లించాలని తీర్పునిచ్చింది. మరో రూ.5000 వినియోగదారుల సంక్షేమ నిధిలో జమ చేయాలని స్పష్టం చేసింది.
- 2025 ఫిబ్రవరి 5న ఇదే ఫిర్యాదీ రత్నదీప్ రిటైల్ స్టోర్ నుంచి రూ.399 ఛార్జబుల్ మస్కిటో బ్యాట్‌ను కొనుగోలు చేశారు. ఛార్జ్ చేసినా పనిచేయడం లేదని, స్టోర్ నుంచి స్పందన రాలేదంటూ 2025 మే 9న కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. పరిహారంగా రూ.40 వేలు, కోర్టు ఖర్చులు రూ.6 వేలు, అనైతిక వ్యాపారానికి పాల్పడినందుకు మరో రూ.20 వేలు, కమిషన్‌కు రూ.లక్ష చెల్లించేలా ఆదేశించాలని కోరారు. విచారించిన కమిషన్ అధ్యక్షుడు వక్కంటి నర్సింహారావు, సభ్యులు పారుపల్లి జవహర్‌బాబు, డి.శ్రీదేవి..ఆరోపణలను నిరూపించే సాంకేతిక నివేదిక లేదని, ఫొటో, ఈమెయిల్ సరిపోవని పేర్కొంటూ ఫిర్యాదీకి రూ.10 వేల జరిమానా విధించింది. అదనంగా రత్నదీప్ రిటైల్ ప్రైవేటు లిమిటెడ్‌కు రూ.5 వేలు, వినియోగదారుల సంక్షేమ నిధికి రూ.5 వేలు జమ చేయాలని స్పష్టం చేసింది.



జీవితమంటే మైలు రాళ్లు దాటుకు పోవడమే

జీవితమంటే మైలు రాళ్లు దాటుకుంటూపోయే క్రమం. ఇందులో చేరుకోవలసిన గమ్యం అంటూ ఉండదు. జీవితాంతం ప్రయాణం కొనసాగించాల్సిందే. దాన్ని ఆస్వాదిస్తూ సాగడమే. ప్రతిక్షణాన్ని ఎంత బాగా ఆస్వాదించామన్నదే జీవిత అంతిమ లక్ష్యం.

– అవిజీత్, కంటెంట్ క్రియేటర్

EENADU Vol: 52, Issue: 190 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

మకరందం

makarandam@eenadu.in

ఈనాడు

గురువారం ఫిబ్రవరి 19, 2026

15

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

ఆత్మశుద్ధికి.. ఆధ్యాత్మిక వృద్ధికి మార్గం

రంజాన్ మాసం

అల్లాహ్‌కు దగ్గరవటానికి, ఆత్మను శుద్ధి చేసుకోవటానికి, పాపాలకు క్షమాపణ కోరటానికి ఓ ప్రత్యక్ష మార్గం ఉపవాసం. ఇస్లాం మౌలిక సూత్రాల్లో ఒకటైన ఉపవాసాన్ని ఉర్దూలో రోజా అంటారు. పవిత్ర రంజాన్ నెలలో నిజాయితీ, ఉపవాసాల (సామ్/ సియామ్)తో పాపాలకు క్షమాపణ లభిస్తుందని పలు హదీసులు చెబుతున్నాయి. 'ఎవరైతే విశ్వాసంతో రంజాన్ నెలలో ఉపవాసం ఉంటారో.. వారి పాపాలను అల్లాహ్ క్షమిస్తాడు' అని ఒకచోట, 'అల్లాహ్ అందించిన అపురూపమైన వాటిలో ఉపవాసం ఒకటి. మనల్ని దైవానికి సన్నిహితంచేసే ఉన్నత ఆరాధనా విధానం ఇది. తెలియక చేసిన తప్పుల నుంచి ఆధ్యాత్మిక కవచంలా కాపాడుతుంది. నరకాగ్నికి దూరం చేస్తుంది. ఉపవాసం ఉన్నవారికి స్వర్గలోక ఎనిమిది ద్వారాల్లో ఒకటైన అర్-రయ్యాన్ ద్వారా ప్రత్యేక ప్రవేశం లభిస్తుంది' అని మరోచోట ఉపవాసం విశిష్టతను వివరించారు. రోజా అంటే కేవలం ఆహారానికి దూరంగా ఉండటం కాదు, అనైతిక సంభాషణలు, చర్యలకూ దూరంగా ఉండాలని సూచించారు. రంజాన్ నెలలో రోజూ తెల్లవారు జామున భోజనం (సహర్), సకాలంలో ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయాలని దైవ ప్రవక్త ముహమ్మద్ (స) నిర్దేశించారు. ఉపవాసంతో గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. ఉపవాసం ఉన్నవారికి ఆహారాన్ని సమకూర్చటం ద్వారా కూడా అంతటి ప్రతిఫలం లభిస్తుందని ఒక హదీసు పేర్కొంది. రంజాన్ చివరి పది శక్తిమంతమైన రాత్రుల్లో విశ్వాసులు- 'ఓ అల్లాహ్! నువ్వు క్షమించేవాడివి.. క్షమాగుణాన్ని ఇష్టపడతావు.. కాబట్టి నన్ను క్షమించు' అని ప్రార్థించాలని సిఫార్సు చేస్తున్నాయి. రంజాన్ నెలను మూడు భాగాలుగా విభజిస్తారు. అవి వేర్వేరు విధాలుగా ఆధ్యాత్మిక పురోగతిపై దృష్టి సారిస్తాయి. మొదటి భాగం దయాపూరిత రోజులు (రెహ్మత్). ప్రార్థన, దాతృత్వ చర్యల ద్వారా అల్లాహ్ కరుణ, దయ, ఆశీర్వాదాలను కోరుకునే కాలం. రెండో భాగం క్షమాపణ రోజులు (మగ్ఫిరా). గత పాపాలకు పశ్చాత్తాపం చెందటానికి, అల్లాహ్ క్షమాపణ కోరటానికి అంకితం చేసే కాలమిది. చివరి భాగం మోక్ష దినాలు (నిజాత్). ఇది నరకాగ్ని నుంచి రక్షణ, ఆశ్రయం పొందటంపై దృష్టి పెడుతుంది. ఇతికాఫ్ (మసీదులో ఏకాంతంగా ఉండటం), లైలతుల్ ఖదర్ (శక్తిమంతమైన రాత్రి) కోసం నిరీక్షణ.. దీనిలో భాగంగా ఉంటాయి. స్థూలంగా ఈ నెలంతా దయ, క్షమాపణలతో నిండి ఉంటుందని గ్రహించాలని ఇస్లామిక్ పండితులు పేర్కొంటున్నారు. కాబట్టి రంజాన్ మాసం హృదయపూర్వక ఆరాధనతో గత పాపాలను నశింపచేసుకునే కాలంగా చెప్పవచ్చు. ఇది స్వీయ అభివృద్ధికి, మరింత ధర్మబద్ధమైన జీవితానికి దోహదం చేస్తుంది.



సత్ఫలితాలు పొందిన కాశీరాజు

పురాణాలు మనకు అందించిన వ్రతాల్లో 'పుత్ర గణపతి వ్రతం' ఒకటి. మంచి సంతానం కలగాలని కాంక్షించేవారు ఫాల్గుణ మాసం శుక్ల చతుర్థి నాడు ఈ వ్రతం చేసుకుంటారు.

రాజులు తమ తర్వాత రాజ్యాన్ని పాలించేందుకు పుత్ర సంతతి అవసరమని భావించేవారు. సామాన్య జనానీకం వృద్ధాప్యంలో తమను ఆదరించడానికి, పెళ్లయ్యి అత్తవారింటికి వెళ్లిన ఆడపిల్లల బాగోగులు చూసుకోవడానికి మగ సంతానం కావాలని కోరుకుంటారు. ఈ కారణాలతో చాలామంది ఫాల్గుణ శుద్ధ చవితి రోజున 'పుత్ర గణపతి' వ్రతం ఆచరించడం ఆనవాయితీ. చతుర్థి నాడు గణపతిని పూజిస్తే శుభం కలుగుతుందని శాస్త్ర వచనం. భాద్రపద శుద్ధ చవితి వలెనే ఫాల్గుణ శుద్ధ చవితి కూడా గణపతికి ప్రీతికరం. శివుడు వినాయకునికి గజముఖం అమర్చినప్పుడు దేవతలందరూ వినాయకుని ముక్తకంఠంతో స్తుతించారు. అప్పుడు పార్వతీదేవి- 'ఈ స్తుతితో ఫాల్గుణ శుద్ధ చవితి నాడు గౌరీ సమేత గణపతిని పూజించడం శ్రేష్ఠం. ఆ రోజు నువ్వులు, బెల్లం నివేదించి ప్రసాదంగా స్వీకరించిన వారికి శక్తియుక్తులు గల సంతానం ప్రాప్తిస్తుంది' అని వరం ఇచ్చినట్టు వరాహ పురాణం పేర్కొంది. డుండి అనే కాశీరాజు పుత్ర గణపతి వ్రతం ఆచరించి సత్ఫలితాలు పొందాడని తెలియజేసే కథనం ప్రచారంలో ఉంది.



ఎలా చేయాలి..

ఫాల్గుణ శుద్ధ చవితి రోజున వేకువనే తలస్నానం చేసి, శుభ్రమైన వస్త్రాలు ధరించాలి. గడపకి పసుపు రాసి, కుంకుమ దిద్ది.. గుమ్మానికి తోరణాలు కట్టాలి. పూజా మందిరంలో కలశస్థాపన చేసి, గణపతి ప్రతిమను కుసుమాలతో అలంకరించాలి. ఉపవాస దీక్ష చేపట్టి గణపతిని షోడశోపచారాలతో పూజించాలి. ఆయనకు ఇష్టమైన అరటి, వెలగ, నారికేళ ఫలాలను, పిండివంటలను నైవేద్యంగా సమర్పించాలి. పుత్ర గణపతి వ్రత కథను పఠించి.. అక్షతలను తలపై చల్లుకోవాలి. పుత్ర సంతానం కావాలని సంకల్పం చేసుకోవాలి. అలా చేయడం వలన త్వరలోనే సత్ఫలితం కలుగుతుందని పెద్దలు చెబుతారు. సాయంత్రం కూడా పూజ చేసి ఉపవాస దీక్ష విరమించాలి.


ప్రేమకు ప్రతిరూపం రామకృష్ణ పరమహంస. కృష్ణుడి జ్ఞానవిజ్ఞానాలు, క్రీస్తు దయ కరుణల కలబోత ఆ అవతార పురుషుడు. ఆత్మాన్వేషకులనే కాదు, ఆధ్యాత్మిక గురువులనూ ప్రభావితం చేసిన రామకృష్ణుల జీవితం.. పారమార్థిక సాగరంలో దీపస్తంభం లాంటిది. ఎందరెందరో భక్తులను తన వాత్సల్యంతో ఆకర్షించిన ప్రేమమూర్తి ఆ పరమహంస.

పరమహంస.. ప్రేమస్పర్శ!

నేడు రామకృష్ణ పరమహంస జయంతి

ఒకసారి కొందరు శిష్యులు రామకృష్ణుల ధర్మపత్ని శారదాదేవితో 'అమ్మా! గురుదేవుల ఈ సంఘం ఇంత పటిష్ఠంగా నిలిచి ఉండటానికి కారణం ఏమిటి?' అనడిగారు. ఆధ్యాత్మిక శక్తి, సంఘ నిర్వహణా సామర్థ్యం, సమర్థులైన సాధువులు, అశేష భక్తుల సహకారం.. ఇలా ఏదో ఒకటి కారణమై ఉంటుందని వారు భావించారు. కానీ ఆ దివ్యజనని స్పష్టం చేసిన సమాధానం వాటన్నింటికన్నా భిన్నమైంది. 'ఈ సంఘాన్ని నిరాటంకంగా ముందుకు నడుపుతున్నది శ్రీరామకృష్ణుల అవ్యాజప్రేమ' అన్నారామె.

రామకృష్ణులు- పాండితీ ప్రకర్షతోనో, సంక్లిష్ట వేదాంత ప్రబోధాలతోనో భక్తులను ఆకర్షించ లేదు.. తన అచంచల, అనంత వాత్సల్యంతోనే ఆకట్టుకున్నారు. ఆయన జీవన ప్రస్థానం, ఆధ్యాత్మిక శిక్షణల్లోనూ ఆ పరమప్రేమే తొణికిసలాడేది. పారమార్థిక పురోగతిలో సహనం, క్షమ, విశాలత్వం తదితర లక్షణాలతో కూడిన ప్రేమ పాత్రను ఆ అవతారమూర్తి పరోక్షంగా ఈ లోకానికి ప్రకటితం చేశారు.



ఆధ్యాత్మిక బోధ.. హాస్యస్ఫోరకంగా

సంక్లిష్ట ఆధ్యాత్మిక సత్యాలను కూడా చక్కని హాస్యకథల్లో రంగరించి భక్తుల హృదయాలకు హత్తుకునే రీతిలో బోధించడం రామకృష్ణుల ప్రత్యేకత. తన దగ్గరకు వచ్చిన జిజ్ఞాసువులను పదాల పటాటోపంతో కలవరపెట్టకుండా సరళమైన భావాలతో వివరించేవారే ఉత్తమ గురువని నిరూపించారు. క్లిష్టమైన తాత్విక విషయాలను కూడా హాస్యపూరిత దృష్టాంతాలతో చెప్పేవారు. ముఖంలో మందహాసం లేకుండా, మానసికోల్లాసం కరవై, పాషాణ హృదయాలతో చేసే సాధనలు ఫలించవని ఆచరణలో నిరూపించారు. అందుకే ఆయన సాన్నిధ్యం భక్తులకు నవ్వుల పూదోటలో విహరించినట్లు తోచేది. హాస్యయోగ సాధనలో నిమ్నగమైనట్లు అనిపించేది. సాధారణంగా ఆధ్యాత్మిక సమావేశాల్లో కనిపించే గంభీర వాతావరణానికి భిన్నంగా ఆ సద్గురువు గోష్ఠి హాస్యవల్లరిగా అలరించేది. నేటికీ ఎందరో ఆధ్యాత్మిక గురువులు.. రామకృష్ణులు ఆనాడు చెప్పిన హాస్యకథల్నే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రస్తావిస్తుంటారు.

కళంకితులపైనా కరుణావృష్టి

బంకించంద్ర ఛటర్జీ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి ప్రముఖులనే కాదు, నాటి సమాజం కళంకితులుగా ముద్రవేసిన వారిని సైతం రామకృష్ణులు ప్రభావితం చేశారు. ఉచ్ఛనీచ భేదాలు లేకుండా తనను ఆశ్రయించిన వారందరికీ ఆధ్యాత్మిక అభ్యున్నతి కలిగించారు. అలాంటివారిలో గిరీష్ చంద్రఘోష్ అనే బెంగాల్ నాటక రచయిత ఒకరు. 'నేను చేయని పాపమంటూ లేదు. వాటన్నిటినీ రామకృష్ణులు స్వీకరించి నన్ను పవిత్రుణ్ణి చేశారు. అందరూ పాపప్రక్షాళన కోసం గంగలో స్నానం చేస్తారు. కానీ నేను గంగలో మునిగితే.. ఆ గంగామాతే పవిత్రమయ్యేంత పునీతునిగా చేశారు గురుదేవులు' అంటూ ఆత్మీయులతో పంచుకున్నారాయన.

కళ్లకద్దుకున్న నారాయణగురు

పారమార్థిక సాధనలో ఎందరికో మార్గదర్శకులుగా నిలిచిన సంఘసంస్కర్త నారాయణగురు. కేరళలోని ఆ సద్గురువును కలిసిన ఓ ఆధ్యాత్మికసాధకుడు- రామకృష్ణుల ఛాయాచిత్రాన్ని చూపి.. 'వీరి గురించి మీ అభిప్రాయం చెప్పండి స్వామి!' అన్నారు. నారాయణగురు పరమహంస ఆ చిత్రాన్ని కళ్లకద్దుకుని 'సాక్షాత్తూ పరబ్రహ్మ. అవతారపురుషుడు. ప్రేమ, కరుణ, వాత్సల్యం ఉట్టిపడే ఆయన ముఖం శాంతిప్రదాయకం' అని వ్యాఖ్యానించడం విశేషం.

మాటకు, మనసుకు అతీతుడు

నిత్యం రామకృష్ణులకు హారతి ఇస్తూ మఠం ఆలయాల్లో 'ప్రభూ! వాక్కులకూ, మనసుకు అతీతుడివి! వెలుగులకు వెలుగై, మా హృదయ కుహరంలో ప్రకాశించే పరంజ్యోతివి! మా అజ్ఞాన అంధకారాన్ని పారదోలు' అని స్తుతిస్తారు. భగవంతుణ్ణి సంపదలు కాదు, అజ్ఞానాన్ని తొలగించమని వేడుకోవాలని రామకృష్ణుల భక్తులు సూచిస్తున్నారు. స్వయంగా ఆ పరమహంస కూడా తనను ఆశ్రయించిన వారిని లౌకికంగా స్థితిమంతులను చేయటం కన్నా, పారలౌకికంగా శ్రీమంతులను చేయటమే లక్ష్యంగా భావించారు. అజ్ఞానంలో కొట్టుకుపోతున్నవారిలో జ్ఞానదీప్తులు వెలిగించి పారమార్థికంగా సుసంపన్నులను చేశారు.

సమత్వమే సాధన

ప్రపంచాన్ని సాక్షీభావంతో చూడగలిగినవారే ఆధ్యాత్మిక సాధకులని రామకృష్ణులు నిరూపించారు. బంగారాన్నీ, మట్టినీ సమంగా భావించగలిగిన నాడు, ఇక ఎలాంటి ప్రలోభాలకూ లొంగరు- అనటానికి ఆయనే నిదర్శనం. భాగవతం నుంచి బుద్ధుడి వరకూ చెప్పింది ఇలాంటి సమత్వం గురించే. అందుకే ఆ పరమహంసను స్తుతిస్తూ..

> తుల్య లోష్ట కాంచనం చ హేయ నేయ ధీగతం
> స్త్రీషు నిత్య మాతృరూప శక్తి భావ భావుకం
> జ్ఞాన భక్తి భుక్తి ముక్తి శుద్ధ బుద్ధిదాయకం

మట్టినీ, బంగారాన్నీ సమానంగా చూసే, లేశమాత్రమైనా కోరికలు లేని, స్త్రీలను మాతృమూర్తిగా, కాళీమాతగా భావించే, భక్తులకు జ్ఞానం, ఉపాధి, ముక్తి, నిర్మలమైన బుద్ధిని ప్రసాదించే రామకృష్ణులకు నమస్కరిస్తున్నాను- అని నీరాజనాలు అర్పించారు స్వామి విరజానంద అనే పరమహంస శిష్యులు. స్వామి వివేకానంద 'ఖండన భవబంధన' అని పరమహంసను స్తుతించారు. ప్రాపంచిక బంధాల నుంచి విముక్తి కలిగిస్తారన్నది భావం.

తుది గడియల్లోనూ భక్తులకై తపించి

రామకృష్ణులు ఆఖరి రోజుల్లో గొంతు క్యాన్సర్‌తో అవస్థపడ్డారు. ఆయన మాట్లాడితే ప్రాణాపాయం- అని వైద్యులు వారించినా లక్ష్యపెట్టక.. భక్తులకు సాంత్వననిచ్చే అమృతవాక్కులు పలికేవారు. ప్రేమపూర్వక మాటలతో, భక్తిగీతాలతో వారికి మనశ్శాంతిని ప్రసాదించేవారు. సేవకులు, శిష్యులు అడ్డుపడుతుంటే 'ఒక్కరికి మేలు చేసేందుకు వెయ్యి జన్మలైనా ఎత్తుతాను. మరణానికి భయపడను' అన్నారాయన.

– బి.సైదులు

2న అహోబిల నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శ్రీ మహావిష్ణువు దశ అవతారాల్లో మత్స్య, కూర్మ, వరాహ అవతారాల తర్వాత ఆవిర్భవించింది నరసింహ అవతారం. బాలుడైన భక్తుడి మాటను నిలబెట్టడానికి పుట్టిందే నృసింహ అవతారం. నరసింహమూర్తి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత అహోబిల శిఖరం చేరి, అక్కడ స్థిరవాసం ఏర్పరచుకున్నాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ భీకరమూర్తి బలం చూసి ఆశ్చర్యపోయిన దేవతలు 'అహో! బలం!' అంటూ అర్చించి ఆనంద పరవశులయ్యారు. అందుకే ఆ పుణ్యస్థలికి 'అహోబలం' పేరు స్థిరమయ్యిందని, ఆ అహోబలమే కాలాంతరంలో 'అహోబిలం'గా పరిణమించిందని చెబుతారు.

అనంత ఫలాల అహోబలేశ్వరుడు

ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లాలోని ఈ ప్రముఖ నారసింహ క్షేత్రం 108 వైష్ణవ దివ్యాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతోంది. అహోబిల క్షేత్రాన ఎగువ అహోబిలం, దిగువ అహోబిలం అనే రెండు ప్రదేశాల్లో స్వామి పూజలందుకోవడం విశేషం. ఈ దివ్యక్షేత్రంలోని ఎగువ, దిగువ ఆలయాల పరిసరాల్లో నృసింహుడు జ్వాల, అహోబిల, మాలోల (లక్ష్మీదేవి ప్రియమైన విష్ణువు), క్రోడ (వరాహ నరసింహమూర్తి), కారంజ (కానుగచెట్టు), భార్గవ (పరశురామ), యోగానంద, ఛత్రవట (దేవగంధర్వులు ఆరాధించే ప్రసన్నరూపమైన నరసింహుడు), పావన మూర్తులుగా ఆరాధనలు అందుకుంటున్నాడు. అందుకు నిదర్శనంగానే నృసింహమూర్తులైన 'జ్వాలాహోబిల మాలోల క్రోడ కారంజ భార్గవాఃయోగానంద ఛత్రవట పావన నవమూర్తయః' అని స్తుతించడం ఆనవాయితీ. కారంజ నరసింహమూర్తిని కేవలం ఈ క్షేత్రంలోనే దర్శించుకోవచ్చు. దిగువ అహోబిలం నుంచి ఎగువ అహోబిలానికి వెళ్లే దారిలో కారంజ నరసింహుడి విగ్రహం కనిపిస్తుంది. కారంజ వృక్షం అంటే కానుగ చెట్టు. ఆ మానులో వెలసిన నృసింహమూర్తికి శివుడిలా నుదుట కన్ను. ఒక చేతిలో బాణం, మరో చేతిలో చక్రం అలంకృతమై ఉండటం విశేషం. పౌరాణిక కథను అనుసరించి.. ఆంజనేయుడు కారంజ చెట్టు కింద శ్రీరామునికై తపస్సు చేస్తుండగా.. నరసింహస్వామి ప్రత్యక్షమై 'నేనే నీ రాముణ్ని' అన్నాడు. హనుమంతుడు నమ్మలేకపోయాడు. నరహరి 'నేనే విష్ణువు, రాముణ్ని, శివుణ్ని' అని... విష్ణుమూర్తిలా సుదర్శనం, శ్రీరాముడిలా బాణం ధరించి.. పరమశివుడిలా నుదుట కన్నుతో దర్శనమిచ్చాడు.

'మా' అంటే లక్ష్మీదేవి, 'లోలుడు' అంటే ప్రియమైనవాడు. అలా లక్ష్మీనాథుడు మాలోల నరసింహుడై ఈ పుణ్యక్షేత్రంలో అనుగ్రహిస్తున్నాడు. భార్గవుడు అంటే పరశురాముడు.. ఈ ప్రాంతంలోనే తపస్సు చేశాడు. అందుకే ఈ క్షేత్రంలో ఒక నరసింహమూర్తికి భార్గవ నరసింహుడని పేరు. హిరణ్యకశిపుడి సంహార అనంతరం నరసింహస్వామి ప్రహ్లాదుడికి యోగవిద్యలు నేర్పించాడు. ఇక్కడి యోగానంద నరసింహ ఆలయం ఆ స్మృతికి నిదర్శనమని భక్తులు భావిస్తారు. అహోబిలంలో వటవృక్షం నీడలో వెలసిన స్వామిని ఛత్రవట నరసింహుడని పేరు. ఆదిశంకరాచార్య, పద్మపాదుడు, రామానుజాచార్యులు, చైతన్య మహాప్రభువు, వేదాంత దేశికులు, కాకతీయ ప్రతాపరుద్రుడు వంటి ప్రముఖులే కాకుండా ఎందరో నృసింహ ఉపాసకులు ఈ క్షేత్రాన్ని దర్శించి సాధనలు చేశారని చరిత్ర కథనం. తిరుమల శ్రీనివాసుడి ఇలవేల్పు అహోబిల నరసింహుడని, అందుకే వివాహానంతరం పద్మావతీదేవితో కలిసి ఆ వేంకటాచలపతి అహోబల క్షేత్రానికి వచ్చాడు- అన్నది పురాణోక్తి.





ఎగువన ఉగ్ర నరసింహుడై..

ఎగువ అహోబిలంలో స్వామి స్వయంభువుడై వెలిశాడు. ఇక్కడ అమ్మవారు చెంచులక్ష్మిగా కొలువై ఉంది. శివుడు, చక్రాళ్వార్‌లు కూడా ఈ క్షేత్రంలో దర్శనమిస్తారు. ఆలయం చెంతన భవనాశినీ నది ప్రవహిస్తుంది. ఎగువ అహోబిలం దాటి వెళ్తే అరణ్యంలో కొండల చీలిక మధ్య 'ఉగ్రస్తంభం' అని ఉంటుంది. అక్కడ శంఖచక్రాలు, స్వామి తిరునామం కనిపిస్తాయి.

దిగువన ప్రహ్లాద వరదమూర్తి..

దిగువ అహోబిలం ఆలయంలో నరసింహుడు ప్రహ్లాద వరదమూర్తిగా భక్తులకు ఆశీస్సులను అందిస్తున్నాడు. ఈ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీమహాలక్ష్మి, ఆండాళ్, ఆళ్వార్ సన్నిధానాలు కూడా దర్శనమిస్తాయి. ఈ పురాతన ఆలయంలో సువిశాల మండపం, సుందర రాజగోపురం, అబ్బురపరిచే శిల్పసంపద దివ్యానుభూతిని కలిగిస్తాయి. స్తంభాలపై నవ నారసింహ విగ్రహాలను దర్శించవచ్చు. పద్మావతి శ్రీదేవీ భూదేవీ సమేతుడై కొలువైన జ్వాలానరసింహస్వామి ఉత్సవమూర్తి మరో ప్రత్యేకత. అహోబిల మఠాన్ని స్థాపించిన మొదటి జీయర్‌స్వామి రాతి ప్రతిమ కూడా ఇక్కడ ప్రతిష్ఠితమైంది.

అర్చించి తరించిన అన్నమయ్య..

తిరుమల శ్రీవేంకటేశ్వరుడి పరమభక్తుడైన పదకవితాపితామహుడు అన్నమయ్యకు అహోబిలానికి అవినాభావ సంబంధముంది. ఈ పవిత్రక్షేత్రానికి చెందిన శఠకోప యతీంద్రులే అన్నమాచార్యకు నారసింహ మంత్రాన్ని ఉపదేశించారు. ఆ శక్తితో అన్నమయ్య- స్వామిపై అనేక కీర్తనలు రచించాడు. 'అనిశము తలచరో అహోబలం, అనంతఫలదం అహోబలం..', 'అహోబలేశ్వరుడు అఖిల వందితుడు..' తదితర కీర్తనలు అన్నమయ్య ఘంటం నుంచి జాలువారిన అహోబలేశ్వర స్తుతులే!



రెండు అహోబిలాల్లో ఉత్సవాలు..

ఏటా ఫాల్గుణ మాసంలో అహోబిల నరసింహస్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. ఎగువ అహోబిలంలో తొలుత ఈ ఉత్సవాలు ఆరంభమవుతాయి. ఆ మరుసటి రోజు దిగువ అహోబిలంలో వేడుకలకు అంకురార్పణ జరుగుతుంది. ఉత్సవాల్లో లక్ష్మీసమేత నరసింహుని వైష్ణవ సంప్రదాయం ప్రకారం.. శేష, సింహ, గరుడ, హనుమత్ తదితర వాహనాల్లో అంగరంగవైభవంగా ఊరేగిస్తారు. ఏడో రోజు దేవదేవేరులకు కల్యాణం నిర్వహిస్తారు. పదోరోజు దేవతామూర్తులను రథంపై ఊరేగిస్తారు. ఈ ఉత్సవాల్లో మరింత విశేషమైంది చెంచుల అగ్గిసేవ. నరసింహునికి జరిగే గరుడోత్సవంలో చెంచులు ఈ సేవతో స్వామి ఊరేగింపులో పాల్గొంటారు. పుష్కరిణిలో జరిగే తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

– ప్రహ్లాద్


సత్సంగ మహిమ...

> సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
> నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః

సత్పురుషుల సాంగత్యం వల్ల విషయవాంఛల పట్ల మమకారం తగ్గి, మోహాలు తగ్గి, మనసు నిశ్చలమై జీవన్ముక్తిని పొందుతామన్నది భజగోవిందంలోని ఈ శ్లోక భావన.

సత్ అంటే భగవంతుడు, సంగం అంటే కలయిక అని అర్థం. శ్రేష్ఠమైన సత్సంగ సమయంలో మనం భగవంతుడితో ఏకమవుతాం. అందుకే మహర్షులు సత్సంగాన్ని మోక్షద్వారం అని కూడా అంటారు.

సత్సంగ మహిమను అద్భుతంగా చూపే ఒక కథ.. రుషుల మధ్య వాదనలా మొదలై, లోకానికి శాశ్వత సత్యాన్ని తెలియజేసే దివ్య దృశ్యంగా మారుతుంది. ఒకసారి బ్రహ్మర్షి వశిష్ఠుడు, రాజర్షి నుంచి బ్రహ్మర్షిగా ఎదిగిన విశ్వామిత్రుడు.. ఇద్దరూ సంభాషణలో నిమగ్నమయ్యారు. విశ్వామిత్రుడు తన మహా తపశ్శక్తి గురించి విశేషంగా చెబుతూ 'తపస్సు ద్వారా మనిషి దేవత్వాన్ని పొందగలడు. తపస్సే శ్రేష్ఠ సాధనం' అన్నాడు గర్వంగా. వశిష్ఠుడు చిరునవ్వుతో 'తపస్సు గొప్పదే. కానీ సత్సంగం అంతకంటే శ్రేష్ఠం. సద్భక్తులతో, సజ్జనులతో కలిసి ఉండటం వల్ల కలిగే అంతరంగ శుద్ధి తపస్సు చేసినంతలో సులభంగా రాదు' అని బదులిచ్చాడు.



ఆ వాదనలో ఎవరికి వారే తమ అభిప్రాయమే సత్యమని నమ్మి, త్రిమూర్తుల తీర్పు కోరాలని నిర్ణయించారు. వశిష్ఠ, విశ్వామిత్రులు మొదట బ్రహ్మదేవుని వద్దకు వెళ్లారు. బ్రహ్మ- ఈ ప్రశ్న లోతైనదని చెప్పి విష్ణుమూర్తిని అడగమన్నాడు. విష్ణువు కూడా తాను సమాధానం చెప్పలేనని, పరమేశ్వరుణ్ణి ఆశ్రయించమన్నాడు. శివుడు నవ్వి 'మీ సందేహానికి ఉత్తమ సమాధానం ఆదిశేషుడి వద్ద లభిస్తుంది' అని సూచించాడు. భూమిని తన పడగలపై మోస్తున్న ఆదిశేషుడు మహర్షుల సందేహం విని- 'మీరిద్దరూ మీ మీ సాధన ఫలితాన్ని సమర్పించండి. నా మీద ఉన్న భూమి భారాన్ని ఎవరి పుణ్యం తగ్గిస్తుందో చూద్దాం' అన్నాడు.

మొదట విశ్వామిత్రుడు తన ఎన్నో యుగాల తపస్సు ఫలితాన్ని సమర్పించాడు. కానీ భూమి కదలలేదు. తర్వాత వశిష్ఠుడు వినమ్రంగా నమస్కరించి 'నేను కొద్ది సమయం సజ్జనులతో గడిపిన సత్సంగ పుణ్యాన్ని సమర్పిస్తున్నాను' అన్నాడు.


మరుక్షణం.. తన మీదున్న భూమి కొద్దిగా పైకి లేవడంతో ఆదిశేషుడు 'తపస్సు మనిషిని పవిత్రుణ్ణి చేస్తుంది. కానీ సత్సంగం మనిషిని దైవత్వానికి దగ్గర చేస్తుంది. సత్సంగం ద్వారా వచ్చే చైతన్యం, శుద్ధి, జ్ఞానం.. ఇవి తపస్సుతో కూడా సులభంగా పొందలేనివి' అన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు వినయంతో తల వంచి వశిష్ఠుడికి నమస్కరించాడు. తనకు ఒక గొప్ప సత్యం తెలిసినందుకు సంతోషించాడు.

సత్సంగ మహిమను తెలియజేస్తూ 'సత్సంగం అంటే సజ్జనులతో కొంత సమయం గడపటమే కాదు; అది ఆత్మను మేల్కొలిపే ఆధ్యాత్మిక వాతావరణం' అనే సందేశాన్ని ఇచ్చే ఈ కథ స్కాంద పురాణంలోనిది.

– యల్లాప్రగడ లక్ష్మి


అయిదు అడ్డంకులు

సంపూర్ణ జ్ఞానం పొందడానికి అయిదు అడ్డంకులు ఉంటాయని బుద్ధుడు తెలియజేశాడు. మొదటిది కామచ్ఛంద- అంటే బాహ్య ఇంద్రియాలైన రూపం, స్పర్శ, శబ్దం, వాసన, రుచి వలన కలిగే కోరికలు. ఇవి జ్ఞానసాధనలో అడ్డు తగులుతాయి. ఇంద్రియసౌఖ్యం అశాశ్వతమని తెలుసుకోవటం ద్వారా ఈ అడ్డంకిని అధిగమించవచ్చని బుద్ధభగవానుడు సూచించాడు. రెండోది వ్యాపాద- అంటే ద్వేషం, కోపం, ఈర్ష్య, అసూయ లేదా మరే కారణంతోనో ఇతరులను ద్వేషించడం, దూషించడం చేస్తే జ్ఞానసాధన కుంటుపడుతుంది. స్నేహాన్ని పంచడం, ప్రశాంతంగా ఉండటం ద్వారా ఈ అడ్డంకి తొలగుతుంది. మూడోది- థినమిద్ధ. అతినిద్ర, సోమరితనం సమయాన్ని వృథా చేయడం కూడా జ్ఞానసముపార్జనకు అడ్డంకే. దేహాన్ని చురుగ్గా ఉంచుకుంటూ, సదా ఉత్సాహంగా ఉండటం ద్వారా ఈ అడ్డు తొలగించుకోవచ్చు. గతం గురించి బాధపడుతూ అశాంతికి గురవడం నాలుగో అడ్డంకి. దీన్ని ఉద్ధచ్చ కుక్కుచ్చ అన్నాడు బుద్ధుడు. ఇది గతానికి బానిసవవడం లాంటిది. ఏకాగ్రతతో వర్తమానంలో జీవించడం ద్వారా దీన్నుంచి బయట పడవచ్చు. ఆఖరిది విచికిత్స. అంటే సంశయం. చేసే సాధన మీద పూర్తి నమ్మకం లేకపోవడం. అనుసరిస్తున్న మార్గం సరైందా కాదా అనే సందేహావస్థలో ఉండటం. బురద నీటిలో ప్రతిబింబం స్పష్టంగా కనిపించనట్టే.. ఈ స్థితిలో ఉన్నవారికి సరైన అవగాహన ఉండదు, సత్యం గోచరించదు. మంచి నిర్ణయం తీసుకునే చొరవ కొరవడి, కాలయాపన జరుగుతుంది. విచక్షణతో వ్యవహరించి నిజాన్ని గ్రహించడం ద్వారా ఈ ప్రమాదం నుంచి బయటపడవచ్చు. జ్ఞానార్జనలో అడ్డుగా నిలిచే ఈ ఐదు అడ్డంకులను 'పంచ నివారణలు' అన్నాడు బుద్ధుడు. సంపూర్ణ జ్ఞానం పొందాలంటే ఈ అయిదింటినీ జయించాలని బుద్ధదేవుని సందేశం.



– డాక్టర్ బండి సత్యనారాయణ

దేవుడితో మమేకం



> అంకోలం నిజ బీజ సంతతిరయస్కాంతోపలం
> సూచికా సాధ్వీ నైజ విభుం లతా క్షితిరుహం
> సింధుః సరిద్వల్లభం ప్రాప్నోతీహ యథా తథా
> పశుపతేః పాదారవిందద్వయం
> చేతోవృత్తిరుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే

అంకోల వృక్షం విత్తనాలను దరిచేర్చుకున్నట్టు, అయస్కాంతం సూదిని ఆకర్షించినట్లు, సాధ్వీమణి భర్తను కోరుకున్నట్లు, నది సముద్రాన్ని చేరినట్లు.. భక్తుడి మనసు సదా పరమాత్ముడి పాదపద్మాలను చేరి అక్కడ నిలుస్తుంది. అలాంటి స్థిరమైన మనస్థితినే భక్తి అంటారన్నది ఆదిశంకరాచార్య రచించిన శివానందలహరిలోని ఈ శ్లోకానికి అర్థం.

కంచి పరమాచార్య నిజమైన భక్తి ఎలా ఉంటుందో చెబుతూ పై శ్లోకాన్ని ఉదహరించి.. ఇలా కొనసాగించారు- 'భక్తి భగవంతుని ఆశ్రయం నుంచి ఎడబాటును భరించలేదు. పరిస్థితుల వల్ల దూరమైనప్పటికీ తిరిగి వెనక్కి వెళ్లి, అయస్కాంతానికి సూది ఆకర్షితమయ్యే చందాన దేవుడికి దగ్గరవుతారు. భక్తుడికి భగవంతుడితో అనుబంధం విడదీయరానిదిగా ఉంటుందంటూ ఆదిశంకరాచార్య వివరించారు.

నేను దూర ప్రయాణాలు చేస్తున్న సందర్భంలో.. అడవిలో అంకోల చెట్టును చూపించారు. దూరంగా పడిన విత్తనాలు చెట్టు దిశగా కదిలి, కాండానికి అంటుకున్నట్లు ఉండటం చూశాను. చెట్టు నుంచి రాలిన విత్తనాలు వెనుకకు పోరాడుతూ చెట్టుకు అతుక్కుపోవడాన్ని అంకోలం నిజ బీజ సంతతి- అని శంకరులు ఎందుకు చెప్పారో ఇలా ప్రత్యక్షంగా చూసినప్పుడు అర్థమైంది.

అయస్కాంతం పరిధిలోకి రాగానే.. సూది అతుక్కుపోయినట్లు.. భక్తుని మనసు దేవుని వైపు ఆకర్షితమై ఆయన సన్నిధిని స్వర్గంగా భావిస్తాడు. చుట్టూ ఎన్ని ప్రలోభాలు ఉన్నా సాధ్వీమణి సదా భర్త గురించి మాత్రమే ఆలోచిస్తుంది. అలాగే భక్తుడు లౌకిక విషయాలకు దూరంగా నిరంతరం దైవచింతనలో మునిగి ఉంటాడు. ఒక లత చెట్టును ఆశ్రయించినట్టు.. ఈశ్వరుడితో జత కట్టడానికి భక్తుడు ప్రయత్నిస్తాడు. స్వామి దర్శనంతో తరిస్తాడు. సముద్రాన్ని చేరాలని నది పరుగులుపెడుతుంది. సముద్రంలో కలిసి ప్రశాంతంగా మారుతుంది. చంచలచిత్తంతో ఉన్న భక్తుడు దైవ సన్నిధికి చేరుకున్నప్పుడు ప్రశాంతతను పొంది పరమానందభరితుడవుతాడు.

శంకరులు ఈ శ్లోకాన్ని ప్రస్తావించి అద్వైత తత్వాన్ని వివరించారు. సముద్రంలో నీరు ఆవిరై, మేఘంగా ఆవిర్భవించి.. వర్షంగా తిరిగి భూమిని చేరుతుంది. ఆ వాన నీళ్లు నదులుగా ప్రవహించి మళ్లీ సముద్రంలోకి వెళ్తాయి. ఆ విధంగా ఒక వృత్తం పూర్తవుతుంది. నది - సముద్రం అనేవి వేరువేరు అయినప్పటికీ.. వాస్తవానికి ఒకటే! అదే అద్వైతం. ఈ విశ్వంలోని ప్రతిదీ దేవుడిలో భాగమే. ఎన్నెన్ని రూపాల్లో కనిపించినప్పటికీ.. ప్రతిదీ చివరికి ఆయనలో విలీనం అవుతుంది.

మన ఆలోచనలు లౌకిక అంశాలతో ప్రేరేపితమైనప్పటికీ.. చివరికి దైవాన్ని ఆశ్రయించినప్పుడు.. అది నిజమైన భక్తిగా స్థిరపడుతుంది. ఆధ్యాత్మిక ఉన్నతికి దోహదం చేస్తుంది. అసలైన శాంతిని పొందుతాం. దైవం వెలుపల ఉన్నాడని భావించి భక్తుడు తన ఆనంద అన్వేషణను ప్రారంభిస్తాడు. స్వీయ జ్ఞాన అనుభూతితో.. దేవుడు వేరు అనే ద్వైత భావన పోయి, తాను-దైవం ఒక్కటే అనే అద్వైత స్థితి వస్తుంది. ఏకత్వ భావన కలుగుతుంది'

– ఉమాబాల

ఈనాడు సినిమా

ఆరంభం... అతి త్వరలో!


అల్లు అర్జున్

అల్లు అర్జున్ - లోకేశ్ కనగరాజ్ కలయికలో రూపొందనున్న సినిమా పనులు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాని ఓ ప్రత్యేకమైన వీడియోతో అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్ని ఊపేసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని ఈ ఏడాదిలోనే ప్రారంభించనున్నట్లు నిర్మాణ సంస్థ స్పష్టతనిచ్చింది. అల్లు అర్జున్ - అట్లీ కలయికలో సినిమా ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న దృష్ట్యా... లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ఈ ఏడాది ప్రారంభం అవుతుందో లేదో అన్న సందేహాలు ఉండేవి. కానీ చిత్రబృందం 2026లోనే మొదలు పెట్టనున్నట్లు తెలిపింది. వేసవి తర్వాత ఈ చిత్రాన్ని ప్రారంభించడంతో పాటు, ఈ సంవత్సరంలోనే సినిమాని కూడా పూర్తి చేయాలనే లక్ష్యంతో అల్లు అర్జున్ ఉన్నట్టు సమాచారం.

నువ్వే నా విజయ రహస్యం


సురేఖ, చిరంజీవి

తన విజయరహస్యానికి భార్య సురేఖనే.. కారణమని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కొన్ని ఫొటోలు పంచుకున్న చిరు.. ఇన్‌స్టాలో శుభాకాంక్షలు తెలిపారు. "నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన నీకు జన్మదిన శుభాకాంక్షలు. 1980 ఫిబ్రవరి 20న మొదలైన మన దాంపత్య పయనం నుంచి నువ్వే నా బలంగా మారావు. ఈ రోజు నీ పుట్టినరోజుతో పాటు రెండు రోజుల ముందుగానే మన వివాహ వార్షికోత్సవం కూడా చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది. నీ ప్రేమ, ఆప్యాయతలతో కుటుంబం మొత్తాన్ని నడిపిస్తున్నావు. నా తల్లిని సొంత బిడ్డలా చూసుకుంటావు. నా విజయ రహస్యం ఏమిటని ఎవరైనా అడిగితే.. నా ప్రతిభ, కృషి కాదు.. నువ్వే అని చెబుతాను. నువ్వు కుటుంబ బాధ్యతల్ని చూసుకున్నావు కాబట్టే నేను నటనపై శ్రద్ధ పెట్టాను. కష్టసుఖాల్లో మమ్మల్ని ఒకేతాటిపై నడిపించావు. నీవల్లే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను" అని చిరు తన ప్రేమను క్యాప్షన్‌లో వ్యక్తపరిచారు.

కీర్తి కల్యాణం


అనుపమ

నా వివాహం ఓ ఆడంబరమైన వేడుక అంటూ పెళ్లి కూతురి గెటప్‌లో చిందులేస్తుంది కథానాయిక అనుపమ పరమేశ్వరన్. మరి ఆమె పెళ్లి వేడుకలో మనమూ భాగమవ్వాలంటే 'క్రేజీ కళ్యాణం' సినిమా చూడాల్సిందే. అనుపమ, నరేశ్ వీకే, తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. బద్రప్ప గాజుల తెరకెక్కిస్తున్నారు. బుధవారం అనుపమ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఆమె.. కీర్తి అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికర కథతో దీన్ని రూపొందిస్తున్నట్లు తెలిపాయి చిత్రవర్గాలు. యారో సినిమాస్ బ్యానర్‌పై బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. సురేశ్ బొబ్బిలి సంగీతమందిస్తున్నారు.

నవ్వించడానికి జంటగా



సత్యదేవ్, ఫరియా, అనిల్ రావిపూడి

నవ్వించేందుకు జట్టు కట్టారు సత్యదేవ్ - ఫరియా అబ్దుల్లా. ఆ ఇద్దరూ నాయకానాయికలుగా... లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్రరెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైందీ చిత్రం. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నిచ్చారు. నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "అందరి పెదాలపై నవ్వులు పూయించే చిత్రమిది. సత్యదేవ్ 15వ చిత్రమైన ఇది, ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది. రామ్ మిరియాల సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలం" అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ "నా స్నేహితుడు నరేంద్రరెడ్డి మరో మంచి చిత్రాన్ని తీస్తున్నారు. సత్యదేవ్ నటిస్తున్న ఒక పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమిది" అన్నారు. సంగీత దర్శకుడు రామ్ మిరియాల మాట్లాడుతూ "ఇదొక అందమైన సినిమా. సత్యదేవ్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. ఇప్పటికే రెండు పాటలు పూర్తి చేశాం" అన్నారు.

చిన్ను-జున్ను ప్రేమ విన్యాసం


శ్రీవిష్ణు, నయన్ సారిక

"మంచి సంభాషణలతో... మనసులోని ఒత్తిడినంతా మాయం చేసేలా ఉంటుంది మా సినిమా" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'విష్ణు విన్యాసం'. నయన్ సారిక కథానాయిక. యదునాథ్ మారుతీరావు దర్శకత్వం వహించారు. సుమంత్‌నాయుడు.జి నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. చిన్ను, జున్నుల ప్రేమకథతో ఈ చిత్రం రూపొందినట్టు టీజర్ స్పష్టం చేస్తోంది. శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఈ సినిమానే ఓ వేడుకలా ఉంటుంది. ఒంగోలు నేపథ్యంలో కథని రాశారు దర్శకుడు. కొత్త పదాలు ఇందులో వినిపిస్తాయి. సినిమాలో తొలిభాగం యువతరానికి చాలా బాగా కనెక్ట్ అవుతుంది. ద్వితీయార్థంలో కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే అంశాలు ఉంటాయి. చివరి 15 నిమిషాలు అందరికీ నచ్చేలా ఉంటుంది. కథ ఉంటేనే మంచి వినోదం పండుతుంది. ఈ కథ ఓ కొత్త అంశంతో ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంద"న్నారు. నయన్‌సారిక మాట్లాడుతూ "ఎన్నో మలుపులున్న ప్రేమకథ ఇది. శ్రీవిష్ణు సందర్భోచితమైన కామెడీ, దర్శకుడి రచన మరో స్థాయిలో ఉంటాయి" అన్నారు. విష్ణు నుంచి ఎలాంటి వినోదం కోరుకుంటారో అది ఇందులో పక్కాగా ఉంటుందన్నారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు రధన్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

కొంత కాలం రుచి, వాసన కోల్పోయా!


మమ్ముట్టి

కొన్నింటిని కోల్పోయినప్పుడే వాటి విలువ తెలుస్తుందని అంటున్నారు మలయాళ అగ్ర హీరో మమ్ముట్టి. ప్రయోగాత్మక పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించే కథానాయకుడీయన. గతేడాది ఆయన అనారోగ్య సమస్యల కారణంగా సినిమాల నుంచి కొంత విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మమ్ముట్టి.. తొలిసారి తన అనారోగ్యం గురించి తెలుపుతూ.. తాను కోలుకున్న తీరును గుర్తుచేసుకున్నారు. "నేను చాలా కాలం పాటు రుచి, వాసన చూసే శక్తిని కోల్పోయాను. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా ఆ ఇంద్రియ జ్ఞానాన్ని తిరిగి పొందుతున్నా. ఈ సమస్య కారణంగా షూటింగ్‌లకు దూరంగా ఉండి.. ఖాళీ సమయాల్లో ఎన్నో విషయాల్ని తెలుసుకున్నా. కానీ ఇలాంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి ప్రాధాన్యత అర్థమవుతుంది. ముఖ్యంగా వినికిడి శక్తి లేని వారి బాధ వర్ణనాతీతం" అని అన్నారు. ప్రస్తుతం ఆయన పలు సినిమాల చిత్రీకరణలతో బిజీగా గడుపుతున్నారు.

హీరోయిన్లు ప్రధాన పాత్రల్లో నటించే వైవిధ్యమైన చిత్రాలకు ప్రేక్షకుల మద్దతు లేకపోవడం వల్ల అవి పూర్తిగా కనుమరుగయ్యే దశలో ఉన్నాయంటోంది నటి తాప్సీ. ఆమె ప్రధాన పాత్రలో అనుభవ్ సిన్హా తెరకెక్కించిన చిత్రం 'అస్సీ'. ఈ నెల 20న థియేటర్లలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ చిత్ర పరిశ్రమ గురించి పలు అభిప్రాయాల్ని పంచుకుంది.

మద్దతు లేకపోతే ఆ చిత్రాలు కనుమరుగే!


తాప్సీ

"మహిళను కాబట్టి నటనలో భావోద్వేగాలు సహజంగానే వస్తాయి. నేను 'అస్సీ'లోని పాత్రకు సన్నద్ధం కావడానికి కొందరు న్యాయవాదులతో కలిసి కోర్టుకు వెళ్లాను. అక్కడ లైంగిక వేధింపుల కేసులు ఎదురుకాలేదు. కానీ, ఓ మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫైళ్లను శ్రద్ధగా పరిశీలిస్తున్నారు. నాతో ఉన్న వారంతా ఆమె బహుశా ఓ కేసును అధ్యయనం చేస్తోన్నారని అన్నారు. అప్పుడు అనిపించింది మనం ఊహించిన దానికంటే ఈ పాత్ర భిన్నంగా ఉంటుందని. అప్పుడే అర్థమైంది ఒక దశ వరకూ ఆ పాత్రను కొంచెం భావోద్వేగాలు పక్కన పెట్టి ఎందుకు పోషించాల్సి వస్తుందోనని".

■ "'అస్సీ'లాంటి చిత్రాల విషయంలో మనం అంతరించిపోయే దశలో ఉన్నాము. వాస్తవానికి ఈ రకమైన సినిమాలు ఓటీటీలో వస్తూనే ఉంటాయని ప్రేక్షకులు అనుకుంటారు. కానీ, ఓటీటీలు ఇలాంటి చిత్రాలను కోరుకోవు. థియేటర్లో నడుస్తున్న సినిమాలనే తమ ప్లాట్‌ఫామ్‌లకు ఎంచుకుంటాయి. వాళ్లు కూడా థియేటర్ల ప్రేక్షకుల్ని.. తమ ప్లాట్‌ఫామ్‌కి తీసుకెళ్లాలనుకుంటారు. అందుకే ఇలాంటి సినిమాలను థియేటర్లలో చూడాల్సిన అవసరం ఉందని మనం గ్రహించకపోతే అంతరించి పోయే దశలో ఉన్నట్లే. ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేలా అన్ని రకాల సినిమాలు చేయాలి. అదికాకుండా మన సినిమా ప్రపంచ సినిమాలతో పోటీ పడలేదనుకుంటూ, ఒకే రకమైన సినిమాను తీసి, దాని వైఫల్యానికి ప్రేక్షకులే కారణమనే హక్కు మనకు ఉండదు".

■ "పాతుకుపోయిన లోతైన మంచి కథలను తెరపై ఆవిష్కరించమని చాలామంది అడుగుతున్నారు. కానీ, అలాంటి చిత్రాలకు థియేటర్లలో ఆదరణ ఎప్పుడు దక్కింది? ఇంట్లో కూర్చుని ఓటీటీలలో చూడటం ద్వారా మంచి సినిమాలకు మద్దతు ఇవ్వడం ఎలా అవుతుంది. ఒక సినిమా నచ్చితే.. ఆ విషయాన్ని ఇతరులతో పంచుకుంటేనేగా ఎక్కువ మంది థియేటర్లకు వచ్చేది. ఇండస్ట్రీలో నాలాంటి నటులు సాధించే విజయాలకంటే చేసే పోరాటాలే ఎక్కువ. మేం సినిమాని పూర్తి చేయడంతో పాటు చాలా విషయాలు ఆలోచించాల్సి వస్తుంది. నిజానికి నాకు నచ్చిన స్క్రిప్టులు ఉన్నాయి. కానీ, వాటిని పట్టాలెక్కించాలంటే ముందుగా అవి నమ్మి చేసే వ్యక్తి నాకు అవసరం. గతంలో విజయవంతమైన సినిమాలు చేసినా.. ఇప్పుడొస్తున్న చిత్రాలలో నాయికగానైనా పరిమితమైన పాత్రలనే మనం చూస్తున్నాం. నాయికలు నడిపించే అసాధారణ చిత్రాలకు కూడా ప్రేక్షకుల మద్దతు అవసరం. అప్పుడే అన్ని రకాల చిత్రాలను తెరపై చూడగలం. ఈ విషయంలో ఇతర కథానాయికల విజయం నాకు సంతోషమే. అందుకే ఇటీవల వచ్చిన 'మర్దానీ 3' చిత్ర విజయాన్ని నేను ఆస్వాదిస్తున్నా".

'సమ్మర్ హాలిడేస్' జ్ఞాపకాలు


రోహన్‌రాయ్, అరుణ్

వేసవి సెలవులు అనగానే మనసు తలుపును తట్టే అందమైన జ్ఞాపకాలు ఎన్నెన్నో! వాటన్నిటినీ గుర్తు చేసే అందమైన కథతోనే 'సమ్మర్ హాలిడేస్' చిత్రాన్ని మే 1న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు తెలిపారు ధీరజ్ మొగిలినేని. ఇటీవలే 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఆయన... తాజాగా నిర్మించిన చిత్రమే 'సమ్మర్ హాలిడేస్'. రోహన్‌రాయ్, అరుణ్ కీలక పాత్రలు పోషించారు. శ్రీకర్ దర్శకుడు. చిన్నారుల నేపథ్యంలో సాగే ఈ సినిమా పేరుని బుధవారం ప్రకటించారు. "#90స్ ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాలతో అలరించిన రోహన్... '35 చిన్న కథ కాదు' సినిమాతో ఆకట్టుకున్న మాస్టర్ అరుణ్ తదితరులు కలిసి నటించిన చిత్రమిద"ని సినీ వర్గాలు తెలిపాయి.



శివానీ నాగారం, సుహాస్, సందీప్‌కిషన్, వంశీ నందిపాటి

దానికి నేనే ఓ ఉదాహరణ

"నా కెరీర్‌లో 'మజిలీ'తో మలుపు వచ్చింది. ఆ సంతోషంలో ఉన్నప్పుడే వరుసగా అవకాశాలు వచ్చాయి. ఒక పెద్ద కథానాయిక సినిమాలో, ఆమెకు సన్నిహితంగా ఉండే పాత్ర అని పిలిచారు. సెట్‌కి వెళ్లాక ఇతన్నెందుకు పిలిచారని ఒక వ్యక్తి నా ముందే అన్నారు. కానీ కొన్నేళ్ల తర్వాత నాకు ఇష్టమైన కీర్తిసురేశ్‌తో కలిసి 'ఉప్పు కప్పురంబు' సినిమా చేసే అవకాశం వచ్చింది. నా విషయంలో విజయం అంటే అదే" అన్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'హే బల్‌వంత్'. శివానీ నాగారం కథానాయిక. గోపీ అచ్చర దర్శకత్వం వహించారు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. నరేశ్, యాంకర్ స్రవంతి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో చిత్రబృందం ఓ వేడుకని నిర్వహించింది. కథానాయకుడు సందీప్‌కిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "ఈ పదేళ్ల నా ప్రయాణం ఓ గొప్ప కలలా గడిచింది. ఎవ్వరైనా హీరో కావొచ్చనడానికి ఉదాహరణ నేనే. నన్ను ఎప్పుడూ ప్రోత్సహించే సందీప్‌కిషన్ ఈ వేడుకకి వచ్చినందుకు కృతజ్ఞతలు. దర్శకుడు తన కలని నెరవేర్చుకున్నాడు. ఓ మంచి సినిమాని తీశాడు" అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ "విడుదల తేదీలు, సినిమా పేరు మారినా ఈ సినిమా ప్రేక్షకులపై చూపించే ప్రభావంలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. ప్రేక్షకులకు పైసావసూల్ సినిమా. ఈ సందర్భంగా ఈ చిత్ర దర్శకుడికి అందరి సమక్షంలోనే నా రెండో సినిమా అడ్వాన్స్‌ని అందిస్తున్నా. ఇది సినిమాపై నాకున్న నమ్మకం" అన్నారు. సందీప్‌కిషన్ మాట్లాడుతూ "సుహాస్ అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన కథని నమ్మి సినిమాలు చేసే హీరో. నిజాయతీగా కష్టపడతాడు" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

రాజకీయ 'ప్రతిఛాయ'


నివిన్‌పౌలీ

'ప్రతిఛాయ' సినిమాతో మరోసారి ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతున్నాడు మలయాళ నటుడు నివిన్‌పౌలీ. ఇటీవలే 'సర్వం మాయ', 'బేబీ గర్ల్' లాంటి వరుస చిత్రాలతో జోరుమీదున్న ఆయన తదుపరి సినిమాని ప్రకటించారు. ప్రతి చిత్రానికి ఓ కథ ఉంటుంది.. దీనికి ఒక విధి అనే వ్యాఖ్యని జోడించాడు. పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని ఉన్నికృష్ణన్.బీ తెరకెక్కిస్తున్నారు. రెండేళ్ల విరామం తర్వాత ఆయన దర్శకత్వంలో వస్తున్న చిత్రమిది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో మోహన్‌లాల్ విడుదల చేశారు. 'ఇప్పుడు రాజకీయాల్లో వ్యక్తిత్వాలు లేవు... చిత్రాలు మాత్రమే' లాంటి రాజకీయ నేపథ్య సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది.

సెప్టెంబరులో సెట్స్‌పైకి లోక చాప్టర్ 2!


కల్యాణి ప్రియదర్శన్

మలయాళ చిత్రపరిశ్రమలోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా 'లోక చాప్టర్ 1: చంద్ర' రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. ఈ నాయికా ప్రాధాన్య చిత్రంలో చంద్ర పాత్రలో కనిపించి.. యువతను విశేషంగా ఆకట్టుకుంది కథానాయిక కల్యాణి ప్రియదర్శన్. డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించారు. నస్లేన్, టొవినో థామస్ తదితరులు నటించారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న కల్యాణి ఈ సినిమా సీక్వెల్ గురించి వెల్లడించింది. "ప్రస్తుతం 'లోక 2' స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. సెప్టెంబరు నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం అయ్యే అవకాశాలున్నాయి. నేను ఈ సినిమాలో భాగమే. తిరిగి నా పాత్రను పోషిస్తున్నాను" అని తెలిపింది.

హిందీ నటి ప్రవీణ దేశ్‌పాండే మృతి



బాలీవుడ్ నటి ప్రవీణ దేశ్‌పాండే (60) కన్నుమూశారు. కొన్ని రోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో పోరాటం చేస్తున్న ఆమె మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. "ప్రవీణ దేశ్‌పాండే ఈ నెల 17న స్వర్గంలోని తన నివాసానికి బయలు దేరారని తెలియజేయడానికి బాధగా ఉంది" అని ఓ ప్రకటనలో వెల్లడించారు. 'రెడీ', 'గబ్బర్ ఈజ్ బ్యాక్', 'డి-డే' లాంటి పలు హిట్ చిత్రాల్లో సహాయక పాత్రల్లో కనిపించి తన నటనతో ఆకట్టుకున్నారు ప్రవీణ. ఆమె చివరిగా 'తస్కరీ: ది స్మగ్లర్స్ వెబ్' అనే వెబ్‌సిరీస్‌లో నటించారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రవీణ మృతి పట్ల పలువురు బాలీవుడ్ సినీతారలు సంతాపం వ్యక్తం చేశారు.

నిలకడగా సలీం ఖాన్ ఆరోగ్యం

ప్రముఖ హిందీ సినీ రచయిత, సల్మాన్ ఖాన్ తండ్రి సలీం ఖాన్(90) ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులు వెల్లడించారు. గురువారం నాటికి ఆయనను వెంటిలేటర్ తొలగించి బయటికి తీసుకువచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. సలీం అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. "సలీం ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రాథమిక పరీక్షల తర్వాత అవసరం మేరకు ఐసీయూకు తరలించాం. ఆయనకు రక్తపోటు అధికంగా ఉంది. స్వల్పంగా మెదడులో రక్తస్రావం జరిగింది. చికిత్స అందించాము. కొన్ని పరీక్షల దృష్ట్యా ఆయన్ని వెంటిలేటర్‌పై ఉంచాల్సి వచ్చింది. ఆయన బాగానే ఉన్నారు" అని వైద్యులు తెలియజేశారు.

నిర్మాతకు విలువ లేదు


దిల్‌రాజు

నిర్మాత అంటే ఇచ్చేవాడని... కానీ ఈ రోజుల్లో తీసుకునే వాళ్లే ఇస్తున్న నిర్మాతని శాసించే పరిస్థితులు చిత్ర పరిశ్రమలో నెలకొన్నాయన్నారు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు. గతంతో పోలిస్తే ఇప్పుడు నిర్మాతకు విలువ లేదని వ్యాఖ్యానించారు. సీనియర్ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు ఇటీవల కర్ణాటకలోని మడికేరిలో రిసార్ట్‌ని ప్రారంభించారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ "ఒక నిర్మాతకు ఎలాంటి లక్షణాలు ఉండాలో సీనియర్లయిన అట్లూరి పూర్ణచంద్రరావు, డి.రామానాయుడు, కేఎస్ రామారావు తదితరుల్ని దూరం నుంచి చూస్తూనే నేర్చుకున్నా. 87 సినిమాల్ని నిర్మించిన అట్లూరి పూర్ణచంద్రరావు సమర్పణలో నేను త్వరలోనే ఓ సినిమాని నిర్మిస్తా. అది కూడా విలువలతో కూడుకున్న సినిమానే చేస్తా. అదే ఆయనకి నేనిచ్చే బహుమానం" అన్నారు.



మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 40 పోస్టులు

విభాగాలు: ఇంజినీరింగ్, ఫార్మా, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్.

అర్హత: సంబంధిత విభాగం/ట్రేడుల్లో ఎంబీఏ, బీఎస్సీ, ఐటీఐ.

వయసు: 27 సంవత్సరాలు మించకూడదు.

స్టైపెండ్: ఎంబీఏ ట్రెయినీలకు మొదటి ఏడాది నెలకు రూ.11,500, రెండో ఏడాది రూ.13,000, మూడో ఏడాది రూ.15,000. గ్రాడ్యుయేట్ ట్రెయినీలకు మొదటి ఏడాది రూ.10,000, రెండో ఏడాది రూ.11,000, మూడో ఏడాది రూ.12,500. ఐటీఐ ట్రెయినీలకు మొదటి ఏడాది రూ.9,500, రెండో ఏడాది రూ.10,500, మూడో ఏడాది రూ.12,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.03.2026

వెబ్‌సైట్: https://www.lifecarehll.com/careers/

మిధానీలో

మిధానీ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ (ఎంపీహెచ్‌సీసీ) ట్రస్ట్, హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ సెలక్షన్‌ను నిర్వహిస్తోంది.

- మెడికల్ ఆఫీసర్: 01
- నర్సు (ఇన్‌ఛార్జ్): 01
- జూనియర్ నర్సు: 01
- ఫార్మసిస్టు: 01
- ల్యాబ్ టెక్నీషియన్: 01
- రిసెప్షనిస్ట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్: 01

అర్హతలు: పోస్టులను అనుసరించి డిగ్రీ, పీజీ, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు పని అనుభవం.

వయసు: మెడికల్ ఆఫీసర్‌కు 65 ఏళ్ల లోపు, మిగిలిన పోస్టులకు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

వేతనం: మెడికల్ ఆఫీసర్‌కు నెలకు రూ.60,720, నర్సు(ఇన్‌ఛార్జ్)కు రూ.33,250, జూనియర్ నర్సు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, రిసెప్షనిస్ట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.29,040.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ/ట్రేడ్ టెస్టులతో.

వాక్-ఇన్ తేదీలు: పోస్టులను అనుసరించి మార్చి 5 నుంచి 11 వరకు ఉంటాయి. **వేదిక:** మిధానీ కార్పొరేట్ ఆఫీస్, కంచన్‌బాగ్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://midhani-india.in/

చదువు

కెరియర్, ఉన్నత విద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: **చదువు**,
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మం.,
రామోజీ ఫిల్మ్ సిటీ
– 501 512
edc@eenadu.in

బీఏ చదివాను. టీ టేస్టర్ అవ్వాలనుంది. ఇందుకోసం ఎక్కడ చదవాలి, ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి? – బాలకృష్ణ

టీ టేస్టర్ అవ్వాలంటే?

■ టీ టేస్టర్ అనేది తేయాకు పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన వృత్తి. వీరు తేయాకు రుచి, వాసన, రంగు, నాణ్యత లాంటి లక్షణాలను పరిశీలిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే తేయాకులను పరిశీలించి, వాటిని సరైన రీతిలో బ్లెండ్ చేయడం కూడా టీ టేస్టర్ బాధ్యతల్లో ఒకటి. టీ పొడి తయారీ సంస్థల్లో, ఎగుమతి సంస్థల్లో, తేయాకు తోటల్లో టీ టేస్టర్లు కీలక పాత్ర పోషిస్తారు. మంచి టీ టేస్టర్లు ఉన్న తేయాకు వ్యాపార సంస్థలకు మార్కెట్ విలువ లభిస్తుంది. అందువల్ల టీ పరిశ్రమలో ఈ వృత్తికి ప్రాధాన్యం ఉంది.

◗ బీఏ విద్యార్హతతోనూ టీ టేస్టర్‌గా కెరియర్ ప్రారంభించవచ్చు. దీనికి ప్రత్యేకంగా టీ టేస్టింగ్, టీ మేనేజ్‌మెంట్, టీ టెక్నాలజీ లాంటి సర్టిఫికెట్ లేదా డిప్లొమా కోర్సులు చేయాలి. వీటి వ్యవధి సాధారణంగా ఆరు నెలలు ఉంటుంది. ఈ కోర్సుల్లో టీ రకాలు, టీ తయారీ విధానం, టీ నాణ్యత పరీక్ష విధానం, టీ బ్లెండింగ్ టెక్నిక్స్, టీ మార్కెటింగ్ లాంటి విషయాలు నేర్పిస్తారు. కోర్సులు పూర్తి చేసిన తర్వాత టీ పరిశ్రమలో ఉద్యోగాలకు అర్హత పొందవచ్చు. అనుభవం, నైపుణ్యాలతో వేతనమూ పెరుగుతుంది.

◗ అసోంలోని టీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డార్జిలింగ్ టీ రిసెర్చ్ సెంటర్, సిలిగురిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీ మేనేజ్‌మెంట్, తమిళనాడులోని ఉపాసీ టీ రిసెర్చ్ ఫౌండేషన్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ సంస్థలు ముఖ్యమైనవి. ఇవి టీ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తాయి.

◗ టీ టేస్టర్లకు తేయాకు తోటలు, టీ తయారీ సంస్థలు, టీ ఎగుమతి సంస్థలు, టీ వేలం కేంద్రాలు, టీ నాణ్యత పరీక్ష కేంద్రాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. అంతర్జాతీయ టీ ఎగుమతి సంస్థల్లో పనిచేసినవారికి విదేశీ అవకాశాలూ లభిస్తాయి.

చివరిగా టీ టేస్టర్ వృత్తి ఒక ప్రత్యేకమైన భవిష్యత్తు ఉన్న కెరియర్. టీ పరిశ్రమలో నాణ్యమైన నిపుణులకు మంచి డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. ఆసక్తి, పట్టుదల, సరైన శిక్షణతో టీ టేస్టర్‌గా విజయవంతమైన కెరియర్ నిర్మించుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

టీచింగ్ ఫ్యాకల్టీలు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజీ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రాంచీ.. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ ఫ్యాకల్టీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

◆ ప్రొఫెసర్: 05 ◆ అసోసియేట్ ప్రొఫెసర్: 15 ◆ అసిస్టెంట్ ప్రొఫెసర్: 20

విభాగాలు: అనస్థీషియాలజీ, బయోకెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఇతర విభాగాలు.

వేతనం: ప్రొఫెసర్లకు నెలకు రూ.2,22,543. అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1,52,241. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1,30,797.

వయసు: 69 సంవత్సరాల్లోపు ఉండాలి.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, దివ్యాంగులకు ఫీజు లేదు. ఇతరులకు రూ.500. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.02.2026

వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

జిప్‌మర్‌లో

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జేఐపీఎంఈఆర్), పుదుచ్చేరి తాత్కాలిక ప్రాతిపదికన పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

◆ ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-1 (నాన్-మెడికల్): 01

◆ ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1: 01

అర్హత: పోస్టులను అనుసరించి డిప్లొమా (ఎంఎల్‌టీ), బీఎస్సీ (ఎంఎల్‌టీ), పీజీతో పాటు పని అనుభవం. **వయసు:** 30 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. **వేతనం:** ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-I కు రూ.56,000 + 20 శాతం హెచ్‌ఆర్‌ఏ, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-I కు రూ.18,000 + 20 శాతం హెచ్‌ఆర్‌ఏ.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్టు, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.03.2026.

వెబ్‌సైట్: https://jipmer.edu.in/announcement/jobs

జూనియర్ పోస్టులు

బామర్ లారీ అండ్ కో లిమిటెడ్, కోల్‌కతా.. మేనేజీరియల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◆ జూనియర్ ఆఫీసర్/ఆఫీసర్ (వీసా): 01 ◆ ఆఫీసర్ (ట్రావెల్): 07 ◆ జూనియర్ ఆఫీసర్ (సేల్స్): 11 ◆ అసిస్టెంట్ మేనేజర్: 07 ◆ డిప్యూటీ మేనేజర్: 01 ◆ యూనిట్ హెడ్: 01

అర్హత: సంబంధిత విభాగాల్లో యూజీ లేదా పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: జూనియర్ ఆఫీసర్/ ఆఫీసర్‌కు 30 ఏళ్లు; ఇతర పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలనలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.03.2026. **వెబ్‌సైట్:** https://www.balmerlawrie.com/careers/current-openings

ఉద్యోగ ఉన్నతిలో ఏది ముఖ్యం?

కార్పొరేట్ సంస్థల్లో చేరుతోన్న యువ ఉద్యోగుల్లో కొందరే ఉన్నత స్థాయికి వెళ్తున్నారు. మిగిలినవారు ఆ స్థానాలను అందుకోలేకపోవడానికి తగిన నైపుణ్యాలు లేకపోవడం కారణం కాదు. కొన్నిసార్లు అద్భుతమైన ప్రతిభావంతుల కంటే సగటు ఉద్యోగే అగ్రస్థానానికి చేరుకోవచ్చు. దీని వెనుక ఉన్న బలమైన అస్త్రం.. నెట్‌వర్కింగ్.

వనిత, రాధ ఒక బహుళ జాతి సంస్థలో 'మేనేజ్‌మెంట్ ట్రెయినీ'లుగా ఎంపికయ్యారు. ఇద్దరూ ఒకే విభాగంలో చేరారు. వనిత చదువులో టాపర్. ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచే సమయాన్ని పని మీద కేంద్రీకరించింది. అవసరమైతే తప్ప ఇతర జట్టు సభ్యులు, వేరే శాఖల మేనేజర్లతో మాట్లాడేది కాదు. విమర్శలకు తావులేని విధంగా పని చేసేది. 'నా పని గుర్తింపు తీసుకురావాలి గానీ నేనెందుకు ప్రత్యేకంగా అందరితోనూ పరిచయం పెంచుకోవాలి' అనే ధోరణితో ఉండేది.

రాధ ఇందుకు భిన్నంగా సమావేశాల్లో చురుగ్గా పాల్గొనేది. అందరినీ చిరునవ్వుతో పలకరించేది. ఏ మాత్రం సమయం దొరికినా ఇతర బృందాల సభ్యులు, మేనేజర్లతో సంభాషించేది. సంస్థలో జరిగే చర్చావేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనేది. ఈ పరిచయాల ద్వారా ఆమెకు ఐటీ, ఫైనాన్స్, క్వాలిటీ, మార్కెటింగ్ లాంటి కీలక శాఖల అధికారులందరితోనూ సత్సంబంధాలు ఏర్పడ్డాయి.

ఒకసారి సంస్థకు విలువైన కొత్త ప్రాజెక్టు వచ్చింది. అది విజయవంతమవ్వాలంటే సంస్థలోని అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరం. ఇది చాలా సున్నితమైన బాధ్యత. ఈ ప్రాజెక్టుకు నాయకత్వం వహించేందుకు సమర్థమైన వారికోసం మేనేజ్‌మెంట్ అనేక మంది ఉద్యోగులను పరిశీలించింది. చివరికి రాధ, వనితల్లో ఒకరిని ఎంపిక చేసుకోవాల్సి వచ్చింది.

వనిత మేటి పనితీరు ఉన్న తెలివైన ఉద్యోగి. అయినా సంస్థలోని ఇతర శాఖల వారితో ఆమెకు పరిచయం లేదు. రాధ సగటు పనితీరు చూపే ఉద్యోగి. అయినప్పటికీ అన్ని శాఖల అధికారులూ ఈ ప్రాజెక్టుకు ఆమె పేరే సూచించారు. అధికారులందరితోనూ పరిచయాలున్నందున ఆమెకు కెరియర్‌లో గుర్తింపుతో పాటు సంస్థలో ఎదిగే అవకాశం వచ్చింది.

పరిచయాలతో పైచేయి

సంస్థలో రాధ కంటే సీనియర్లు, మెరుగైన పనితీరు చూపే ఉద్యోగులున్నప్పటికీ, విస్తృతమైన ఆమె నెట్‌వర్కింగ్ కారణంగా అతి తక్కువ కాలంలోనే ప్రాజెక్టుకు నాయకత్వం వహించే అవకాశం వచ్చింది. ఆమె కెరియర్‌కు ఇది ఒక మలుపుగా మారింది.

రాధ విజయాన్ని అర్థం చేసుకున్న వనిత వృత్తిలో ఎదగటానికి కేవలం పనితీరు మాత్రమే సరిపోదని, ఇతర ఉద్యోగులతో పరిచయాలూ ముఖ్యమని అర్థం చేసుకుంది. తన నెట్‌వర్క్‌ను విస్తరించే ప్రయత్నం చేసింది.

నివేదికల సారమిదీ

- రిఫరల్స్, నెట్‌వర్కింగ్ ప్రభావంపై నిర్వహించిన అనేక సర్వేలు, అధ్యయనాల సమగ్ర విశ్లేషణ ఆధారంగా రూపొందిన గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 85 శాతం ఉద్యోగాలు నెట్‌వర్కింగ్ ద్వారానే లభిస్తున్నాయి.
- హార్వర్డ్ బిజినెస్ రివ్యూ అధ్యయనం కూడా సంస్థల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన అధికారుల్లో ఎక్కువ శాతం మంది విజయానికి బలమైన మానవ సంబంధాలు కారణమని వెల్లడించింది.

పెద్దపెద్ద బిజినెస్ స్కూళ్లలో వ్యాపార వ్యూహాలు, ఆకర్షణీయంగా ప్రజెంటేషన్లు ఇవ్వడం లాంటి అనేక నైపుణ్యాలు విద్యార్థులకు నేర్పుతారు. అకడమిక్ కోర్సులు అందించే విద్యాసంస్థలు గ్రేడ్లు, మార్కులు, సాంకేతిక నైపుణ్యాలు లాంటి కొలవగలిగిన అంశాలు నేర్పుతాయి. వ్యక్తి ప్రవర్తన, ఆలోచనా దృక్పథాలపై ఆధారపడిన నైపుణ్యాలు కార్పొరేట్ ప్రపంచంలో వేగంగా ఎదగడానికి కీలకం. ఇవి కాలేజీ సిలబస్‌లో ఉండవు.



ప్రశ్నించుకోవాలి

కార్పొరేట్ సంస్థల్లో చేరినవారు 'నాకు ఎంత తెలుసు'? అనే దాంతో పాటు 'నేను ఎంత మందికి తెలుసు'? అని ప్రశ్నించుకోవాలి. ఈ సమాధానం మీ కెరియర్ వేగాన్ని, గమ్యాన్ని నిర్ణయిస్తుంది.

కాలేజీ సిలబస్‌లో నెట్‌వర్కింగ్ గురించి ప్రత్యేక అధ్యాయం ఉండదు. చాలా కార్పొరేట్ సంస్థల్లో ఇందుకోసం విడిగా శిక్షణ ఇవ్వరు. అయినప్పటికీ ఉద్యోగంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఇది ఒక అదృశ్య ఇంధనంలా పనిచేస్తుంది.

నెట్‌వర్కింగ్ అంటే

- పనిచేసే సంస్థలో మంచి మానవ సంబంధాలు కలిగి ఉండటం, వాటిని స్థిరీకరించుకోవడం, వృత్తి ఉద్యోగాల్లో లక్ష్యాలు సాధిస్తూ, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సహకరించుకోవడం.
- ఇతరులకు సహాయపడటం, వాళ్లు చెప్పేవి అర్థం చేసుకోవడం.
- ప్రతి వ్యవహారంలోనూ విలువ జోడించడం, ఒక నమ్మకాన్ని నిర్మించుకోవడం.

ఇవన్నీ ఒక్క రోజులోనే విస్తృతమయ్యేవి కాదు. నిరంతరం క్రమానుగతంగా కృషిచేస్తేనే నెట్‌వర్కింగ్ పెరుగుతుంది.



– **దొరైరాజ్**
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

విస్తరించడమెలా?

- నెట్‌వర్కింగ్ అంటే కేవలం తీసుకోవడం కాదు. ఇవ్వడం కూడా. ఇతరులకు మీరు చేసే చిన్న సహాయం కూడా పెద్ద ఫలితాన్నిచ్చి, భవిష్యత్తులో మీకు పెట్టుబడి అవుతుంది.
- ఎదుటివారిని అర్థం చేసుకోవాలంటే మాట్లాడటం కంటే వినడం ముఖ్యం. ఇది నమ్మకాన్ని పెంచుతుంది.
- సామాజిక మాధ్యమాల్లో కేవలం గ్రూపులు పెంచుకోవడంతో సరిపోదు. ఈ వేదికలపై అర్థవంతమైన పోస్టులు, కామెంట్లు చేయడం ద్వారా మీ వ్యక్తిగత బ్రాండ్‌ను పెంచుకోవచ్చు. కేవలం మీకు అందిన ప్రతి సమాచారాన్నీ ఫార్వర్డ్ చేయడం వల్ల క్రమంగా మీ స్థాయి పలుచన అవుతుంది.
- ఎవరి సహాయం ఎప్పుడు అవసరమవుతుందో ఊహించలేము. నెట్‌వర్కింగ్‌లో స్థాయీ భేదం చూపకుండా, ఉద్యోగులందరితోనూ సఖ్యతగా ఉండటం నేర్చుకోవాలి.
- సంబంధాలు ఎప్పటికీ సజీవంగా ఉండటానికి అవసరమైనప్పుడే కాకుండా, అప్పుడప్పుడూ పలకరిస్తూ ఉండాలి.

డిగ్రీలు కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగం పొందడానికి అవకాశం కల్పించే పత్రాలు మాత్రమే. కొలువులో చేరిన తర్వాత సంస్థలో ఎంత ఎత్తుకు ఎదగాలన్నది మీ చుట్టూ ఉన్న మనుషులు, వారితో మీకు ఉన్న మానవ సంబంధాలు, మీరు నిర్మించుకున్న నెట్‌వర్క్ పైనే ఆధారపడి ఉంటుంది.

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఘజియాబాద్ 34 ఎగ్జిక్యూటివ్, నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. బీఈ/ బీటెక్ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

ఇంజినీర్ ట్రెయినీలు

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు..

పోస్టు: డిప్యూటీ ఇంజినీర్ **ఖాళీలు:** 8

అర్హత: కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ మెటలర్జీ/ మెటీరియల్స్ సైన్స్/ సిరామిక్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్ 55 శాతంతో పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: 30 సంవత్సరాలు మించకూడదు.

వేతన శ్రేణి: నెలకు రూ.40,000-1,40,000.

పోస్టు: గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ

ఖాళీలు: 11

అర్హత: మెటలర్జీ/ మెటీరియల్స్ సైన్స్/ సిరామిక్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ మెకానికల్/ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్ 55 శాతంతో పూర్తిచేయాలి. ఉద్యోగానుభవం అవసరం లేదు.

వయసు: 27 సంవత్సరాలు మించకూడదు.

వేతన శ్రేణి: నెలకు రూ.40,000-1,40,000.



ఎంపిక: రాత పరీక్ష (కంప్యూటర్/ పేపర్ బేస్డ్), ధ్రువపత్రాల పరిశీలన, పర్సనల్ ఇంటర్వ్యూలతో ఎంపిక చేస్తారు. పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. వ్యవధి రెండు గంటలు.

- ప్రశ్నపత్రంలో రెండు భాగాలు ఉంటాయి. పార్టు-1లో సబ్జెక్టు సంబంధిత 60 ప్రశ్నలు వస్తాయి. పార్టు-2 ఆప్టిట్యూడ్ పరీక్షలో 40 ప్రశ్నలు ఇస్తారు. ఇందులో జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు.
- రెండు పార్టుల్లోనూ కలిపి 50 శాతం కనీసార్హత మార్కులు పొందినవారిని పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ పీడబ్ల్యూబీడీలకు 40 శాతం సరిపోతాయి.
- 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ తేదీ, వివరాల సమాచారాన్ని ఈమెయిల్ ద్వారా తెలియజేస్తారు. రాత పరీక్షకు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు. వీటిల్లో అర్హత పొందినవారికి వైద్య పరీక్షలు నిర్వహించి.. కేటగిరీల వారీగా తుది ఎంపిక చేస్తారు.

వివరాలు

వయసు: పోస్టుల ప్రకారం మారుతుంది. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: రూ.1000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.03.2026.

వెబ్‌సైట్: http://www.celindia.co.in/

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

ఇన్‌సైడ్ సేల్స్

సంస్థ: ప్రసాఫ్ట్ ఐటీ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, కస్టమర్ అక్విజిషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్, నెగోషియేషన్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: మార్చి 12
☛ https://tinyurl.com/eu7ahdcw

ఫీల్డ్ మార్కెటింగ్

సంస్థ: చాణక్య నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, సేల్స్, సేల్స్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: మార్చి 12
☛ https://tinyurl.com/5t4fcptb

సేల్స్ – రియల్ ఎస్టేట్

సంస్థ: పాలిగాన్ జియోస్పేషియల్
నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, కోల్డ్ కాలింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: మార్చి 7
☛ https://tinyurl.com/mryurcuk

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: వేదాస్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.10,000-11,000
దరఖాస్తు గడువు: మార్చి 13
☛ https://tinyurl.com/f7sm8zjc

గుంటూరు, హైదరాబాదుల్లో

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: న్యాస్టా గ్రామోజ్వల సొల్యూషన్స్
నైపుణ్యాలు: డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, మార్కెటింగ్ స్ట్రాటజీస్
స్టైపెండ్: రూ.8,000-15,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://tinyurl.com/4wtw6x6p

విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడల్లో

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: హమ్ సోదక్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ స్టైపెండ్: రూ.15,000-25,000
దరఖాస్తు గడువు: మార్చి 11
☛ https://shorturl.at/EdIWe

సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: టెకీ ఈబైక్స్
నైపుణ్యం: ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: మార్చి 8
☛ https://shorturl.at/b8IyD

విజయవాడలో

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: అర్బన్ కంపెనీ
నైపుణ్యం: ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.20,000-25,000
దరఖాస్తు గడువు: మార్చి 7
☛ https://shorturl.at/puyF6

నార్తర్న్ కోల్ ఫీల్డ్స్ (ఎన్‌సీఎల్).. 270 అసిస్టెంట్ ఫోర్‌మన్ ట్రెయినీ పోస్టులను భర్తీ చేయనుంది. పదోతరగతి, డిప్లొమా అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌తో నియామకాలు ఉంటాయి.

ఎన్‌సీఎల్‌లో ఫోర్‌మన్లు

మొత్తం పోస్టుల్లో.. అసిస్టెంట్ ఫోర్‌మన్ (ఈఅండ్‌టీ) ట్రెయినీ-14, అసిస్టెంట్ ఫోర్‌మన్ (మెకానికల్) ట్రెయినీ-108, అసిస్టెంట్ ఫోర్‌మన్ (ఎలక్ట్రికల్) ట్రెయినీ-148 ఉన్నాయి.

పరీక్ష: మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. సిలబస్ వివరాలు ప్రకటనలో ఉన్నాయి. వ్యవధి 90 నిమిషాలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో.. రెండు సెక్షన్లతో ఉంటుంది. సెక్షన్-ఏలో సబ్జెక్టు సంబంధిత 70 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్-బీలో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు 30 ఉంటాయి. ఇందులో భాగంగా.. జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, వెర్బల్ అండ్ మెంటల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు 1 మార్కు. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష కేంద్రాలను దరఖాస్తు సమయంలోనే ఎంచుకోవాలి.

- సీబీటీలో అన్‌రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్/ దివ్యాంగులు 40 శాతం కనీసార్హత మార్కులు పొందాలి.



వివరాలు

అర్హత: పదోతరగతి, మూడేళ్ల ఎలక్ట్రానిక్స్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా.

వయసు: 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.1180. ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగులు/ దివ్యాంగులకు ఉండదు.

మూల వేతనం: నెలకు రూ.47,330. అదనంగా డీఏ, అటెండెన్స్ బోనస్, స్పెషల్ అలవెన్స్, హెచ్‌ఆర్‌ఏ, ట్రాన్స్‌పోర్ట్ సబ్సిడీ, వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05.03.2026

వెబ్‌సైట్: http://www.nclcil.in/

ప్రాక్టీస్ బిట్స్

భౌతిక శాస్త్రం

1. కింది ప్రాథమిక ఘటాల్లో అప్పుడప్పుడు విరామమిస్తూ వాడే ఘటం ఏది?
   1) వోల్టా ఘటం
   2) లెక్లాంచి ఘటం
   3) క్షార ఘటం 4) డ్రైసెల్
2. డైక్రోమేట్ ఘటంలో ఆక్సీకరణిగా ఏ రకమైన పదార్థం వాడతారు?
   1) $K_2Cr_2O_7$ 2) H_2SO_4
   3) $CuSO_4$ 4) MnO_2
3. లిథియం అయాన్ ఘటాల కంటే తక్కువ శక్తినిస్తూ వేడి, చల్లదనంలో బాగా పనిచేసే ఘటం?
   1) క్షార ఘటం
   2) లెడ్-యాసిడ్ ఘటం
   3) నికెల్-కాడ్మియం ఘటం
   4) వోల్టా ఘటం
4. కార్ల లాంటి వాహనాల్లో స్టార్టర్ సెల్‌గా వాడేది?
   1) అనార్ద్ర ఘటం
   2) లిథియం - అయాన్ ఘటం
   3) లెడ్-యాసిడ్ ఘటం
   4) క్షార ఘటం
5. కింది వాటిలో ఏవి రసాయన శక్తిని విద్యుచ్ఛక్తిగా, తిరిగి విద్యుచ్ఛక్తిని రసాయన శక్తిగా మార్చే ఘటాలు?
   1) వోల్టా ఘటం
   2) లెక్లాంచి ఘటం
   3) రీఛార్జ్ బ్యాటరీ 4) క్షార ఘటం

జవాబులు 1-2, 2-2, 3-3, 4-3, 5-3.

TENTH Physical Science — Carbon and its compounds

Final Exams-2026 IMPORTANT Q & A

1. **Explain esterification reaction with an example.**

A: Esters are most commonly formed by reaction of an acid and an alcohol.

$$\underset{\text{Ethanoic acid}}{CH_3COOH} + \underset{\text{Ethanol}}{C_2H_5OH} \xrightarrow{\text{con. } H_2SO_4} \underset{\text{Ethyl ethanoate}}{CH_3COOC_2H_5} + \underset{\text{Water}}{H_2O}$$

2. **Explain how carbon's tetra valency contributes to its versatile nature.** **2 Marks**

A: Carbon has a valency of four, making it capable of bonding with four other atoms. This allows it to form a vast allay of compounds with elements like Hydrogen, Oxygen, Nitrogen, and Sulphur.

3. **Why are carbon and its compounds used as fuels for most applications?**

A: Carbon and its compounds give a large amount of heat energy, and light is released. So, it's used as fuels for most applications.

4. **What is hydrogenation? What is its industrial applications?**

A: Hydrogenation is the process of adding hydrogen to unsaturated hydrocarbons in the presence of a catalyst (Ni or Pd) to form saturated hydrocarbons.

Application: It is used to convert vegetable oils (unsaturated oil) into Vanaspati, ghee (Saturated fats)

5. **What is isomerism?**

A: The phenomenon of possessing same molecular formula but different structures by the compounds is known as isomerism. The compounds that exhibit isomerism are called isomers.

6. **How would you distinguish experimentally between an alcohol and a carboxylic Acid?**

A: **Alcohol:** 1) no change in colour and litmus solution
2) no brisk effervescence

Carboxylic acid: 1) turns blue litmus red
2) brisk effervescence

7. **Write any two properties of Ethanoic acid?**

A: 5%-8% Solution of acetic acid in water is called vinegar and is used widely as a preservative in pickles, preparation of esters.

For more IMP Q & A



Writer: D.V. Subbanaidu

సామర్థ్యాల పెంపు సహా సమ్మిళిత వృద్ధి సాధన!

కేంద్ర బడ్జెట్ 2026-27

(ముఖ్యాంశాలు)

అంతర్జాతీయ ఒత్తిళ్లను తట్టుకుంటూనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే వ్యూహంతో కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాదికి బడ్జెట్‌ను ప్రకటించింది. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసేలా, అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యాన్ని మరింత స్పష్టం చేసింది. సంప్రదాయ వస్తుఉత్పత్తితో పాటు యువశక్తి కేంద్రంగా సాంకేతికత, మేధోసంపత్తి ఆధారిత పరిశ్రమలకు పెద్దపీట వేసింది. నైపుణ్యం, పోటీతత్వం, ఉత్పాదకతల్లో భారత్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే ధ్యేయంతో అంతర్జాతీయ మార్కెట్‌తో మరింతగా అనుసంధానమయ్యేందుకు దోహదపడే తాజా బడ్జెట్ సమగ్ర స్వరూపాన్ని పోటీ పరీక్షార్థులు అర్థం చేసుకోవాలి. పద్దులోని ప్రధాన లక్ష్యాలు, దృష్టి సారించిన రంగాలు, చేసిన కేటాయింపులు, గణాంకాలను గుర్తుంచుకోవాలి.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కొత్తగా ప్రారంభించిన కర్తవ్య భవన్ రూపొందించిన మొదటి కర్తవ్య బడ్జెట్‌గా ఇది గుర్తింపు పొందింది. స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దారు. దీర్ఘకాల అభివృద్ధికి దన్నుగా నిలిచే మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యంతోపాటు ఔషధాలు, సెమీ కండక్టర్లు సహా మొత్తం ఏడు రంగాల్లో ఉద్యోగాల సృష్టి, ఉత్పాదకత పెంపు మొదలైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. బడ్జెట్ పరిమాణం రూ.53.47 లక్షల కోట్లు.

మూడు ప్రధాన లక్ష్యాలు: ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల సామర్థ్యాలను పెంపొందించడం, సమ్మిళిత వృద్ధిని సాధించడం అనే మూడు లక్ష్యాలతో ఈ బడ్జెట్‌ను రూపొందించారు.





1 ఉత్పాదక పెంపుతో అభివృద్ధి వేగవంతం

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దేశీయంగా ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంపొందించడంపై బడ్జెట్ దృష్టి సారించింది. భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా నిలిపే విధంగా ఏడు నిర్దేశిత రంగాలకు ప్రత్యేక కేటాయింపులు చేసింది.

బయో ఫార్మాశక్తి: భారత్‌ను ప్రపంచ ఫార్మా కేంద్రంగా మార్చే విధంగా బయో ఫార్మాశక్తి మిషన్‌ను ఐదేళ్లలో రూ.10,000 కోట్లతో ప్రతిపాదించింది.

సెమీకండక్టర్ మిషన్-2.0: సాంకేతిక స్వావలంబనను ముందుకు తీసుకెళ్లడానికి తాజా బడ్జెట్ ఇండియా సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) 2.0ని ప్రారంభించింది.

ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ: దేశీయ ఎలక్ట్రానిక్ వస్తు తయారీకి వ్యయాన్ని రూ.40 వేల కోట్లకు పెంచారు.

వారసత్వ పారిశ్రామిక రంగాల పునరుజ్జీవనం: మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం ద్వారా 200 వారసత్వ పారిశ్రామిక సమూహాలను పునరుద్ధరించే రీతిలో పథకాన్ని రూపొందించారు.

ఛాంపియన్ ఎంఎస్ఎంఈ- ప్రత్యేక కార్యాచరణ: అధిక సామర్థ్యం ఉన్న సంస్థలను ప్రోత్సహించేందుకు, ప్రపంచవ్యాప్తంగా పోటీపడగలిగే ఛాంపియన్ ఎంఎస్ఎంఈలను సృష్టించేందుకు రూ.10,000 కోట్లతో ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ ప్రారంభించాలని నిర్ణయించారు.



నిర్భర్ భారత్ నిధి: సూక్ష్మ సంస్థలకు మద్దతు ఇవ్వడానికి నిర్భర్ భారత్ నిధికి రూ.2,000 కోట్లు కేటాయించారు.

నగర ఆర్థిక ప్రాంతాలు (సీఈఆర్): కొత్తగా నగర ఆర్థిక ప్రాంతాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. నిర్దిష్ట వృద్ధి కారకాల ఆధారంగా నగరాలకు గుర్తింపు తీసుకురావాలని, ఐదేళ్లలో ప్రతి నగర ఆర్థిక ప్రాంతానికి రూ.5,000 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు.

మెగా టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు: టెక్స్‌టైల్స్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10,000 కోట్లు కేటాయించారు.

కంటైనర్ల తయారీకి ప్రాధాన్యం: లాజిస్టిక్ రంగాన్ని బలోపేతం చేసేలా దేశీయంగా కంటైనర్ల తయారీ కోసం రూ.10,000 కోట్లు కేటాయించారు.

2 ప్రజల ఆకాంక్షల సాకారం - సామర్థ్యాల పెంపు

ప్రజలు ముఖ్యంగా యువత సామర్థ్యాలను పెంపొందించడం, దేశ పురోగతిలో వారిని ప్రధాన భాగస్వామ్యులను చేయడం ఇందులోని లక్ష్యాలు.

మెడికల్ టూరిజం: వెల్‌నెస్, మెడికల్ టూరిజంలకు గమ్యస్థానంగా భారతదేశ హోదాను పెంచేలా ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ఐదు ప్రాంతీయ వైద్యకేంద్రాల ఏర్పాటును ప్రతిపాదించారు.



నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలజీ: విద్యారంగం, పర్యాటక పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించేలా ప్రస్తుతం ఉన్న నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీని అప్‌గ్రేడ్‌చేసి 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ'గా ఏర్పాటు చేశారు.

ఖేలో ఇండియా మిషన్: క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా క్రీడారంగం రూపురేఖలను మార్చడానికి బడ్జెట్‌లో 'ఖేలో ఇండియా మిషన్'కు రూపకల్పన చేశారు.

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్, గేమింగ్, కామిక్ (ఏవీజీసీ) ల్యాబ్‌ల ఏర్పాటు: ముంబయిలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్' ద్వారా దేశవ్యాప్తంగా 1500 ఉన్నత పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ ల్యాబ్‌ల ఏర్పాటు.

◆ దేశంలో పశువైద్య నిపుణుల సంఖ్య పెంచేందుకు ప్రైవేటు రంగంలో పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, ప్రయోగశాలలు, సంతానోత్పత్తి సౌకర్యాల స్థాపనకు రుణ రాయితీని ప్రతిపాదించారు.

3 సబ్ కా సాథ్ సబ్ కా వికాస్

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

'అందరితో కలిసి అందరి కోసం' అనే దార్శనికతకు అనుగుణంగా దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, వివిధ రంగాలకు వనరులు, సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధిలో భాగస్వాములను చేయడం.

భారత్ విస్తార్ (వర్చువల్లీ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సెస్ అగ్రికల్చర్ రిసోర్సెస్): వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానించడం ద్వారా ఉత్పత్తి పెంపు, రైతులకు సరైన సలహాలు అందేలా ప్రోత్సహిస్తుంది. ◆ విజయవంతమైన 'లఖ్‌పతి దీదీ' పథకం ఆధారంగా క్లస్టర్ స్థాయి సమాఖ్యలతో స్వయంసహాయక వ్యవస్థాపకుల మార్ట్‌లను అభివృద్ధి చేస్తారు. ◆ మానసిక ఆరోగ్యం, ట్రామా కేర్‌కు ప్రాధాన్యం ఇస్తూ నిమ్‌హాన్స్-2 (నిమ్‌హాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్) ఏర్పాటుతోపాటు రాంచీ, తేజ్‌పుర్‌లోని జాతీయ మానసిక ఆరోగ్య సంస్థలను ప్రాంతీయస్థాయి సంస్థలుగా అప్‌గ్రేడ్ చేస్తారు.



బౌద్ధ సర్క్యూట్లు: అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపుర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో బౌద్ధ సర్క్యూట్‌ల ఏర్పాటు. ఈ పథకంతో ఆలయాలు, మఠాల సంరక్షణతోపాటు యాత్రికులకు సౌకర్యాలు సమకూరుతాయి. ◆ దివ్యాంగుల కోసం 'దివ్యాంజన్ కౌశల్ యోజన', 'దివ్యాంగ్ సహకార యోజన' పథకాల ఏర్పాటు.

బడ్జెట్‌లోని మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే, మూడోది వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు దోహద పడుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.



రచయిత: వమరవల్లి రమణయ్య

ఆన్‌లైన్ బెదిరింపులను అరికట్టే ఆపరేషన్ శాస్త్ర!

దేశంలో తొలిసారిగా తూత్తుకుడిలోని చిదంబరనార్ నౌకాశ్రయంలో స్వీయరక్షణ కోసం యాంటీ డ్రోన్ వ్యవస్థ ఏర్పాటైంది. అవినీతి సూచీలో భారత్ అనుకూల రీతిలో తన స్థానాన్ని కాస్త మెరుగుపరుచుకుంది. దేశ సైన్యం మాజీ అధిపతి నరవణె రాసిన పుస్తకం విడుదలకు ముందే వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రజలందరికీ వంద శాతం బీమా కవరేజీ ఉన్న జిల్లాగా రాజస్థాన్‌లోని అల్వార్ నిలిచింది. లోతైన సముద్ర అవక్షేపాల నుంచి అరుదైన ఖనిజాలను జపాన్ వెలికితీసింది. ఇటలీలో శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్, సోషల్ మీడియా ద్వారా బెదిరింపులకు పాల్పడే వారి, భయాందోళనలను సృష్టించే వారి భరతం పట్టేందుకు దిల్లీ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ విధంగా సమకాలీన వార్తాంశాలను, ప్రధాన పరిణామాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఇటీవల జరిగిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్, ఐసీసీ అండర్-19 క్రికెట్ పోటీల విశేషాలు, విజేతల రికార్డులు, జాతీయ, అంతర్జాతీయ ముఖ్య సంఘటనలు; నియామకాలు, నివేదికలను గుర్తుంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో డబ్ల్యూపీఎల్-4 కు సంబంధించి సరికానిది?
   ఎ) డబ్ల్యూపీఎల్-4 విజేత - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.
   బి) రన్నర్ - దిల్లీ క్యాపిటల్స్.
   సి) ఆరెంజ్ క్యాప్ విజేత - స్మృతి మంధాన.
   డి) పర్పుల్ క్యాప్ విజేత - శ్రీచరణి.
   1) సి, డి 2) సి 3) డి 4) బి, డి

   నోట్: డబ్ల్యూపీఎల్-4 పర్పుల్ క్యాప్ విజేత సోఫీ డివైన్.
2. కింది వాటిలో సరైంది?
   ఎ) 2023లో డబ్ల్యూపీఎల్ ప్రారంభమైంది.
   బి) 2023, 2025 డబ్ల్యూపీఎల్ విజేత దిల్లీ క్యాపిటల్స్.
   సి) 2024, 2026 డబ్ల్యూపీఎల్ విజేత రాయల్ ఛాలెంజర్స్.
   డి) 2023, 2024, 2025, 2026 డబ్ల్యూపీఎల్ రన్నర్ దిల్లీ క్యాపిటల్స్.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, డి

   నోట్: 2023, 2025 డబ్ల్యూపీఎల్ విజేత ముంబయి ఇండియన్స్.
3. ఇటీవల వార్తల్లో ఉన్న 'పెర్దానపుత్ర' ఏమిటి?


   

   1) జింబాబ్వే నుంచి వచ్చిన చీతా.
   2) కునో నేషనల్ పార్కులో ఇటీవల జన్మించిన చీతా పిల్ల.
   3) మలేసియా ప్రధానమంత్రి కార్యాలయ సముదాయం.
   4) సింగపూర్ ప్రధానమంత్రి కార్యాలయం.

   నోట్: 1) మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం.
   2) ఇటీవల భారత ప్రధాని మోదీ మలేసియా పర్యటన సందర్భంగా సెమీకండక్టర్లు సహా కీలక రంగాల్లో సహకారానికి సంబంధించి 11 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.
4. గ్లోబల్ టీచర్ ప్రైజ్-2026 ఎవరికి వచ్చింది?
   1) గంగాదేవి రమణ్ 2) కిరణ్ స్వాతి
   3) రూబుల్ నాగీ 4) సరస్వతి రూబుల్

   నోట్: రూబుల్ నాగీ ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా భారతదేశంలోని పలు ప్రాంతాల్లో 800 కంటే ఎక్కువ అభ్యాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
5. కింది వాటిలో సరైంది?
   ఎ) అవినీతి సూచీ 2025లో భారత్ ర్యాంకు 91.
   బి) అవినీతి సూచీ 2024లో భారత్ ర్యాంకు 96.
   సి) అవినీతి సూచీ (అతితక్కువ)లో డెన్మార్క్‌ది మొదటి ర్యాంకు.
   డి) ఫిన్లాండ్, సింగపూర్ 2, 3 ర్యాంకులు సాధించాయి.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

   నోట్: 1) అవినీతి నిర్మూలన విషయంలో భారత్ 100కు 39 పాయింట్లు సాధించింది.
   2) డెన్మార్క్ 100కు 89 పాయింట్లు సాధించింది.
   3) దక్షిణ సూడాన్, సోమాలియాలు 9 పాయింట్లతో చివరి స్థానంలో నిలిచాయి.
   4) అమెరికా 29వ స్థానంలో నిలిచింది.
   5) ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (జర్మనీ) అవినీతి సూచీని వెల్లడిస్తుంది.
6. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తక రచయిత?

   1) దల్బీర్ సింగ్ సుహాగ్
   2) ఉపేంద్ర ద్వివేది
   3) మనోజ్ ముకుంద్ నరవణె
   4) మనోజ్ పాండే

   నోట్: 28వ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణె (2019, డిసెంబరు 31 నుంచి 2022, ఏప్రిల్ 30) మధ్య పనిచేశారు.
7. ఐసీసీ యూ-19 మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్-2026కు సంబంధించి కింది వాటిలో సరైంది?
   ఎ) ఐసీసీ యూ-19 మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్-2026 జింబాబ్వేలోని నమీబియాలో జరిగింది.
   బి) ఇది 16వ ఎడిషన్.
   సి) దీని బ్రాండ్ అంబాసిడర్ తడెంబు తైబు (జింబాబ్వే).
   డి) ఈ వరల్డ్ కప్ 1988లో ప్రారంభమైంది.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, సి, డి
8. ఐసీసీ యూ-19 మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్-2026కు సంబంధించి కింది వాటిలో సరైంది?

   ఎ) విజేత ఇండియా.
   బి) ఈ వరల్డ్ కప్‌ను ఇండియా ఇప్పటివరకు 8 సార్లు నెగ్గింది.
   సి) రన్నర్ ఇంగ్లండ్.
   డి) ఈ కప్‌ను ఇంగ్లండ్ ఇప్పటివరకు మూడుసార్లు నెగ్గింది.
   1) ఎ, సి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

   నోట్: 1) ఐసీసీ యూ-19 మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌ను ఇండియా 6 సార్లు నెగ్గింది (2000, 2008, 2012, 2018, 2022, 2026)
   2) ఈ వరల్డ్ కప్‌ను ఇంగ్లండ్ ఒకసారి నెగ్గింది.
   3) ఈ వరల్డ్ కప్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ వైభవ్ సూర్యవంశీ.
9. జర్మనీలోని న్యూరెంబర్గ్‌లో జరిగిన ప్రపంచంలోని ప్రముఖ సేంద్రియ ఉత్పత్తుల వాణిజ్య ప్రదర్శన 'బయోఫాచ్ 2026'లో ఏ దేశానికి 'కంట్రీ ఆఫ్ ది ఇయర్ అవార్డు' లభించింది?
   1) అమెరికా 2) జపాన్
   3) రష్యా 4) ఇండియా
10. ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) మార్చి 10 2) ఫిబ్రవరి 10
    3) ఏప్రిల్ 12 4) ఫిబ్రవరి 12

    నోట్: 1) 2026, ఫిబ్రవరి 10న ప్రపంచ పప్పుధాన్యాల దినోత్సవాన్ని 'పల్సెస్ ఆఫ్ ది వరల్డ్: ఫ్రమ్ మోడెస్టీ టూ ఎక్సలెన్స్' అనే థీమ్‌తో నిర్వహించారు.
    2) పప్పుధాన్యాల్లో స్వావలంబన మిషన్ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రారంభమైంది.
11. ఎస్ఏఎఫ్ఎఫ్ యూ-19 మహిళల ఛాంపియన్‌షిప్-2026 విజేత?
    1) బంగ్లాదేశ్ 2) పాకిస్థాన్
    3) నేపాల్ 4) ఇండియా

    నోట్: నేపాల్‌లో జరిగింది. ఫైనల్‌లో ఇండియా బంగ్లాదేశ్‌ను ఓడించింది.
12. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన సొరయా అగేయి హజియాఘా ఏ దేశానికి చెందినవారు?
    1) ఇరాక్ 2) కువైట్ 3) యూఏఈ 4) ఇరాన్

    నోట్: 1) సొరయా ఇరాన్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి.
    2) ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీలో ప్రస్తుతం ఉన్న సభ్యుల్లో చిన్నవారు.
13. ఆన్‌లైన్ బెదిరింపులు, సోషల్ మీడియాలో భయాందోళనలను అరికట్టడానికి ఏ రాష్ట్ర/యూటీ పోలీసులు 'ఆపరేషన్ శాస్త్ర' ప్రారంభించారు?
    1) గుజరాత్ 2) పుదుచ్చేరి 3) దిల్లీ 4) కేరళ

    నోట్: జమ్ము-కశ్మీర్‌లోని మారుమూల అటవీ ప్రాంతాల్లో దాక్కున్న ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి భారత భద్రతా దళాలు ప్రారంభించిన ఉమ్మడి ఉగ్రవాద నిరోధక ఆపరేషన్ పేరు 'ఆపరేషన్ కియా'.
14. కీలకమైన మౌలిక సదుపాయాలను కాపాడుకోవడానికి అత్యాధునిక యాంటీ-డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తొలి భారతీయ ఓడరేవు ఏది?

    1) కాండియా పోర్టు (దీన్‌దయాళ్ పోర్టు), గుజరాత్
    2) జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు (మహారాష్ట్ర)
    3) మార్మగోవా పోర్టు (గోవా)
    4) వి.ఓ.చిదంబరనార్ పోర్టు (తమిళనాడు)
15. ఇండియాలో రాష్ట్ర స్థాయి బర్డ్ అట్లాస్‌ను ప్రచురించిన రెండో రాష్ట్రం?
    1) మహారాష్ట్ర 2) ఉత్తరాఖండ్
    3) గోవా 4) గుజరాత్

    నోట్: రాష్ట్ర స్థాయి బర్డ్ అట్లాస్‌ను ప్రచురించిన మొదటి రాష్ట్రం కేరళ.
16. '2047 నాటికి అందరికీ బీమా' రోడ్ మ్యాప్ కింద 100% బీమా కవరేజీ సాధించిన భారతదేశంలోని మొదటి జిల్లా గుర్తించండి.
    1) కాకినాడ (ఏపీ) 2) బలోత్రా (రాజస్థాన్)
    3) అల్వార్ (రాజస్థాన్) 4) ఆగ్రా (యూపీ)
17. బ్రిటిష్ పార్లమెంటులోని 'హౌస్ ఆఫ్ లార్డ్స్'లో జీవితకాల సభ్యుడి (లైఫ్ పీర్) గా బాధ్యతలు స్వీకరించిన తెలుగు వ్యక్తి?

    1) అరుణ్ యోగిరాజ్
    2) సంపత్ నందన్
    3) అర్జున్ అప్పారావు 4) ఉదయ్ నాగరాజు
18. చంద్రయాన్ మిషన్-4లో భాగంగా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలోని కింది ఏ ప్రదేశంలో వ్యోమనౌకను దించాలని ఇస్రో నిర్ణయించింది?
    1) శూన్య మౌంటన్-3 2) అరుణ్ తార్-1
    3) మాన్స్ మౌటన్-4 4) అరుణ్ తార్-2

    నోట్: 2028కి చంద్రయాన్-4ను చేపట్టాలనేది ఇస్రో లక్ష్యం.
19. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం వందేమాతరం ఆరు చరణాల వెర్షన్‌ను ఎంత సమయంలో ఆలపించాలి?
    1) 52 సెకన్లు 2) 2 నిమిషాల 52 సెకన్లు
    3) 3 నిమిషాల 10 సెకన్లు
    4) 3 నిమిషాల 52 సెకన్లు

    నోట్: జనగణమన పూర్తి వెర్షన్ పాడటానికి 52 సెకన్లు పడుతుంది. మొదటి, చివరి పంక్తులతో కూడిన సంక్షిప్త సంస్కరణ పాడటానికి 20 సెకన్లు పడుతుంది.
20. లోతయిన సముద్ర అవక్షేపాల నుంచి అరుదైన భూమి ఖనిజాలను విజయవంతంగా వెలికితీసినట్లు ఏ దేశం ప్రకటించింది?
    1) అమెరికా 2) చైనా 3) కెనడా 4) జపాన్
21. 'ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా ఖాతాలు తెరవాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి' అని ఏ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది?
    1) ఆంధ్రప్రదేశ్ 2) బిహార్ 3) కేరళ 4) అస్సాం
22. మొత్తం 16 క్రీడాంశాల్లో జరిగే 25వ ఎడిషన్ 'వింటర్ ఒలింపిక్స్ క్రీడలు' ఏ దేశంలో ఇటీవలే ప్రారంభమయ్యాయి?
    1) అమెరికా 2) చైనా 3) ఇటలీ 4) స్పెయిన్

    నోట్: 'వింటర్ ఒలింపిక్స్ గేమ్స్-2026'లో క్రీడల సంఖ్య-8, క్రీడాంశాలు-16.
23. రచయిత్రి, ఫొటోగ్రాఫర్, సాంస్కృతిక పరిశోధకురాలు 'పెపెతా సేథ్'కు భారత పౌరసత్వాన్ని ఇటీవల ఇచ్చారు. ఈమె ఏ దేశం నుంచి వచ్చారు?

    1) ఇటలీ 2) కెనడా
    3) రష్యా 4) బ్రిటన్

    నోట్: 2012లో భారత ప్రభుత్వం ఈమెకు పద్మశ్రీ ఇచ్చింది. 1970లో మొదటిసారి ఇండియాకు వచ్చారు.



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3; 2-1; 3-3; 4-3; 5-1; 6-3; 7-2; 8-1; 9-4; 10-2; 11-4; 12-4; 13-3; 14-4; 15-3; 16-3; 17-4; 18-3; 19-3; 20-4; 21-2; 22-3; 23-4.

అభివృద్ధి, పర్యావరణ సమస్యలు: సహజ వనరులు - నీరు



భూమిపై ఉన్న సమస్త ప్రాణులకు నీరు ముఖ్య జీవనాధారం. నీటి వనరులు ప్రధానంగా భూగర్భ, ఉపరితల జల వనరులు అని రెండు రకాలు. మన దేశంలో ఇవి పుష్కలంగా ఉన్నాయి. అయితే జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, వ్యవసాయానికి అధిక నీటి వినియోగం లాంటి కారణాలతో ఇవి తరిగిపోవడమే కాకుండా, కాలుష్యబారిన పడుతున్నాయి. ఇది మానవాళికి తీవ్రమైన ముప్పుగా పరిణమించింది. మన దేశంలో ఆయా అవసరాలకు జల వనరుల డిమాండ్ ఏ విధంగా ఉంది, ఏయే రంగాలకు ఎంతెంత ఖర్చు చేస్తున్నారు లాంటి అంశాలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

తరుగుతోన్న నీటి వనరులతో.. తరతరాలకు తీరని నష్టం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

జల వనరుల వినియోగం - డిమాండ్

మన దేశంలో గృహ అవసరాలు, వ్యవసాయం, పరిశ్రమలు, జలరవాణా, విద్యుత్ శక్తి మొదలైన రంగాల్లో నీటి డిమాండ్ అధికం. పెరుగుతోన్న జనాభా, వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామిక విస్తరణ లాంటివి నీటి వినియోగంపై అధిక ఒత్తిడికి కారణమవుతున్నాయి. దీంతో డిమాండ్‌ను స్థిరంగా నిర్వహించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఏదైనా దేశం లేదా ప్రాంత సగటు వార్షిక నీటి లభ్యత అనేది అక్కడి జల వాతావరణ, భౌగోళిక కారకాలపై ఆధారపడి ఉంటుంది.

◆ భారత ప్రభుత్వ జల్ మంత్రిత్వ శాఖ వార్షిక నివేదిక 2024-25 ప్రకారం, దేశంలో మొత్తం నీటి లభ్యత దాదాపు 3880 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం)గా ఉంది.

◆ భౌగోళిక, ఇతర అంశాల కారణంగా ఉపయోగించగల నీటి లభ్యతను సంవత్సరానికి 1139 బీసీఎంగా పరిమితం చేశారు. అందులో 690 బీసీఎం ఉపరితల జల వనరులు కాగా 449 బీసీఎం భూగర్భ జల వనరులు.

◆ దేశంలోని తలసరి నీటి లభ్యత క్రమంగా తగ్గుతున్నట్లు నివేదిక పేర్కొంది. 2021, 2031 సంవత్సరాల్లో సగటు వార్షిక తలసరి నీటి లభ్యత వరుసగా 1486 బీసీఎం, 1367 బీసీఎంగా అంచనా వేశారు. జనాభా పెరిగితే ఆ మొత్తం ఇంకా తగ్గొచ్చు.

◆ తలసరి వార్షిక నీటి లభ్యత 1700 బీసీఎం ఉంటే దాన్ని మంచి స్థితిగా పేర్కొంటారు. ఆ లభ్యత 1000 బీసీఎం కంటే తక్కువ ఉంటే ఆ స్థితిని నీటి కొరతగా పరిగణిస్తారు.

◆ జల్ మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం 2025 - 2050 మధ్య కాలంలో వివిధ రంగాలు డిమాండ్ చేసే జల వనరుల పరిమాణం కింది విధంగా ఉంటుందని అంచనా..

- ☛ గృహావసరాల డిమాండ్: 73 బీసీఎం నుంచి 102 బీసీఎం
- ☛ వ్యవసాయ రంగం డిమాండ్: 910 బీసీఎం నుంచి 1072 బీసీఎం
- ☛ పారిశ్రామిక రంగం డిమాండ్: 23 బీసీఎం నుంచి 63 బీసీఎం
- ☛ విద్యుత్ శక్తి రంగం డిమాండ్: 15 బీసీఎం నుంచి 130 బీసీఎం
- ☛ ఇతర అవసరాలకు డిమాండ్: 7 బీసీఎం నుంచి 280 బీసీఎం

ఆయా రంగాల్లో నీటి వినియోగం ఇలా..

◆ వాతావరణం నుంచి మానవ వినియోగానికి సేకరించే మొత్తం నీటిలో 65% వ్యవసాయ, 20% పారిశ్రామిక, 10% గృహ, వ్యాపార, ప్రజా సేవలకు సంబంధించిన డిమాండ్‌ను తీరుస్తున్నాయి. మిగిలిన 5% రిజర్వాయర్ల నుంచి ఆవిరిగా మారి తిరిగి వాతావరణంలోకి వెళ్తోంది. అయితే వినియోగ పరిమాణం ఇంతే మొత్తంలో ఉండదు. ఉదాహరణకు గృహ అవసరాలకు వినియోగించే నీరు ఇంటి పరిమాణం, స్థానిక జీవన ప్రమాణ స్థాయి, నీటి చార్జీలు, మీటర్ విధానంపై ఆధారపడి ఉంటుంది. మన దేశంలో గ్రామాల్లో సాధారణ పరిస్థితుల్లో రోజువారీ తలసరి నీటి వినియోగం 5 గాలన్లు ఉండగా నగరాల్లో అది 150 గాలన్లుగా ఉంది. ఇది అమెరికాలో అత్యధికంగా 1340 గాలన్లు.

◆ జల్ మంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం, 2020-30 దశాబ్దంలో జలవనరుల డిమాండ్ 20% పెరుగుతుంది. ఈ కాలంలో పారిశ్రామిక అవసరాల డిమాండ్ 22.3 మి.లీ. నుంచి 47 మి.లీటర్లకు, గృహ డిమాండ్ 41.0 మి.లీ. నుంచి 55.0 మి.లీ.కు, వ్యవసాయ డిమాండ్ 51.7 మి.లీ. నుంచి 59.2 మి.లీ.కు పెరుగుతుందని విశ్లేషించారు. నీటి డిమాండ్ పారిశ్రామిక అవసరాలకు 100%, గృహ అవసరాలకు 40%, వ్యవసాయ అవసరాలకు 14% పెరుగుతాయని అంచనా.

భూగర్భ నీటి వనరుల వినియోగం

❖ భూగర్భ జలాల పునరుజ్జీవనానికి ప్రధాన వనరులు వర్షపాతం (60%), కాలువలు, చెరువులు, నీటి సంరక్షణ నిర్మాణాలు మొదలైనవి. దేశంలోని ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితుల వల్ల మంచినీటికి డిమాండ్ పెరగడం, వర్షపాతంలో హెచ్చుతగ్గులు, అధిక జనాభా, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ లాంటి వివిధ కారణాల వల్ల నీటికొరత, భూగర్భజల క్షీణత జరుగుతుంది.

❖ సాధారణంగా బ్లాక్‌లు/ తాలూకా/ మండలాలు మొదలైన అసెస్‌మెంట్ యూనిట్ల (ఏయూ) వర్గీకరణ అంచనా అనేది స్టేట్ ఆఫ్ గ్రౌండ్ వాటర్ ఎక్స్‌ట్రాక్షన్ (ఎస్ఓఈ) ఆధారంగా జరుగుతుంది. 70% కంటే తక్కువ ఎస్ఓఈ ఉన్న అసెస్‌మెంట్ యూనిట్లను 'సురక్షితమైనవిగా' వర్గీకరించారు. 70% నుంచి 90% మధ్య ఉన్నవి సెమీక్రిటికల్; 90 నుంచి 100% మధ్యవి క్రిటికల్‌గా; 100% కంటే ఎక్కువ అతిగా దోపిడీకి గురైన వర్గంలోకి వస్తాయి.

❖ 2017 నుంచి 2025 మధ్య దేశంలో మొత్తం వార్షిక భూగర్భజలాలు 432 బీసీఎం నుంచి 448.52 బీసీఎంకి పెరిగాయి. ఇదే కాలంలో సురక్షిత అంచనా యూనిట్ల శాతం 62.6% నుంచి 73.14 శాతానికి పెరిగింది. అతిగా దోపిడీకి గురైన బ్లాకుల యూనిట్ల శాతం 17.2% నుంచి 10.8శాతానికి తగ్గింది.

రంగాల వారీ వినియోగం ఇలా..

వ్యవసాయం/ నీటిపారుదల: భారతదేశంలో భూగర్భ జలాలను ప్రధానంగా వ్యవసాయ రంగానికి అధికంగా వినియోగిస్తున్నారు. మొత్తం వెలికితీతలో దీని వాటా దాదాపు 87-90% ఉంది.

❖ **దేశీయ/ గృహరంగం/ కుటుంబాలు:** 9% నుంచి 11% భూగర్భజలాలను దేశీయ లేదా గృహ అవసరాలకు వినియోగిస్తున్నారు. వీటిలో గ్రామీణ అవసరాలకు 50%, పట్టణ ప్రాంతాల్లో 85% వినియోగిస్తున్నారు.

❖ **పరిశ్రమలు:** పారిశ్రామిక అవసరాలకు దాదాపు 2% భూగర్భ జల వనరులను వినియోగిస్తున్నారు.

ఉపరితల జలాల వినియోగం

భూమి పైభాగంలో సహజంగా లభించే నీటిని ఉపరితల జలాలు అంటారు. నదులు, సరస్సులు, చెరువులు మొదలైనవి వీటికి ఉదాహరణలు. రుతుపవనాల వర్షపాతం, హిమాలయాల మంచు కరగడం ద్వారా వీటికి నీటి లభ్యత ఉంటుంది.

❑ ఏదైనా ప్రాంతం లేదా దేశ సగటు వార్షిక నీటి లభ్యత ఎక్కువగా జల వాతావరణ, భౌగోళిక అంశాలపై ఆధారపడి ఉంటుంది. దేశంలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో సగటు వార్షిక నీటి వనరులు సుమారు 2116 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం)గా అంచనా వేశారు.

❑ దేశంలోని చెరువులు, సరస్సులు, జలాశయాల్లోని నీటి నిల్వల ఆధారంగా జల్ శక్తి మంత్రిత్వ శాఖ 2018-19లో మొదటిసారి జల వనరుల గణన నిర్వహించి, నివేదిక విడుదల చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2.4 మిలియన్లకుపైగా ఉన్న జలవనరులను లెక్కించారు.

❑ కేంద్ర ప్రభుత్వం 2023, ఏప్రిల్ 25న విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 24,24,540 నీటివనరులను లెక్కించారు. వాటిలో 97.1% (23,55,055) గ్రామీణ ప్రాంతాల్లో, 2.9% (69,485) పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. ఉపరితల నీటి వనరుల్లో 59.5% (14,42,993) చెరువులు, 15.7% (3,81,805) జలాశయాలు, 12.1% (2,92,280) నీటి సంరక్షణ పథకాలు/ ప్రొటెక్షన్ ట్యాంక్‌లు, 9.3% (2,26,217) చెక్ డ్యామ్‌లు, 0.9% (22,361) సరస్సులు, 2.5% (58,884) ఇతరాల్లో ఉన్నాయి.

రంగాలవారీగా వినియోగం ఇలా..

❑ **వ్యవసాయ రంగం:** భారతదేశంలో వ్యవసాయం అతిపెద్ద నీటి వినియోగ రంగంగా ఉంది. మొత్తం నీటి వనరుల్లో (ఉపరితల, భూగర్భ) దాదాపు 80-90% నీరు ఈ రంగానికే మళ్లుతోంది. సగటు వార్షిక ఉపరితల జల వినియోగం 690 బిలియన్ క్యూబిక్ మీటర్లు.

❑ ఉపరితల నీటిలో వ్యవసాయం దాదాపు 89% ఉపయోగించుకుటోంది. ఈ రంగానికి నీటి వినియోగం 2025 నాటికి 611 బీసీఎం ఉండగా, 2050 నాటికి 807 బీసీఎం ఉంటుందని అంచనా.

❑ **పారిశ్రామిక రంగం:** ఉపరితల నీటిలో దాదాపు 2% వినియోగించుకుంటోంది. ఇటీవలి కాలంలో ఈ రంగానికి నీటి డిమాండ్ వేగంగా పెరుగుతోంది.

❑ మొత్తం పారిశ్రామిక నీటి అవసరాలు 2010లో 56 బిలియన్ క్యూబిక్ మీటర్ల నుంచి 2050 నాటికి 151 బీసీఎంకు పెరుగుతుందని అంచనా.

❑ ముఖ్యమైన నీటి ఇంటెన్సివ్ పరిశ్రమల్లో థర్మల్ పవర్ ప్లాంట్లు, వస్త్రాలు, ఉక్కు ఉన్నాయి.



రచయిత

బండారి ధనుంజయ

విషయ నిపుణులు

Word of the Day

926

Vandalize

Telugu meaning: నాశనం చేయు, ధ్వంసం చేయు

English meaning: The word 'vandalize' is a verb that means to deliberately damage or destroy public or private property.

Synonyms: Damage, Deface

Antonyms: Protect, Preserve

Usage: **1.** Several individuals were arrested for attempting to vandalize public monuments during the late-night protest.

2. Authorities installed surveillance cameras after repeated incidents where unknown people tried to vandalize the school property.

Current Affairs



Prime Minister Narendra Modi held bilateral talks with French President Emmanuel Macron at Maharashtra Lok Bhavan in Mumbai on 17 February 2026. India and France agreed to upgrade the India-France relationship to a Special Global Strategic Partnership. There were a total of 21 outcomes. Both nations agreed to the launch of the India-France Year of Innovation and the India-France Innovation Network.

☛ Modi and Macron virtually inaugurated the Final Assembly Line (FAL) for H125 helicopters in Vemagal Industrial Area in Kolar (near Bengaluru), Karnataka.



Bangladesh Nationalist Party leader Tarique Rahman was sworn in as Bangladesh's Prime Minister on 17 February 2026. He is the son of former Prime Minister Khaleda Zia and assassinated President Ziaur Rahman. President Mohammed Shahabuddin officiated as Rahman and his cabinet took their oaths.



Telangana Chief Minister A.Revanth Reddy inaugurated the 23rd edition of BioAsia 2026 international summit on 17 February 2026. The two-day global conference will be held at the Hyderabad International Convention Centre (HICC). This year's summit is themed 'TechBio Unleashed – AI, Automation, and the Revolutionary Changes in Life Sciences.'

The Indian Army is hosting the inaugural United Nations Fellowship Training Programme on Small Arms and Light Weapons (SALW) Control for the first time in Asia for the Asia-Pacific region. The program is being held under the aegis of the Ministry of External Affairs and the Ministry of Defence from February 16 to March 6, 2026.

***For more Current Affairs:* Scan QR code**

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2026-27

స్టడీ జోన్

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వరుసగా మూడో ఏడాది రాష్ట్ర బడ్జెట్‌ను 2026, ఫిబ్రవరి 14న శాసనసభలో ప్రవేశపెట్టారు. 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205.34 కోట్ల అంచనా వ్యయంతో పద్దును సమర్పించారు. రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లు; ద్రవ్యలోటు రూ.75,868.09 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు.

☛ 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.2,34,140.14 కోట్ల రెవెన్యూ రాబడి వస్తుందని ఆర్థిక మంత్రి అంచనా వేశారు. కిందటి ఆర్థిక సంవత్సరంలో రూ.2,17,976 కోట్ల రెవెన్యూ రాబడిని ఆశిస్తే 2026 జనవరి నెలాఖరు వరకు వచ్చింది రూ.1,40,000 కోట్లే. సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రాబడి రూ.1,96,903 కోట్లు ఉంటుందని పేర్కొంటున్నారు. గత బడ్జెట్ (2025-26)ను రూ.3,22,359.34 కోట్లతో ప్రవేశపెట్టినా సవరించిన అంచనాల్లో దాన్ని రూ.3,00,534.67 కోట్లకే పరిమితం చేశారు.

☛ 2025-26 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రతిపాదనల్లో రూ.33,185.97 కోట్లు రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా వేస్తే సవరించిన అంచనాల్లో అది రూ.41,118.36 కోట్లకు పెరిగింది.

☛ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూ.53,915 కోట్లను మూలధన వ్యయంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది.

'సూపర్ సిక్స్'కు పెద్దపీట

☛ 'సూపర్ సిక్స్' పేరిట అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు.

☛ ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు రూ.27,719 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం కింద రూ.9,668 కోట్లు ఇచ్చారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు సాయం చేసేందుకు రూ.6,600 కోట్లు కేటాయించారు.


☛ మహిళలు, యువతులు, తదితరులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.1,420 కోట్లు, బలహీనవర్గాల వారికి ఉచిత విద్యుత్, రాయితీపై విద్యుత్ ఇచ్చేందుకు రూ.600 కోట్లు బడ్జెట్‌లో చూపారు. వివిధ సామాజిక వర్గాల వారికి ఆర్థిక సాయం చేసేందుకు రూ.2,320 కోట్లు కేటాయించారు.



ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2026-27 సమగ్ర స్వరూపం, రంగాలవారీ కేటాయింపులు, ముఖ్య శాఖలకు చేసిన ప్రతిపాదనలు, రూపాయి రాక - పోక, ఇతర ముఖ్యాంశాలతో కూడిన పూర్తి సమాచారం ఈబుక్ రూపంలో సిద్ధంగా ఉంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉచితంగా అందుకోండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉపరితల రసాయనశాస్త్రం



ఉపరితలాలు లేదా అంతర్ తలాల వద్ద జరిగే దృగ్విషయాలను అధ్యయనం చేసే శాస్త్రమే 'ఉపరితల రసాయనశాస్త్రం' (Surface Chemistry). ఒక పదార్థం వేరొక ద్రవం లేదా ఘనపదార్థం అంతర్భాగాల్లోకి చొచ్చుకుపోకుండా ఉపరితలంపైనే ఉండటాన్ని 'అధిశోషణం' అంటారు. వాయువుల్లో భౌతిక, రసాయనిక అధిశోషణం జరుగుతుంది. వీటి తీవ్రతను ప్రభావితం చేసే అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలి.

వాయువుల అధిశోషణ తీవ్రతను ప్రభావితం చేసే అంశాలు

- ✦ అధిశోషకం ఉపరితల వైశాల్యం
- ✦ అధిశోషితం (వాయు) స్వభావం
- ✦ వాయువు పీడనం
- ✦ ఉష్ణోగ్రత

అధిశోషణం అనువర్తనాలు

- ✦ వాయు ముసుగు
- ✦ తేమను నియంత్రించడం
- ✦ జడవాయువుల మిశ్రమాన్ని వేరుచేయడం
- ✦ అధిక శూన్యస్థితిని ఏర్పర్చడం
- ✦ వ్యాధులను నయం చేసే ప్రక్రియ

అధిశోషణ క్రమం, ఫ్రాయిండ్లిష్ అధిశోషణ సమోష్ణరేఖ, ఫ్రాయిండ్లిష్ సమీకరణం, ద్రావణాల నుంచి అధిశోషణం - ఇమిడి ఉన్న సూత్రాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in SWIMS Tirupati

Sri Venkateswara Institute of Medical Sciences, Tirupati (SVIMS) is conducting interviews for filling up the Medical Officers, Staff Nurse, A.N.M, Electrician, etc posts in various departments on a contractual basis. The total number of posts is 26. The Interview dates are 2026 February 19, 20, 21, 22, 23.

Graduate Apprentice Posts

Bharat Electronics Limited (BEL) invites applications for Graduate, Diploma & ITI Apprenticeship training at its Navi Mumbai unit. The total no. of posts is 72. Eligible candidates can apply online before 27 February 2026.

Junior Stenographer Posts

CSIR-Central Leather Research Institute, Chennai, Tamil Nadu, is inviting applications for the Junior Stenographer, Junior Secretariat Assistant and Multi-Tasking Staff posts. The total number of posts is 13. The application fee is Rs.500. The last date for online applications is 2 March 2026.

Did You Apply..?

Today (February 19) is the last date for the following Jobs

☛ 418 Manager and IT Developer positions at Bank of Baroda. ***Eligibility:*** BE/B.Tech, MCA degree.

☛ Multitasking Staff Posts in CSIR-IITR. ***Eligibility:*** Matriculation.

For more information and other notifications - scan QR code

Bank Exams — Reasoning

Word Formation

Directions (Q.s 1 - 17): *In each of the following questions, a group of letters is given which are numbered 1, 2, 3, 4, 5 and 6. Below are given four alternatives containing combinations of these numbers. Select that combination of numbers so that letters arranged accordingly, form a meaningful word.*


1. V A R S T E
1 2 3 4 5 6
A) 2, 3, 1, 6, 4, 5 B) 4, 5, 2, 3, 1, 6
C) 6, 3, 4, 5, 2, 1 D) 3, 2, 4, 5, 6, 1
E) 2, 4, 5, 3, 6, 1

2. E H R A S P
1 2 3 4 5 6
A) 5, 2, 4, 6, 1, 3 B) 6, 2, 3, 4, 5, 1
C) 2, 4, 6, 1, 3, 5 D) 3, 4, 2, 1, 6, 5
E) 6, 4, 2, 1, 3, 5

3. A C E S T H
1 2 3 4 5 6
A) 6, 1, 4, 5, 3, 2 B) 2, 6, 1, 4, 5, 3
C) 4, 3, 5, 6, 1, 2 D) 6, 3, 2, 1, 4, 5
E) 3, 5, 4, 2, 1, 6

4. G T A E N M
1 2 3 4 5 6
A) 1, 3, 2, 5, 4, 6 B) 1, 3, 2, 6, 4, 5
C) 6, 3, 5, 1, 4, 2 D) 6, 3, 1, 5, 4, 2
E) 5, 1, 2, 6, 4, 3

5. N R O C T A
1 2 3 4 5 6



A) 1, 6, 2, 4, 3, 5 B) 2, 3, 5, 4, 6, 1
C) 6, 5, 2, 3, 1, 4 D) 4, 6, 2, 5, 3, 1
E) 2, 5, 6, 1, 4 ,3

6. G A N I M E
1 2 3 4 5 6
A) 1, 2, 4, 3, 6, 5 B) 1, 6, 3, 5, 2, 4
C) 5, 2, 1, 4, 3, 6 D) 2, 5, 1, 4, 3, 6
E) 6, 3, 4, 1, 5, 2

7. D I F E R N
1 2 3 4 5 6
A)1, 4, 3, 6, 2, 5 B) 6, 4, 3, 5, 2, 1
C) 3, 5, 2, 4, 6, 1 D) 5, 4, 3, 2, 6, 1
E) 2, 1, 6 , 4, 5, 3

8. K A T C E L
1 2 3 4 5 6
A) 4, 2, 3, 1, 5, 6 B) 1, 2, 4, 5, 6, 3
C) 6, 5, 3, 2, 4, 1 D) 3, 2, 4, 1, 6, 5
E) 1, 4 , 6 , 3, 2, 5

9. T E L S C A
1 2 3 4 5 6
A) 1, 2, 3, 4, 6, 5 B) 4, 6, 5, 1, 2, 3
C) 5, 6, 4, 1, 3, 2 D) 6, 5, 3, 2, 4, 1
E) 4, 6, 3, 1, 2, 5

10. C E L S M U
1 2 3 4 5 6
A) 4, 6, 3, 5, 2, 1 B) 5, 6, 4, 1, 3, 2
C) 4, 6, 5, 2, 3, 1 D) 5, 2, 3, 1, 6, 4
E) 2 , 6, 4, 1, 3, 5

11. H N R C A B
1 2 3 4 5 6
A) 4, 1, 5, 6, 2, 3 B) 4, 2, 6, 5, 3, 1
C) 3, 5, 6, 4, 1, 2 D) 2, 5, 3, 4, 1, 6
E) 6, 3, 5, 2, 4, 1

12. E L B M A G
1 2 3 4 5 6
A) 6, 5, 4, 3, 2, 1 B) 3, 1, 6, 4, 5, 2
C) 4, 5, 6, 3, 1, 2 D) 2, 1, 6, 3, 5, 4
E) 3, 5, 4, 6, 2, 1

13. R T A O U H
1 2 3 4 5 6
A) 1, 3, 4, 5, 6, 2 B) 2, 3, 6, 4, 5, 1
C) 6, 3, 2, 4, 5, 1 D) 3, 5, 2, 6, 4, 1
E) 2, 6, 1, 5, 3, 4

14. T L E M N A
1 2 3 4 5 6
A) 2, 6, 4, 5, 3, 1 B) 3, 2, 4, 6, 5, 1
C) 4, 3, 5, 1, 6, 2 D) 5, 3, 2, 4, 6, 1
E) 6, 4, 3, 2, 1, 5

15. I N L A S G
1 2 3 4 5 6
A) 6, 1, 3, 5, 4, 2 B) 5, 1, 6, 2, 4, 3
C) 3, 4, 6, 1, 2, 5 D) 2, 4, 3, 6, 1, 5
E) 3, 6, 1, 2 ,4, 5

16. T L P N A E
1 2 3 4 5 6
A) 3, 2, 5, 4, 6, 1 B) 3, 2, 5, 4, 1, 6
C) 4, 5, 3, 6, 2, 1 D) 4, 6, 1, 3, 5, 2
E) 4, 2, 6, 3, 5, 1

17. T N D R A E
1 2 3 4 5 6
A) 1, 6, 2, 3, 5, 4 B) 3, 6, 2, 4, 5, 1
C) 5, 4, 3, 6, 2, 1
D) 4, 5, 3, 6, 2, 1
E) 3, 1, 2, 6, 5, 4

Scan the QR code for Key

These model questions were prepared by ***Rajesh Madhu, Asst. Prof. of Mathematics.***



పరీక్ష పత్రాల దిద్దుబాటుకు.. పంటల సాగుకు 'ఏఐ'

ఏఐ ఆధారిత ట్రాక్టరుతో వ్యవసాయం

అది హరియాణాలోని కర్నాల్ పట్టణ సమీప గ్రామం. పొలం మధ్యలో ఉన్న ట్రాక్టర్ స్టీరింగుకు ఓ ఐప్యాడ్ బిగించి ఉంది. రైతు బిర్ విర్క్ ఐప్యాడ్ ఆన్ చేసి ట్రాక్టరును ఆటోమేటిక్ మోడ్‌లో పెట్టారు. అంతే.. ఎవరి సాయం లేకుండానే ట్రాక్టరు ముందుకు కదులుతూ పొలంలోని బంగాళాదుంపలను సేకరిస్తూ వెళుతోంది. కర్నాల్ పట్టణవాసి అయిన శ్వేతాంక్ పాండే అనే కోచ్ సైతం విద్యార్థుల పరీక్ష పత్రాల మూల్యాంకనానికి ఇలాంటి ఆటోమేటెడ్ పరికరాన్నే వాడుతున్నారు. ఆల్గారిథమ్ ఆధారంగా ఆ పరికరం పత్రాలను స్కాన్ చేసి దిద్ది గ్రేడింగు ఇస్తోంది. ఈ రెండు చోట్లా కంటికి కనిపించకుండా పనిచేస్తున్నది కృత్రిమమేధ (ఏఐ). అమెరికాలో చదువుకొన్న బిర్ విర్క్ స్వీడిష్ కంపెనీ నుంచి ఈ సాంకేతికతను దిగుమతి చేసుకొని గత రెండేళ్లుగా విజయవంతంగా వ్యవసాయం చేస్తున్నారు. సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్ నడుపుతున్న శ్వేతాంక్ పాండేకు సైతం పెద్దసంఖ్యలో ఉన్న విద్యార్థుల పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని ఏఐ సులభతరం చేసింది. ఏఐ వాడకం ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా పెరుగుతోంది. భారత్‌లోనూ వ్యాపార స్టార్టప్‌లు మొదలు వ్యక్తిగత పనుల వరకు దీని వినియోగం విస్తరిస్తోంది. దాదాపు వంద కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లతో ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న డిజిటల్ మార్కెట్లలో ఒకటైన భారత్‌లో తమ వ్యాపారాలు విస్తరించేందుకు అనేక సంస్థలు దృష్టి సారించాయి.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఏఐపై ఏటా అంతర్జాతీయ సదస్సు

- గుటెరస్ వెల్లడి

ఐరాస: ఏఐని నియంత్రించడం ఐరాస పని కాదని, కానీ ఏటా అన్ని దేశాలు, పౌర సమాజాలు, ప్రైవేటు కంపెనీలతో కలిసి అంతర్జాతీయ ఏఐ సదస్సు నిర్వహించాలని నిర్ణయించామని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఏఐ నిర్మాణంలో 3 కీలక వ్యవస్థలను గుర్తించామని వెల్లడించారు. అత్యున్నత స్థాయి స్వతంత్ర అంతర్జాతీయ సైంటిఫిక్ ప్యానెల్ అని, ఇందులో ప్రపంచం నలుమూలల నుంచి 40 మంది నిపుణులను నియమించామని తెలిపారు. అంతర్జాతీయ సదస్సు ద్వారా ఎవరైనా ఏదైనా అంశంపై చర్చించే అవకాశం లభిస్తుందని వెల్లడించారు. దీనివల్ల ఏకాభిప్రాయ సాధనతోపాటు ఏఐలో అవకాశాలను పెంచడంతోపాటు రిస్కులను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏఐకి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడంపై తాను చేసిన ప్రతిపాదన ఆమోదం పొందుతుందన్న ఆశాభావాన్ని ఆయన ఓ ఇంటర్వ్యూలో వ్యక్తం చేశారు.



ఏఐ సమిట్‌కు వచ్చిన ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌కు స్వాగతం పలుకుతున్న ప్రధాని మోదీ

గిన్నిస్ రికార్డులకెక్కిన ఏఐ సమిట్

- 24 గంటల్లో 2.5 లక్షలకుపైగా ప్రతిజ్ఞలు

దిల్లీ: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026 గిన్నిస్ రికార్డులకెక్కింది. ఏఐని బాధ్యతాయుతంగా వినియోగిస్తామని ఈ సమిట్ సందర్భంగా 24 గంటల్లో 2,50,946 మంది విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడంద్వారా ఈ ఘనత సాధించింది.

ఏఐ ఎక్స్‌పో గడువు 21 వరకూ పొడిగింపు

దిల్లీ: ఇండియా ఏఐ ఎక్స్‌పోను గురువారం సందర్శకులకు మూసివేయనున్నారు. దానికి బదులుగా ఈ నెల 20, 21 తేదీల్లో సందర్శకుల కోసం తెరిచి ఉంచుతారు. వాస్తవానికి ఏఐ ఎక్స్‌పో 20వ తేదీనే ముగియాల్సి ఉంది. గురువారం సమిట్ జరగనున్నందున, అందులో దేశాధినేతలు పాల్గొంటున్నందున గందరగోళానికి తావులేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా యూనస్..?



ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ నూతన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఇప్పటివరకు తాత్కాలిక ప్రభుత్వ సారథిగా ఉన్న మహమ్మద్ యూనస్ భవితవ్యంపై సందిగ్ధత ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆయన ఓ కీలక బాధ్యతలు చేపట్టనున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ పదవి నుంచి దిగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. షాబుద్దీన్ పదవీకాలం 2028 ఏప్రిల్ వరకు ఉన్నప్పటికీ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. గతంలో పలుమార్లు యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం తనకు గౌరవం ఇవ్వలేదని.. ఫిబ్రవరిలో బంగ్లా ఎన్నికలు జరిగిన అనంతరం పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే యూనస్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ఈ విషయంపై బంగ్లా ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

'ప్రార్థనా స్థలాల చట్టం-1947' వివాదంపై తుది విచారణకు తేదీని నిర్ణయిస్తాం

- సుప్రీంకోర్టు సీజేఐ ధర్మాసనం వెల్లడి

దిల్లీ: 'ప్రార్థనా స్థలాల చట్టం-1947'లోని పలు నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై తుది విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సమ్మతించింది. విచారణ తేదీని త్వరలో నిర్ణయిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ప్రస్తుత రెండు వేర్వేరు వివాదాలపై 9మంది సభ్యులతో కూడిన విస్తృత ధర్మాసనాలు ఏర్పాటయ్యాయని, మార్చి, ఏప్రిల్ నెలల్లో విచారణ జరపనున్నాయని పేర్కొన్నారు. ఆ వ్యాజ్యాల అనంతరం 'ప్రార్థనా స్థలాల చట్టం'పై తుది విచారణను చేపడతామన్నారు. అంతకుముందు ...పిటిషనర్ అశ్వినీ ఉపాధ్యాయ్ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ మాట్లాడుతూ... ప్రార్థనా స్థలాల చట్టం నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ అంశాలను సుప్రీం ధర్మాసనం 2022 అక్టోబరు 12న ఖరారు చేసిందని బుధవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం 2022 అక్టోబరు 31వ తేదీకల్లా స్పందనను దాఖలు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ చేయలేదని తెలిపారు.

బంధుప్రీతి, స్వార్థం ప్రజాస్వామ్యానికి శాపం

- హౌసింగ్ సొసైటీ ఫ్లాట్ల వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: తాము మాత్రమే వృద్ధిచెందాలనే స్వార్థం, బంధుప్రీతి ప్రజాస్వామ్య వ్యవస్థకు శాపమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. హౌసింగ్ సొసైటీ ఫ్లాట్ల కేటాయింపులో అధికార దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనను నిర్ధరిస్తూ జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన పంజాబ్, హరియాణా హైకోర్టు ఉత్తర్వును కొట్టివేసింది. అక్రమ కేటాయింపులను రద్దు చేసింది. హరియాణా అర్బన్ హౌసింగ్ సొసైటీలో రెండు లగ్జరీ ఫ్లాట్‌లను అనర్హులైన పాలకమండలి సభ్యుడికి, అతడి కిందిస్థాయి అధికారికి అక్రమంగా కేటాయించారని, అధికార దుర్వినియోగం చోటుచేసుకుందన్న పిటిషనర్ వాదనను సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఆ కేటాయింపులు పక్షపాతంగా, ఏకపక్షంగా ఉన్నాయని ఆక్షేపించింది.

దిల్లీ అల్లర్ల కేసు.. బెయిలు కోరుతూ సుప్రీంకు మరో నిందితుడు

దిల్లీ: దిల్లీ అల్లర్ల (2020) కేసులో తనకు దిల్లీ హైకోర్టు బెయిలు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ మరో నిందితుడు దాఖలు చేసిన అప్పీలును సుప్రీంకోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. నిందితుడైన అబ్దుల్ ఖాలిద్ సైఫీ దాఖలు చేసిన అభ్యర్థనపై స్పందిస్తూ జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ప్రసన్న బి వరాలేల ధర్మాసనం దిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో సహ నిందితులైన ఐదుగురికి అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే బెయిలు మంజూరు చేసిందని, ప్రస్తుతం అప్పీలు చేసిన నిందితుడు వారితో తనను సమానంగా పరిగణించాలని కోరడానికి వీల్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. తనకు బెయిలు మంజూరు చేయడానికి నిరాకరిస్తూ హైకోర్టు గత సెప్టెంబరు 2న వెలువరించిన తీర్పును సైఫీ సవాలు చేశారు. జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లపై వచ్చిన ఆరోపణల్లో ప్రాథమికంగా వాస్తవం ఉందని పేర్కొంటూ సుప్రీంకోర్టు జనవరి 5న వారికి ఈ కేసులో బెయిలు నిరాకరించింది. సామాజిక కార్యకర్తలు గుల్‌షిఫా ఫాతిమా, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రహమాన్, మహ్మద్ సలీం ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు 11 షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది.

అందుకు అనుమతిస్తే సమాజానికి చెడు సందేశమిచ్చినట్లే

- ఎల్విష్ పాము విషం కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: పాము విషం కేసులో వన్యప్రాణి (రక్షణ) చట్టం కింద ప్రముఖ యూట్యూబర్ ఎల్విష్ యాదవ్‌పై నమోదైన ఫిర్యాదును పరిశీలిస్తామని బుధవారం సుప్రీం కోర్టు వెల్లడించింది. పాము వంటి 'నోరులేని బాధితుల'ను ప్రముఖులు ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే అది సమాజానికి చెడు సందేశాన్నిస్తుందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో జరిగిన ఓ రేవ్ పార్టీలో పాము విషాన్ని ఉపయోగించారన్న ఆరోపణలతో 2023 నవంబరులో ఎల్విష్ యాదవ్‌పై కేసు నమోదైంది. దీన్ని సవాలు చేస్తూ యాదవ్ దాఖలు చేసిన అభ్యర్థనను జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. "మీరు జూకు వెళ్లి అక్కడ జంతువులతో ఆడుకుంటారా? అది నేరం కాదా? వన్యప్రాణి (రక్షణ) చట్టం కింద నమోదైన ఫిర్యాదుపై మేం ఆందోళన చెందుతున్నాం" అని పేర్కొంది. రేవ్ పార్టీ జరిగినట్లు, పాము విషం తీసుకున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని యాదవ్ తరఫు న్యాయవాది తెలిపారు. ఆ ప్రాంతంలో యాదవ్ లేరని, పరీక్షించిన తొమ్మిది పాములు విషపూరితమైనవి కావని వివరించారు. రేవ్ పార్టీలో ఐదు నాగుపాములు సహా తొమ్మిది పాములను పోలీసులు రక్షించారని, పాము విషాన్ని కూడా గుర్తించారని రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది తెలిపారు. ఎలా పాము విషాన్ని తీసి రేవ్ పార్టీల్లో వినియోగిస్తారో తెలపాలంటూ ప్రభుత్వ కౌన్సిల్‌ను అత్యున్నత న్యాయస్థానం అడిగింది. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది.

పశ్చిమాసియాకు మరో 50 యుద్ధవిమానాలు

- ఇరాన్‌తో చర్చలు జరుపుతూనే మోహరించిన అమెరికా!

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అణు ఒప్పందంపై జెనీవా వేదికగా టెహ్రాన్‌తో రెండు రోజులపాటు పరోక్ష చర్చలు జరిపిన వాషింగ్టన్.. ఆ చర్చలు కొనసాగుతుండగానే 24 గంటల్లో దాదాపు 50 అత్యాధునిక యుద్ధవిమానాలను పశ్చిమాసియాలో మోహరించింది. వీటిలో ఎఫ్-22, ఎఫ్-16, ఎఫ్-35 వంటి ఫైటర్ జెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అగ్రరాజ్యం ఏ క్షణాన ఎలాంటి చర్యలు చేపడుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి నుంచీ హెచ్చరిస్తున్న సంగతి గమనార్హం. మరోవైపు- అమెరికా విమానవాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్.. కరీబియన్ సముద్రం నుంచి పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు ఆ దేశ నౌకాదళాధికారి ఒకరు తెలిపారు. విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు పలు యుద్ధవిమానాలను ఇప్పటికే పశ్చిమాసియాలో అమెరికా మోహరించింది.

కొన్ని విషయాలపై స్పష్టత రావాలి: అమెరికా

జెనీవాలో చర్చలు సానుకూలంగా జరిగాయని అమెరికా, ఇరాన్ పేర్కొన్నాయి. చర్చల్లో పురోగతి సాధించామని.. కొన్ని విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని అమెరికా అధికారులు తెలిపారు. ఓ ఒప్పందం కుదుర్చుకునేందుకు మార్గం సుగమమైందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అన్నారు. తాజా చర్చలు మిశ్రమ ఫలితాలను ఇచ్చాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. ఇరాన్ అంగీకరించడానికి సిద్ధంగా లేని కొన్ని కఠినమైన షరతులను ట్రంప్ నిర్దేశించినట్లు తెలిపారు. వాషింగ్టన్ ఇంకా దౌత్యపరమైన పరిష్కారాలనే ఇష్టపడుతోందని అంటూనే.. తమ అధ్యక్షుడి వద్ద మరిన్ని ఐచ్ఛికాలు ఉన్నాయంటూ హెచ్చరికలు చేశారు.

జపాన్ ప్రధానిగా తకాయిచి

- రెండోసారి బాధ్యతల స్వీకరణ



టోక్యో: పార్లమెంటు ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచిన జపాన్ ప్రధాన మంత్రి సానే తకాయిచి బుధవారం మళ్లీ అధికార పగ్గాలు చేపట్టారు. అరుదైన లోహాలు, ఇతర ఆర్థిక అంశాల్లో అమెరికాతో సహకారాన్ని మరింత పెంపొందించుకుంటామని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మైత్రిని బలోపేతం చేసుకుంటామని తెలిపారు. గత వారం వెలువడిన పార్లమెంటు దిగువసభ ఎన్నికల ఫలితాల్లో తకాయిచి నేతృత్వంలోని లిబరల్ డెమొక్రటిక్ పార్టీ మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది. అందువల్ల ఎగువ సభలో మెజారిటీ లేకపోయినా ఆమె ప్రభుత్వ బిల్లులను నిరాటంకంగా నెగ్గించుకోగలిగే అవకాశం ఉంది.

లొంగిపొండి... లేదంటే...

- మావోయిస్టులకు హోంశాఖ హెచ్చరిక

దిల్లీ: నక్సలిజాన్ని ఈ సంవత్సరం మార్చిలోగా పూర్తిగా నిర్మూలించాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి కార్యరూపమిచ్చేందుకు భద్రతా బలగాలు కట్టుదిట్టమైన ప్రణాళిక సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా నలుగురు సీనియర్ కమాండర్లతో సహా మొత్తం 300 మంది మావోయిస్టులపై బలగాలు దృష్టి నిలిపాయని అధికారులు బుధవారం వెల్లడించారు. ప్రభుత్వ నిఘాలో ఉన్న మావోయిస్టు నేతల్లో సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు మిసిర్ బెస్రా అలియాస్ భాస్కర్, దేవ్‌జీ అలియాస్ కుంభ దాదా లియాస్ చేతన్, రామన్న అలియాస్ గణపతి అలియాస్ లక్ష్మణరావు, మల్లా రాజారెడ్డి అలియాస్ సాగర్‌లు ఉన్నారు. దేవ్‌జీ, అతని అనుచరుడు కేసా సోఢీల కదలికల గురించి సమాచారం అందడంతో ప్రభుత్వ బలగాలు ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు వెంబడి భారీ ఆపరేషన్ నిర్వహించాయి. అవి వెతుకుతున్న కమాండర్లలో ముగ్గురు ఈ ప్రాంతంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మల్లా రాజారెడ్డి మాత్రం ఒడిశా ప్రాంతంలో క్రియాశీలంగా ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టులు తమంత తాముగా లొంగిపోవాలని, లేదంటే ముమ్మర ఆపరేషన్లలో తూటాలకు బలికావాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరించారు.

దిల్లీ, రాజస్థాన్‌లలో వర్షాలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీతోపాటు, రాజస్థాన్‌లో పలు చోట్ల బుధవారం తేలికపాటి వర్షాలు కురిశాయి. దిల్లీలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవడంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. మరోవైపు, రాజస్థాన్‌లోని బీకానేర్, జైపుర్, భరత్‌పుర్, అజ్మేర్, కోటా ప్రాంతాల్లో వర్షాలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. జైపుర్‌లోని నారాయణలో అత్యధికంగా 27 మి.మీ. వర్షపాతం, పశ్చిమ రాజస్థాన్‌లోని నోహర్, హనుమాన్‌గఢ్‌లలో 20 మి.మీ. చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు.

ఇమ్రాన్ ఆరోగ్యంపై ధర్నాను విరమించిన ప్రతిపక్షాలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య విషయంపై ఇస్లామాబాద్‌లోని పార్లమెంటు వెలుపల చేపట్టిన తమ నిరసనలను ప్రతిపక్ష కూటమి తాత్కాలికంగా విరమించుకుంది. గురువారం ప్రారంభం కానున్న రంజాన్‌ను పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయం చేసినట్లు తెలిపింది. అయితే ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని, అతని వ్యక్తిగత వైద్యున్ని కలుసుకునే అవకాశం కల్పించాలని ప్రతిపక్షం పట్టుపడుతోంది.

'అందరికీ ఏఐ'లో భారత్ కృషికి మద్దతు

- రెండు దేశాల సంబంధాలు అద్భుతం
- స్విట్జర్లాండ్ అధ్యక్షుడి స్పష్టీకరణ



దిల్లీ: ఏఐని ప్రజాస్వామ్యీకరించి.. అన్ని దేశాలకు సమాన అవకాశాలను కల్పించేందుకు భారత్ చేస్తున్న కృషికి సంపూర్ణ మద్దతు ఇస్తామని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు పర్మెలిన్ పేర్కొన్నారు. ప్రతి దేశానికీ కీలక సాంకేతికతలతో ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను ఆయన స్వాగతించారు. సరిహద్దుల ఆవలకు డేటా సరఫరా చేయడానికి మద్దతిస్తామని, అది డిజిటల్ టెక్నాలజీల ప్రయోజనాలను అందరికీ అందించడానికి ఉపయోగపడుతుందని, అయితే అదే సమయంలో డేటా సార్వభౌమత్వాన్ని కాపాడటానికి నిబంధనలను పాటించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఏఐ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన ఆయన బుధవారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. తదుపరి ఏఐ సమిట్‌ను స్విట్జర్లాండ్ నిర్వహించే అవకాశముంది.

'భారత్‌లో నిర్వహిస్తున్న ఏఐ సమిట్.. రూపొందించే నిబంధనావళి సరైన మార్గదర్శనం చేయనుంది. అలాగే స్వచ్ఛంద సహకారం కోసం ఇక్కడ నిర్మించే వారధులు లక్ష్యాన్ని సాధించేందుకు సహాయపడతాయి. అత్యధిక వేతనాలున్న దేశాల్లో ఉత్పత్తి వ్యయాన్ని ఏఐ గణనీయంగా తగ్గించగలిగితే ఎగుమతులు చౌకగా ఉంటాయి. ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని కార్మిక మార్కెట్లపై ఒత్తిడి పెరుగుతుంది. అటువంటి షాక్‌లను ట్రేడ్ పాలసీల ద్వారా సరిచేయవచ్చు' అని పర్మెలిన్ పేర్కొన్నారు. 'భారత్, స్విట్జర్లాండ్‌ల మధ్య సంబంధాలు అద్భుతంగా ఉన్నాయి. 2024లో 75 ఏళ్ల స్నేహాన్ని సెలబ్రేట్ చేసుకున్నాం. ఇంకా అనేక రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయి. వీటిని వినియోగించుకోవడానికి నా పర్యటన దోహదం చేయనుంది. పారిశ్రామిక సామర్థ్యంపై రెండు దేశాల ఆర్థిక సంబంధాలు ఆధారపడి ఉన్నాయి. స్విట్జర్లాండ్ నుంచి యంత్రాలు, ఔషధాలు, రసాయన ఉత్పత్తులు, విలువైన పరికరాలు, మెడికల్ టెక్నాలజీలు, వాచ్‌లను ఎగుమతి చేస్తున్నాం. భారత్ నుంచి రసాయనాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్స్, ఇతర పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం' అని వివరించారు.

కీళ్లవాతానికి వ్యాయామంతో ప్రయోజనం తక్కువే!

- అధ్యయన నివేదిక వెల్లడి

దిల్లీ: కీళ్ల మధ్యన ఉండే మృదు పదార్థం అరిగిపోయిన కారణంగా సంభవించే ఆస్టియో ఆర్థరైటిస్ (కీళ్ల వాతం) వ్యాధి లక్షణాలు- వ్యాయామంతో తొలగిపోయే అవకాశాలు చాలా తక్కువని ఒక అధ్యయనంలో తేలింది. ఈ స్థితిలో వ్యాయామం చేయడం.. ఏ చికిత్సా చేయకపోవడంతో సమానమేనని పేర్కొంది. వ్యాయామం మంచి ప్రభావం చూపినా అది కొద్దికాలమే నిలుస్తుందని స్పష్టం చేసింది. "రూమాటిక్ అండ్ మస్క్యులోస్కెలెటల్ డిసీజెస్" అనే జర్నల్ ఈ అధ్యయనాన్ని ప్రచురించింది. కీళ్లవాతం వల్ల కలిగే నొప్పిని నివారించడానికి, శారీరక కార్యకలాపాల మెరుగుదలకు వ్యాయామమే అమోఘమైన పరిష్కారమంటూ సాగుతున్న ప్రచారాన్ని ఈ అధ్యయనం తోసిపుచ్చింది. జర్మనీలోని బోచుమ్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌కు చెందిన పరిశోధకులు కూడా ఈ అధ్యయనంలో పాల్గొన్నారు.



ఆస్టియో ఆర్థరైటిస్‌కు వ్యాయామాన్ని ప్రారంభ చికిత్సగా సిఫార్సు చేస్తుంటారు గానీ దానివల్ల ఫలితాలు స్వల్పకాలికమైనవే అనడానికి వైజ్ఞానిక సాక్ష్యాలున్నాయని పరిశోధకులు తెలిపారు. వ్యాయామం ద్వారా కీళ్లవాతం నివారించవచ్చని ఇప్పటివరకూ ప్రచురితమైన నివేదికలపై సమగ్ర సమీక్ష జరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ అధ్యయనంలో భాగంగా దాదాపు 12 వేల మందిపై 28 చికిత్సాపరమైన పరీక్షలు, ఐదు శారీరక సమీక్షలు నిర్వహించి గణాంకాలను విశ్లేషించారు. ఇతర చికిత్సలతో పోలిస్తే కీళ్ల వాతానికి వ్యాయామమే సరైన విరుగుడని చెప్పడానికి సరైన సాక్ష్యాలు లేవని పెదవి విరిచారు. తుంటికీలుకు సోకిన ఆర్థరైటిస్ నివారణకు వ్యాయామం ఏమాత్రం ప్రయోజనకారి కాదని, చేతి కీళ్లపై కొంతవరకూ ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. వ్యాయామంతో పోలిస్తే కీళ్ల శస్త్రచికిత్స (ఆస్టియోటమీ), జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలే దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయని వెల్లడైనట్టు వివరించారు.

అణు జలాంతర్గాముల్లో చైనా దూకుడు

బీజింగ్: సైనికపరంగానూ అమెరికాకు చైనా గట్టి పోటీ ఇస్తోంది. ముఖ్యంగా సముద్రగర్భంలో అగ్రరాజ్య ఏకవత్రాధిపత్యానికి గండికొట్టే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఇటీవల కాలంలో అణు ఆధారిత జలాంతర్గాముల తయారీలో దూకుడు పెంచింది. లండన్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ నివేదిక ప్రకారం.. గత ఐదేళ్లలో అమెరికా కంటే వేగంగా డ్రాగన్ అణు జలాంతర్గాములను తయారు చేస్తోంది. 2021-25 మధ్య చైనా ఏకంగా 10 అణు జలాంతర్గాములను రంగంలోకి దించింది. అమెరికా ఏడింటికి పరిమితమైంది. చైనా సబ్‌మెరైన్ల బరువు 70 వేల మెట్రిక్ టన్నులైతే అగ్రరాజ్య జలాంతర్గాముల బరువు కేవలం 55,500 మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ స్థాయిలో చైనా జోరు పెంచడం అమెరికాను కలవరపరుస్తోంది. ఎందుకంటే 2016-2020 మధ్య డ్రాగన్ కేవలం మూడు జలాంతర్గాములనే తయారు చేసింది. ప్రస్తుత వేగంతో చైనా దూసుకెళితే 2035 కల్లా అణు జలాంతర్గాముల విషయంలో అగ్రరాజ్యాన్ని అధిగమించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

పుట్టకముందే జనన ధ్రువీకరణ పత్రాలు.. వేర్వేరుగా తండ్రి-కుమారుల మతాలు!

- బెంగాల్ సర్ ప్రక్రియలో చిత్రవిచిత్రంగా వివరాల నమోదు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నమోదవుతున్న కొందరి డేటాను చూసి ఎన్నికల కమిషన్ (ఈసీ) ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు! తండ్రి-కుమారుడి మతం వేరువేరుగా ఉంటుండటం, పుట్టినరోజు కంటే ముందుగానే జనన ధ్రువీకరణ పత్రాలు జారీ అయి ఉండటం వంటి విపరీత పరిణామాలే ఇందుకు కారణం. సర్‌లో భాగంగా బెంగాల్ వ్యాప్తంగా పలు ప్రాంతాల ఓటర్లకు సంబంధించిన డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ ప్రక్రియ పూర్తవడంతో.. వాటిని ఈసీ తాజాగా క్షుణ్నంగా పరిశీలించింది. పలు పురి డాక్యుమెంట్లలో వివరాలు చిత్రవిచిత్రంగా ఉండటాన్ని గుర్తించింది. తూర్పు మేదినీపుర్ జిల్లాలోని పాంశ్‌కుడా పశ్చిమ అసెంబ్లీ స్థానంలో అప్‌లోడ్ అయిన ఓ ఎన్యుమరేషన్ ఫారమ్ (ఈఎఫ్)లో.. షేక్ రాజేష్ అలీ అనే ఓటరు తండ్రి పేరు భువన్‌చంద్ర బేరాగా నమోదైంది. తండ్రి-కుమారుడి మతం వేరువేరుగా ఉండటంతో ఈసీ అధికారులు మరింత లోతుగా పరిశీలించగా.. బిజోయ్ కృష్ణ బేరా అనే మరో ఓటరు తండ్రిగా అదే భువన్‌చంద్ర బేరా పేరు నమోదై కనిపించింది. ఇక- దక్షిణ 24 పరగణాలు జిల్లాలోని మగ్రాహాట్‌లో ఓ ఓటరు సమర్పించిన జనన ధ్రువీకరణ పత్రంలో.. తన పుట్టినతేదీ 1990 అక్టోబరు 30గా ఉంది. అయితే ఆ తేదీ కంటే 68 రోజుల ముందే.. అంటే 1990 ఆగస్టు 23నే తన జననం రిజిస్ట్రేషన్ చేసి ఉంది. ఇలాంటి తప్పులు పొరపాటున నమోదవుతున్నాయా.. లేక ఓటర్లు దురుద్దేశంతో చేస్తున్నారా.. అనేది అర్థం కావడం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కారణం ఏదైనా.. ఆయా ధ్రువపత్రాలను సిబ్బంది అప్‌లోడ్ చేసి ఉండకూడదని పేర్కొంటున్నారు. కోల్‌కతాలో ఓ దంపతుల మూడవ సంతానం, నాలుగో సంతానం మధ్య వయసు వ్యత్యాసం కేవలం నెల రోజులుగా నమోదవడాన్ని ఈసీ గత వారం గుర్తించింది. సర్ విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకు బెంగాల్‌లో ఏడుగురు సిబ్బందిపై ఈ నెల 16న సస్పెన్షన్ వేటు కూడా వేసింది.

రూ.10వేల కోట్ల పీఏసీఎల్ ఆస్తుల జప్తు

- పోంజీ స్కీమ్‌తో భారీ మోసానికి పాల్పడిన సంస్థపై ఈడీ చర్య

దిల్లీ: వ్యవసాయ భూముల అభివృద్ధి, విక్రయం పేరుతో లక్షల మంది ప్రజల నుంచి భారీగా డబ్బు వసూలు చేసి మోసగించిన చండీగఢ్‌కు చెందిన పీఏసీఎల్(పెరల్స్ గ్రూప్)పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కొరడా ఝుళిపించింది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద నమోదైన కేసులో భాగంగా రూ.10వేల కోట్ల విలువైన 247 స్థిరాస్తులను జప్తు చేసినట్లు ఈడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఓ సంస్థకు సంబంధించి ఒకేసారి ఇంత భారీ మొత్తంలో ఆస్తుల జప్తు ఇదే తొలిసారి అనే పేర్కొంది. ఈ ఆస్తులన్నీ పంజాబ్‌లోని ఎస్ఏఎస్ నగర్ (మొహాలీ), రూప్‌నగర్, జిర్కాపుర్‌లలో ఉన్నాయి. పోంజీ స్కీమ్ ద్వారా ప్రజల నుంచి అక్రమంగా సేకరించిన రూ.48వేల కోట్లతో ఈ ఆస్తులను పీఏసీఎల్ లిమిటెడ్ కొనుగోలు చేసిందని ఈడీ వెల్లడించింది. 2014 ఫిబ్రవరిలో నమోదైన సీబీఐ కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. తాజా జప్తుతో ఈడీ స్వాధీనం చేసుకున్న పీఏసీఎల్ లిమిటెడ్ ఆస్తుల విలువ రూ.17,610 కోట్లకు చేరింది.

దృష్టిని దాటి కాలాన్ని చూస్తున్న ఛత్తీస్‌గఢ్ 'క్యాలెండర్ బాయ్'



ఈటీవీ భారత్: కేవలం పది శాతం దృష్టి ఉన్న కేశ్‌నాథ్ ధ్రువ్‌ను సహ విద్యార్థులు, గురువులు అందరూ 'క్యాలెండర్ బాయ్' అంటారు. ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లా నగరీ పట్టణ సమీప నిర్రబెడ గ్రామానికి చెందిన ఈ బాలుడు ఫలానా నెల, ఫలానా సంవత్సరం అని తేదీ చెప్పగానే.. అది ఏ వారమో క్షణాల్లో చెప్పేస్తాడు. రుద్రీలో ఎగ్జాక్ట్ ఫౌండేషను ఆధ్వర్యంలోని వికలాంగుల ఆశ్రమ శిక్షణ కేంద్రంలో బ్రెయిలీ లిపి సాయంతో కేశ్‌నాథ్ 12వ తరగతి చదువుతున్నాడు. "వచ్చే ఏడాది నా పుట్టినరోజు ఏ వారం వస్తుందని అడగ్గా.. కేశ్‌నాథ్ క్షణాల్లో చెప్పడం చూసి విస్మయానికి గురయ్యా" అని ఎగ్జాక్ట్ ఫౌండేషను వ్యవస్థాపకురాలైన లక్ష్మీ సోని తెలిపారు. 'ఈ బాలుడు కళ్లతో చూడలేకపోయినా, అతడి సంకల్పశక్తి భవిష్యత్తులో ఎంతో దూరం చూడగలుగుతోంది'' అని కేశ్‌నాథ్‌ను ధంతరీ జిల్లా కలెక్టర్ అబినాశ్ మిశ్ర అభినందించారు.

కదులుతున్న వాహనాల డోర్లు తెరుస్తూ.. బైకర్ ప్రమాదకర స్టంట్లు

ఇంటర్నెట్‌డెస్క్: సోషల్ మీడియాలో లైకుల కోసం ఓ బైకర్ రోడ్లపై కదులుతున్న వాహనాల డోర్లు తెరుస్తూ.. వాహనదారులను ఇబ్బందులకు గురి చేసిన ఘటన దిల్లీలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. దిల్లీకి చెందిన తుషార్ పునియా(22) తరచూ బహిరంగ ప్రదేశాల్లో రీల్స్ చేస్తూ.. ఇతరులను ప్రమాదాల్లోకి నెడుతుంటాడు. ఈ క్రమంలోనే రోడ్లపై రిజిస్ట్రేషన్ లేని మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తూ.. ముఖానికి మాస్క్ ధరించి పక్కన వెళ్తున్న వాహనాల డోర్లను ఓపెన్ చేస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాడు.



పోలవరం నిధుల చెల్లింపు విధానంలో మార్పులు?

- 'స్పర్శ్' తరహాలో నిధులు ఇస్తామంటున్న కేంద్రం
- పని పూర్తి చేసి బిల్లులు సిద్ధం చేస్తేనే నిధులు
- సింగిల్ నోడల్ ఏజెన్సీ విధానమే కావాలంటున్న రాష్ట్రం
- మూడో విడత అడ్వాన్స్ రావాల్సిన నేపథ్యంలో సందిగ్ధం

ఈనాడు-అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు ఇచ్చే పద్ధతిలో మార్పులు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్స్‌గా నిధులు ఇస్తోంది. సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారా వీటిని సమకూరుస్తోంది. ఇప్పుడు ఆ విధానం మార్చి స్పర్శ్ పద్ధతిలో డబ్బు ఇస్తామని చెబుతోంది. సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారా చెల్లిస్తే రాష్ట్ర ఖజానాకు అడ్వాన్స్ రూపంలో నిధులు వచ్చేస్తాయి. స్పర్శ్ విధానంలో ఈ విధంగా రావు. ఈ కొత్త విధానంలో బిల్లులను అప్‌లోడ్ చేసిన తరవాత చెల్లింపుల ప్రక్రియను కేంద్రమే చేపడుతుంది. ఇప్పుడు అనేక పథకాలకు చెల్లింపులను స్పర్శ్ తరహాలోకి కేంద్ర ప్రభుత్వం మార్చేస్తోంది. పోలవరం పనులకు డబ్బు చెల్లింపునకు కూడా స్పర్శ్ మార్గాన్ని ఎంచుకుంటామని చెబుతోంది.

ఖర్చు చేస్తేనే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు కేటాయించింది. ఆ నిధులు రాష్ట్రం తీసుకోలేదు. 2024-25లో నిధులను అదే ఆర్థిక సంవత్సరంలో రెండు విడతల్లో అడ్వాన్స్‌గా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. 2025 మార్చిలో రెండో విడత తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న నిధుల్లో 80 శాతం ఖర్చు చేస్తేనే మూడో విడత డబ్బు విడుదల చేస్తారు. మూడో విడత నిధుల కోసం ఈ ఏడాది జనవరిలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం కేటాయించిన రూ.5,936 కోట్లను తీసుకోలేదు. దీంతో కేంద్రం కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టే క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పోలవరం బడ్జెట్‌ను రూ.3,017.40 కోట్లకు సవరించింది. ఇందులో ప్రస్తుతం రూ.1,500 కోట్లు ఇచ్చేందుకు.. అవి ఖర్చు చేస్తే మరో రూ.1,500 కోట్లు మార్చి లోపు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

విధానం మారిస్తే నిధులు వెంటనే వచ్చేనా?

పోలవరం ప్రాజెక్టుకు అడ్వాన్స్‌గా కేంద్రం నిధులు ఇస్తున్న క్రమంలో అందుకు తగ్గట్టుగా సింగిల్ నోడల్ ఏజెన్సీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకుంది. ఈ మేరకు కేంద్రం అడ్వాన్స్‌గా ఇస్తున్న నిధులు తొలుత రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. ఎప్పుడు బిల్లు చెల్లించాల్సి వస్తే అప్పుడు సింగిల్ నోడల్ ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను జమ చేస్తుంది.

స్పర్శ్ విధానంలోకి మారిస్తే...

ఇప్పుడు చెల్లింపులను కేంద్రం స్పర్శ్ విధానంలోకి మారుస్తామని చెబుతోంది. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటా నిధులను ఇస్తాయి. ఈ విధానంలో బిల్లులు సిద్ధమైన వెంటనే తమ వాటా నిధులను విడుదల చేస్తాయి. పోలవరం ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ వాటా లేదు. కేంద్రమే పూర్తి స్థాయిలో నిధులు ఇస్తోంది. అంటే పోలవరం పనులను పూర్తి చేసి బిల్లులు సిద్ధమైన వెంటనే నిధులను స్పర్శ్ విధానంలో ఇస్తామని కేంద్రం ఇప్పుడు చెబుతోంది. అదే జరిగితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం సవరించిన బడ్జెట్ రూ.3,017.40 కోట్లు తీసుకోవడం అంత సులభం కాదు. పాత విధానాన్ని మార్చవద్దని రాష్ట్ర ఆర్థికశాఖ, పోలవరం ప్రాజెక్టు అధికారులూ పట్టుబడుతున్నారు. మళ్లీ స్పర్శ్ విధానం మేరకు చేయాలంటే విధివిధానాలు పూర్తి చేసేందుకే ఈ ఆర్థిక సంవత్సరం పూర్తవుతుందనేది వారి వాదన. అందువల్ల పాత విధానాన్ని కొనసాగించాలని పట్టుబడుతున్నారు. కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

నందమూరి తారకరత్నకు చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: నటుడు నందమూరి తారకరత్నకు సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. "మా కుటుంబానికి అత్యంత ఆత్మీయుడు తారకరత్న. అతని ఆప్యాయత, అనుబంధం మా మనసులో శాశ్వతంగా నిలిచే ఉంటుంది" అని చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు. మరో పోస్టులో తారకరత్నకు మంత్రి నారా లోకేశ్ నివాళి అర్పించారు. ఆయన భౌతికంగా దూరమైన..జ్ఞాపకాలు ఎప్పుడూ తన వెన్నంటే ఉంటాయని పేర్కొన్నారు.

ముస్లింలకు చంద్రబాబు, లోకేశ్ శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: రంజాన్ మాసారంభం సందర్భంగా ముస్లింలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ''ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, పేదలకు దానధర్మాలు చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో మెలుగుతారు. వారి దీక్ష పవిత్రంగా సాగాలని ఆకాంక్షిస్తున్నాను'' అని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి, వారి ఉపవాస దీక్ష భక్తిశ్రద్ధలతో సాగాలని ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

76 మందికి జడ్పీసీఈవోలుగా పదోన్నతులు

ఈనాడు, అమరావతి: జిల్లా పరిషత్ సీఈవోలుగా 76 మందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో), జడ్పీ డిప్యూటీ సీఈవో, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (డీడీవో)గా పని చేస్తున్న వారిలో నుంచి సీనియారిటీ ఆధారంగా పదోన్నతులిచ్చారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

జగన్ చెట్లు నరికిస్తే.. మేము పరిరక్షిస్తున్నాం

ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఈనాడు-అమరావతి: గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ఎక్కడికి వెళితే.. అక్కడ చెట్లను నరికివేయించేవారని, కూటమి ప్రభుత్వంలో మాత్రం పచ్చదనాన్ని పరిరక్షిస్తున్నామని శాసనసభలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జాతీయ రహదారుల పనుల్లోని సివిల్ వర్క్స్‌లో ఒక శాతం నిధులను మొక్కలు నాటేందుకు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రోడ్లకు ఇరువైపులా గ్రీన్‌బెల్ట్ లేకపోతే ఎంతో నష్టం జరుగుతుందన్నారు.

ఖేలో ఇండియా పథకం ద్వారా రూ.75 కోట్లు

క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: అన్ని నియోజకవర్గాల్లో క్రీడాభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఖేలో ఇండియా పథకంలో రూ.75 కోట్లు మంజూరైనట్లు క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శాసనసభలో పేర్కొన్నారు. అంతకుముందు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ.. మండపేటలో స్టేడియం పనులు పూర్తి చేయాలని, రాయవరం, కపిలేశ్వరంలలో ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియంలు నిర్మించాలని కోరారు. ఇదే అంశంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. 'పాత ఉన్నత పాఠశాలల్లో రెండు, మూడు ఎకరాల విస్తీర్ణంలో మైదానాలున్నాయి. వాటిలో కబడ్డీ, వాలీబాల్ కోర్టులు వంటివి ఏర్పాటు చేయాలి' అని మంత్రికి సూచించారు.

మాజీ ఎమ్మెల్సీల మృతికి సంతాపం

ఈనాడు, అమరావతి: మాజీ ఎమ్మెల్సీలు ఐలాపురం వెంకయ్య, రత్నాబాయి మృతికి సంతాప తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు బుధవారం సభలో ప్రవేశపెట్టారు. వారి మృతికి సంతాపంగా సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు. వారిద్దరి రాజకీయ ప్రస్థానం, వారు నిర్వహించిన పదవులు, చేసిన సేవల గురించి ఛైర్మన్ సంతాప తీర్మానంలో ప్రస్తావించారు.

అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు ఉన్నతాధికారులు అందుబాటులో ఉండాలి

ఈనాడు, అమరావతి: ప్రస్తుత శాసనసభ/మండలి సమావేశాల సమయంలో రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అన్ని శాఖల ఉన్నతాధికారులు వారి వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రధానమైన ప్రజాసమస్యలపై చర్చించేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులను కలుసుకోవడంలో ఇబ్బందులున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిన నేపథ్యంలో సీఎస్ ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఎక్స్ అఫిషియో కార్యదర్శులు తప్పనిసరిగా తమ కార్యాలయాల్లో ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు దీనిని తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు.

క్రెషెస్‌కు ఆర్థికశాఖ మోకాలడ్డు

- 108 కేంద్రాలు మంజూరు చేసిన కేంద్రం
- ఈ ఏడాది ఒక్క దానికి అడుగు పడని వైనం

ఈనాడు, అమరావతి: దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించనట్లు ఉంది రాష్ట్ర ఆర్థికశాఖ అధికారుల తీరు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాల బాట పడుతూ పిల్లల సంరక్షణ వారికి పెద్ద సవాలుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా ఉద్యోగులకు అండగా నిలిచేలా ముఖ్యమంత్రి చంద్రబాబు గతేడాది మహిళా దినోత్సవం సందర్భంగా చిన్నారుల సంరక్షణ కేంద్రాలు(క్రెషెస్) ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆ దిశగా మహిళా శిశు సంక్షేమశాఖ ముందడుగు వేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఆ వెంటనే కేంద్రం కూడా స్పందించి రాష్ట్రానికి 108 కేంద్రాలను మంజూరు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ రాష్ట్ర వాటా నిధులు మంజూరుకు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు ఆర్థికశాఖకు నివేదించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మోక్షం కలగలేదు.

ఆరు నెలలు దాటిన పిల్లల సంరక్షణ చూసేలా..

క్రెషెస్‌లో ఆరు నెలలు దాటిన పిల్లల సంరక్షణను చూస్తారు. చిన్నారుల సంరక్షణకు కార్యకర్త, సహాయకురాలు అందుబాటులో ఉంటారు. పిల్లలు ఆటలాడుకునేందుకు ఆట వస్తువులు, ఉయ్యాల, బరువు తూచే యంత్రం, బెడ్లు, ఫ్రిడ్జ్, మరుగుదొడ్లు, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేస్తారు. చిన్నారుల ఆహారం వరకు తల్లిదండ్రులు అందించేదే సమకూర్చాలని నిర్ణయించారు.

నామమాత్రపు వ్యయంతోనే కేంద్రాలు అందుబాటులోకి..

108 కేంద్రాల ఏర్పాటుకు రూ.3.62 కోట్ల వ్యయం కానుంది. కేంద్రం, రాష్ట్రం కలిసి 60:40 నిష్పత్తిలో భరించాల్సి ఉంటుంది. అంటే ఇందులో కేంద్రం వాటా రూ.2.17 కోట్లు, రాష్ట్రం వాటా రూ.1.44 కోట్లు కానుంది. ఇప్పటికే కేంద్రం తన వాటాగా రూ.60 లక్షలు విడుదల చేసింది. కార్యకర్తలకు నెలకు రూ.5,500, సహాయకురాలికి రూ.3,000 చెల్లిస్తారు. పోషకాహారం అందించినందుకుగాను అంగన్‌వాడీ కార్యకర్తకు మరో రూ.1500 చొప్పున ఇస్తారు. నరేగా చట్టం, ఫ్యాక్టరీలు, బ్రాయిలర్ల చట్టం ప్రకారం ఇవి తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంది. కనీసం 50 మంది మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రదేశంలో వీటి ఏర్పాటుకు అధికారులు మొగ్గుచూపుతున్నారు. తొలి విడతగా జిల్లాకు ఒకటి చొప్పున ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, మరికొన్ని ప్రైవేటు కంపెనీలున్న చోట్ల ఆయా యాజమాన్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అద్దె భారం లేకుండా ప్రభుత్వ భవనాల్లోనే కొనసాగించేలా..

అంగన్‌వాడీలకు అనుబంధంగా క్రెషెస్ ఏర్పాటుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ ప్రభుత్వ మహిళా ఉద్యోగులు ఎక్కువగా విధులు నిర్వహిస్తున్నారనే విషయాన్ని ప్రాతిపదికగా తీసుకుని మహిళాశిశు సంక్షేమ శాఖ నివేదిక రూపొందించింది. విభాగాధిపతుల కార్యాలయాలు, జిల్లా కోర్టులు, కలెక్టరేట్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల వద్ద ఏర్పాటు అవసరాన్ని ప్రస్తావించింది. అద్దె భారం లేకుండా ప్రభుత్వ భవనాల్లోనే ఈ సంరక్షణ కేంద్రాలు నెలకొల్పేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

మోహన్‌బాబు, విష్ణులను వెంటనే అరెస్టు చేయాలి: ఎస్ఎఫ్ఐ

ఈనాడు, అమరావతి: తమ నాయకుల కిడ్నాప్‌నకు కారకులైన మంచు మోహన్‌బాబు, విష్ణులను వెంటనే అరెస్టు చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వలేమని ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నాం. గతంలో ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మోహన్‌బాబు విశ్వవిద్యాలయం గుర్తింపు రద్దు చేసి, శ్రీవేంకటేశ్వర వర్సిటీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి. విశ్వవిద్యాలయంలో అధిక ఫీజుల వసూళ్లకు వ్యతిరేకంగా తిరుపతి కలెక్టరేట్ వద్ద వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను మోహన్‌బాబు, విష్ణుల ఆదేశాలతో పీఆర్ఓ సతీష్ సారథ్యంలో 30 మంది బౌన్సర్లు, గుండాలు వాహనాల్లో కిడ్నాప్ చేశారు' అని పేర్కొన్నారు.

వైఎస్ షర్మిలతో రుద్ర సంతోష్‌కుమార్ భేటీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో ఏఐసీసీ ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఏపీ ఇన్‌ఛార్జి రుద్ర సంతోష్‌కుమార్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీలో తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు చర్చించారు.

ఔషధ రంగంలో భారత జీసీసీల విప్లవం

- తగ్గుతున్న వ్యయాలు.. పెరుగుతున్న వేగం
- పరిశోధన, అభివృద్ధి ఖర్చుల్లో 5% ఆదా
- బయో ఆసియా-2026 వేదికగా కేపీఎంజీ-అన్ఎర్త్ ఐక్యూ నివేదిక వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లోని ఔషధ, జీవశాస్త్రాల గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ప్రపంచ ఆరోగ్య రంగంలో కీలక మార్పులు తీసుకొస్తున్నాయి. ఔషధాల తయారీ ప్రక్రియలో వేగం పెంచడంతో పాటు, పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ) వ్యయాలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. బయో ఆసియా సదస్సులో భాగంగా కేపీఎంజీ ఇండియా, అన్ఎర్త్ ఐక్యూ సంస్థలు సంయుక్తంగా రూపొందించిన 'మేకింగ్ ఇట్ మ్యాటర్: హౌ జీసీసీస్ ట్రాన్స్‌ఫార్మ్ కేపబిలిటీ ఇంటూ ఎండ్-పేషెంట్ ఇంపాక్ట్' నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ వంటి సాంకేతికతలను అందుకోవడం ద్వారా, ఔషధాల అభివృద్ధి కాలపరిమితి గతంలో ఉన్న 10-15 ఏళ్ల నుంచి ప్రస్తుతం 9-13 ఏళ్లకు తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఫలితంగా, మందుల తయారీ నుంచి, మార్కెట్లోకి విడుదల చేసే వరకు అయ్యే ఖర్చులు 20-30% నుంచి 15-25 శాతానికి తగ్గాయి. తొలి దశ పరిశోధనల్లో 5-6 ఏళ్లు, క్లినికల్ పరీక్షల దశలో 4-6 ఏళ్ల సమయం ఆదా అవుతోంది. దేశంలో ప్రస్తుతం 150కి పైగా హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ జీసీసీలు ఉన్నాయి. వీటిలో 3 లక్షల మంది మందికి పైగా నిపుణులు పని చేస్తున్నారు. వీటిలో ఫార్మా రంగానికి చెందినవి 30-35% ఉండగా, లైఫ్ సైన్సెస్‌వి 20-25%, మెడికల్ పరికరాలకు చెందినవి 20-25% వాటా కలిగి ఉన్నాయి. మిగిలినవి హెల్త్‌టెక్, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో ఉన్నాయి. సేవలందించే స్థాయి నుంచి, ఆవిష్కరణలకు చిరునామాగా జీసీసీలు మారుతున్నాయని నివేదిక విశ్లేషించింది.

పరికరాల విభాగంలోనూ

వైద్య పరికరాల విభాగంలోనూ భారత జీసీసీల పాత్ర గణనీయంగా పెరిగింది. డిజిటల్ ఇంజినీరింగ్, రెగ్యులేటరీ ఆటోమేషన్ సాయంతో పరికరాల అభివృద్ధి కాలాన్ని 5-8 ఏళ్ల నుంచి 3-5 ఏళ్లకు తగ్గించగలిగారు. సాఫ్ట్‌వేర్ ఆధారిత లాభాల మార్జిన్లు 10-15% నుంచి 18-25 శాతానికి మెరుగుపడ్డాయి. జీసీసీల తదుపరి పరిణామం.. వ్యాపార పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాల మిళితంపై ఆధారపడి ఉంటుందని కేపీఎంజీ ఇండియా జీసీసీ లీడర్ షాలినీ పిళ్లై పేర్కొన్నారు. సరికొత్త సాంకేతికతలు, జెన్ ఏఐ వాడకం ద్వారా ఈ రంగంలోని ప్రధాన సవాళ్లను అధిగమించొచ్చని అభిప్రాయపడ్డారు. అంకుర సంస్థలు, విద్యా సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో కూడిన పర్యావరణ వ్యవస్థ ఈ కేంద్రాల పురోగతికి బాటలు వేస్తోందని అన్ఎర్త్ ఐక్యూ సహ వ్యవస్థాపకులు గౌరవ్ వాసు, శైల్ మణియార్, కేపీఎంజీ పార్ట్‌నర్ కార్తీక్ రామకృష్ణన్ వెల్లడించారు. ఈ మార్పుల వల్ల తుది ప్రయోజనం రోగులకే దక్కుతోంది. క్యాన్సర్, అరుదైన వ్యాధులు, దీర్ఘకాలిక సమస్యలకు తక్కువ ధరకే మందులు లభించే అవకాశం ఏర్పడుతోంది. క్లినికల్ ట్రయల్స్ విజయవంతం కావడం, కొత్త చికిత్సలు త్వరగా అందుబాటులోకి రావడం ఆరోగ్య రంగంలో కీలక పరిణామమని నివేదిక స్పష్టం చేసింది.

ఇది బాహుబలి బడ్జెట్

- త్రిమూర్తులు రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రైతులను నిలబెట్టేది: ప్రశాంతిరెడ్డి
- ప్రతి మండలానికి ఐటీఐ కావాలి: భాష్యం ప్రవీణ్
- పిల్లల చదువులకు ఆలంబన: బండారు శ్రావణి
- శాసనసభలో చర్చ సందర్భంగా ఎమ్మెల్యేలు

ఈనాడు-అమరావతి: 'రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ బాహుబలి బడ్జెట్. ప్రధాని మోదీ సహకారంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అనే త్రిమూర్తులు రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. ఈ బడ్జెట్‌లో రూ.51,120 కోట్లు బీసీల సంక్షేమానికి కేటాయించారు. అన్ని వర్గాలకు ఉపయోగపడేలా కేటాయింపులు ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు గాడిన పడింది. పెద్ద మొత్తంలో పెట్టుబడులు వస్తున్నాయి' అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శాసనసభలో బుధవారం బడ్జెట్‌పై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. 'గోదావరి పుష్కరాలకు ఇక 15 నెలలే సమయం ఉంది. ఇందుకు తగ్గ ప్రణాళికలు ముందే సిద్ధం చేసుకోవాలి. పనులు ప్రారంభించాలి' అని సూచించారు. గోదావరి డెల్టాను, 2 లక్షల ఎకరాలకు నీళ్లందించే లొల్ల లాకులూ ఆధునికీకరించాలని ఆయన కోరారు.

◆ కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నారని, తల్లికి వందనం పేరుతో పిల్లల చదువులకు నిధులు ఇవ్వడమే కాకుండా ఉచిత ప్రయాణాలు స్త్రీశక్తి పేరుతో అమలు చేయడానికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించారని అన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంతో పాటు పాఠశాల, ఉన్నత విద్యకు అధిక నిధులు కేటాయించారన్నారు. జగన్ ప్రభుత్వంలో అనాలోచిత నిర్ణయాల వల్ల ఆదాయ మార్గాలు లేకుండా పోయాయని, అప్పులు పెరిగిపోయాయని, అలాంటి రాష్ట్రాన్ని మళ్లీ సరైన మార్గంలో నడిపిస్తున్నారని కొనియాడారు.

◆ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ 'ఈ బడ్జెట్‌లో కీలకమైన మూడు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రైతులను నిలబెట్టేలా, విద్యార్థులు ఎదిగేలా, ప్రజల ఆరోగ్యం కాపాడేలా ఈ బడ్జెట్ ఉంది' అని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర కల సాకారం దిశగా బడ్జెట్ ఉందని అన్నారు. ఆస్తుల సృష్టికి ఎంతో కీలకమైన మూలధన వ్యయం రూ.53,000 కోట్లకు పైగా ప్రతిపాదించడం సంతోషకరమని ప్రశాంతిరెడ్డి చెప్పారు.

◆ పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ బడ్జెట్ విజన్ డాక్యుమెంట్‌లా ఉందని, విద్యకు ఏకంగా రూ.32,000 కోట్లకు పైగా నిధులు కేటాయించారని అన్నారు. 'మా నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాలు ఇప్పించేందుకు పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్నాను. వారు ఇంజినీరింగ్, ఇతర డిగ్రీలు చేసిన వారికన్నా ఐటీఐ చేసిన వారిని తీసుకువస్తే ఉపాధి కల్పిస్తామని చెబుతున్నారు. అందువల్ల ప్రతి మండల కేంద్రంలో ఒక ఐటీఐ ఏర్పాటు చేయాలి' అని కోరారు.

◆ శ్రీకాకుళం ఎమ్మెల్యే జి.శంకర్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం పోలవరం, వంశధార ప్రాజెక్టులను గాడిలో పెట్టిందన్నారు.

◆ సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ బడ్జెట్ మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మహిళలకు పెద్దపీట వేసిందని చెప్పారు.

ఫోన్, టీవీ తెరలకు కొత్త టెక్నాలజీ

- అల్ట్రాప్యూర్ బ్లూ ఓఎల్ఈడీని ఆవిష్కరించిన లార్డిన్ సంస్థ



బుబే పార్క్

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రానిక్స్‌లో అగ్రగామి దేశాల్లో ఒకటైన దక్షిణ కొరియాకు చెందిన అంకుర సంస్థ లార్డిన్ స్మార్ట్ ఫోన్లు, టీవీ స్క్రీన్ల కోసం సరికొత్త ఆవిష్కరణ చేసింది. గత రెండు దశాబ్దాలుగా శాస్త్రవేత్తలను ఊరిస్తున్న 'బ్లూ ఫాస్ఫోరెంట్ ఓఎల్ఈడీ' సాంకేతికతలో ఈ సంస్థ పరిశోధకులు విజయం సాధించారు. ఇది అల్ట్రాప్యూర్ బ్లూ ఎమిటర్ తెరల (డిస్‌ప్లే) భవిష్యత్తును మార్చనుందని సంస్థ సీటీవో బుబే పార్క్ పేర్కొన్నారు. ఈ సాంకేతికత ప్రత్యేకతలను బయో ఆసియా-2026 సదస్సులో 'ఈనాడు'కు ఆయన వివరించారు. ఫోన్లలోని ఓఎల్ఈడీ తెరల్లో ఎరుపు, ఆకుపచ్చ రంగులు ఎక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. నీలం రంగు విషయంలో ఇప్పటికీ పాత తరం ఫ్లోరోసెంట్ సాంకేతికతనే వినియోగిస్తున్నారు. దీంతో తెర ఎక్కువ బ్యాటరీని వినియోగించుకోవడమే కాదు.. త్వరగా దెబ్బతినే అవకాశం ఉంది. తాజా ఆవిష్కరణలో పరిశోధకులు అత్యంత సమర్థమైన బ్లూ ఫాస్ఫోరెంట్ ఆర్గానిక్ లైట్ ఎమిటింగ్ డయోడ్స్‌ని అభివృద్ధి చేశారు. ఈ సాంకేతికత 50.3 ఎక్స్‌టర్నల్ క్వాంటమ్ ఎఫిషియన్సీ (ఈక్యూఈ) సాధించింది. ఇది ప్రస్తుత ప్రమాణాల కంటే చాలా అధికం. దీంతో నాలుగు రెట్ల సామర్థ్యం పెరుగుతుంది. దీన్ని పరిశ్రమ వర్గాలు డ్రీమ్ ఓఎల్ఈడీగా పిలుస్తున్నాయి. దీని మెటీరియల్‌ను త్వరలోనే డిస్‌ప్లే తయారీ సంస్థలకు విక్రయించనున్నామని బుబే పార్క్ తెలిపారు. తద్వారా బ్యాటరీలు ఎక్కువ కాలం మన్నుతాయని, స్క్రీన్‌పై రంగులు మరింత సహజంగా ఉంటాయని వివరించారు.

డిప్యూటీఈఓ పోస్టుల్లో రిజర్వేషన్ రోస్టర్ పాటించలేదని ఫిర్యాదులు

ఈనాడు, అమరావతి: డిప్యూటీ విద్యాధికారుల పోస్టుల విషయంలో మహిళా రిజర్వేషన్‌లో జీఓ-77ను సక్రమంగా అమలు చేయలేదని ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులు ఏపీపీఎస్సీకి ఫిర్యాదు చేశారు. ఏపీపీఎస్సీ 38 పోస్టులకు ఎంపిక జాబితాను విడుదల చేసింది. ఇందులో మహిళా రిజర్వేషన్ కింద 16 పోస్టులు ఇచ్చారు. దీని ప్రకారం 42% పోస్టులు మహిళలకు కేటాయించారని పేర్కొన్నారు. కొందరు అభ్యర్థులు దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రిజర్వేషన్ల జాబితాలో పాఠశాల విద్యాశాఖ నిబంధనలు పాటించకపోవడం వల్లనే ఈ సమస్య వచ్చినట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన రిజర్వేషన్ రోస్టర్‌ను ఏపీపీఎస్సీ యథాతథంగా అమలు చేసిందని, రిజర్వేషన్ల రోస్టర్‌ను పరిశీలించి, వివరణ తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోలేదని పేర్కొన్నారు.

మూడు రాష్ట్రాల్లో సంస్థాగతంగా బలోపేతానికి భాజపా నిర్ణయం



శిక్షణ మహాభియాన్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న బీఎల్ సంతోష్. చిత్రంలో తరుణ్‌ఛుగ్, రామచందర్‌రావు, మాధవ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో భాజపాను సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని పార్టీ నిర్ణయించింది. 'పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్-2026'లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల శిక్షణ కార్యక్రమాన్ని భాజపా సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భాజపా ముఖ్య నాయకులు హాజరయ్యారు. భాజపాను ఆయా రాష్ట్రాల్లో సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌ఛుగ్, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి అభయ్‌పాటిల్, జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శివప్రకాష్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, ఏపీ అధ్యక్షుడు మాధవ్, దక్షిణాది రాష్ట్రాల శిక్షణ మహాభియాన్ ఇన్‌ఛార్జి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగం మానేస్తా!

- పనితీరు బాగోలేదని పిడుగురాళ్లకు బదిలీ చేసిన ప్రభుత్వం
- స్వచ్ఛంద పదవీ విరమణ లేఖ పంపిన ఏడీఎంఈ

ఈనాడు, అమరావతి: వైద్య విద్య అదనపు సంచాలకుడు (ఏడీఎంఈ) వెంకటేశ్వరరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తానని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ దరఖాస్తును విభాగాధిపతి డీఎంఈకి అందజేశారు. ఈ పరిణామం వైద్య ఆరోగ్య శాఖలో చర్చనీయాంశమైంది. దరఖాస్తు ఆమోదంపై తర్జనభర్జన సాగుతోంది. గత ప్రభుత్వంలో వైకాపాతో అంటకాగారని వెంకటేశ్వరరావుపై విమర్శలున్నాయి. ఆయన విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసినప్పుడు జగన్‌కు ఓటెయ్యాలని ఏకంగా ఉద్యోగులను బెదిరించారని ఆరోపణలు వచ్చాయి. గులకరాయి దాడి ఘటనలో జగన్‌కు పెద్దగా గాయం కాలేదని అప్పట్లో మీడియాకు వెల్లడించిన వైద్యులపై కక్ష సాధింపునకు తెగబడ్డారనే ఆరోపణలూ వినిపించాయి. వైద్య ఆరోగ్య శాఖలోని ఉన్నతాధికారి ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతో అప్పట్లో ఆయన జోలికి ఎవ్వరూ వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే ఉన్నతాధికారి అండతో జీజీహెచ్ నుంచి వైద్య విద్య విభాగంలో ఏడీఎంఈ పోస్టులో చేరారు. ఇప్పటికీ వ్యవహారశైలి మారలేదు. పనితీరు బాగోకపోవడంతో వెంకటేశ్వరరావును పిడుగురాళ్లకు బదిలీ చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన దస్త్రం సిద్ధమవుతున్న క్రమంలో విషయం బయటకు రావడంతో.. ఏడీఎంఈ స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యక్తిగత సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

రూ.8 కోట్ల ఆస్తిని కారుచౌకగా కాజేసిన కాటసాని వర్గీయులు

- రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పేదల భూముల్ని ఆక్రమించిన వైకాపా వాళ్లు
- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వర్గీయులు 11 మంది ఓ ముఠాగా ఏర్పడి రూ.8 కోట్ల విలువైన తన ఆస్తిని రూ.10 లక్షలకు మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారని కర్నూలు జిల్లా కల్లూరు మండలం న్యూకృష్ణానగర్‌కు చెందిన కేదారేశ్వరరావు వాపోయారు. ఇదేంటని ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని.. గత వైకాపా ప్రభుత్వంలో వారి దుర్మార్గాల మీద ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఏపీ శెట్టి బలిజ, పూసల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ త్రిమూర్తులు బుధవారం ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పేదలు సాగు చేసుకుంటున్న ఏడున్నర ఎకరాల్ని స్థానిక వైకాపా నాయకులు కబ్జా చేశారని.. వాటికి పట్టాలు కూడా పొందారని వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లి మండలానికి చెందిన నేతి రమేశ్‌బాబు ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ పత్రాలతో తన ఆస్తిని కాజేయాలని చూస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన చెన్నకేశవులు కోరారు.

ఆపరేషన్ కేజీహెచ్-2

- మావోయిస్టు రహిత భారత్ లక్ష్యంగా కర్రెగుట్టల్లో ప్రారంభం
- దేవ్‌జీ, కేసా సోధీల వేటకు తరలివెళ్లిన బలగాలు



దేవ్‌జీ



కేసా సోధి

చర్ల, న్యూస్‌టుడే: 'నక్సల్స్ మిషన్-2026' సమీపిస్తుండటంతో మావోయిస్టుల వేటను భద్రతా బలగాలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మంగళవారం కొత్తగా ఆపరేషన్ 'కేజీహెచ్-2'(కర్రె గుట్టలు హిల్స్-2)ను ప్రారంభించాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ చేతన్, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోధి కోసం బీజాపూర్ జిల్లా పరిధిలోని నంబి నుంచి వ్యాపించిన కర్రెగుట్టల ప్రాంతంలో 2 వేల మందితో కూడిన బలగాలు ఈ వేటను ప్రారంభించాయి. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 2024లో మావోయిస్టుల కోసం భారీ ఆపరేషన్‌లను చేపట్టింది. సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, సీఏఎఫ్ సంయుక్త బలగాలు గత ఏడాది ఏప్రిల్ నెలలో 21 రోజుల పాటు కర్రెగుట్టల్లో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇక్కడినుంచి మావోయిస్టు పార్టీ సీనియర్ క్యాడర్ తప్పించుకుంది. ప్రస్తుతం కర్రెగుట్టల్లోని తడపల, పాములూరు, మురుమూరు, డోలీ వంటి ప్రాంతాల్లో ఎఫ్ఓబీ(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్)లను ఏర్పాటు చేసి సీఆర్పీఎఫ్ బలగాలు నిత్యం ఆపరేషన్ చేపడుతున్నాయి. తాజాగా చేపట్టిన 'కేజీహెచ్-2' సైతం అత్యంత వ్యూహాత్మక ఆపరేషన్‌గా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్రెగుట్టలకు సరిహద్దుగా ఉన్న ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నారు.